

ఈనాడు



హైదరాబాద్ 25-3-2018 ఆదివారం సిటీ సంపుటి 44. సంచిక 224

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-00 పేజీలు 18+32+32 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

జనరేషన్ 'జడ్'..

సమస్యలపై జెట్ స్పీడ్



'జనరేషన్ జడ్'.. డిజిటల్ యుగంలో పుట్టిన తరం ఇది. శతాబ్దం మారుతున్న వేళ 1995-2001 మధ్య ఈ భూమ్మీద అడుగుపెట్టిన వారు నేడు 18 ఏళ్లు దాటి రేపటితరానికి ప్రతినిధులుగా నిలిచారు. 'నెట్' ఇంట్లో.. కంప్యూటర్ యుగంలో పుట్టిన వీరికి దాదాపుగా పుట్టుకతోనే చేతిలో సెల్‌ఫోన్.. చెవుల్లో ఇయర్‌ఫోన్.. పొద్దునలేస్తే ఫేస్‌బుక్.. మాట్లాడితే వాట్సాప్. 22వ శతాబ్దాన్ని చూడబోతున్న తొలితరం ఇది. ప్రస్తుత ప్రపంచంపట్ల వీరి దృక్పథం ఏమిటి? నేడు సమాజాన్ని ముంచెత్తుతున్న సమస్యలపై వారి స్పందన ఏమిటి? ఇంగ్లండ్‌కు చెందిన ఓ సంస్థ భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా 20 దేశాలకు చెందిన యువతీయువకుల్ని పలకరించింది. ఆ వివరాల సమాహారం.. 13లో




3న ఢిల్లీకి సీఎం కేసీఆర్

- పలు పార్టీల నేతలతో భేటీ
- 4న రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరు

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే నెల 3న ఢిల్లీకి వెళ్లనున్నారు. జాతీయ స్థాయిలో కొత్త కూటమి ఏర్పాటులో భాగంగా ఆయన పలు పార్టీల నేతలతో భేటీ కానున్నట్లు తెలిసింది. శాసనసభ సమావేశాల అనంతరం ఢిల్లీకి వెళ్తానని సీఎం ప్రకటించారు. దీనికి అనుగుణంగా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. 2న ఢిల్లీలో పదవీ విరమణ పొందుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలు సమావేశం ఉంది. దీనికి పలు జాతీయ పార్టీల నేతలు హాజరుకానున్నారు. అంతా (మిగతా 2లో)

సమాఖ్య స్ఫూర్తికి విఘాతం!



- 15వ ఆర్థిక సంఘం విధానాలతో కొన్ని రాష్ట్రాలకు తీవ్ర నష్టం
- వచ్చేనెల 10న దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం
- ఆ భేటీలో కార్యాచరణ నిర్ణయిస్తాం
- ఫోన్ ఇంటర్వ్యూలో 'ఈనాడు'తో కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్

ఈనాడు, హైదరాబాద్: "సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా, ఆందోళనకరంగా 15వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు ఉన్నాయి. వీటితో కొన్ని రాష్ట్రాలకు తీవ్రంగా నష్టం వాటిల్లడంతోపాటు, రాష్ట్రాల పాలనలో కేంద్రం జోక్యం మరింత పెరిగే అవకాశం ఉంది" అని కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ అభిప్రాయపడ్డారు. 15వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలపై చర్చించేందుకు వచ్చే నెల పదో తేదీన దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి ఐజాక్ సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో సమావేశం ఏర్పాటుకు గల కారణాలు, ఆర్థిక సంఘం మార్గదర్శకాల ప్రభావంపై 'ఈనాడు'కు ఫోన్‌లో ఇంటర్వ్యూ ఇచ్చారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తమిళనాడు ప్రతిపక్ష నేత ఎం.కె.స్టాలిన్ (మిగతా 2లో)

కొత్తగా 21 పురపాలికలు

జాబితాలో గజ్వేల్, బడంగ్‌పేట్, పెద్ద అంబర్‌పేట

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో 21 నగర పంచాయతీలను ప్రభుత్వం మున్సిపాలిటీలుగా (అప్‌గ్రేడ్) ఉన్నతీకరించింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జనాభా, ఆదాయం, మౌలిక సదుపాయాలు, విస్తరిస్తున్న కాలనీలు, ఉపాధి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంది. సీఎం నియోజకవర్గమైన గజ్వేల్ మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. జీహెచ్ఎంసీ పరిధికి ఆవతల, బాహ్య వలయ రహదారి పరిధిలోని బడంగ్‌పేట, పెద్ద అంబర్‌పేట నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా హోదా పెంచింది. ఆదిభట్ల, ఎలక్ట్రానిక్స్ పార్కు, బీడీఎల్ సంస్థలకు దగ్గర్లోని ఇబ్రహీంపట్నం ఇప్పటి వరకు నగర పంచాయతీగానే ఉంది. ఇప్పుడు దీన్ని మున్సిపాలిటీగా మార్చారు. మరోవైపు నూతన నగర పంచాయతీలు, మున్సిపాలిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పరిశీలిస్తోంది. కొత్త మున్సిపాలిటీ చట్టం తీసుకువచ్చి, (మిగతా 2లో)



ష్..గప్‌చుప్!

- వేలల్లో ప్రభుత్వ జీవోలు
- వెబ్‌సైట్‌లో ఉంచేది కొన్నే
- ప్రజలకు తెలియాల్సిన అంశాల్లోనూ దాపరికం
- కీలకమైన 16 సర్కారీ శాఖల్లో ఇదే పరిస్థితి
- పురపాలకశాఖలో పరిస్థితి మరీ దారుణం

మాల్స్, మల్టీప్లెక్స్‌లలో పార్కింగ్ రుసుములకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం ఒక జీవో ఇచ్చింది. కాని ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అది అందుబాటులో లేదు. అధికారుల ట్విట్టర్‌లో మాత్రం కనిపిస్తోంది.

ఈ ఏడాది ఇప్పటివరకు (రెండున్నర నెలల్లో) అన్ని శాఖల్లో కలిపి 4,000కు పైగా జీవోలు విడుదలయ్యాయి. 1,703 మాత్రం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. వాటిలో కూడా జీఓఆర్‌టీలే 1500కు పైగా ఉండటం గమనార్హం.

ఈనాడు – హైదరాబాద్

సాధారణంగా ప్రభుత్వం ఏదైనా ఉత్వర్వులను(జీవో)ను ఆమోదించి అధికారికంగా ఆమోదముద్ర వేసిన వెంటనే అది రాజపత్రం అయిపోతుంది. దాన్ని తెలుసుకునే, విశ్లేషించే హక్కు ప్రజలందరికీ ఉంటుంది. దానిలోని తప్పొప్పులను ప్రశ్నించే అధికారమూ వారికి ఉంటుంది. అలా జరగాలన్న ఉద్దేశం, పారదర్శకతకు పెద్దపీట వేయాలన్న లక్ష్యంతో వాటిని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచే ఆనవాయితీని ప్రభుత్వాలు ఆరంభించాయి. జీవోలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించే వెబ్‌సైట్ దీనికి సంబంధించి అత్యంత కీలకమైన సమాచార అనుసంధాన వ్యవస్థగా ఉంది. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, గ్రామీణాభివృద్ధి, పురపాలన, పట్టణాభివృద్ధి, నిధుల విడుదల, వివిధ రకాల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఉత్తర్వులను అందుబాటులో ఉంచడం ఆ శాఖల విధి. దానికి భిన్నంగా ప్రస్తుతం చాలా శాఖలు అన్ని ఉత్తర్వులనూ చీకట్లో ఉంచేస్తున్నాయి. 2016వ సంవత్సరంలో సగానికి సగం జీవోలు వెబ్‌సైట్‌లో లేక పోగా.. 2017వ సంవత్సరానికి సంబంధించి అందుబాటులో ఉంటున్న జీవోల సంఖ్య మరింత తగ్గిపోయింది. ప్రజలకు సంబంధించిన సమాచారం ఇవ్వాల్సిన వాటినీ రహస్యంగా ఉంచేస్తుండటంతో తీవ్ర నష్టం జరుగుతోంది. ఉదాహరణకు రియల్ ఎస్టేట్ చట్టానికి సంబంధించి నిబంధనలు రూపొందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2017 జూలై 31న జీవోను తీసుకువచ్చింది. దాన్ని ఆగస్టు నాలుగో తేదీన గెజిట్‌లో ప్రచురిస్తున్నట్లు పురపాలక శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ జీవోను ఇప్పటి వరకూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచలేదు. ఈ నిబంధనలపై ప్రజాభిప్రాయాన్ని తీసుకుని తుది ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. ఇంతవరకూ అది కూడా జరగలేదు. మహిళా, శిశు సంక్షేమశాఖ, విపత్తు నిర్వహణ, ఇంధన, కార్మిక శాఖలు మాత్రం జారీ చేసిన జీవోలలో దాదాపు అన్నింటినీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి (మిగతా 2లో)



అమ్మ భాషకు అందలం

- తెలుగు అమలును తప్పనిసరి చేస్తూ చట్టం
- విపక్షాల సంపూర్ణ మద్దతు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఒకటి నుంచి పదోతరగతి వరకు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా బోధించాలనే బిల్లును శనివారం శాసనసభ ఆమోదించింది. విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ఈ బిల్లు ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని (మిగతా 2లో)

అసైన్డ్ చట్టానికి సవరణ

ఆక్రమణ భూముల్లో ఉన్న పేదలకు హక్కులు


సమస్యలపై గళమెత్తుతాం

తెలంగాణ సకల ఉద్యోగుల మహాసభ నేడు 18లో

- హామీల అమలులో సర్కారు నిర్లక్ష్యం
- ఉద్యోగ సంఘాల ఐకాస ఆరోపణ
- సీపీఎస్ రద్దు చేయాలని.. పదవీ విరమణ వయసు పెంచాలని డిమాండ్

1 నుంచి రెండో విడత కాంగ్రెస్ బస్సు యాత్ర 2లో


లాలూకు 14 ఏళ్ల జైలు



- నాలుగో దాణా కేసులో శిక్ష ఖరారు
- రూ.60 లక్షల జరిమానా
- సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు

14లో

కట్టుకథలు.. అసత్యాలు



- అమిత్‌షాకు ఆంధ్ర అంటే లెక్కలేదు
- అసెంబ్లీలో నిప్పులుచెరిగిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- నిధుల మళ్లింపు అలవాటు మాకు లేదు
- పోలవరం భూ సేకరణ ప్రస్తావన ఏదీ?
- రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తే ఉపేక్షించం

6లో

స్వప్రయోజనాలే మీ అజెండా



- అందుకే ఎన్డీయే నుంచి వైదొలిగారు
- ప్యాకేజీ విషయంలో రెండేళ్ల తర్వాత యూటర్న్ తీసుకున్నారు
- అసంబద్ధ ఆర్థిక డిమాండ్లు చేస్తూ మాపై నిందారోపణలా!
- ఏపీ సీఎం చంద్రబాబుకు భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా 9 పేజీల లేఖ

6లో

సెవెన్‌హిల్స్ దివాలా!

రూ.737.58 కోట్లకు చేరిన ఈ ఆస్పత్రి గ్రూప్ బకాయిలు

- దివాలా పరిష్కార ప్రక్రియకు దరఖాస్తు
- అనుమతించిన జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్

2లో

ష్! గప్‌చుప్...

(మొదటిపేజీ తరువాయి)

తెస్తున్నాయి. మిగిలిన శాఖలన్నింటిదీ ఒకే బాట.

అన్నీ రహస్యమేనా?

గతంలో సమాచారం వెలుగులోకి రాకుండా ఉండాల్సిన జీవోలను వెబ్‌సైట్‌లో కాన్ఫిడెన్షియల్(రహస్యం) అని అప్‌లోడ్ చేసేవారు. గత రెండేళ్లుగా అదీ లేకుండా పోయింది. వేలకోట్ల రూపాయల ప్రజాధనం వ్యయానికి సంబంధించిన, ప్రభుత్వ విధానాలు, చివరకు నిధుల విడుదలకు సంబంధించినవీ ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. జీవోల ఆధారంగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారన్న కారణంతో కొన్నింటిని వెబ్‌సైట్‌లో నమోదు చేయడం లేదని అధికారులు చెబుతుండగా..వారి వాదనను పాలనా పరమైన నిపుణులు ఖండిస్తున్నారు. ఒక వైపు సమాచార హక్కు చట్టం, పారదర్శకతకు ప్రాధాన్యం అంటూనే..అధికారిక ఉత్తర్వులను అందుబాటులోకి తీసుకురావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

పురపాలక శాఖలో అంతా రహస్యమే

రాష్ట్రంలో 2017వ సంవత్సరంలో అత్యల్పంగా జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టిన శాఖ పురపాలకశాఖ. 2017వ సంవత్సరంలో ఈ శాఖ ద్వారా వెయ్యికిపైగా జీవోలు జారీ అవగా.. కేవలం ఐదు మాత్రమే వెబ్‌సైట్‌లో కన్పిస్తున్నాయి. సమాచార చట్టం ద్వారా అడిగినా వాటికి సంబంధించిన సమాచారం ఇవ్వడం లేదు. వెబ్‌సైట్‌లో ఉంచని వాటిలో కొన్నింటిని మాత్రమే ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

2016లో 10 వేల జీవోలు వెలుగు చూడలేదు

జారీ అయిన మొత్తం జీవోలు	23,717
ప్రజలకు అందుబాటులో (వెబ్‌సైట్) ఉంచినవి	13,163(55 శాతం)
జారీ అయిన జీవో ఎంఎస్‌లు	2,824
వెబ్‌సైట్లో పెట్టినవి	1,598 (56 శాతం)
జారీ అయిన జీవోఆర్‌టీలు	20,893
వెబ్‌సైట్లో పెట్టినవి	11,565 (55 శాతం)

2017లో 10,500కు పైగా..

జారీ అయిన మొత్తం జీవోలు	19,000లకుపైగా
ప్రజలకు అందుబాటులో (వెబ్‌సైట్) ఉంచినవి	8,696 (45 శాతం)
జారీ అయిన జీవో ఎంఎస్‌లు	1,460
వెబ్‌సైట్లో పెట్టినవి	864 (59 శాతం)

ఈ ఏడాదీ అదే పరిస్థితి

పురపాలక శాఖలో జనవరి ఒకటి నుంచి ఇప్పటి వరకూ 150కిపైగా జీవోలు విడుదలయ్యాయి. ఇందులో జీఓఎంఎస్‌లు 67 వచ్చాయి. అందులో ఒక్కటి కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో లేవు.

రెండు రకాల జీవోలు

జీవోఆర్‌టీ: ప్రభుత్వ శాఖలు రెండు రకాల జీవోలను జారీ చేస్తాయి. సాధారణ అంశాలకు సంబంధించి జీవో ఆర్‌టీలు ఉంటాయి. చిన్న మొత్తాల చెల్లింపులు, ఉద్యోగులకు సంబంధించి విధానపరమైన అంశాలు కానివి (బదిలీలు, పదోన్నతులు) వంటివాటికి సంబంధించి జీవోఆర్‌టీలు ఉంటాయి.

జీఓఎంఎస్: కీలకమైన అంశాలకు సంబంధించిన జీవోలు జీఓఎంఎస్‌లుగా ఉంటాయి. విధాన నిర్ణయాలు, ఆర్థిక పరమైన చెల్లింపులు, బడ్జెట్ విడుదల తదితర అంశాలకు సంబంధించి జీవోఎంఎస్‌లు జారీ అవుతాయి.

- వెబ్‌సైట్‌లో పెడుతున్న జీవోల్లో 75 శాతం సాధారణ అంశాలకు సంబంధించిన జీవోఆర్‌టీలే ఉండటం గమనార్హం.

వెలుగు చూడనివి..మచ్చుకు కొన్ని

- ఐదో తరగతి నుంచి పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, వికలాంగ విద్యార్థులకు మెస్ ఛార్జీలు(ఉపకార వేతనాలు), సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించేందుకు వీలుగా వారికిచ్చే డైట్ ఛార్జీలను ప్రభుత్వం భారీగా పెంచింది. ఈ విషయమై ఎస్సీ సంక్షేమశాఖ మే 20న ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన జీవోనెం.32 మాత్రం వెబ్‌సైట్లో కనిపించడం లేదు.
- నిరుద్యోగ యువత ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ ఖాళీలపై కొన్ని రోజులుగా సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాకపోవడంతో ప్రకటన జారీ చేసేందుకు సాంకేతికంగా ఇబ్బందులు వచ్చాయి. దీనిపై ఊరట కలిగించేలా 8792 పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు 2017 సెప్టెంబరు 1న జీవోనెం.129 జారీ చేసింది. అదీ వెబ్‌సైట్‌లో లేదు.
- స్థిరాస్తి వ్యాపారంలో అక్రమాలను అరికడుతూ సామాన్యులకు ఊరటనిచ్చేలా కేంద్రం చట్టం చేసింది. ఈ చట్టాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలు జారీ చేయాల్సి ఉంది. దీనికి గడువు 2017, జులై 31. దానికి సంబంధించిన జీవోనెం.202 అదృశ్యమైంది.
- ఆరో నిజాం అనాథల కోసం వందేళ్ల క్రితం సరూర్‌నగర్‌లో విక్టోరియా హోమ్ నిర్మించి 78 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. సదరు స్థలాన్ని అనాథలకు తప్ప ఎవరికీ ఇవ్వడానికి వీల్లేదు. ప్రభుత్వం మాత్రం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పేరిట పది ఎకరాలను లీజుకు ఇచ్చింది. తొలుత ప్రతినెలా రూ.94 లక్షల లీజు అని చెప్పింది. కొన్ని రోజులకే దాన్ని రూ.5.44 లక్షలకు తగ్గించింది. వీటికి సంబంధించిన జీవోలు-48, 50 ఆగస్టులో జారీ అయ్యాయి. అవి ఎంత వెదికినా కన్పించడం లేదు.

కోర్టుకు ఎక్కిన సుపరిపాలన వేదిక

వివిధ ప్రభుత్వ శాఖలు ప్రభుత్వ ఉత్తర్వులను వెబ్‌సైట్‌లో నమోదుచేయకపోవడంపై సుపరిపాలన వేదిక (ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్) హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రమాణపత్రం ఇవ్వాలని ఆదేశించింది. ప్రస్తుతం అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు.

రెండేళ్లలో వివిధ శాఖలు జారీ చేసిన జీవోలు... వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినవి

శాఖ	2016		2017	
	ఇచ్చినవి	వెబ్‌సైట్‌లో ఉన్నవి	ఇచ్చినవి	వెబ్‌సైట్‌లో ఉన్నవి
వ్యవసాయం	981	431	1353	528
బీసీ సంక్షేమం	361	230	373	188
పౌరసరఫరాలు	276	125	110	56
పర్యావరణ	287	169	226	108
ఆర్థిక	2716	1476	1326	268
సాధారణ పరిపాలన	3241	1409	2655	599
ఉన్నతవిద్య	443	117	348	69
హోం	1730	559	1678	84
గృహనిర్మాణం	216	49	184	27
నీటిపారుదల	1162	741	1097	772
మైనారిటీ	318	90	268	17
పురపాలన	1190	508	1000కిపైగా	5
పంచాయతీరాజ్	1233	917	816	706
రెవెన్యూశాఖ	830	688	800	397
ఎస్సీ సంక్షేమం	908	287	602	87
రవాణా, రహదారులు భవనాలు	811	137	535	18
యువజన సంక్షేమ	939	556	810	129

1 నుంచి రెండో విడత కాంగ్రెస్ బస్సు యాత్ర

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రజా చైతన్య బస్సుయాత్ర రెండో విడత చేపట్టడానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తర్వాత రెండో విడత చేపడతామని ఇది వరకు ప్రకటించినట్లుగానే.. ఏప్రిల్ ఒకటి నుంచి పదో తేదీ వరకు బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం బస్సుయాత్ర వివరాలను ప్రకటించారు. 1న రామగుండం నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర 10న వెంకటాపూర్‌లో పూర్తవుతుంది. మొత్తం 10 రోజుల్లో 18 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ యాత్ర సాగనుంది. ఫిబ్రవరి 26న రంగారెడ్డిజిల్లా చేవెళ్ల నుంచి ప్రారంభమైన తొలి విడత ప్రజాచైతన్య బస్సుయాత్ర మొత్తం 16 నియోజకవర్గాలలో సాగింది. ఏప్రిల్ ఒకటిన సాయంత్రం రామగుండంలో జరిగే బహిరంగ సభ ద్వారా రెండో విడత యాత్ర ప్రారంభమవుతుంది. 2న సాయంత్రం పెద్దపల్లిలో బహిరంగ సభ నిర్వహిస్తారు. 3న మంథని, భూపాలపల్లి, 4న ములుగు, పరకాల, 5న వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమం, 6న వర్ధన్నపేట, నర్సంపేట, 7న స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, 8న డోర్నకల్, మహబూబాబాద్, 9న ఇల్లెందు, పినపాక, 10న భద్రాచలం, వెంకటాపూర్‌లలో యాత్ర సాగుతుంది. వెంకటాపూర్‌లో సాయంత్రం ఆరింటికి బహిరంగ సభతో రెండో విడత బస్సు యాత్ర పూర్తవుతుంది. తొలి విడత యాత్రకు ఉపయోగించిన బస్సుతో పాటు ఇతర ప్రచార రథాలను రెండో విడత యాత్రకూ ఉపయోగించనున్నారు. ఈ బస్సులో పైనుంచి మాట్లాడేందుకు వేదిక సౌకర్యం లేకపోవడంతో బయట ఏర్పాటు చేసిన బహిరంగ సభ వరకు బస్సులోనే వెళ్లి సభా వేదికపై మాట్లాడేవారు. ఈ అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వేదికతో కూడిన ప్రత్యేక బస్సును బెంగళూరులో తయారు చేయిస్తున్నట్లు యాత్ర నిర్వాహణ కమిటీ కన్వీనర్ మహేందర్‌రెడ్డి తెలిపారు.

3న దిల్లీకి సీఎం కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

దిల్లీలో అందుబాటులో ఉన్నందున వారిని కలవాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. 3వతేదీన అందుబాటులో ఉన్న వారిని కలిసి కొత్త కూటమి ఏర్పాటుపై చర్చించే అవకాశముంది. రాష్ట్రం నుంచి తెరాస తరపున రాజ్యసభకు ఎన్నికైన సంతోష్‌కుమార్, ప్రకాశ్ ముదిరాజ్, లింగయ్య యాదవ్‌లు వచ్చేనెల 4న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరితో తెరాస సభ్యుల సంఖ్య ఆరుకి చేరుతుంది. ఇప్పటివరకు రాజ్యసభలో తెరాస సభ్యులు ముగ్గురు ఉండగా వారిని ఇతర (అదర్) కేటగిరిలో చేర్చారు. నాలుగుకు మించి సభ్యులుంటే నేరుగా పార్టీ పేరిట గుర్తింపునిస్తారు. ఆరుగురు సభ్యులున్న పార్టీగా తెరాస 7 నుంచి 8 స్థానాల్లో నిలిచే వీలుంది. దీంతో ఆ పార్టీకి మొదటి వరుసలో స్థానం లభించనున్నట్లు తెలిసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సీఎం కేసీఆర్ రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరు కానున్నారు.

కొత్తగా 21 పురపాలికలు

(మొదటి పేజీ తరువాయి)

పట్టణీకరణకు ఎక్కువగా అవకాశాలున్న గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చనుంది. 10వేలకు మించిన జనాభా కలిగిన గ్రామాలను ఈ మేరకు పరిశీలించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా 40 వరకు నగర పంచాయతీలు, మున్సిపాలిటీలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. తొలివిడత కింద 26 వరకు వచ్చే అవకాశముంది. ఇప్పటికే ఉన్న నగర పంచాయతీలకు చుట్టూ ఉన్న గ్రామాలను కలిపి మున్సిపాలిటీలుగా, మున్సిపాలిటీల చుట్టూ గ్రామాలను కలిపి నగర పాలక సంస్థలుగా మార్చే విషయమై కసరత్తు చేస్తోంది. నగర పంచాయతీ, మున్సిపాలిటీ పరిధి నుంచి 3 కి.మీ. లోపల గ్రామాల విలీనానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

మున్సిపాలిటీలుగా మారిన నగర పంచాయతీలు: బడంగ్‌పేట్, పెద్ద అంబర్‌పేట, నర్సంపేట, సత్తుపల్లి, గజ్వేల్, వేములవాడ, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, హుజూర్‌నగర్, జమ్మికుంట, నాగర్‌కర్నూలు, పరకాల, హుజూరాబాద్, మధిర, హుస్నాబాద్, బాడేపల్లి, అచ్చంపేట, అయిజ, దేవరకొండ, కొల్లాపూర్, ఆందోల్-జోగిపేట.

రాజ్యసభ సభ్యులకు అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు సంతోష్‌కుమార్, ప్రకాశ్ ముదిరాజ్, లింగయ్య యాదవ్‌లను శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ శనివారం మండలి కార్యాలయంలో సత్కరించారు. శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు ఎంపీలకు అభినందనలు తెలిపారు. కొత్త ఎంపీ ప్రకాశ్ మజ్లిస్ ఎమ్మెల్యేలను కలిసి తనకు ఓటు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ బాల్కసుమన్, తెరాస నేతలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బద్రుద్దీన్ ఇతర నేతలు ఎంపీలను తెలంగాణ భవన్‌లో సత్కరించారు.

బ్రాహ్మణ పరిషత్ సీఈఓగా రఘురామశర్మ

- ఏపీకి 22 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

ఈనాడు, హైదరాబాద్: బ్రాహ్మణ పరిషత్ సీఈఓగా రఘురామశర్మను ప్రభుత్వం నియమించింది. దీంతో పాటు విభజన చట్టం మేరకు 22 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీచేసింది. వారిలో విపత్తు నిర్వహణ శాఖ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పనిచేసిన సదాభార్గవి, రంగారెడ్డి జిల్లా జేసీగా పనిచేసిన సుందర్ అబ్నార్ తదితరులు ఉన్నారు.

సెవెన్‌హిల్స్ ఆస్పత్రి గ్రూప్ దివాలా

ఈనాడు - హైదరాబాద్

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని చెల్లించక చేతులెత్తేస్తున్న కంపెనీల సరసన తాజాగా సెవెన్‌హిల్స్ ఆస్పత్రి గ్రూపు చేరింది. ముంబయి, విశాఖపట్నంలలో ఆస్పత్రులు నిర్వహిస్తున్న సెవెన్‌హిల్స్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ యాక్సిస్, తదితర బ్యాంకులకు బకాయిపడ్డ మొత్తం రూ.737.58 కోట్లకు చేరుకుంది. రుణ బకాయి చెల్లించడానికి జిల్లా కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా గడువు ఇచ్చినా ప్రయోజనం లేకపోవడంతో యాక్సిస్ బ్యాంకు.. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ ధర్మాసనాన్ని ఆశ్రయించింది. దివాలా పరిష్కార ప్రక్రియ (కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్)ను చేపట్టాలంటూ యాక్సిస్ బ్యాంకు ఐబీసీ కోడ్ సెక్షన్ 7 కింద దరఖాస్తు చేసింది. దీనిపై ఎన్‌సీఎల్‌టీ జ్యుడీషియల్ సభ్యులు రాజేశ్వరరావు విత్తనాల విచారణ చేపట్టి దివాలా ప్రక్రియ ప్రారంభానికి అనుమతిని మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

యాక్సిస్ నుంచి 418.21 కోట్లు..

2004 ఏప్రిల్ 13న సెవెన్‌హిల్స్ హెల్త్‌కేర్ రూ.401 కోట్ల అధీకృత మూలధనంతో కంపెనీ చట్టం కింద ఏర్పాటైంది. సెవెన్‌హిల్స్‌కు ద్వైపాక్షిక సౌకర్యాలందించడంలో భాగంగా యాక్సిస్ బ్యాంకు నుంచి రూ.418.21 కోట్లు, కన్సార్టియం కింద మరో రూ.271.19 కోట్లు రుణం మంజూరైంది. ఎప్పటికప్పుడు సెవెన్‌హిల్స్..



విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రి

పలు స్థిర, చరాస్తులను రుణాలకు హామీగా సమర్పిస్తూ వచ్చింది. క్రమంగా నిర్వహణ సామర్థ్యం తగ్గడంతో ఆసుపత్రి నష్టాలబాట పట్టింది. మెరుగైన సేవలందించడానికిగాను యాక్సిస్ బ్యాంకుతో రుణ పునర్నిర్మాణ ఒప్పందాలు జరిగాయి. వ్యవస్థాపకులు హామీదారులుగా పలు హామీలు సమర్పించారు. 2014 జూన్ 30న యాక్సిస్ బ్యాంకుతో ఆసుపత్రి ట్రస్టీల ఒప్పందం కుదిరింది. అయితే, ఒప్పందం ప్రకారం వాయిదాలు చెల్లించకపోవడంతో 2016 ఏప్రిల్ 2 నాటికి రూ.737.58 కోట్లను నిరర్థక ఆస్తులుగా ప్రకటించి యాక్సిస్ బ్యాంకు.. సెవెన్‌హిల్స్‌కు నోటీసులు జారీ చేసింది. తాకట్టులో ఉన్న వాటాలను వెనక్కి తీసుకుంటామని బ్యాంకు ట్రస్ట్‌ను కోరింది. అయితే, తాకట్టులో ఉన్న వాటాలను మార్చుకోవడాన్ని సవాల్ చేస్తూ సెవెన్‌హిల్స్ ప్రమోటర్స్ జితేంద్ర మాగంటి, మాగంటి జితేంద్ర దాస్ (హెచ్‌యూఎఫ్) జిల్లా కోర్టు నుంచి సుప్రీం కోర్టుదాకా వెళ్లినా ఫలితం లేకపోయింది. నిర్దుష్ట గడువు విధించి బకాయి చెల్లించాలని ఆదేశించినా అమలు చేయకపోవడంతో బ్యాంకు ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి దివాలా పరిష్కార ప్రక్రియకు అనుమతించాలని కోరింది.

దివాలా ప్రక్రియను బహిరంగ పరచాలి..

దివాలా ప్రక్రియ పరిష్కార నిపుణుడి(ఐఆర్‌పీ/సీఐఆర్‌పీ)గా గుడ్‌గావ్‌కు చెందిన అభిలాష్‌లాల్‌ను జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ నియమించింది. సెవెన్‌హిల్స్ గ్రూపు, హామీదారుల ఆస్తుల క్రయవిక్రయాలపై నిషేధం విధించారు. ఆస్తులను అన్యాక్రాంతం చేయడంగానీ, హక్కులను బదిలీ చేయడంగానీ చేయరాదని ఎన్‌సీఎల్‌టీ జ్యుడీషియల్ సభ్యుడు రాజేశ్వరరావు స్పష్టంచేశారు. తాకట్టు ఆస్తులపై నిషేధం ఉంటుందన్నారు. ఆస్పత్రికి వ్యతిరేకంగా దిగువ కోర్టులు, ట్రైబ్యునళ్లు, మధ్యవర్తిత్వం, ఇతర న్యాయస్థానాల్లో ఏవైనా పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నా, తీర్పులు వెలువడి అమలుకు ఆదేశాలిచ్చి అమలుకాకపోయినా ఈ నిషేధం వర్తిస్తుందని వెల్లడించారు. దివాలా ప్రక్రియ ప్రారంభం గురించి బహిరంగంగా ప్రకటించాలని, ఐబీబీఐ (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా) వెబ్‌సైట్‌లో ఉంచడంతోపాటు మీడియా ద్వారా ప్రకటనలు ఇవ్వాలని ఐఆర్‌పీకి సూచించారు. ఈ విషయాన్ని ఆస్పత్రి వెబ్‌సైట్‌లోనూ పేర్కొనాలని ఆదేశించారు.

డాక్టర్ల వేతనాలకు ప్రాధాన్యమివ్వాలి..

సెవన్‌హిల్స్ గ్రూపులో పనిచేసే డాక్టర్ అమిత్ రావ్ డియో మరో 49 మంది డాక్టర్లు తమను ప్రతివాదులుగా చేర్చాలంటూ పిటిషన్ దాఖలు చేయగా. . డాక్టర్లు తమ సమస్యలను ఐఆర్‌పీ దృష్టికి తీసుకెళ్లాలంటూ రాజేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రికి వెన్నెముక లాంటి వైద్యుల జీతభత్యాల చెల్లింపునకు అత్యవసర విభాగంగా పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యం ఇవ్వాలని ఐఆర్‌పీకి సూచించారు. బకాయిలు రావాల్సి ఉందని.. తమనూ ప్రతివాదులుగా చేర్చుకోవాలన్న గ్రేటర్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ అభ్యర్థనను అనుమతించారు. పరికరాల సరఫరా చేసినందున రూ.21.71 లక్షలు వడ్డీతో రావాల్సి ఉందంటూ ముంబయికే చెందిన త్రిశూల్ ఎలక్ట్రోమెక్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి ఈ నెల 7న అందిన లేఖనూ దివాలా పరిష్కార ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రుణ బకాయిలు వివరాలు అందిన తరువాత రుణదాతల కమిటీని ఏర్పాటు చేయాలని, ఏర్పాటైన వారంలోగా సమావేశం నిర్వహించి సమాచారం ట్రైబ్యునల్‌కు అందజేయాలని ఐఆర్‌పీని ఆదేశించారు. దివాలా పరిష్కార ప్రక్రియకు సంబంధించిన నివేదికను ఏప్రిల్ 17న సమర్పించాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

25-3-2018 ఆదివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
అష్టమి: ఉ. 7-38 తదుపరి నవమి
ఆర్ద్ర నక్షత్రం: మ. 2-00 తదుపరి పునర్వసు
అమృత ఘడియలు: ఉ.శే. 6-09 వరకు
వర్జ్యం: రా. 1-10 నుంచి 2-39 వరకు
దుర్ముహూర్తం: సా. 4-31 నుంచి 5-19 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6-04; సూర్యాస్తమయం: సా.6-07

పెరుగుతున్న ఎండలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వేసవి ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. పలుచోట్ల 40 డిగ్రీలకు చేరువగా పగటిపూట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం మహబూబాబాద్ జిల్లా పెద్దనగరంలో 41.3, భద్రాచలంలో 40, హైదరాబాద్‌లో 39.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్న సమయంలో తప్పనిసరైతే తప్ప ఎండలో తిరగవద్దని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి ప్రజలకు సూచించారు. గత పదేళ్ల మార్చి నెలలో హైదరాబాద్‌లో అత్యధిక ఉష్ణోగ్రత 41.3 డిగ్రీలుగా 2010 మార్చి 23న నమోదైంది. ఈ నెలలో దీనికి చేరువయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రమంతా పొడి వాతావరణం నెలకొంది. రాత్రిపూట ఉష్ణోగ్రత సాధారణంకన్నా 5 డిగ్రీలు అదనంగా ఉంటోంది.

సమాఖ్య స్ఫూర్తికి విఘాతం!

(మొదటి పేజీ తరువాయి)

తదితరులు కూడా ఈ అంశంపై గళమెత్తిన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఐజాక్ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..

దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం ప్రధాన అజెండా ఏంటి?

ఈ సమావేశానికి ప్రత్యేకంగా అజెండా ఏం లేదు. రాష్ట్రాలు అభిప్రాయాలు వ్యక్తం చేసిన తర్వాత తదుపరి కార్యాచరణ ఏంటన్నది నిర్ణయిస్తాం. పదిహేనో ఆర్థిక సంఘం మార్గదర్శకాల (టీఓఆర్) ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై ఎలా ఉంటుందో చర్చిస్తాం.

పదిహేనో ఆర్థిక సంఘం మార్గదర్శకాలపై అభ్యంతరాలేంటి?

ప్రధానమైంది 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం. దీనివల్ల దక్షిణాదితో సహా మరికొన్ని రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. జనాభా నియంత్రణకు చర్యలు తీసుకొని బాగా పని చేసిన రాష్ట్రాలు.. 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఎక్కువగా నష్టపోతాయి. ఈ నిర్ణయం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉంది. ద్రవ్యలోటు, ఇతర అంశాలపైనా ప్రభావం చూపుతుంది. ద్రవ్య వినిమయ చట్టం ప్రకారం.. మూడుశాతం వరకు రుణాలు తీసుకొనే అవకాశం ఉండగా, దాన్ని రెండున్నర శాతానికి తగ్గించడం, జీఎస్‌డీపీలో 25 శాతానికి బదులు 20 శాతానికి తగ్గించడం ఇలా అనేకం ఉన్నాయి. రాష్ట్రాలకు ఉన్న అవకాశాలు మరింత తగ్గిపోయేలా చర్యలున్నాయి.

ప్రజాకర్షక పథకాలు వల్ల రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి దెబ్బతినకుండా చూడాలనే ప్రయత్నం ఉన్నట్లు ఉంది కదా?

రాష్ట్రాలు చేపట్టేవి ప్రజాకర్షక పథకాలు అవునా కాదా అని నిర్ణయించే పని ఆర్థిక సంఘానిది కాదు. ఈ బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలది. గృహనిర్మాణం, విద్య, వైద్యం మెరుగ్గా అందించడానికి పలు పథకాలను రాష్ట్రాలు ప్రవేశపెడుతుంటాయి. వీటిని ప్రజాకర్షక పథకాలుగా పేర్కొని పక్కన పెట్టాలంటే ఎలా.?

గత ఆర్థిక సంఘం రాష్ట్రాలకు వాటా నిర్ణయించింది. ఇంకా అనేక నిర్ణయాలు చేసింది. కొత్త ఆర్థిక సంఘం మార్గదర్శకాల వల్ల పాతవాటికి ఏం ఇబ్బంది ఉండదు కదా?

మార్గదర్శకాలన్నీ రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయి. 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ఇచ్చినవి కూడా వెనక్కి తీసుకొనే అవకాశం ఉంది. రాష్ట్రాల అధికారాలను, హక్కులను మరింత కుదించేలా 15వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు ఉన్నాయి.

దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రులను మాత్రమే ఎందుకు ఆహ్వానించారు?

భౌగోళికంగా, విద్య, ఆరోగ్యం తదితర అంశాల్లో ఉన్న సారూప్యత దృష్ట్యా మొదట దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రులను ఆహ్వానించాం. రాజకీయంగా స్వతంత్రంగా అభిప్రాయాలు చెప్పగల పరిస్థితీ ఈ రాష్ట్రాలకు ఉంది. సమావేశానికి హాజరుకావడానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలు అంగీకరించాయి. మిగిలిన రాష్ట్రాలూ వచ్చే అవకాశముంది.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	40.6	26.2
మహబూబ్‌నగర్	40.0	24.1
హన్మకొండ	40.0	21.0
ఆదిలాబాద్	39.1	24.3
కరీంనగర్	39.0	20.0
రామగుండం	39.6	19.3
హైదరాబాద్	39.2	21.3
మెదక్	38.4	17.6
తిరుపతి	38.0	26.4
సూర్యాపేట	38.0	26.0
నిజామాబాద్	38.0	22.0
ఖమ్మం	37.0	23.0

అమ్మ భాషకు అందలం

(మొదటి పేజీ తరువాయి)

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, ఇతర మాధ్యమాల(ఉర్దూ, తమిళం, మళయాలం) విద్యాసంస్థలు, కేంద్ర, అంతర్జాతీయ, ఇతర స్థాయిలో సిలబస్ బోధిస్తున్న సంస్థల్లోనూ తెలుగు మొదటిభాషగా బోధించాల్సిందే. 2018-19వ సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో రాష్ట్రంలో ఉన్న అన్నిరకాల పాఠశాలల్లో ఒకటి, ఆరోతరగతిలలో తెలుగును మొదటిభాషగా అమలు చేస్తారు. క్రమంగా ఒక్కో ఏడాది తరగతులు పెంచుతామని మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రపంచ తెలుగు మహాసభలతో తెలంగాణ తెలుగును ప్రపంచవ్యాప్తం చేశామని, ఇప్పుడు కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు. దీనికోసం సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందినీ సిధారెడ్డి ఆధ్వర్యంలో తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాల్లో మాతృభాష బోధనాతీరుపై అధ్యయనం చేశాక రాష్ట్రంలో అమలుకు శ్రీకారం చుట్టామన్నారు.

సమగ్రంగా చర్చించాలన్న కిషన్‌రెడ్డి


విద్యాసంస్థల్లో తెలుగు అమలు బిల్లుకు విపక్షాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఈ బిల్లును తాము స్వాగతిస్తున్నామని, దీనిని మరింత సమగ్రంగా చర్చించాలని కిషన్‌రెడ్డి అన్నారు. బిల్లు విప్లవాత్మకమని ఆర్.కృష్ణయ్య పేర్కొనగా, తల్లిభాషకు ఇది ఎంతో మేలు చేస్తుందని సున్నం రాజయ్య అన్నారు. జాఫర్‌హుస్సేన్ అభినందనలు తెలిపారు. శాసనసభ వ్యవహారాలు తెలుగులోనే నడపాలని, ఉత్తర ప్రత్యుత్తరాలు, బస్సులపై రాతలు తెలుగులోనే ఉండాలని సూచించారు.

డీజీపీ నియామకంపై రాష్ట్రానికే అధికారం

పోలీసు డైరెక్టర్ జనరల్ ఎంపిక, నియామకం చట్టం-2018 బిల్లును శాసనసభ ఆమోదించింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు పోలీసు డైరెక్టర్ జనరల్(డీజీపీ) నియామక అధికారం పూర్తిగా రాష్ట్రాలకే వర్తిస్తుందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రకాశ్‌సింగ్ సుప్రీంకోర్టులో వేసిన కేసు తీర్పు మేరకు అన్ని రాష్ట్రాలూ డీజీపీల నియామకంపై చట్టాలు చేశాయని, ఈరోజుతో తెలంగాణకు కూడా చట్టం వచ్చిందన్నారు.

- తెలంగాణ వైద్య వృత్తిదారుల రిజిస్ట్రీకరణ చట్టం-1968కి సవరణ చేస్తూ చేసిన సవరణ చట్టం-2018 బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. వైద్యఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సవరణ చట్టంతో వైద్యవిద్యలో పీజీ పూర్తిచేసిన వారు ఇకపై పల్లెల్లో పనిచేయాల్సిన నిబంధన తొలగిపోయిందన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలోనూ వైద్యుల స్థానాలు భర్తీకి 2673 పోస్టులను మంజూరు చేసిందన్నారు. ఈనేపథ్యంలో పీజీ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు సీఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. 2016లోనే ఎంబీబీఎస్ విద్యార్థులకు మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందేనన్నారు. దీనిపై కిషన్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, సున్నం రాజయ్య మాట్లాడుతూ గ్రామాల్లో వెంటనే వైద్యులను నియమించాలని కోరారు.
- రాష్ట్రంలోని న్యాయవాదుల గుమస్తాలు ఉద్యోగ విరమణానంతరం రావాల్సిన ప్రయోజనాలు, కుటుంబ సభ్యుల వైద్య సౌకర్యాలు, ఇతర సంక్షేమ చర్యలకు ఉద్దేశించిన చట్టాన్ని సవరించే బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఇదేక్రమంలో న్యాయవాదుల సంక్షేమనిధి చట్టానికి సవరణ చేసిన బిల్లుకు ఆమోదం లభించింది. న్యాయవాదులు, గుమస్తాల సంక్షేమనిధి కింద స్టాంపు విలువను రూ.50 నుంచి రూ.100కి పెంచారు. న్యాయశాఖా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు న్యాయవాదులు, గుమస్తాల అభ్యర్థనల అనంతరం వారి సంక్షేమానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఇదీ సంగతి!



ఈ పేషెంట్‌కు రోజుకు మూడుసార్లు కాంభోజీ రాగం వినిపించు. అతను పడుకునే ముందు సింధుభైరవీ, కల్యాణీ పాడు, ఇతనికి...

లేపాక్షి ఉత్సవాలకు లక్షమంది!

- **శాసనసభ్యుడు బాలకృష్ణ అంచనా**
- **ఉత్సవాల చిహ్నం ఆవిష్కరణ**

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న లేపాక్షి ఉత్సవాలకు కనీసం లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ వెల్లడించారు. మార్చి 31, ఏప్రిల్ 1 తేదీలలో నిర్వహించనున్న ఉత్సవాలకు హాజరయ్యే పర్యాటకులకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పించామని తెలిపారు. ఏపీ సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు, అనంతపురం జిల్లా పరిషత్తు అధ్యక్షుడు పి.నాగరాజు, కలెక్టర్ వీరపాండ్యన్‌తో కలిసి బాలకృష్ణ లేపాక్షి ఉత్సవం-2018 చిహ్నాన్ని శనివారం బెంగళూరులో ఆవిష్కరించారు. ప్రత్యేకంగా రూపొందించిన గీతాన్ని మంత్రి కాలవ శ్రీనివాసులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివారం(నేడు) కొడికొండ నుంచి లేపాక్షిలోని నంది విగ్రహం వరకు సైకిల్ యాత్ర నిర్వహించి, మధ్యాహ్నం ఉత్సవాల ముందస్తు కార్యక్రమాలను ప్రారంభిస్తామని చెప్పారు. మార్చి 30న వారసత్వ నడక (హెరిటేజ్ వాక్), 31న అచ్యుత మానస, 600మంది కూచిపూడి కళాకారుల నర్తన, నటి సురభి పురాణిక్ నృత్య కార్యక్రమం, శివమణి, అనూప్ రూబెన్స్ తదితరుల కార్యక్రమాలు ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అఖిలప్రియ పాల్గొంటారని బాలకృష్ణ తెలిపారు.

రెండో రోజుకు చేరిన అన్నాహజారే నిరశన

దిల్లీ: లోక్‌పాల్ ఏర్పాటుకు డిమాండ్ చేస్తూ సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దిల్లీలో చేపట్టిన నిరాహార దీక్ష శనివారం రెండోరోజుకు చేరుకుంది. తనకు బీపీ బాగా పడిపోయినందున ఎక్కువగా మాట్లాడవద్దని వైద్యులు సూచించినట్లు ఆయన తెలిపారు. ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ నిరశన కొనసాగిస్తానని ఆయన స్పష్టంచేశారు.

ఆస్పత్రిలో చేరిన ప్రతాప్ సి.రెడ్డి!

ఈనాడు డిజిటల్, చెన్నై: అపోలో ఆస్పత్రుల వ్యవస్థాపక ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి శనివారం ఉదయం ఆస్పత్రిలో చేరారు. శుక్రవారం రాత్రి ఆయన అస్వస్థతకు గురయ్యారని, అపోలో ఆస్పత్రిలో చేరారని ప్రచారం జరిగింది. దీనిపై ఆస్పత్రి నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే సాధారణ చెకప్‌లో భాగంగానే శనివారం వేకువజామున చేరారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.


ఈనాడు

శ్రీరామ రామ రామేతి...

కాలపరీక్షకు నిలిచిన కమనీయ కావ్యం వాల్మీకి రామాయణం. ప్రశంసించేవారికి, ప్రశ్నించేవారికి కూడా ప్రామాణ్యాన్ని కలిగించిన ప్రాచేతసుడి రచన లోకానికి లోకోత్తర మర్యాదాపురుషోత్తముణ్ని పరిచయం చేసింది. కొడుకుగా, సోదరుడిగా, భర్తగా, ప్రభువుగానే కాదు- మామూలు మనిషిగా తోటి జీవుల పట్ల చూపవలసిన మానవీయతను, ఉన్నత సంస్కారాన్ని రాముడి ద్వారా ఉపదేశించింది. మనిషి మనుగడకు వ్యాకరణాన్ని నిర్దేశించింది. 'జగతినిట్టి గుణోజ్జ్వలుడైన నాయకుకుండుట ఘటిల్లునే' అంటూ మురారిబట్టు వంటి తదనంతర కవులు విస్తుపోయేంత గొప్పగా రామ పాత్రను మహర్షి తీర్చిదిద్దారు. ఆ భావధారను అందిపుచ్చుకొన్న కంచర్ల గోపన్న 'ఎంతటి పుణ్యమో శబరి ఎంగిలిగొంటివి విందగానే! నీ మహిమము(ఆలోచన) ఎట్టిదో ఉడుత మైని(దేహం)పై కర్గ్గ నఖాంకరంబులన్ సంతసమంద చేసితివి' అంటూ ఒక రాజకుమారుడు సామాన్య జీవుల పట్ల చూపిన ఉదాత్త వైఖరికి అంజలి ఘటించారు. రాక్షసుల పట్ల సైతం రాముడి తీరు అలాంటిదే అన్నారు విశ్వనాథ. జనస్థానంలో తనపై విరుచుకుపడ్డ శత్రుమూకను చావుదెబ్బ తీసిన రాముడు సంబరాలు చేసుకోలేదు సరికదా, తీవ్ర సంతాపానికి గురయ్యాడట. 'ఏ దనుజున్ వధించినను ఇట్టి విషాదము పొందు ఆత్మమర్యాదుడు స్వామి' అన్నారాయన. తాటక వధ కారణంగా తల్లి తనను అభిశంసిస్తుందేమో 'అమ్మా! దేహమునన్ విచిత్రముగు దుఃఖరామము' అనిపిస్తోందమ్మా అంటూ విలపించాడట. ఆ దుఃఖం రాముడిది కాదు, లోకానిది. మానవ జీవితంలోని మహావిషాద సర్వస్వాన్నీ తన గుండెల్లోకి తీసుకొన్న విశ్వమానవుడు రాముడు. 'బాధను విన్నవింప వెనుభారము తగ్గెన దేమి చిత్రమో' అని మనిషి తెలిసుకున్నది, ఆరాధించడానికి ఆయన అవతారపురుషుడైనే కానక్కరలేదు- విశ్వనరుడైతే చాలు!

'రేపటినుంచి నీవే రాజువి' అన్నప్పుడు రాముడు ఆనందంతో ఎగిరి గంతులు వేయలేదు. 'రాజ్యం నీది కాదు, అరణ్యానికి బయలుదేరు' అన్నప్పుడు దుఃఖంతో కూలబడనూ లేదు. బతుకును కోతులతో పంచుకోవలసి వస్తే ఆత్మన్యూనతతో కుంగిపోలేదు. అయోధ్యలో భరతుడితో, కిష్కింధలో సుగ్రీవుడితో, లంకలో విభీషణుడితో ఆయన ఒకే తరహా సుఖ ఆవరణ(కంఫర్ట్ జోన్)లో ఉండగలిగాడు. రాముడి కారణంగా 'పత్రాతికి కల్గె పావనము'- బండరాయిలా ఉన్న అహల్యకు పవిత్రత చేకూరింది. 'అరాతికి రాజ్య సుఖంబు కల్గె'- శత్రువర్గంలోని విభీషణుడికి రాజయోగం పట్టింది. తిర్యక్కులు అంటే పశుపక్ష్యాదులు. 'తిర్యగ్జాతికి పుణ్యమబ్బె'- జటాయువుకు పుణ్యలోకాలు దక్కాయి. 'కపిజాతి మహత్వమునొందె'- మొత్తం వానరజాతికే గౌరవం దక్కింది. తనవల్ల పదిమందికి మేలు జరగడంకన్నా మనిషి జన్మకు దక్కవలసిన మరోకటి ఉండదు. వ్యక్తిత్వ వికాసానికైనా, ఉంటున్న స్థితినుంచి ఉండవలసిన స్థితికి ఎదగాలన్నా- మనిషికి అందుకే రాముడితో పరిచయం ఏర్పడాలి. మనిషి సుఖంగా జీవించడానికి ఏడు ఆధారాలు అవసరం అంది శాస్త్రం. వాటినే ఏడుగడ అంటారు. 'గురువును తల్లియు తండ్రియు పురుషుడ విద్యయును దైవమును దాతయును'- ఈ ఏడుగురివల్ల మనిషికి సంపూర్ణ రక్షణ కలుగుతుంది. ఈ కోణంలో రాముణ్ని 'సర్వజగద్రక్షకుడ'గా కవులు గుర్తించారు. 'బంటురీతి కొలువు ఇయ్యవయ్య రామా' అని ప్రాధేయపడ్డారు త్యాగరాజస్వామి. 'దేవదేవ భజే దివ్య ప్రభావం రావణాసుర వైరి రణపుంగవం' అని కీర్తించాడు అన్నమయ్య. 'రామశబ్ద జ్యోతిని నోటి చివర వెలిగిస్తే ఆ జీవితం దేహళీదత్త దీపం అవుతుంది' అన్నాడు తులసీదాసు. ఇంటా బయటా వెలుగులు పంచే వీధి దీపంలా జీవితం వికసనం చెందాలంటే మనిషికి రాముడంటే ఎవరో తెలియాలి. అంతటి గొప్ప పాత్రను చిత్రించాడు కాబట్టే 'యావత్ స్థాస్యంతి గిరయః...'- 'ఈ భూమ్మీద పర్వతాలు నదులు ఎంతకాలం ఉంటాయో- అంతకాలం నా కావ్యం నిలిచి ఉంటుంది' అని స్థిరంగా ప్రకటించాడు వాల్మీకి.

ఈ రోజుల్లో నదులు ఎండిపోతున్నాయి, పర్వతాలను మనమే దొలిచేస్తున్నాం కనుక వాల్మీకి శ్లోకం ప్రకారం రామాయణం నశిస్తుందని కాదు అర్థం. ఈ లోకంలో రామాయణం పదిలంగా ఉన్నంత కాలం పర్వతాలు నదులు నిండుగా ఉంటాయని గ్రహించాలి. రామ చైతన్యాన్ని సంరక్షించుకోవాలి. ఇంట గెలిచి రచ్చకెక్కమని సామెత. నట్టింట సుఖశాంతులకూ సీతారాముల దాంపత్యమే మనకు దిక్సూచి. 'సీత శ్రీరామచంద్రుని చిత్తపదము, రామచంద్రుడు జానకీ ప్రాణపదము' అన్నారు విశ్వనాథ. ఆ జంట అన్యోన్యతను పతాక శీర్షికలాంటిది ఆ వాక్యం. 'అన్యత రామచంద్ర విరహక్షుత...' సీతారాముల రూప భావసారూప్యం హనుమను విస్మయపరచింది. వీరు ఇద్దరా ఒకరా అని హనుమ ఆశ్చర్యపోయాడు. 'సీత నెరుంగకుండ రఘుశేఖరుడు అర్థము కాడు పూర్తిగా' అని తేల్చి చెప్పారు విశ్వనాథ. ఇప్పటికీ జనం పెండ్లిపత్రికలపై 'జానక్యా కమలాంజలి...' శ్లోకాన్ని అచ్చువేస్తూ ఆ దంపతులకు ఈ జాతి గుండెల్లో పటం కట్టించి పెట్టారు. 'స్థిరమైన నడవడి నరులకు అందరికాను వలయు' అంటూ పోతనగారి ఉదాత్త జీవనానికి నమూనాలను చెప్పారు. 'రామ వంటి కొడుకు, భరత సౌమిత్రుల వంటి తమ్ములున్న, సీత వంటి భార్యయు వసుధయందు, లేరు లేరటంచు ముందు యుగంబుల జనులు తలలూపవలెదే' అని మనసారా ఆకాంక్షించారు. 'పది కొంపలును లేని పల్లెలోనైనను' రామమందిరం ఒకటి ఉండి తీరాలని ఈ జాతి ఆరాటపడింది. 'శ్రీరామ' అని రాయకుండా రచనే కాదు, ఉత్తరమ్ముక్క కూడా మొదలుపెట్టరాదని ఆశించింది. రామాయణాన్ని జాతీయ గ్రంథంగాను 'సర్వమంగళ గుణ సంపూర్ణుడగు నిన్ను నరుడు దేవునిగాగ...' రాముణ్ని భగవంతుడిగా ఆరాధిస్తూ వస్తోంది. జన మనోభిరాముడి జన్మదిన వేడుకలకు తెలుగునేల రంగవల్లులు దిద్దుతున్న వేళ ఇది!




అంతర్జాలంలో దగా నేత్రం

అది ప్రతి నాయకుడి స్థావరం. అక్కడ కంప్యూటర్ తెరలపై ఏవేవో గణాంకాలు, సమాచారం మెరుస్తున్నాయి. 1995నాటి జేమ్స్ బాండ్ చిత్రం 'ది గోల్డెన్ ఐ'లో ఈ సెట్‌ను డిజైన్ చేసిన కంపెనీకి తరవాత మరో మహదవకాశం వచ్చింది. తన ఆపరేషన్స్ కేంద్రాన్ని రూపొందించాలని స్ట్రాటజిక్ కమ్యూనికేషన్ లేబరేటరీస్ గ్రూప్ (ఎస్‌సీఎల్) ఈ సంస్థకే అప్పజెప్పింది. ఇండోనేసియా, థాయ్‌లాండ్, కెన్యా, బ్రిటన్‌లతోపాటు పలు దేశాల ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు, సైన్యాలకు ప్రజా సంబంధాల (పీఆర్) పనులు చేసిపెట్టే సంస్థ అది. 1993లో బ్రిటన్‌లో ప్రారంభమైన ఎస్‌సీఎల్ తన కంపెనీని మరిపించడం కోసమే బాండ్ సినిమా సెట్‌ను అరువు కుంది. 2001 సెప్టెంబర్ 11న (9/11) అమెరికాపై టెర్రరిస్టు దాడి నేపథ్యంలో- జిహాదీలకు, టెర్రరిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు, అంతర్జాలంలో సందేశాలు పంపే నైపుణ్యం తనకుందని చెప్పి పాశ్చాత్య ప్రభుత్వాలను ఆకర్షించి వ్యాపారం పెంచుకుంది. మానసిక యుద్ధంలో, జనాన్ని ప్రభావితం చేసే ప్రచార కార్యకలాపాల్లో దిట్టనంటూ 2013లో స్టీవ్ బ్యానన్ దృష్టిని ఆకర్షించింది. బ్యానన్ అప్పట్లో అమెరికాలో బ్రెయిట్ బార్ట్ న్యూస్ అనే అంతర్జాల వార్తా సంస్థకు నడిపేవారు. క్లింటన్ దంపతులను ద్వేషిస్తూ, రిపబ్లికన్ పార్టీకి భూరి విరాళాలిచ్చే మహాధని రాబర్ట్ మెర్సర్‌కీ ఆయన రాజకీయ సలహాదారు. ఎస్‌సీఎల్ నిర్వాహకులకు మెర్సర్‌తో సంబంధాలు ఏర్పడింది. అమెరికాలో కేంబ్రిడ్జ్ ఎనలిటికా పేరుతో దుకాణం తెరవడానికి బాట వేశారు బ్యానన్. ఈ కొత్త సంస్థలో మెర్సర్ ప్రధాన వాటాదారు; ఎస్‌సీఎల్ ప్రతినిధి అలెగ్జాండర్ నిక్స్‌తో పాటు బ్యానన్‌కూ వాటాలున్నాయి.

ఈ సంస్థను నిజంగా నడిపేది మాత్రం ఎస్‌సీఎల్ సంస్థే. 2016లో డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారానికి తోడ్పడేందుకు బ్యానన్ కేంబ్రిడ్జ్ ఎనలిటికాను రంగంలోకి దింపారు. ఇందుకు ఆ సంస్థ దాదాపు 90 లక్షల డాలర్ల ఫీజు తీసుకుంది. కేంబ్రిడ్జ్ ఎనలిటికా ఐరోపా సమాఖ్య (ఈయూ) నుంచి నిష్క్రమణ (బ్రెగ్జిట్)పై నిర్వహించిన రిఫరెండంలో బ్రిటిష్ ఓటర్లను ప్రభావితం చేసిందన్న ఆరోపణపై బ్రిటిష్ పార్లమెంటు దర్యాప్తు జరుపుతోంది. అమెరికా వినియోగానికై గూగుల్, ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్, ట్విటర్ వంటి మాధ్యమాల సాయంతో ఓటర్ల అభిప్రాయాలను మలచి 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలవడానికి కేంబ్రిడ్జ్ ఎనలిటికా తోడ్పడిందని దుమారం రేగుతోంది. ఇందుకోసం ఫేస్‌బుక్‌లో అయిదు కోట్ల మంది ఓటర్ల వివరాలను అనధికారికంగా సంగ్రహించామని కేంబ్రిడ్జ్ ఎనలిటికాలో డేటా విశ్లేషకుడిగా పనిచేసిన క్రిస్టఫర్ వైలీ బయటపెట్టారు. అంతే... ప్రపంచమంతటా ప్రకంపనలు మొదలయ్యాయి!

రష్యా కోణం

మొదట 'దిసీజ్ యువర్ డిజిటల్ లైఫ్' అనే యాప్‌ను రూపొందించి, లక్షలాది ఫేస్‌బుక్ వినియోగదారులకు ఒక పరీక్ష పెట్టి వారి ఇష్టాయిష్టాలు, వ్యక్తిగత వివరాలను సేకరించారు. విజ్ఞాన పరిశోధన కోసమే పరీక్ష పెడుతున్నామని చెప్పి, అందులో పాల్గొన్నవారికి కొంత మొత్తం చొప్పున చెల్లించారు కూడా. ఈ ఫేస్‌బుక్ ఖాతాదారులతోపాటు లక్షల సంఖ్యలో వారి బంధుమిత్రుల ఖాతా వివరాలనూ దొంగచాటుగా సేకరించారు. కేంబ్రిడ్జ్ బాగోతం బయటపడటానికి కొన్ని వారాల ముందు ట్రంప్‌ను గెలిపించడానికి 13మంది రష్యన్ ఏజెంట్లు, మూడు రష్యన్ కంపెనీలు అంతర్జాలాన్ని దుర్వినియోగం చేశాయని ప్రత్యేక విచారణాధికారి రాబర్ట్ మల్లర్ నిర్ధారించారు. రష్యాకు చెందిన ఇంటర్నెట్ రిసెర్చ్ ఏజెన్సీ (ఐఆర్‌ఏ) వందలాది ట్రోల్స్‌ను నియోగించి ఫేస్‌బుక్, ట్విటర్, యూట్యూబ్‌లలో హిల్లరీ క్లింటన్‌పై దుష్ప్రచారం సాగించింది. గిట్టని వ్యక్తులపై అంతర్జాలంలో బురద జల్లేవారిని 'ట్రోల్స్' అంటారు. రష్యా ఏజెంట్లు ఒక్క ఫేస్‌బుక్‌లోనే 14 కోట్లమంది ఖాతాదారులకు ఈ రకమైన సందేశాలు పంపి హిల్లరీకి వ్యతిరేకంగా, ట్రంప్‌కు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మలచారు. రష్యా ప్రభుత్వం తన అధీనంలోని స్పుత్నిక్ వెబ్‌సైట్,



జనం మనసులపై మాయాజాలం

రష్యా టుడే టీవీ ఛానల్ ద్వారా హిల్లరీపై వ్యతిరేకతను పెంచింది. రష్యా ఏజెంట్లు స్వయంచాలిత 'బాట్స్' ద్వారా ట్రంప్ అనుకూల, హిల్లరీ వ్యతిరేక ప్రచారం సాగించారు. హిల్లరీ వర్గం ఉపయోగించిన బాట్ల కన్నా ట్రంప్ తరఫున అయిదు రెట్లు ఎక్కువ బాట్‌లను ప్రయోగించారు. అలారం మోగించడం మొదలుకొని వైరస్‌లను వ్యాపింపజేయడం వరకు వివిధ పనులను స్వయంగా చేసే అప్లికేషన్లను 'బాట్స్' అంటారు. రష్యన్ ఏజెంట్లు ఎన్నికల చర్చల సమయంలో హిల్లరీ వ్యతిరేక ప్రచారాన్ని ఉద్ధృతం చేసేవారు. ట్విటర్‌లో హిల్లరీ అనుకూల హ్యాష్‌ట్యాగ్‌లు ధరించి ఓటర్ల మనసుల్లో అనుమాన బీజాలు నాటేవారు. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్ వ్యక్తిగత సర్వర్ నుంచి తొలగించిన 30,000 ఈ-మెయిల్స్‌ను పునరుద్ధరించి ట్రంప్ ప్రచార బృందానికి అప్పగించారు. ఇంకా ఈ బృందం సామాజిక మాధ్యమాల్లో బాట్స్ ద్వారా రోజుకు 50 వేల రకాల ప్రచార ప్రకటనలను పంపిణీ చేస్తూ, వాటికి వినియోగదారుల ప్రతిస్పందనను చూసి అక్కడికక్కడే ప్రకటనల్లో మార్పుచేర్పులు చేసేది. ఎక్కువ లైక్‌లు, షేర్‌లు, రీట్వీట్‌లు లభించిన ప్రకటనలను మళ్ళీ మళ్ళీ పంపిణీ చేసేవారు. అలాగే అంతర్జాలంలో, సామాజిక మాధ్యమాల్లో వలసలకు వ్యతిరేకంగా వచ్చిన ఏదైనా వ్యాసాన్ని ఏయే రాష్ట్రాల్లో ఎక్కువమంది క్లిక్ చేసి చదివారో పసిగట్టి, తక్షణం ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి ట్రంప్ వెళ్ళే ఏర్పాట్లు చేసేవారు. ట్రంప్ అక్కడ వలసలకు వ్యతిరేకంగా భీషణ ప్రసంగాలు చేసి ఓటర్లను ఆకట్టుకునేవారు. ఈ విధంగా కోట్ల మంది ఓటర్ల మనోభావాలను తెలుసుకొంటూ వారిని తమవైపు తిప్పుకోవడానికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవడంలో కేంబ్రిడ్జ్ ఎనలిటికా సహాయాన్ని ట్రంప్ బృందం తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ట్రంప్, రష్యా సంబంధాలపై మరిన్ని వివరాలను సేకరించడం కోసం కేంబ్రిడ్జ్ ఎనలిటికా ఆంతరంగిక పత్రాలను తనకు అప్పగించాల్సిందిగా రాబర్ట్ మల్లర్ కోరారు.

డిజిటల్ అస్త్రం శక్తిమంతం

ఎప్పుడైతే డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్ కంప్యూటర్ల నుంచి మొబైల్ ఫోన్లకు అంతర్జాలం పాకిందో, అప్పటి నుంచి డిజిటల్ సీమలో అవకాశాలు, ముప్పులు ఇంతింతై పెరిగిపోతున్నాయి. నేడు మొబైల్ ద్వారా సామాజిక మాధ్యమాలను వినియోగించుకునేవారిలో 80 శాతం ఫేస్‌బుక్‌లో ఉన్నారు. అంతర్జాల శోధన సంబంధ వాణిజ్య ప్రకటనల ద్వారా లభించే ఆదాయంలో 90 శాతం గూగుల్‌కే దక్కుతోంది. వేలాది బోగస్ ఖాతాల ద్వారా కోట్ల మందికి స్వయంచాలిత బోగస్ సందేశాలు క్షణాల్లో పంపడానికి ఈ రెండు వేదికలు అమోఘ సాధనాలయ్యాయి. రష్యన్ ఏజెంట్లు చాలా స్వల్ప మొత్తాలు చెల్లించి ఫేస్‌బుక్ నుంచి ఆన్‌లైన్ వాణిజ్య ప్రకటనల సమాచారాన్ని సేకరించారు. ఖాతాదారుల అభిరుచులకు తగ్గ వాణిజ్య ప్రకటనలు పంపే 'ఫేస్‌బుక్ కస్టమర్ టార్గెటింగ్ సాఫ్ట్‌వేర్' ఇందుకు ఉపయోగపడింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు నెల రోజుల ముందు ట్విటర్ ద్వారా నాలుగు లక్షల బాట్లు లక్షలాది మందికి బోగస్ సందేశాలు పంపాయి. అంతర్జాల, సామాజిక మాధ్యమాల సంస్థలకు ఎంతసేపటికీ అత్యధిక లైక్, షేర్, క్లిక్‌లను సొంతం చేసుకోవాలనే యావే తప్ప, తమ వేదికల ద్వారా ప్రసారమవుతున్న సందేశాలు నిజమైనవా లేక నకిలీవా అన్న సంగతే పట్టదు. అదే రాజకీయ, వ్యాపార వర్గాలతోపాటు ప్రత్యర్థులకూ వరంగా పరిణమించింది. ఈ పరిణామాలు ప్రజాస్వామ్య సమాజాల సుస్థిరతకు భంగకరంగా తయారవుతున్నాయి. గూగుల్, ఫేస్‌బుక్ వంటి ఐటీ కంపెనీలు నేడు గుత్తాధిపత్యం చలాయించే స్థాయికి ఎదిగాయి. అవి వ్యక్తిగత సమాచారాన్ని అమ్ముకోవడం, ఇతరత్రా దుర్వినియోగం చేయకుండా అడ్డుకునే చట్టాలు అమెరికాలోకన్నా ఐరోపా దేశాల్లో బలంగా ఉన్నాయి. భారత దేశం ఐరోపా నుంచి పాఠాలు నేర్చుకోవడం ఎంతైనా అవసరం. 2000 సంవత్సరంలో తెచ్చిన సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం- వ్యక్తుల పాస్‌వర్డ్‌లు, బ్యాంకు లావాదేవీలు, ఆరోగ్యస్థితి, లైంగికత, వైద్య రికార్డులు, బయోమెట్రిక్ సమాచారాలను ఆంతరంగిక సమాచారంగా పరిగణిస్తోంది. కానీ, డేటా కంపెనీల పరిధి విస్తరిస్తున్న కొద్దీ ఇతర వ్యక్తిగత సమాచారాలకూ చట్టపరమైన రక్షణ ఛత్రాన్ని అందజేయడం అనివార్యమవుతోంది. ఉదాహరణకు వ్యక్తుల మత విశ్వాసాలు, కులం, జాతి, రాజకీయ ఆసక్తుల గురించి వేర్వేరు మార్గాల్లో తెలుసుకునే సౌలభ్యం డేటా కంపెనీలకు ఏర్పడింది. దీన్ని నియంత్రించే చట్టాలను తీసుకురావడం తక్షణావసరం. వాటిని సమర్థంగా అమలుచేయడం ఇంకా అవసరం!

– ఏఏవీ ప్రసాద్



కేంబ్రిడ్జ్ ఎనలిటికా అంటే?

ఇంటర్నెట్‌ను కాని, ఫేస్‌బుక్, ట్విటర్ వంటి సామాజిక మాధ్యమాలను కాని ఉపయోగించినప్పుడు, మీరు లైక్ చేసిన, ట్వీట్ చేసిన, చర్చించిన అంశాలన్నీ కేంబ్రిడ్జ్ ఎనలిటికా వంటి మెసేజింగ్-బిగ్‌డేటా కంపెనీలకు అపార సమాచార నిధిగా ఉపయోగపడతాయి. మీరు చూసే టీవీ కార్యక్రమాలు, చేసే ప్రయాణాలు, షాపింగ్ అలవాట్లు, బ్యాంకింగ్ లావాదేవీలు, చదివే పుస్తకాలు, పత్రికల గురించి సమాచారాన్ని థర్డ్‌పార్టీ సంస్థల నుంచి, డేటా బ్రోకర్ల నుంచీ కేంబ్రిడ్జ్ ఎనలిటికా వంటి కంపెనీ కొనుగోలు చేస్తుంది. పైవిధంగా మీ ఆసక్తులు, అభిరుచులు తెలుసుకున్న సదరు కంపెనీ, మీ వ్యక్తిత్వాన్ని అంచనా వేసి, మీ మనసును తాకే ప్రచార సందేశాలను, వ్యాసాలను అందుబాటులోకి తెస్తుంది. ఇవే సూత్రాలను సమూహాలకూ వర్తింపజేసి ఎన్నికలను, మార్కెట్లలో కొనుగోలు అలవాట్లను ప్రభావితం చేస్తుంది. ఈ తరహా సేవలనే ట్రంప్ ప్రచార బృందం ఉపయోగించుకుంది. రష్యా ఏజెంట్లు, కేంబ్రిడ్జ్ ఎనలిటికాల దెబ్బకు ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలపై అమెరికా, బ్రిటన్‌లలో దుమారం రేగుతోంది. అన్నట్టు భారతదేశంలోనూ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలకు ఎన్నికల సేవలు అందించడానికి కేంబ్రిడ్జ్ అనుబంధ సంస్థ ఓవెలీనో బిజినెస్ ఇంటెలిజెన్స్ (ఒబీఐ) ముందుకొచ్చింది.

కేసుల మాఫీ రాజకీయం

పుణ్యభూమి

భిన్న మతావలంబకుల కదంబం భారతావని. కుల మత వర్గ ప్రాంత భాష భేదాలతో నిమిత్తం లేకుండా పౌరులంతా సమానమేనని భారత రాజ్యాంగం ఎలుగెత్తి చాటుతోంది. మత సహిష్ణుత కదలబారిన చోట చిచ్చు రాజేసి, సహనశీల విలువల్నే సమిధలుగా చేసి రాజకీయంగా చలికాగే దుర్మార్గం- జాతి చెక్కిట నెత్తుటి చారికలు కట్టిస్తోంది. 'ఒక్కొక్క మత హింసాత్మక చర్యతో క్రీస్తును పదేపదే సిలువ వేస్తున్నాం... మహాత్ముడిని పలుమార్లు హత్య చేస్తున్నాం'- అని ముజఫర్ నగర్ అమానుష నరమేధం నేపథ్యంలో నాటి రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ వాపోయారు. రాక్షసంగా జనానికి కీడు చేసే యంత్రాంగం రాజకీయావతారం దాల్చి నెత్తుటి నెగళ్లను ఎలా ఎగదోస్తుందో 2013 ఆగస్టునాటి ముజఫరాబాద్ మతఘర్షణలు కళ్లకు కట్టాయి. ఆ సందర్భంగా కమలనాథులపై అక్రమ కేసులు బనాయించారంటూ వాటి ఉపసంహరణకు యోగి ఆదిత్యనాథ్ సర్కారు నేడు పావులు కదుపుతున్న తీరు దుర్నీత రాజకీయానికే అద్దం పడుతోంది. భారత రాజ్యాంగ అవతారికలో మొట్టమొదటిదైన సమన్యాయ భావనకే కసిగా తూట్లు పొడిచే ఈ నిర్వాకం పూర్వాపరాలు చిత్తగించండి!

చట్టాన్ని తన పని తాను నిష్ఠగా చేసుకుపోనిస్తే- పెద్దపెద్ద గద్దెలెక్కి తాము ఉద్ధరించేదేముందన్నది పాలక పక్షీయుల వ్యథ. రామరాజ్య భావనకు కట్టుబాటు చాటే కమలనాథులు, 'పరిత్రాణాయ సాధూనాం- వినాశాయచ దుష్కృతాం' అన్న కృష్ణగీతనే కార్యాచరణగా స్వీకరించారనడానికి యూపీలో యోగి పాలనే దాఖలా! కరడుగట్టిన నేరగాళ్లు కనుమరుగయ్యే దాకా రాష్ట్రంలో ఎదురుకాల్పులు (ఎన్‌కౌంటర్లు) జరుగుతూనే ఉంటాయని ముఖ్యమంత్రే ఇటీవల ఎగువసభలో స్పష్టీకరించారు. పన్నెండొందల పైచిలుకు ఎన్‌కౌంటర్లలో 40 మంది పేరుమోసిన నేరగాళ్లు రాలిపోయారని, మరికొన్ని వందలమంది క్షతగాత్రులయ్యారని గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్లపై జాతీయ మానవ హక్కుల సంఘం యూపీ ప్రభుత్వానికి తాకీదులు పంపిన నేపథ్యంలో- వాటిని సమర్థిస్తూ ఉప ముఖ్యమంత్రివర్యులు కేశవ్ ప్రసాద్ మౌర్య చేసిన వ్యాఖ్యలు గమనార్హం. దుష్టశక్తుల్ని తుడిచిపెడితేనే రామరాజ్యం స్థాపించగలమన్న ఆయన మాటల్నిబట్టి- జనస్వామ్య చట్టాన్ని పక్కనపెట్టి అయినా లక్ష్యసాధనకు సర్కారు కట్టుబడి ఉందన్నది నిర్వివాదం! దుర్మార్గుల్ని వధిస్తే సరిపోదు- సాధు సంతతిని రక్షించడమూ తలకెత్తుకోక తప్పదన్న రీతిగా, ముజఫర్ నగర్ మతఘర్షణల్లో కేసులు ఎదుర్కొంటున్న భాజపా పెద్దల్ని ఒడ్డున పడేసేందుకు యోగి ప్రభుత్వం సంసిద్ధమైంది! తమ్ముడు తనవాడైనా ధర్మం చెప్పాలన్నది కాలం చెల్లిన నీతి. అధికారానికి వచ్చిన వెంటనే అస్మదీయులకు అరదండాలు తొలగించి తీరాలన్నది నయా రాజకీయ రీతి!


ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

మతఘర్షణగా మారి నరమేధానికి దారితీసేముందు ఏ వివాదమైనా గోటితో పోయేటంత చిన్నదే. కోతిపుండును బ్రహ్మరాక్షసి చెయ్యడంలో తరతమ భేదాలతో పార్టీలన్నింటి ప్రావీణ్యమూ తిరుగులేనిదే! ముజఫర్ నగర్- దేశానికి చక్కెర గిన్నె. 2013 ఆగస్టులో అక్కడ తమ ఇంటి ఆడపిల్లను వేధిస్తున్నందుకు కవల్ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మరో వర్గానికి చెందిన యువకుడిపై దాడి చేసి చంపేశారు. దరిమిలా అవతలి పక్షంవారు ప్రతీకార దాడికి తెగబడి అన్నదమ్ముల్ని హతమార్చడంతో అగ్గి రాజుకుంది. శాంతిభద్రతల పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉన్నవేళ- రెండు వర్గాల్లోనూ భారీయెత్తున జరిగిన భేటీల్లో తాడోపేడో తేల్చుకోవాలన్న ఉద్రిక్త ప్రసంగాలు మోతెక్కిపోయాయి. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పార్టీ భేదాలకు అతీతంగా పనిగట్టుకొని అగ్గికి ఆజ్యం పోయడంతో పశ్చిమ యూపీ భగ్గుమంది. 62మంది అభాగ్యులు మతఘర్షణల్లో తెగటారిపోగా కొంపాగోడు వదిలి 60 వేలమంది దాకా శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవాల్సి వచ్చింది.

అఖిలేశ్ ప్రభుత్వ పాలన అసమర్థతకు నాటి ఘోరం నిదర్శనగా నిలిచింది. ముజఫర్ నగర్, భాగ్‌పట్, షామ్లి, మీరట్, సహరణ్‌పూర్ జిల్లాల్లో రేగిన మారణకాండకు సంబంధించి 128 కేసులు పెట్టినట్లు 2013 అక్టోబరులో యూపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. నాలుగేళ్లుగా కేసుల పురోగతి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటే- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ విష్ణు సహాయ్ కమిషన్- తప్పంతా బ్యూరోక్రసీ నెత్తికెత్తి పాలక పక్షీయులకు 'క్లీన్‌చిట్' అనుగ్రహిస్తూ 2016 మార్చిలో నివేదిక సమర్పించింది. అధికారంలో ఉండే వెసులుబాటే అది. దాన్నిప్పుడు ఉపయోగించుకోవడానికే యోగి ప్రభుత్వం తహతహలాడుతోంది!

'ఏ నేరగాడూ తప్పించుకోకూడదు... ఏ నిరపరాధీ శిక్షకు గురికాకూడదు'- సర్వోన్నత న్యాయస్థానం నిర్దేశించిన న్యాయసూత్రం అది. నేరగాళ్లనూ నిరపరాధులుగా తీర్మానించేసే దుర్రాజకీయం ఎప్పటికప్పుడు కొత్తకోరలు తొడుక్కొంటోంది. 'కోర్టుల్లో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించాలనుకొంటున్నాం... రాష్ట్రంలో రాజకీయ ప్రేరిత కేసుల్ని ఉపసంహరించాలనుకొంటున్నాం' అని యూపీ న్యాయశాఖ మంత్రి సెలవిచ్చారు. మొన్న డిసెంబరులో వివాదాస్పద బిల్లును నెగ్గించి స్వయంగా ముఖ్యమంత్రి సహా పలువురు రాజకీయ నేతలపై ఉన్న పాత కేసుల్ని పూర్తిగా మాఫీ చేసేసిన అనుభవంతో- తమ నేతలపై కేసుల తొలగింపు సాధ్యపడుతుందా అని రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగానికి లేఖ రాసింది. విశేషం ఏమిటంటే- ప్రజాప్రయోజనాల పరిరక్షణ కోసమే ఈ ఉపసంహరణ అనీ చెబుతోంది. కేసుల ఉపసంహరణ సాధ్యం కాకపోతే, వాటిని మళ్ళీ దర్యాప్తు చేయిస్తారట. సత్యం వధ- ధర్మం చెర!

పెరిగిపోతున్న నేరాలకు దీటుగా కోర్టుల్లో కేసులూ పేరుకుపోతున్నాయి. సత్వర న్యాయం మరీచికగా మారిన దేశంలో- నేరగాళ్లు బోర విరుచుకు తిరిగే సౌలభ్యం, అది మరిన్ని నేరాలకు దారితీసే అవకాశం దండిగా పోగుపడ్డాయి. ఈ చిక్కుముడిని చక్కగా విప్పే 'ద్విముఖ వ్యూహం' కమలనాథుల యూపీలో నిష్ఠగా అమలవుతోంది. బూటకపు ఎన్‌కౌంటర్లలో నేరగాళ్ల ఉసురుతీసేయడం అందులో మొదటిది. వివిధ కోర్టుల్లో 62 లక్షల కేసులు పెండింగులో ఉన్నాయంటూ- వాటిలో రాజకీయ నేతలు, మంత్రులు, చట్టసభ సభ్యులపై గల 20వేల కేసుల్ని ఉపసంహరిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసేసింది. ఈ ఉపసంహరణాస్త్రంతో 'రాజకీయ' కేసుల నీడలో ఉన్న నేతలంతా పునీతులైపోతారన్న మాట! అదే స్థిర సంకల్పంతో మత హింస కేసుల నుంచీ- అభియోగాలు ఎదుర్కొంటున్న అస్మదీయులందరికీ విముక్తి ప్రసాదించే ఔదార్యం అక్కడ కశ్మల గంగతో పోటీపడి పరవళ్లెత్తుతోంది. దేశంలో నిరుడు 822 మత ఘర్షణలు వెలుగుచూస్తే అత్యధికంగా 195 ఒక్క యూపీలోనే నమోదయ్యాయి. 44 మంది మరణించారని, 542 మంది గాయపడ్డారనీ గణాంకాలు చాటుతున్నాయి. నేరతీవ్రతతో నిమిత్తం లేకుండా రాజకీయ కేసులన్న ముసుగువేసి దండన నుంచి దోషుల్ని తప్పించే దుర్రాజకీయం- భారత రాజ్యాంగం పట్ల తీవ్ర అపచారం. అంతకుమించి బాధిత జనావళి పట్ల క్రూరపరిహాసం. కాదంటారా?

– పర్వతం మూర్తి

జగదభిరామనవమి

రామనామం జగన్మోహనకరం. పేరులోనే లోకాన్ని ఆనందింపజేసే గుణం 'రామ'శబ్దంలో ఉంది. అందుకే రాముడు జగదభిరాముడయ్యాడు. పేరులోనే గాక, గుణగణాల్లోనూ అత్యున్నత స్థానాన్ని అలంకరించిన మానవోత్తముడు శ్రీరాముడు. ఈ అవతారపురుషుడి జన్మదినం, వివాహదినం శ్రీరామనవమి. ఏటా వసంత రుతువు చైత్ర మాసంలోని శుక్లపక్షంలో నవమి తిథినాడు సంక్రమించే ఈ శుభదినం మానవాళికి ఆదర్శపాత్రం, అభ్యుదయకారకం.

శ్రీరాముడు జన్మించిన సమయంలో నక్షత్రమండలంలో అయిదు గ్రహాలు ఉన్నత స్థానంలో ఉన్నాయంటారు. ఇంత మంచివేళలో లోకోత్తర గుణాలు గల మహాపురుషులే అవతరిస్తారని శాస్త్రవాక్యం. అందుకే రామ జననవేళ విశ్వ క్షేమకారకం. వైవస్వత మన్వంతరంలోని పంచమ త్రేతాయుగం నాలుగో భాగంలో, విలంబి నామసంవత్సరం చైత్రశుద్ధ నవమినాడు రాముడు జన్మించాడని ఒక భారతీయ కాలమానం చెబుతోంది. ఈ ఏడాది కూడా విలంబి కావడం విశేషం.

శ్రీరాముడికి ఇంతటి విశిష్టత రావడానికి ఆయన ఉదాత్త శీలమే కారణం. 'లోకంలో అత్యధిక గుణసంపద గల మహానుభావుడెవరు' అని వాల్మీకి ప్రశ్నించినప్పుడు, నారదమహర్షి రాముణ్ని ప్రస్తావిస్తాడు. ఆయన గుణగణాల్ని వివరిస్తాడు. ఆకాశంలోని చుక్కల్లా అనంత గుణాలు కలిగిన రాముడి గురించి తెలుసుకొని, తాను కావ్యం రాస్తే అలాంటి మహాపురుషుడిపైనే రాయాలని వాల్మీకి నిర్ణయించుకొన్నాడు. రామాయణ మహాకావ్యాన్ని రచించాడు. రామగాథ వాల్మీకితో పాటు లోకాన్నీ తరింపజేసింది. ఉన్నత గుణాలు గలవారి చరిత్రలనే కావ్యాలుగా రాయాలని అలంకారశాస్త్రాలూ ప్రబోధిస్తున్నాయి.

తండ్రిమాట నిలబెట్టడం కోసం రాజ్యాన్నే త్యాగం చేసి, అడవుల బాట పట్టిన సత్యవాక్య పాలకుడు రాముడు. ఏకపత్నీవ్రతాన్ని ఆజీవనాంతం ఆచరించిన సచ్ఛీలి ఆయన. భ్రాతృవాత్సల్యాన్ని ఆదర్శవంతంగా కొనసాగించిన ప్రేమమూర్తి.

అన్యోన్య దాంపత్యానికి పార్వతీ పరమేశ్వరుల్ని, ఆదర్శ దాంపత్యానికి సీతారాముల్ని ప్రత్యక్ష నిదర్శనాలుగా భావిస్తారు. కష్టసుఖాల్లో భార్యాభర్తలు కలసి నడవాలన్న నీతిసూత్రానికి వారే ఉదాహరణలు.

వనవాసానికి పయనమయ్యే సమయంలో రాముడు- అపాయాలకు, ఆపదలకు నెలవైన అడవుల్లో నివసించడం ప్రమాదకరం కాబట్టి అయోధ్యలోనే ఉండిపొమ్మని సీతకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తాడు. భర్త లేని అయోధ్య అడవిలాంటిదని, ఆయన ఉన్న అడవి అయోధ్య వంటిదని



అంతర్యామి

ఆమె సమాధానమిస్తుంది. నీడలా ఎప్పుడూ భర్తను అనుసరించే ఉంటానని పలికి అనేక కష్టాల్ని ఎదుర్కొన్న సాధ్వి సీతాదేవి. విడదీయలేని ప్రేమకు ప్రతిరూపాలైన సీతారాములు, అందుకే జగదారాధ్యులయ్యారు. ఎన్ని తరాలు గడిచినా సీతారాముల పెళ్లి విశ్వ కల్యాణంగానే విరాజిల్లుతోంది.

భద్రాద్రి వంటి ప్రముఖ క్షేత్రాల్లోనే గాక ఊరూరా, ఇంటింటా సీతారామ కల్యాణాల్ని చూస్తుంటే శ్రీరామనవమికి గల ప్రత్యేకత, పవిత్రత ఎంతటిదో తేటతెల్లం అవుతుంది. కల్యాణం అనేది ఇంటివేడుక మాత్రమే కాదని, అది కుటుంబ వ్యవస్థ అవిచ్ఛిన్నంగా కొనసాగేలా చేసే పవిత్ర యజ్ఞమని రామాయణం చెబుతోంది. కన్యాదాతకు, కన్యా ప్రతిగ్రహీతకు సకల భోగభాగ్యాలు అందించేదే వివాహమని విశ్వగురువులైన వసిష్ఠాదులు జనక, దశరథులకు బోధించారు. ఇందుకు ఉదాహరణగా నిలిచేదే సీతారామ కల్యాణం.

వివాహఘట్టంలో సీతారాముల తలంబ్రాల సమయం మనోహరం. ఎర్రమందారాల వంటి సీత అరచేతుల నుంచి జాలువారే అక్షతలు పద్మరాగమణులుగా మారాయి. నల్లనివాడైన రామయ్య అరచేతులమీదుగా జారే తలంబ్రాలు కుందపుష్పాలుగా రూపుదిద్దుకున్నాయని వర్ణించే శ్లోకాన్ని నేటికీ పెళ్లిళ్లలో గుర్తుచేసుకుంటారు. వివాహజీవితం అనురాగరంజితం కావాలన్న ఆశీస్సును అది అందిస్తుంది. మానవోత్తముడైన రాముడి ఆదర్శాల్ని తలచుకొంటూ, జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి శ్రీరామనవమి స్ఫూర్తినిస్తుంది.

– డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

కేసుల ఒత్తిడితో అజ్ఞాతంలోకి నేరేడ్‌మెట్ ఎస్సై?


ఎస్సై నాగరాజు

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: నేరేడ్‌మెట్ ఎస్సై నాగరాజు శుక్రవారం అజ్ఞాతంలోకి వెళ్లడం రాచకొండ కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది. కేసుల ఒత్తిడితోనే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లాడని పోలీస్‌స్టేషన్ సిబ్బంది చర్చించుకుంటున్నారు. నాగరాజు శ్రీకాకుళంలో ఉన్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా తెలిసినట్లు సమాచారం. రెండున్నరేళ్ల క్రితం ట్రైనింగ్ నిమిత్తం వచ్చి ఇక్కడే పోస్టింగ్ పొందిన నాగరాజుకు పనిభారం పెరిగింది. ఆ స్టేషన్ ఎస్సైలు మధుసూదన్, ప్రవీణ్‌బాబు, కిషన్, జానీ బదిలీ కావడంతో కేసుల బాధ్యత ఆయనపై పడింది. స్టేషన్‌లో అనుభవజ్ఞులైన రైటర్లు లేకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. సీఐ, ఏసీపీలు తరచూ కేసుల పరిష్కారంపై ఆయనను మందలించేవారని సమాచారం. దీంతో తరచుగా తీవ్ర ఒత్తిడికి గురవుతుండేవారని సహచర సిబ్బంది చెప్పారు. ఈ నేపథ్యంలోనే నాగరాజు అజ్ఞాతంలోకి వెళ్లారని తెలుస్తోంది. మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వరశర్మను వివరణ కోరగా.. అధికారుల ఒత్తిడి లేదని.. విధులు నిర్వహించడంలో ఎస్సై ఇబ్బందులు ఎదుర్కొని ఉంటారని వెల్లడించారు.

సూర్యాపేట గ్రామీణ ఎస్సై సస్పెన్షన్

హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం కేసులో అధికారుల చర్యలు


లవకుమార్, ఎస్సై

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ స్టేషన్లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దామోదర్‌రెడ్డిపై చేయి చేసుకున్న సూర్యాపేట గ్రామీణ ఎస్సై లవకుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఐజీ స్టీఫెన్ రవీంద్ర శనివారం సాయంత్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ ప్రకాశ్ జాదవ్ తెలిపారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హెడ్‌కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులపై గృహహింస కేసు విషయమై విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిపించిన గ్రామీణ ఎస్సై లవకుమార్ అతనిపై చేయి చేసుకున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదని వాపోవడంతోపాటు తమ స్టేషన్ ఎస్సై సంతోష్‌కుమార్ వేధింపులకు గురిచేశారని మనస్తాపం చెందిన దామోదర్‌రెడ్డి శుక్రవారం ట్రాఫిక్ స్టేషన్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఎస్పీ రంగనాథ్ సూర్యాపేటకు వచ్చి పలువురు పోలీసులు, సాక్షులను విచారించారు. అనంతరం కొద్ది సేపట్లోనే ఎస్సై లవకుమార్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడ్డాయి.

వెలువడిన సూసైడ్ నోట్

ఆత్మహత్యాయత్నానికి ముందు దామోదర్‌రెడ్డి సూసైడ్ నోట్ రాశారు. గ్రామీణ ఎస్సై లవకుమార్, ట్రాఫిక్ ఎస్సై సంతోష్‌కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. తన భార్య, పిల్లలకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. దామోదర్‌రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

నక్సలిజం అంతిమదశకు చేరుకుంది

రాజ్‌నాథ్ వ్యాఖ్య

గురుగ్రామ్: దేశంలో నక్సలిజం అంతిమ దశకు చేరుకుందని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ప్రత్యక్ష పోరాటం చేయలేక మావోయిస్టులు దొంగ దెబ్బలకు దిగుతున్నారని అన్నారు. కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్) 79వ 'రైజింగ్ డే'ను పురస్కరించుకొని.. హరియాణాలో కదర్‌పుర్‌లోని సీఆర్‌పీఎఫ్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ ఈమేరకు ప్రసంగించారు. సీఆర్‌పీఎఫ్ బలగాల సేవలను ఆయన కొనియాడారు. వారి కృషి ఫలితంగానే వామపక్ష తీవ్రవాద ఘటనలు తగ్గుముఖం పట్టాయని ఆయన అన్నారు.

మత్తుమందులు, మాదకద్రవ్యాల వ్యాపారం చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారులకు సూచించారు. వీటిని అక్రమంగా తరలించే వ్యక్తుల ఆస్తులను జప్తు చేయాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్య నిరోధక సంస్థల తొలి జాతీయ సదస్సు సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై.. ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని రాజ్‌నాథ్ అన్నారు. దేశంలోని కొన్ని చోట్ల అక్రమంగా గంజాయి, నల్లమందు వంటివాటిని సాగుచేస్తున్నారని.. అలాంటి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సదస్సులో భారత్‌తోపాటు అమెరికా, ఆస్ట్రేలియాలకు చెందిన మాదకద్రవ్య నిరోధక సంస్థలూ పాల్గొన్నట్లు మాదకద్రవ్య నియంత్రణ సంస్థ (ఎన్‌సీబీ) డైరెక్టర్ జనరల్ తెలిపారు.

పరిజ్ఞానమే ప్రథమ ప్రాధాన్యం

- సానుకూల దృక్పథమూ కీలకమే
- ఆంగ్లానికి తగ్గుతున్న ప్రాధాన్యం
- వెల్లడించిన భారత నైపుణ్య నివేదిక సర్వే

ఈనాడు, హైదరాబాద్: సబ్జెక్టుపై పట్టు ఉన్నా ఆంగ్లంలో సరిగ్గా మాట్లాడలేక ఉద్యోగం దక్కలేదన్న వ్యాఖ్యలు ఇక వినపడవు. ఎందుకంటే ఉద్యోగాలిచ్చే యజమానులు ఉద్యోగార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం కాదు... పనిచేసే రంగంలో నైపుణ్యం, అవగాహనే ప్రధానంగా కోరుకుంటున్నారు. ఒక్క ఏడాదిలోనే సబ్జెక్టుపై పరిజ్ఞానానికి మొదటి ప్రాధాన్యమిచ్చిన యాజమాన్యాల శాతం రెట్టింపు కావడం విశేషం. అదే సమయంలో ఆంగ్ల భాషకు ప్రాధాన్యం తగ్గుతోంది.

ప్రాధాన్యతలో వ్యత్యాసం: విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యం... ఎంపికలో యజమానుల ప్రాధాన్యం, రాష్ట్రాల్లో నియామకాల పరిస్థితి... తదితర అంశాలపై అఖిల భారత సాంకేతిక విద్యామండలి, భారత పరిశ్రమల సమాఖ్య తదితర సంస్థలు గత ఐదేళ్లుగా భారత నైపుణ్య నివేదిక(ఐఎస్ఆర్) రూపొందిస్తున్నాయి. తాజాగా 2018 నివేదిక విడుదలైంది. ఉద్యోగాల ఎంపికకు అభ్యర్థుల్లో ఏం చూస్తారు? దేనికి ప్రాధాన్యమిస్తారన్న విషయంలో ఈసారి భారీ వ్యత్యాసం కనిపించింది. పరిశ్రమల యాజమాన్యాల ప్రాధాన్యాల్లో మార్పు ఉండటం గమనార్హం. 2017 నివేదికలో అభ్యర్థి పనిచేసే రంగంలో నైపుణ్యం, అవగాహన మొదటి ప్రాధాన్యంగా 19.30 శాతం మంది చెప్పగా... తాజా అధ్యయనంలో అది 38 శాతానికి పెరిగింది. సానుకూల దృక్పథం అవసరమని 20 శాతం మంది(2వ ప్రాధాన్యం) చెప్పారు. అంతకుముందు సర్వేల్లో దీన్ని కోరుకున్న వారే లేరు. తాను పనిచేసే రంగంలో వచ్చే పరిస్థితులకు అనుగుణంగా మారిపోయే గుణం అవసరమని 13 శాతం మంది(3వ ప్రాధాన్యం) వెల్లడించారు. గత నివేదికలో ఆంగ్ల భాష అవసరమని 13.78 శాతం మంది(3వ ప్రాధాన్యం)గా చెప్పారు. తాజాగా 10 శాతానికి తగ్గి 4వ ప్రాధాన్యానికి ఆంగ్ల భాష పడిపోయింది.

సర్వేలో ముఖ్యాంశాలు...

- అభ్యర్థులు కెరీర్‌పరంగా నిర్ణయాలు తీసుకోవడానికి సంసిద్ధంగా ఉన్నవారు 15 శాతమే.
- మహిళలు, పురుష ఉద్యోగులు పనిచేయడానికి ప్రాధాన్యమిచ్చే 10 నగరాల్లో హైదరాబాద్ ఒకటి.
- అప్రెంటిషిప్ చేసేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులు 93 శాతం ఉండగా...37 శాతం సంస్థలే దాన్ని కల్పిస్తున్నాయి.
- ఉద్యో అవకాశాలు అధికంగా కల్పిస్తున్న మొదటి 10 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలిచింది.
- మహిళల్లో ఉద్యోగ నైపుణ్యమున్న 9 నగరాల్లో విజయవాడ ఒకటి.
- పురుష, మహిళల ఉద్యోగ నైపుణ్యాలున్న 10 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా నిలిచింది.

యజమానుల ప్రాధాన్యం

అంశం	ప్రాధాన్యత శాతం
పనిచేసే రంగంపై అవగాహన	38
సానుకూల దృక్పథం	20
మార్పుకు అనుగుణంగా మారడం	13
ఆంగ్ల భాష	10
న్యూమరికల్, లాజికల్ ఎబిలిటీ(ఐక్యూ)	8
నేర్చుకునే సామర్థ్యం	6
ఇతరులతో కలిసి పనిచేసే సామర్థ్యం	2

నైపుణ్యం అవసరం

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలు ప్రాధాన్యాలు మార్చుకోవడం తప్పదు. ఒకప్పుడు భారత్‌లోని కంపెనీలు ఎక్కువగా సర్వీస్ ఇచ్చేవి. ఇప్పుడు ప్రొడక్టు కంపెనీలుగా మారుతున్నాయి. అందువల్ల వాటిల్లో విధులు నిర్వర్తించాలంటే పనిచేసే రంగంపై నైపుణ్యం అవసరం. ఇక ఆంగ్లం అంటారా నైపుణ్యం ముందు దాని ప్రాధాన్యం తగ్గిపోయింది.

\- వెంకట్ కాంచనపల్లి, సీఈఓ, సన్‌టెక్ కార్ప్




భూమి కుంగడంతో ఏర్పడిన గొయ్యి

కుంగిన భూమి.. ఆందోళనలో రైతులు

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెల్జిపూర్ వద్ద వ్యవసాయ పొలాల్లో శనివారం భూమి కుంగి పెద్దగొయ్యి ఏర్పడింది. కాళేశ్వరం ప్రాజెక్టు పదో ప్యాకేజీలో భాగంగా మధ్య మానేరు తిప్పాపూర్ వద్ద నిర్మిస్తున్న సర్జిపూల్ నుంచి అనంతగిరి జలాశయంలోకి నీటిని సరఫరా చేసేందుకు సొరంగాన్ని నిర్మిస్తున్నారు. వెల్జిపూర్ వద్ద సొరంగం పైభాగంలో భూమి కుంగుతుండటంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. చుట్టూ పగుళ్లు ఏర్పడటంతో రైతులు అటువైపు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. గత సంవత్సరం సైతం ఇదే ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడగా మట్టితో నింపారని రైతులు తెలిపారు. మళ్లీ పెద్ద గొయ్యి ఏర్పడటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పశువులను మేపడానికి, పొలాల వద్దకు రాత్రింబవళ్లు వెళ్తుంటామని.. ప్రమాదం జరిగితే తమకు దిక్కెవరని అంటున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' డీఈఈ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా పైనుంచి మట్టి తొలగించి సొరంగం పైభాగంలో సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మాణం చేస్తామన్నారు. సొరంగం నిర్మాణంలో భూమి గట్టిగా లేనిచోట ఇటువంటి సంఘటనలు జరుగుతుంటాయని తెలిపారు.

'పది' అక్రమార్కులపై హైకోర్టుకు నివేదిస్తాం

- 21 మందిని సస్పెండ్ చేశాం
- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల పాత్ర ఉంటే గుర్తింపు రద్దు
- సీసీ కెమెరాలున్న చోట మాల్ ప్రాక్టీస్ కేసులు లేవు
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, కొన్నిచోట్ల వాట్సాప్ ద్వారా పరీక్షలు ప్రారంభమైన తర్వాత ప్రశ్నపత్రాలు బయటకు వస్తున్నా వాటిని గుర్తించి నిందితులపై తక్షణం చర్యలు తీసుకుంటున్నామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ చెప్పారు. ఇప్పటివరకు నాలుగు ఘటనలు వెలుగుచూశాయని, వాటితో సంబంధమున్న మొత్తం 21 మంది సిబ్బందిని సస్పెండ్ చేశామని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు కాపీయింగ్‌పై తీసుకున్న చర్యలు, పరీక్షల సమయంలో జరిగిన ఘటనలపై న్యాయస్థానానికి నివేదిక ఇస్తామని చెప్పారు. శనివారం ఆయనిక్కడ ప్రభుత్వ పరీక్షల విభాగం(ఎస్ఎస్‌సీ బోర్డు) సంచాలకుడు బి.సుధాకర్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 12 మంది ఇన్విజిలేటర్లు(ఉపాధ్యాయులు), ఇద్దరు ప్రధాన పర్యవేక్షకులు(ఉపాధ్యాయులు), ముగ్గురు విద్యాశాఖకు చెందిన అధికారులతోపాటు పరీక్షలతో సంబంధమున్న నలుగురు సిబ్బందితో మొత్తం 21 మందిని సస్పెండ్ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం వరకు 25మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు, ఒకరి బదులు మరొకరు పరీక్ష రాస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఆంగ్లం పేపర్-1, జగిత్యాల జిల్లాలో గణితం పేపర్-1, నిర్మల్‌లో సామాన్యశాస్త్రం పేపర్-1 ప్రశ్నపత్రాలు బయటకు వచ్చాయని, పరీక్ష ప్రారంభమయ్యాక వచ్చినందున లీకేజీ అయినట్లు కాదని, కేవలం మాల్‌ప్రాక్టీసు మాత్రమేనని చెప్పారు. ఏదైనా సమాచారం అందిన వెంటనే పోలీసు సిబ్బంది బాగా స్పందిస్తున్నారని, తద్వారా నాలుగు ఘటనలను గుర్తించామని తెలిపారు. పరీక్షల పూర్తయ్యాక పరీక్షల ప్రక్రియపై అంతర్గత కమిటీని నియమించి విశ్లేషిస్తామని, నివేదికను హైకోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. నిందితులను వదిలిపెట్టబోమని, చట్టపరంగా అన్నిచర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. అక్రమాల్లో ప్రైవేట్ పాఠశాలల పాత్ర ఉందని తేలితే వాటి గుర్తింపు రద్దు చేస్తామన్నారు. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న వాటికి నోటీసులు ఇస్తున్నామన్నారు. సీసీ కెమెరాల నిఘా మధ్య 431 చోట్ల పరీక్షలు జరుగుతున్నాయని, వాటిల్లో ఒక్క మాల్‌ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని ఒక ప్రశ్నగా సమాధానంగా చెప్పారు.

బాలిక అనుమానాస్పద మృతి

- అత్యాచారం చేసి, హత్య చేశారని తల్లిదండ్రుల ఆవేదన


మౌనిక (పాతచిత్రం)

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: ఆడుతూ పాడుతూ బడికెళ్లిన బాలిక.. ఇంటికొచ్చిన కాసేపటికే గుర్తుతెలియని దుండగుల చేతిలో అఘాయిత్యానికి గురై విగతజీవిగా మారింది. రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో శుక్రవారం జరిగిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్‌కు చెందిన నర్సింహ, లలిత దంపతులు రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లి వాంబే కాలనీకి వలసొచ్చారు. ఇద్దరూ కూలీ పనిచేస్తున్నారు. వారి ఒక్కగానొక్క కుమార్తె మౌనిక(8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. శుక్రవారం తల్లిదండ్రులు పనికి వెళ్లగా..బాలిక పాఠశాలకు వెళ్లి వచ్చింది. సాయంత్రం బాలికను పలకరించేందుకు ఇంట్లోకి వెళ్లిన పక్కింటి మహిళ చిన్నారి అచేతనంగా పడి ఉండటాన్ని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించింది. వారి ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ ఎస్సై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. 'మా కుమార్తె మెడచుట్టూ గొంతు నులిమి చంపిన గుర్తులున్నాయి. అత్యాచారం చేసి..విషయం బయటికి రాకూడదన్న ఉద్దేశంతో చంపేశారు.' అని తండ్రి నర్సింహ శనివారం విలేకర్ల ఎదుటవాపోయాడు.

అసోంలో బాలికపై సామూహిక 'హత్యాచారం'

నగావ్: అసోంలో ఐదో తరగతి చదువుతున్న బాలికపై.. ఐదుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. అనంతరం ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించారు. తీవ్రంగా కాలిన గాయాలకు గురైన బాలిక.. శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. నాగావ్ జిల్లాలోని ధనియభెటి లాలుంగ్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి చేరుకున్న చిన్నారిపై.. జాకిర్ హుస్సేన్ అనే వ్యక్తి మరో నలుగురితో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని.. వారి కోసం గాలింపు చేపట్టామని పేర్కొన్నారు. ఇటు ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు.. హుస్సేన్ ఇంటిపై దాడి చేశారు. నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బాలిక చదువుతున్న పాఠశాలలోని విద్యార్థులు, ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్ నిరసనకు దిగారు.

వరంగల్ ఆకర్షణీయ నగర ప్రతిపాదనలు భేష్

- నగర పర్యటన సందర్భంగా చైనా ప్రతినిధులు

వరంగల్ కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్ మహానగరానికి సంబంధించి ఆకర్షణీయ నగర(స్మార్ట్‌సిటీ) ప్రతిపాదనలు బాగున్నాయని చైనా ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ మిషనరీ, ఎలక్ట్రానిక్స్ ప్రొడక్ట్స్ ప్రతినిధి షియోంగ్ హాంగ్ కితాబిచ్చారు. దేశంలో ఆకర్షణీయ నగరాల పథకానికి ఎంపికైన నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న చైనా పారిశ్రామికవేత్తలతో కలిసి శనివారం వరంగల్ మహానగరంలో ఆయన పర్యటించారు. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ప్రత్యేక బస్సుల్లో చేరుకున్న చైనా ప్రతినిధులు తొలుత వరంగల్ శివారులోని రాంపూర్‌లో నిర్వహిస్తున్న డంపింగ్‌యార్డును సందర్శించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు తీరును పరిశీలించారు. అనంతరం హన్మకొండలోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) కార్యాలయంలో స్మార్ట్ సిటీ పథకంపై రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్‌లు)లను దృశ్యరూప ప్రదర్శనగా తిలకించారు. ప్రాజెక్టులో రూ.2,876 కోట్లతో వివిధ ప్రాజెక్టులను ప్రతిపాదించారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.వెయ్యి కోట్లు, మిగిలిన రూ.1,876 కోట్ల నిధులను పబ్లిక్ అండ్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) ద్వారా అమలు చేయాలనే లక్ష్యంతో ఉన్నామని వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి చైనా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా చైనా ప్రతినిధి షియోంగ్ హాంగ్ మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు నచ్చాయని, తమ కంపెనీల భాగస్వామ్యం తప్పక ఉంటుందన్నారు. స్థానిక పరిస్థితులు, వాతావరణాలకు తగినట్లుగా వ్యాపార కార్యకలాపాలను ప్రారంభిస్తామన్నారు. వరంగల్ మహానగర పాలకసంస్థ మేయర్ నరేందర్, కమిషనర్ గౌతమ్, కుడా ఛైర్మన్ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వరంగల్ నగర శివారు రాంపూర్‌లోని డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న చైనా ప్రతినిధులు

టీజీటీ గణితం ఫలితాల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: గురుకులాల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) గణితం పోస్టుల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. గురుకులాల్లో 840 టీజీటీ గణితం పోస్టులకు 805 మందితో ఎంపికైనవారి జాబితా ప్రకటించింది. ఈమేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ ప్రకటన జారీ చేశారు. దివ్యాంగుల కోటాకు సంబంధించిన 35మంది ఫలితాలు వైద్యపరీక్షల నివేదిక వచ్చిన వెంటనే ప్రకటిస్తామని తెలిపారు. ఎంపికైనవారి జాబితాను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో పొందుపరిచారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈనెల 28న ఉదయం 10 గంటల నుంచి టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో పరిశీలన ప్రక్రియ ఉంటుందని కార్యదర్శి తెలిపారు.

వారం రోజుల్లో మిగతా సబ్జెక్టులకు.. గురుకులాల్లో టీజీటీ మిగతా సబ్జెక్టు పోస్టులకు వారంలోగా ఫలితాలు వెల్లడించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వర్గాలు తెలిపాయి. టీజీటీ గణితం సబ్జెక్టుకు శనివారం వెల్లడించిన ఎంపిక జాబితాలో తదుపరి మెరిట్ అభ్యర్థులు దాదాపు 90 మందికి స్థానం లభించింది. పీజీటీకి ఎంపికైన అభ్యర్థులు.. టీజీటీ పోస్టులకు అర్హతను వదిలివేయడంతో ఈ అవకాశం లభించింది. మిగతా సబ్జెక్టుల్లోనూ ఇదే తరహాలో 50కిపైగా తదుపరి మెరిట్ అభ్యర్థులకు అవకాశం లభించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయినందున ఒకటి రెండురోజుల తేడాలో మిగతా సబ్జెక్టుల ఎంపిక జాబితాలు వెల్లడవుతాయి.

టీఆర్‌టీలో తదుపరి మెరిట్‌కు అవకాశం! గురుకులాల్లో టీజీటీ, ఇతర పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల నుంచి ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ) పోటీకి స్వచ్ఛందంగా తప్పుకోనున్నట్లు ప్రమాణ పత్రాలు తీసుకోవాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. ఇలా చేయడంతో టీఆర్‌టీలోనూ తదుపరి మెరిట్‌కు అవకాశం కల్పించాలని ఆలోచిస్తోంది. ఈ మేరకు స్వచ్ఛందంగా పోస్టులు వదులుకుంటున్నట్లు హామీ ఇచ్చేలా ప్రమాణపత్రాలను సిద్ధం చేస్తోంది. ఈ తరహా నిర్ణయం కారణంగా టీజీటీలో తదుపరి మెరిట్ అభ్యర్థులకు పోస్టులు దక్కుతున్నాయి.

కనీస వేతనాల్ని సవరించేలా ఆదేశించండి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల కనీస వేతనాల్ని సవరించడంలేదని హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. కనీస వేతనచట్ట నిబంధనల ప్రకారం వేతనాల్ని ఎప్పటికప్పుడు సవరించాల్సి ఉన్నా ఆ ప్రకారం జరగడంలేదని తెలంగాణ ప్రాంత వర్తక సంఘం కౌన్సిల్ కార్యదర్శి జీవన్‌రావు వ్యాజ్యాం దాఖలుచేశారు. తెలంగాణ సర్కారు రెండేళ్ల కాలపరిమితితో 2014, 2016లో రెండు అడ్వయిజరీ బోర్డులు ఏర్పాటు చేసిందని.. వాటి ప్రతిపాదనల ఆధారంగా వేతనాల సవరణ వ్యవహారంలో తుది ప్రకటన జారీకి చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. తెలంగాణ కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి, లేబర్ కమిషనర్‌లను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

ఇన్‌సర్వీసు కోటా స్థానంలో వెయిటేజీ చట్టవిరుద్ధం

హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం

ఈనాడు, హైదరాబాద్: పీజీ వైద్యవిద్యలో ఇన్‌సర్వీసు కోటా స్థానంలో వెయిటేజీ ఇవ్వాలని నిర్ణయించి తెలంగాణ ప్రభుత్వం ఈనెల 22న జారీ చేసిన జీవో నెం.21, 22లను కొట్టివేయాలంటూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. 2017లో జారీచేసిన జీవో.27 ప్రకారమే ప్రవేశాలు కల్పించాలంటూ కాళోజీ నారాయణరావు వైద్యవిశ్వవిద్యాలయాన్ని ఆదేశించాలని డాక్టర్ ఎం.వసుచరణ్‌రెడ్డి, మరో 12మంది వ్యాజ్యం దాఖలు చేశారు. ఎంసీఐ నిబంధనల ప్రకారం పీజీలో జాతీయ కోటాలో 50శాతం పోగా, మిగిలిన 50శాతం సీట్లు స్థానికులకే చెందుతాయంటూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవోల్లో పేర్కొందని తెలిపారు. రాష్ట్రంలోని వైద్యవిద్యార్థులకు పీజీ ప్రవేశాల్లో నిర్దిష్ట కోటా ఉందని, క్లినికల్‌కు 30శాతం, నాన్‌క్లినికల్‌కు 50శాతం కోటా ఉందన్నారు. ప్రభుత్వం ఈ కోటాలను ఎత్తివేసిందని, దీనికి సంబంధించి జారీచేసిన జీవోలు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95కు విరుద్ధమని వివరించారు. వీటిని కొట్టివేయాలని, పిటిషన్‌పై విచారణ ముగిసేదాకా వాటి అమలును నిలిపివేయాలని కోరారు. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ వైద్యవిద్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ రిజిస్ట్రార్, వైస్‌ఛాన్సలర్, నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ కన్వీనర్‌లను చేర్చారు. పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగే అవకాశముంది.

స్వప్రయోజనాలే మీ అజెండా

- అందుకే ఎన్డీఏ నుంచి మీరు వైదొలిగారు
- ఏపీ సీఎంకు అమిత్‌షా తొమ్మిది పేజీల లేఖ

ఈనాడు - అమరావతి

"కాంగ్రెస్ హయాంలో రాష్ట్రానికి రూ. 1,17,967 కోట్లు అందితే భాజపా ప్రభుత్వం మొత్తం రూ.2,44,271 కోట్లు అధికంగా రాష్ట్రానికి అందిస్తోంది. ఐదు కోట్ల ఆంధ్ర ప్రజల అభివృద్ధికి కేంద్రం ఎంత బాధ్యతతో, అంకితభావంతో ఉందో చెప్పేందుకు ఈ అంకెలు సరిపోతాయనుకుంటా నాయుడుగారూ?"



స్వప్రయోజనాల కోసమే ఎన్డీఏ నుంచి వైదొలిగారని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ముఖ్యమంత్రి చంద్రబాబుపై ధ్వజమెత్తారు. ప్రత్యేక సహాయ ప్యాకేజీ కింద రూ.3 లక్షల కోట్ల విలువైన మౌలిక వసతులు, పారిశ్రామిక ప్రాజెక్టులు ప్రారంభించేందుకు కేంద్రం చొరవ తీసుకుందని, సీఎం దీనికి అంగీకరించి రెండేళ్ల తర్వాత యూటర్న్ తీసుకున్నారని విమర్శించారు. జరుగుతున్న అభివృద్ధిని దాచి, రాజకీయ లబ్ధి కోసం పార్టీలు... ప్రజల్లో ప్రత్యేక హోదా సెంటిమెంటును రగిలిస్తున్నాయని ఆరోపించారు. "ఆంధ్ర ప్రజల అభివృద్ధిలో తెదేపాను మా భాగస్వామిగా చూస్తున్నాం. మన రెండు పార్టీలకు ప్రజలిచ్చిన తీర్పును పక్కనపెట్టి స్వీయ రాజకీయ ప్రయోజనాల కోసం మీరు ఎన్డీఏను వీడిపోవడం దురదృష్టకరం. అభివృద్ధి కన్నా రాజకీయ సమీకరణలు మీపై ప్రభావాన్ని చూపించినట్లు నేను సందేహిస్తున్నా" అని శనివారం ముఖ్యమంత్రికి రాసిన 9 పేజీల లేఖలో అమిత్‌షా పేర్కొన్నారు.

మీకు, ఆంధ్రప్రదేశ్‌లోని ఐదుకోట్ల సోదర, సోదరీమణులకు ఉగాది శుభాకాంక్షలు అంటూ అమిత్‌షా లేఖను ప్రారంభించారు. "ఎన్డీఏ కుటుంబం నుంచి వైదొలగాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించుకున్న తర్వాత ఈ లేఖ రాస్తున్నా. గత లోక్‌సభ, రాజ్యసభల్లో మీ పార్టీకి తగినంత ప్రాతినిధ్యం లేకున్నా భాజపా ఒక అజెండా ప్రకారం ఉభయ రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించింది. విభజన చట్టం ప్రకారం జాతీయ ప్రాధాన్యమున్న 11 విద్యాసంస్థలను కేంద్రం ఏపీలో ఏర్పాటు చేయాలి. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీ, ఐఐఎం వంటి 9 సంస్థలు ఏర్పాటయ్యాయి. గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు నిధులను ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో ఆమోదించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలపట్ల నిర్లిప్తంగా ఉందని, మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తారా? సాధ్యాసాధ్యాలను బట్టి ఏపీలో 8 భారీ ప్రాజెక్టులు చేపట్టాలి. ఇప్పటికే ఐదింటి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. రూ. 6,769 కోట్ల అంచనాతో విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. కడప జిల్లాలో ఉక్కుకర్మాగారం ఏర్పాటుపై టాస్క్‌ఫోర్స్ కమిటీ నివేదిక ప్రకారం కార్యాచరణ ప్రారంభించింది. కొత్త రైల్వేజోన్ ఏర్పాటు రైల్వే శాఖ పరిశీలనలో ఉంది. రింగ్‌రోడ్డు, వైర్లెస్‌లైన్ల ఏర్పాటు చర్యలు వివిధ దశల్లో ఉన్నాయి.

2015-2020కి రాష్ట్రానికి నిధుల సరఫరా ఎలా ఉండబోతోందంటే..

గ్రాంట్లు	రూ.2,44,271 కోట్లు
కేంద్ర పన్నుల్లో వాటా	రూ.1,70,686 కోట్లు
గ్రాంట్ ఇన్ ఎయిడ్	రూ.36,225 కోట్లు
ద్రవ్య లోటు కింద	రూ.22,113 కోట్లు
స్థానిక సంస్థల గ్రాంటు	రూ.12,290 కోట్లు
విపత్తు నిర్వహణ నిధి	రూ.2,957 కోట్లు

ఎందుకు త్వరపడరు?

ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కింద రూ.8,991.18 కోట్లతో ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల (ఈఏపీ)కు సంబంధించి ఒప్పందాలు జరిగాయి. రూ.17,236 కోట్ల విలువైన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడానికి సిద్ధంగా ఉన్నాయి. అయినా ప్యాకేజీ కింద నిధుల విడుదల ఆలస్యమవుతుందంటున్న మీరు ఈఏపీల కోసం ఎందుకు త్వరితగతిన స్పందించలేదు? నాబార్డు నుంచి నేరుగా నిధులు తీసుకోడానికి 'స్పెషల్ పర్పస్ వెహికల్' ఏర్పాటుకు ఎందుకు స్పందించలేదు? ఆ నిధులు మీరు ఇతర అవసరాల కోసం మళ్లించడం కుదరదనేగా? అసంబద్ధ ఆర్థిక డిమాండ్లతో మాపై నిందలేయడం కయ్యానికి కాలు దువ్వడం కాదా? 14వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి ఐదేళ్ల ఆర్థిక లోటు రూ. 22,113 కోట్లుగా తేల్చింది. కేంద్రం 2014-15కి లోటు భర్తీకి రూ. 3,979 కోట్లు విడుదల చేసింది. కానీ మీరు రూ. 16వేల కోట్ల లోటు చూపుతున్నారు. ఇందులో రైతు రుణమాఫీ, పింఛన్ల వంటివి కూడా కలిసి నందున మీ వాదన సరికాదు. 2015-16కి కేంద్రం రూ. 1,600 కోట్లను అదనంగా విడుదల చేస్తామంది.


మీ అసమర్థత కాదా?

రాయలసీమలోని ఏడు వెనుకబడిన జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాలకు వర్తించేలా 2016 సెప్టెంబరు 30న కేంద్ర ప్రత్యక్ష పన్నుల సంస్థ నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ పారిశ్రామిక పన్ను రాయితీలను అందుకోలేదని వాదించడం మీ అసమర్థత కాదా? మొదటి మూడేళ్లలో ఏడు వెనుకబడిన జిల్లాలకు కేంద్రం రూ. 1,050 కోట్లు అభివృద్ధి గ్రాంట్లుగా ఇస్తే 88% వాడుకోలేదు. రాజ్‌భవన్, సచివాలయం, అసెంబ్లీ, మౌలిక వసతుల కోసం ప్రత్యేక సాయంగా రూ. 2,500 కోట్లు ఇస్తే 8% మాత్రమే వినియోగించుకున్నారు. ఇచ్చినవి వాడుకోకుండా మరిన్ని నిధులు కోరడం సముచితమేనా? పై రెండు గ్రాంట్లలో 12%, 8%లకే వినియోగ వివరాలిచ్చారు. ఖర్చు వివరాలను కేంద్రానికి ఇవ్వక్కర్లేదనడం మీ అవకాశవాదం. రైల్వే బడ్జెట్ల ద్వారా రూ. 14,151 కోట్లు కేటాయించాం. రూ. 47,989 కోట్లతో 32 రైల్వే ప్రాజెక్టులు కార్యరూపంలో ఉన్నాయి. 2014 ఏప్రిల్ 1 నుంచి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం మొత్తం భరిస్తామన్న కేంద్రం రూ. 5,364 కోట్లు విడుదల చేసింది' అని అమిత్‌షా లేఖలో పేర్కొన్నారు.

మీవి కట్టుకథలు.. అసత్యాలు

- అధికారం ఉందని ఏదిపడితే అది రాస్తారా?
- అసెంబ్లీలో నిప్పులు చెరిగిన ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు - అమరావతి



"కాంగ్రెస్ కంటే మీరే ఎక్కువ అన్యాయం చేశారని, ఎక్కువ మోసం చేశారనే భావన ప్రజల్లో ఉంది. ప్రత్యేక హోదా సహా చట్టంలో పెట్టిన అంశాలు, సభలో ఇచ్చిన హామీలు అమలు చేయమంటున్నాం. వాటిని సమీక్షించాల్సిన ఆలోచన కూడా లేకపోతే మిమ్మల్ని ఏమనాలి?"

రాష్ట్రానికి చేయాల్సిన సాయంపై సమీక్షించమని అడిగితే ఎదురుదాడికి దిగడమేమిటని ముఖ్యమంత్రి చంద్రబాబు భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాపై మండిపడ్డారు. కట్టుకథలు, అసత్యాలతో రాష్ట్రమంటే లెక్కలేనితనం ప్రదర్శించారని.. ఎక్కువ రాష్ట్రాలు మీ చేతుల్లో ఉన్నాయని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారా అని ధ్వజమెత్తారు. "ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తి హుందాతనం లేకుండా ఆంధ్రప్రదేశ్‌పై దాడి చేస్తే ఎలా? రాష్ట్రాన్ని కించపరుస్తూ, రెచ్చగొడుతూ, నన్ను నిందిస్తూ రాసిన లేఖను ప్రతి ఒక్కరూ చదివి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే వెనక్కి తగ్గను. ప్రత్యేక హోదా కోసం రాష్ట్ర ప్రజలంతా ఆందోళనలు చేస్తుంటే కేంద్రానికి ఇవేవీ గుర్తుకు రాలేదా? పార్లమెంట్‌లో హోదా కోసం ఎంపీలు పోరాడుతున్నారు. వీటి గురించి ప్రస్తావించలేదంటే ఎంత తెంపరితనం? మమ్మల్ని దెబ్బతీయాలనే దుర్బుద్ధితోనే ఇదంతా చేస్తున్నారు. తెదేపా త్యాగాలకు పెట్టింది పేరు. ప్రత్యేక హోదా రాష్ట్రానికి ఇచ్చే వరకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నాం" అని చంద్రబాబు అమిత్‌షాపై నిప్పులు చెరిగారు. శనివారం ఆయన అసెంబ్లీలో అమిత్‌షా రాసిన లేఖను చదువుతూ వివరణ ఇచ్చారు. "విభజన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్లో.. చట్టంలో పేర్కొన్న అంశాలకు సంబంధించి, రాజ్యసభలో ఇచ్చిన హామీలపై నిధులు పెట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదు. ఇచ్చిన నిధులకు రూ. 11,592 కోట్లకు వినియోగపత్రాలిచ్చాం. వెనకబడిన ప్రాంతాలకు రూ. 1,050 కోట్లు ఇస్తే 12 శాతం ఖర్చు చేశారని, రాజధానికి ఇచ్చిన రూ. 2,500 కోట్లలో 8 శాతమే ఖర్చు చేశామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సాయం చేసినా వాడుకోవడంలో అసమర్థులమంటున్నారు. కేంద్ర నిధుల ఖర్చుపై వినియోగ ధ్రువపత్రాలు ఇస్తున్నా, ఆన్‌లైన్‌లో పెడుతున్నా పట్టించుకోరా? పోలవరానికి రూ. 5,364 కోట్లు ఖర్చు చేశామంటున్నారు. భూసేకరణ విషయం ప్రస్తావించలేదే? వేగవంతం చేస్తామనలేదే? ఇతర రాష్ట్రాలకేమో 90శాతం గ్రాంట్‌గా ఇస్తారు. నేనేమో ఎస్పీవీ పెడితే ఖాతాలో వేస్తారా? దీనివల్ల రాష్ట్ర రుణపరిమితి మించిపోదా? దానికి బదులు నేనే అప్పుతెచ్చుకోవచ్చుగా? కేంద్ర నిధుల్ని మళ్లించడం మీకు అలవాటేమో. నాకు లేదు.

రాష్ట్రానికి ఏమిస్తున్నారు?

రాష్ట్రం నుంచి పన్నుల కింద కోట్లాది రూపాయల ఆదాయాన్ని పొందుతున్న కేంద్రం తిరిగి రాష్ట్రానికి ఇవ్వడానికి ఎందుకు ఆలోచిస్తోంది? కియా మోటార్స్ ఏటా 3లక్షల కార్లు తయారుచేస్తే కేంద్రానికి రూ. 4,500 కోట్లకుపైగా ఆదాయం వెళ్తుంది. రాష్ట్రం నుంచి ఇంధనం, గ్యాస్ తీసుకెళ్తున్నారు. రాష్ట్రానికి ఏమిస్తున్నారు? లాభాల్లో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంటున్నారు. సోలార్ పార్కుకు రూ. 24వేల కోట్లు అంటున్నారు. అందులో కేంద్రానిది రూ. 800 కోట్లే. స్వచ్ఛభారత్‌కు మీరు రూ. 8 వేలు ఇస్తే మేం రూ. 7 వేలు అదనంగా చెల్లించాం. అదేదో మీ ఘనతలా చెప్పుకోవడమేంటి? ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేసే రహదారులకు రూ. లక్ష కోట్లు ఇస్తామంటున్నారు. 14వ ఆర్థిక సంఘం అన్ని రాష్ట్రాలకూ ఇచ్చినట్లే మాకూ నిధులిస్తోంది. ఇందులో రాష్ట్రానికి ప్రత్యేకంగా ఇచ్చిందేంటి? వెనకబడిన ప్రాంతాలకు నిధుల ఖర్చుపై వినియోగ ధ్రువపత్రాలు ఇచ్చాక నీతిఆయోగ్ నిధులు విడుదల చేయమంది. ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కి తీసుకున్నారు. రైల్వేకు దేశమంతా ఇచ్చినట్లే ఏపీలోనూ ఇచ్చారు. ప్రత్యేక హోదాకు సమానంగా ఇస్తామన్నాకే ప్రత్యేక సాయానికి ఒప్పుకున్నాను. ఏడాదిన్నరగా రాష్ట్రానికేమీ చేయలేదు.

మోదీ.. సోనియా, మన్మోహన్ ఫొటోలు పెట్టారా?

కేంద్ర భాగస్వామ్యంతో రాష్ట్రానికి ఉపయోగం ఉంటుందనుకున్నా. కేంద్ర మంత్రివర్గంలోకి ఇద్దర్ని తీసుకుంటామని ప్రధాని మోదీ అంటే సరే అన్నా తప్ప క్యాబినెట్ హోదానా, సహాయ మంత్రిగా తీసుకుంటున్నారా? ఏ శాఖ ఇస్తున్నారని కూడా అడగలేదు. ఎన్డీయే డబ్బులిచ్చినా ఎక్కడా పేరు పెట్టలేదంటున్నారు. మోదీ కూడా పదేళ్లు సీఎంగా పనిచేశారు. ఎప్పుడైనా మన్మోహన్‌సింగ్, సోనియాల ఫొటో పెట్టారా? ఒకరకంగా చెప్పాలంటే మా మంత్రుల్ని కూడా మీ పార్టీకి ప్రచారం చేయమన్నారు. నేనెప్పుడూ మీ మంత్రుల్ని మాకు ప్రచారం చేయమనలేదు. తెలంగాణలో ఎన్నికల తర్వాత తెదేపాతో తెగదెంపులు చేసుకుంటున్నామని భాజపా ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. అయినా సురేశ్‌ప్రభును రాష్ట్రం నుంచి రాజ్యసభకు పంపి త్యాగం చేశాం తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరలేదే? ఎన్డీయే నుంచి వైదొలిగే విషయంలోనూ ఏకపక్షంగా వెళ్లలేదే? ఎందుకు వైదొలగాల్సి వస్తుందో వివరించాం. ప్రజల్ని మోసం చేయొచ్చని వాళ్లు (వైకాపా) చెప్పారు. మీరు నమ్మారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రధాని కార్యాలయంలోనే ఉంటా.. కేసులు పెట్టిస్తా అంటున్నారు. ప్రతివారం కోర్టుకెళ్లే వ్యక్తి, బెయిల్‌పై ఉన్నవారు ప్రధానిని పదేపదే కలిస్తే ఏమనుకుంటారు? ప్రభుత్వం నుంచి వైదొలగడంలో నేనేమీ తొందరపడలేదు. ప్రధాని, మంత్రులను కలిశా. 29సార్లు తిరిగి ప్రయత్నించా. అయిదో బడ్జెట్లో కూడా ఏపీకి ఏమీ కనబడకే ఎంపీలను ఆందోళన చేయమన్నాం. మిత్రధర్మంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్‌కు చెప్పినా పట్టించుకోలేదు. దిల్లీ నాయకత్వంతో ఉంటే గతంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే మీకూ పడుతుందని భాజపా ఎమ్మెల్యేలకు కూడా చెబుతున్నా. దేశంలో ఏ రాష్ట్రం కంటే తెదేపా వెనకబడి ఉండదు. నాలుగేళ్లలో సగటున 10.5శాతం చొప్పున వృద్ధిరేటు సాధించాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ప్రత్యేక హోదాకీ, యూసీలకూ సంబంధమేంటి?

- అమిత్‌షా లేఖపై లోకేష్ స్పందన

ఈనాడు అమరావతి: భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్ర సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారని ఏపీ పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడానికీ, వినియోగ పత్రాలకూ (యూసీ) సంబంధం ఏంటని ఆయన ప్రశ్నించారు. లోకేష్ శనివారం శాసనసభ లాబీల్లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేంద్ర నిధులతో చేపట్టిన అన్ని ప్రాజెక్టులకు సంబంధించి జరిగిన పనులకు కేంద్రానికి ఇప్పటికే యూసీలు సమర్పించామని తెలిపారు. ఎన్డీఏ నుంచి వైదొలగాలని తెదేపా ఆవేశపూరితంగా నిర్ణయం తీసుకుందని అమిత్‌షా ఆ లేఖలో రాయడాన్ని ఆయన తప్పుబట్టారు. కేంద్ర మంత్రులు రాజీనామాలు చేసిన తర్వాత కూడా కేంద్రం నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం వల్లే ఎన్డీయే నుంచి వైదొలిగామని పేర్కొన్నారు. శాసనమండలిలో శనివారం నారా లోకేష్ మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణల విభజన జరగడం మంచిదేనని భాజపా సభ్యులు అంటున్నారు. ఇది నాకు చాలా బాధ కలిగిస్తోంది' అన్నారు.

లేఖలోని అంశాలు ఆశ్చర్యం.. హోదాతోనే న్యాయం

- వైకాపా అధినేత జగన్

ఈనాడు డిజిటల్, అమరావతి: భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా లేఖలోని అంశాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయని.. ప్రత్యేకహోదా ద్వారా రాష్ట్రాలకు ఇచ్చే పారిశ్రామిక రాయితీలు ఇవ్వకుండా రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని వైకాపా అధినేత జగన్ ప్రశ్నించారు. రాష్ట్ర అప్పులు గత నాలుగేళ్లలో రూ. 97 వేల కోట్ల నుంచి రూ. 2.25 లక్షల కోట్లకు చేరిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా రూపొందించే ప్యాకేజీ, హోదాకు సమానమని ఎలా చెబుతారన్నారు. సీఎం చంద్రబాబుకు అమిత్‌షా రాసిన లేఖపైనా, చంద్రబాబు అసెంబ్లీలో చేసిన ప్రసంగంపైనా జగన్ స్పందించారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు మాత్రమే ఇచ్చే పారిశ్రామిక రాయితీలు, జీఎస్టీ, 100 శాతం ఆదాయపు పన్ను మినహాయింపులు, కరెంటు ఛార్జీల్లో రిబేటు తదితర ప్రయోజనాలు ప్రత్యేక ప్యాకేజీలో ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఈ ప్రయోజనాలు లేకుండా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌తో ఎలా పోటీ పడతామని అన్నారు. ప్రత్యేకహోదా నుంచి కేంద్రం ఎందుకు పక్కకు మళ్లింది? అని ప్రశ్నించారు.

బాబూ... బాగా చెప్పారు!

- చంద్రబాబుకు మమత ప్రశంస
- అమిత్ షా లేఖ అబద్ధాల పుట్ట అని వ్యాఖ్య



కోల్‌కతా: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్రాలను అణచివేస్తూ మరోవైపు వాటికి అధిక నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత మమతా బెనర్జీ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, నిధుల మంజూరు కోసం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్న పోరాటానికి ఆమె మద్దతు తెలిపారు. ఈ క్రమంలో భాజపా అధ్యక్షుడు అమిత్ షా రాసిన లేఖను చంద్రబాబు తిప్పికొట్టిన తీరును ప్రశంసించారు. "చంద్రబాబు వాస్తవాలను వెల్లడించారు. చాలా బాగా చెప్పారు. ఆయనకు నా ప్రశంసలు. చాలా మంది అసత్యాలను ప్రచారం చేస్తూ నాయకులుగా చలామణి అవుతున్నవారు. అది వారికి అలవాటుగా మారింది. రాష్ట్రాలను అణచివేస్తూనే వాటికి చాలా నిధులు ఇచ్చినట్లుగా పోజులిస్తున్నారు. ఇది బూటకపు సమాఖ్య వ్యవస్థ" అంటూ ట్వీట్ చేశారు.

ఏపీ మనోభావాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదనటం నిరాధారం, అసత్యం అంటూ అమిత్ షా తొమ్మిది పేజీల లేఖ రాయటం, దానిని చంద్రబాబు 'అబద్ధాల పుట్ట'గా పేర్కొంటూ ఘాటుగా జవాబివ్వటంపై మమత ఈ వ్యాఖ్యలు చేశారు. యూపీలో కొత్తగా పొత్తులకు సిద్ధమైన బీఎస్పీ అధినేత మాయావతి, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌లకూ మమతా బెనర్జీ మద్దతు ప్రకటించారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓటమి ఎస్పీ-బీఎస్పీల పొత్తును ఆటంకపరచలేదని మాయావతి ప్రకటించటాన్నీ మమతా బెనర్జీ మరో ట్వీట్‌లో సమర్థించారు.

తాపీ పట్టిన చెయ్యి.. లాఠీ పట్టబోతోంది

- డీఎస్పీ కాబోతున్న భవన నిర్మాణ కార్మికుడు
- కుమారుడి అంధత్వంతో పెరిగిన పట్టుదల!
- గ్రూపు-1లో రెండో స్థానం(ఎస్సీ) సాధించిన సునీల్

ఈనాడు అమరావతి: కుటుంబ కష్టాలను గట్టెక్కించడానికి చదువుకు స్వస్తిచెప్పి భవననిర్మాణ పనికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అందించిన సహకారంతో మళ్లీ చదువును పట్టాలెక్కించాడు. తాను చిన్న ఉద్యోగిగా ఉంటే అంధుడైన కుమారుడి భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న భయం అతన్ని వెంటాడింది. గ్రూపు-1 లక్ష్యంగా ఎంచుకున్నాడు. రెండేళ్లపాటు భార్యా పిల్లలకు దూరమై అహర్నిశలూ శ్రమించాడు. తొలి ప్రయత్నంలోనే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూపు-1 (ఎస్.సి.) జాబితాలో సునీల్ రెండో స్థానంలో, రాష్ట్ర స్థాయిలో 29వ స్థానంలో నిలిచాడు. డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ కాబోతున్నా.

నేపథ్యమిదీ..: కూలీ కుటుంబానికి చెందిన సునీల్(28) స్వస్థలం కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ. బూడిద కొండ, రాహేల్‌ల పెద్దకుమారుడైన సునీల్ ప్రాథమిక విద్య ప్రభుత్వ పాఠశాలలో పూర్తిచేశాడు. పదో తరగతిలో 548, ఇంటర్(బైపీసీ)లో 95% మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. డిగ్రీలో చేరే సమయంలో తండ్రి మరణించడంతో చదువుకు స్వస్తిపలికి భవన నిర్మాణాల పనికెళ్లాడు. కూలిపనితో కుటుంబాన్ని పోషిస్తున్న తల్లి ఇచ్చిన భరోసాతో 2007లో 87% మార్కులతో డిగ్రీ పూర్తిచేశాడు. అనంతరం ఓ సిమెంట్ కంపెనీలో కెమిస్ట్‌గా ఉద్యోగంలో చేరాడు.



కుటుంబంతో సునీల్

శ్యామలను వివాహాన్ని చేసుకున్నాడు. ప్రథమ సంతానం రాహుల్ పుట్టుకతో అంధుడు కావడంతో సునీల్ కుటుంబం వేదనకు గురైంది. చిన్నవేతనంతో కుటుంబానికి..ముఖ్యంగా రాహుల్‌కు న్యాయం చేయలేనన్న బాధ సివిల్స్‌పై దృష్టిపెట్టేలా చేసిందని 'ఈనాడు, ఈటీవీ'తో పేర్కొన్నాడు.

స్నేహితుడి అండతో: 'స్నేహితుడు నరసింహారావు అండతో హైదరాబాద్‌కు పయనమై ఓ శిక్షణ కేంద్రంలో చేరా. పలు శిక్షణ కేంద్రాల్లో పార్ట్‌టైమ్‌గా రీజనింగ్ బోధిస్తూ అవసరాలను తీర్చుకున్నా. స్వీయసాధనతో సబ్జెక్టుపై పట్టుసాధించా. ఆంగ్లంలో హిందు, తెలుగులో ఈనాడు దినపత్రిక, టీవీలో వచ్చే చర్చా వేదికలను వింటూ సొంతంగా నోట్స్‌ను తయారుచేసుకున్నా. చరిత్ర, రాజనీతి శాస్త్రాల్లోని అంశాలను సమగ్రంగా చదివా. గ్రూపు-2 ప్రధాన పరీక్షలో వెనుకబడినప్పుడు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. శిక్షణకు ఫీజు చెల్లించడంతోపాటు నా స్నేహితుడు నాకోసం బ్యాంకు ఉద్యోగాన్ని హైదరాబాద్ బదిలీ చేయించుకున్నాడు. వాడి ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధించా. మా అమ్మ, నా భార్య శ్యామల సహకారం అంతా ఇంతా కాదు. భవిష్యత్‌లో సివిల్స్‌కు సన్నద్ధమవుతా'.

ఎన్డీఏకి మరో పార్టీ దూరం

తెగదెంపులు చేసుకున్న జీజేఎం

డార్జిలింగ్: భాజపా తీరుతో విసిగిపోయిన మరో పార్టీ ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగింది. ఇకపై తమకు ఆ కూటమితో ఎలాంటి సంబంధాలు ఉండబోవని 'గూర్ఖా జనముక్తి మోర్చా' (జీజేఎం) అధిపతి ఎల్.ఎం.లామా శనివారం ప్రకటించారు. గూర్ఖాల విశ్వాసాన్ని భాజపా వమ్ము చేసిందని ఆరోపించారు. జీజేఎంతో తమకు పొత్తు అప్పటి ఎన్నికల వరకేనని పశ్చిమ బెంగాల్ భాజపా అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ఇటీవల చేసిన ప్రకటన జీజేఎంను మనస్తాపానికి గురిచేసింది. గూర్ఖాలపై భాజపాకి సానుభూతి గానీ, చిత్తశుద్ధిగానీ లేదని తేలిపోయిందని లామా చెప్పారు. 2009, 2014 ఎన్నికల్లో డార్జిలింగ్ లోక్‌సభ స్థానం నుంచి భాజపా అభ్యర్థులు గెలవడానికి తాము దోహదపడ్డామన్నారు. తమ పార్టీ వల్లనే బెంగాల్‌లో భాజపా అడుగుపెట్టగలిగిందని చెప్పారు. 15 రోజుల్లో చర్చలు జరుపుతామని కేంద్ర హోంమంత్రి హామీ ఇవ్వడంతో గత ఏడాది డార్జిలింగ్‌లో కొనసాగిన 104 రోజుల బంద్‌ను ఉపసంహరించుకున్నామనీ, ఆరు నెలలకు పైగా గడిచిపోయినా స్పందన రాలేదనీ విమర్శించారు.

రాహుల్‌తో ప్రధాన మంత్రి పదవిపై చర్చించలేదు

- ఎన్సీపీ అధినేత శరద్ పవార్ వెల్లడి

థానే: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాయేతర లౌకికవాద పార్టీలు ఆధిక్యం సాధిస్తే.. ప్రధాన మంత్రి పదవిని ఎవరు చేపట్టాలనే అంశంపై కాంగ్రెస్, ఎన్సీపీ పార్టీలు చర్చించుకున్నాయా? అటువంటి పరిస్థితే వస్తే ప్రధాన మంత్రి పదవికి తన పేరును పరిశీలించాలని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కోరుకుంటున్నారా?... ఇటీవల దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో భేటీ అయినప్పుడు ఈ అంశాలు ఏమైనా ప్రస్తావనకు వచ్చాయా?...శనివారం మహారాష్ట్రలోని పాల్ఘడ్‌లో శరద్ పవార్ ఇచ్చిన సమాధానం ఈ సందేహాలకు తావిస్తోంది. ఆయన పాల్గొన్న ఓ సమావేశంలో అక్కడివారు అడిగిన ఓ ప్రశ్నకు పవార్ బదులిస్తూ..."రాహుల్ గాంధీతో భేటీలో తాను ప్రధాన మంత్రి పదవిని చేపట్టే విషయమేమీ చర్చకు రాలేదు" అని ఆయన వెల్లడించారు. వచ్చే లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భావసారూప్యం ఉన్న పార్టీలతో కలిసే ఎన్సీపీ పోటీ చేస్తుందని తెలిపారు. అభివృద్ధికి, ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదని, అయితే వ్యవసాయ భూములను, స్థానిక ఉద్యోగాలను వాటికోసం పణంగా పెట్టలేమని పవార్ చెప్పారు. బుల్లెట్ రైలు, ముంబయి-బరోడా నడవాల గురించి ప్రస్తావిస్తూ అవి అవసరమా అని ప్రశ్నించారు.

కేంబ్రిడ్జ్ అనలిటికాలో సోదాలు

లండన్: 'ఫేస్‌బుక్' డేటా కుంభకోణానికి కేంద్ర బిందువుగా ఉన్న కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థ కార్యాలయాలపై బ్రిటన్ అధికారులు సోదాలు చేశారు. ఆ సంస్థకు వ్యతిరేకంగా ఆధారాలను సేకరించాక తదుపరి చర్యలను పరిశీలిస్తామని చెప్పారు. సోదాల కోసం న్యాయమూర్తి నుంచి వారెంటును పొందిన సమాచార కమిషనర్ కార్యాలయం (ఐసీవో).. 18 మంది అధికారులను రంగంలోకి దింపింది. వీరు స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 8.00 గంటల సమయంలో లండన్‌లో కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థకు చెందిన కార్యాలయాల్లోకి ప్రవేశించారు. 3.00 గంటలకు బయటికి వచ్చారు. ఐసీవో విస్తృత దర్యాప్తులో ఇదిఒకఅంకమేనని అధికారులుతెలిపారు.

కదులుతున్న రైలు ఎక్కుతుండగా విషాదం

- ప్లాట్‌ఫాం, బోగీ మధ్య ఇరుక్కుని ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

చీరాల పట్టణం, న్యూస్‌టుడే: కదులుతున్న రైల్లోకి తేలిగ్గానే చేరుకోవచ్చన్న ధీమా ఓ ఇంజినీరింగు విద్యార్థి ప్రాణాలను బలిగొంది. ప్రకాశం జిల్లా దర్శి కామాంతపూడి గ్రామానికి చెందిన కె. వెంకటాద్రి, సత్యవతి దంపతుల కుమారుడు వెంకటశివ(18) గుంటూరు జిల్లా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చెన్నైలో విద్యా సదస్సులో పాల్గొనేందుకు శుక్రవారం రాత్రి స్నేహితులతో కలిసి బాపట్లలో హైదరాబాద్-చెన్నై ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైలు చీరాలకు రాగా మంచినీటి కోసం కిందికి దిగాడు. రైలు కదలటంతో పరిగెత్తుకుంటూ ఎక్కేందుకు ప్రయత్నించాడు. అదుపుతప్పి ప్లాట్‌ఫాం, రైలు పెట్టెకు మధ్య ఇరుక్కుపోయాడు. రైలు కొంతదూరం ఈడ్చుకు వెళ్లింది. గార్డు వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో రైలును నిలిపేశారు. తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలో ఉన్న శివను చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యుడు ధ్రువీకరించారు.



వెంకటశివ

ఎందుకీ దాగుడు మూతలు?

- ప్రభుత్వాధికారులతో కమిటీ వేసి లెక్కలు తేల్చండి!: పవన్



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు భాజపా ప్రత్యేక హోదా ఇవ్వదు.. దాన్ని సాధించుకునే స్థితిలో తెదేపా లేదనే విషయం ప్రజలకు మరోమారు అర్థమైందని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా చంద్రబాబుకు సుదీర్ఘ లేఖ రాయడం, దానిపైన ముఖ్యమంత్రి సుదీర్ఘంగా జవాబివ్వడం చూస్తుంటే ఈ విషయం తేటతెల్లమవుతోందని శనివారం ఓ ప్రకటనలో వివరించారు. రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలు ఇచ్చామని, వాటిని ఖర్చు చేయడంలో తెదేపా విఫలమైందని అమిత్‌షా మళ్లీ పాత పాటే పాడగా.... రాష్ట్రానికి భాజపా అన్యాయం చేసిందంటూ చంద్రబాబు మరోసారి ఘోషించారని విమర్శించారు. ఈ దాగుడుమూతలను ఆపి ఇప్పటి వరకూ కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిందెంతో, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందెంతో తేల్చేలా అధికారులతో కమిటీ వేసి లెక్కలు కట్టి ప్రజలకు తెలియజేయొచ్చు కదా! అని ప్రశ్నించారు. జనసేన చొరవతో ఏర్పాటైన ఉమ్మడి నిజ నిర్ధారణ కమిటీ అధ్యయనంలో వెల్లడైన అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయొచ్చు కదా! అని అన్నారు. "ప్రత్యేక హోదా తప్ప మిగతా వాటి గురించి వినే స్థితిలో ప్రజలు లేరనే వాస్తవాన్ని ప్రభుత్వాలు గుర్తిస్తే మంచిది. ప్రజలు విసిగిపోయి నిరవధిక ఆందోళనలకు దిగే పరిస్థితిని దయచేసి కల్పించొద్దు. భాజపా, తెదేపా కారణంగా రాష్ట్రంలో ఏర్పడ్డ అనిశ్చితిపై చర్చించేందుకు త్వరలో వామపక్ష పార్టీల నాయకులతో సమావేశమవుతాం. ప్రజల అభీష్టాన్ని నెరవేర్చడానికి ఎలా ముందుకెళ్లాలో ఈ సమావేశంలో నిర్ణయిస్తాం. అనంతరం లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ, ఇతర సీనియర్ నాయకులు, మేధావులతోనూ సమాలోచనలు జరుపుతాం" అని పవన్ ప్రకటనలో వివరించారు.

'కనిష్క్' నిర్వాహకులపై ఈడీ కేసు

చెన్నై, న్యూస్‌టుడే: బ్యాంకుల నుంచి రూ. 824 కోట్ల మేర రుణాలు పొంది మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కనిష్క్ సంస్థ నిర్వాహకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కేసు నమోదు చేసింది. చెన్నై టీనగర్ నార్త్ ఉస్మాన్ రోడ్డులోని 'కనిష్క్' ఆభరణాల తయారీ సంస్థ 14 బ్యాంకుల నుంచి రూ. 824 కోట్ల రుణాలు పొంది మోసానికి పాల్పడినట్లు కొద్దిరోజుల కిందట సీబీఐ అధికారులకు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. ఆభరణాల నిల్వను ఎక్కువగా చూపించి, తప్పుడు వార్షిక ఆదాయ నివేదికలు, లాభాలు చూపించి ఈ రుణాలు పొందారన్నది ఆరోపణ. దీంతో సంస్థ డైరెక్టరు భూపేష్‌కుమార్ జైన్, ఆయన భార్య నీతాజైన్ తదితర ఆరుగురిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసుకు సంబంధించి నుంగంబాక్కంలోని భూపేష్‌కుమార్ జైన్ నివాసం, కార్యాలయం, పరిశ్రమ తదితర ప్రాంతాల్లో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. భూపేష్, నీతాలను బెంగళూరుకు రప్పించి పలు విడతలుగా విచారించారు. కనిష్క్ సంస్థ నిర్వాహకులు ఆరుగురు చట్టవిరుద్ధంగా నగదు బదిలీకి పాల్పడినట్లు దర్యాప్తులో తేల్చారు. దీంతో వారిపై ఈడీ శుక్రవారం కేసు నమోదు చేసింది. వారిని విచారించడానికి, అక్రమాస్తులను స్తంభింపచేయడానికి చర్యలు చేపట్టింది.

పదెకరాల స్థలం కొంటానంటూ దగా!

మరోవంక, భూపేష్‌కుమార్‌పై చెన్నైకి చెందిన పుగళేంది పోలీసులకు ఓ ఫిర్యాదు చేశారు. పూందమల్లి వద్ద రూ. కోట్ల విలువైన తన పదెకరాల స్థలం కొనుగోలుకు భూపేష్ ఒప్పందం కుదుర్చుకున్నాడని, తర్వాత ఆ పత్రాల ద్వారా రూ. 42 కోట్ల బ్యాంకు రుణం తీసుకుని మోసం చేశాడని ఆరోపించారు. ఈ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

'నాదెళ్ల'పై సీబీఐకి స్టేట్ బ్యాంక్ ఫిర్యాదు

- తప్పుడు లెక్కలతో రూ.250 కోట్ల రుణం పొందిన వైనం

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై నగరంలో కనిష్క్ పంథాలోనే మరో నగల దుకాణం మోసానికి పాల్పడినట్లు తేలింది. నాదెళ్ల సంపత్ జ్యూయలరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తప్పుడు లెక్కలతో రూ. 250కోట్ల మేర రుణాలు తీసుకుని మోసం చేసినట్లు సీబీఐకి ఫిర్యాదు అందింది. ఈ సంస్థ 2010 నుంచి తప్పుడు ఖాతాలు చూపించి స్టేట్ బ్యాంకు నుంచి రూ. 250కోట్ల వరకు రుణాలు పొందిందని, ఇది 2017 డిసెంబరు 22న పరిశీలనలో తేలిందని బ్యాంకు అధికారులు సీబీఐకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవంక, ఇప్పటికే ఈ సంస్థకు అనుబంధంగా ఉన్న నాదెళ్ల సంపత్ శెట్టి నగల దుకాణం ప్రజల నుంచి 'బంగారు ఆభరణాల పొదుపు పథకం' కింద పెట్టుబడులు పొంది గత ఏడాది అక్టోబరులో వివాదాల్లో చిక్కుకుంది. మదుపుదారులకు ఆభరణాలు ఇవ్వకుండా, చెల్లించిన డబ్బు తిరిగి చెల్లించకుండా నగరంలోని శాఖలన్నీ మూసివేసింది. వివిధ కారణాలతో మదుపుదారులకు డబ్బులు తిరిగి చెల్లించలేకపోతున్నట్లు తమ దుకాణాలకు నోటీసులు అతికించింది. సుమారు వెయ్యి మంది బాధితులు ఆందోళనలకు దిగడంతోపాటు ఆర్థిక నేరాల నిరోధక విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో 21 వేల మంది నుంచి రూ. 75కోట్ల మేర డబ్బు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

● **మెగాస్టార్ 152వ చిత్రానికి..**
చిరంజీవిగారి 152వ చిత్రాన్ని నేను డైరెక్ట్ చేస్తున్నానన్న వార్తలో నిజం లేదు. అయినా నాకు ఒక కథ రాసుకోవడానికి, సినిమా తీయడానికి చాలా సమయం పడుతుంది. ఇంకా ఏ కథా నేను సిద్ధం చేసుకోలేదు. ప్రస్తుతం నా మనసంతా రంగస్థలం చుట్టూనే తిరుగుతోంది. ముందు నేను దాన్లోంచి బయటపడాలి. కొంత సమయం తీసుకోవాలి. ఆ తర్వాతే ఏదైనా.. మెగాస్టార్‌తో ప్రాజెక్టు వాస్తవం కాదు.

● **సైకిల్ స్టాండ్**
పదో తరగతి, కాలేజ్ చదువంతా రాజోలులోనే సాగింది. డిగ్రీ తర్వాత 'టెట్రాహెడ్రల్' అని ట్యూషన్ సెంటర్ ప్రారంభించా. చెబితే నమ్మరు కాని.. నా దగ్గర ట్యూషన్‌కు కాలేజీ విద్యార్థులు ఎగబడేవారు. ట్యూషన్ గది బయట సైకిల్ స్టాండ్‌లా ఉండేది. విద్యార్థులు పార్క్‌చేసే సైకిళ్లే ఓ పర్లాంగు దూరం ఉండేవి. ఆ ట్యూషన్లు నాకు బాగా పేరు తెచ్చిపెట్టాయి. కాకినాడ ఆదిత్యాలో పనిచేసే అవకాశం రావడానికి ఆ ట్యూషన్లే కారణం.

● **ఎక్కడైనా కష్టపడితే** తగిన ఫలితం వస్తుందేమో కానీ, సినిమా పరిశ్రమలో.. కష్టపడితే సినిమా పూర్తవుతుందంతే! ఆశించిన ఫలితం రావాలని ఏమీ ఉండదు.

● **మల్టీస్టారర్ అంటే పెద్ద మార్కెట్...** రాజమౌళి గారు మొదలుపెట్టారు కదా.. సాధకబాధకాలు చాలా ఉంటాయి. ఆ హీరోల స్థాయి, అభిమానులు.. ఇలా ప్రతి ఒక్కరినీ దృష్టిలో పెట్టుకుని వెళ్లాలి. తారక్, చరణ్‌లా ఎవరైనా ముందుకొస్తే.. చూడాలి. నాకూ తీయాలనే ఉంది.

● **దాదాపు యంగ్ హీరోలందరితో చేశాను..** ప్రభాస్‌తో చేయాలని ఉంది. ఏమో.. ఏం జరుగుతుందో చూడాలి.

ఒక దొంగ.. ఒక పాము.. ఒక పూజారి..

ఎవరికీ పట్టని.. ఎక్కడో మారుమూల ఉన్న మా ఊరు మట్టపర్రు పేరు ఒక్కసారిగా మార్మోగిపోయింది. దానికి కారణం అక్కడ వెంకటేశ్వరస్వామి వెలవడం. మా ఇంటి దగ్గరనుంచి ఓ నాలుగు ఫర్లాంగుల దూరమెళ్లాక రెండు పెద్ద తాటి చెట్లు ఉండేవి. అక్కడ ఓ పాముపుట్ట. అటువైపు ఎవరూ వెళ్లేవారు కాదు. మా ఊళ్లోనే ఓ దొంగ ఉండేవాడు. అకస్మాత్తుగా ఓ రోజు ఆ దొంగ పుట్టకు సమీపంలో కూర్చుని జపం చేయడం మొదలెట్టాడు. అక్కడికి దగ్గర్లోనే ఓ రాయి మీద వెంకటేశ్వరుని ఆకారం. ఇంకేముంది.. జనాలంతా వెంకటేశ్వర స్వామి వెలిశాడు అంటూ హడావుడి చేయడం మొదలెట్టారు. అక్కడి పుట్టలోని పాము బయటకొచ్చి అతని చుట్టూ తిరిగేది. అతని మీద పాకేది. పక్కనే ఉన్న చిన్న చెరువులోకి దిగి.. నీళ్లల్లో మునిగి వచ్చి విగ్రహాన్ని చుట్టుకునేది. ఇది నేను కళ్లారా చూశా. ఆ దొంగ మాత్రం ధ్యానంలో మునిగిపోయేవాడు. ఇంకో విచిత్రమేమిటంటే.. ఆ రోజుల్లో మా ఊళ్లోనే ఒక పిల్లాడు పుట్టాడు. ఆ బాబు తల నిర్ణీత పరిమాణం కంటే మూడింతలు పెద్దదిగా ఉండేది (జన్యులోపం కావొచ్చు). చేతులకు ఎర్రటి గీతలతో శంఖుచక్రాలు ఉన్నాయని.. వెంకటేశ్వరస్వామే అక్కడ వెలిశాడు అంటూ ప్రచారం జరిగింది. మా ఊరికి జనాల రాక మొదలైంది. వచ్చినవాళ్లు ఆ స్వామిని, పామును, పిల్లాడిని చూడటం.. తోచిన విరాళాలు ఇవ్వడం మొదలయ్యేసరికి.. గుడి కట్టాలనుకున్నారు. గుడి కట్టేప్పుడు మా పిల్లగ్యాంగ్ అంతా ఇటుకలు అందించడం లాంటి సాయం చేసేవాళ్లం. సాయంత్రానికి రెండు పావలాలు (అర్ధ రూపాయి) చేతులో పెట్టేవారు. కొన్నాళ్లకు ఆ స్వామీ కన్నుమూశాడు. పాము కూడా గుడి ప్రాంగణంలోనే చనిపోయింది. ఇప్పటికీ గుడి మాత్రం అలాగే ఉంది. వాస్తవానికి ఆ గుడి కట్టడం వల్ల నా జీవితం మారిందని చెప్పుకోవచ్చు. ఆ గుళ్లోకి బీఏ చదివిన పూజారి వచ్చారు. ఆయన దగ్గరికి ట్యూషన్‌కు వెళ్లేవాణ్ని. ఆయనకు నవలలు చదవడం అలవాటు. వారపత్రికల్లో వచ్చే సీరియళ్లను కలిపి పుస్తకంగా తయారు చేసేవారు. అవన్నీ చదువుకోడానికి నాకు ఇచ్చేవారు. అది నాకు బాగా ఉపయోగపడింది. ఒకరకంగా నాకు అక్షర జ్ఞానం వచ్చింది. ఆ పాము, ఆ దొంగ.. గుడి లేకపోయినా.. అక్కడికి పూజారిగారు రాకపోయినా.. ఇప్పుడు నేనిలా ఉండేవాడ్ని కాదేమో!

వాటి జోలికి పోను

● **మీ పిల్లలిద్దరి పేరు సుకృతవేణి, సుక్రాంత్.. 'సు' సెంటిమెంట్ ఏదైనా ఉందా?**

ఈ పేర్లు పెట్టింది మా ఆవిడే. సెంటిమెంట్ ఏమీ కాదు కానీ, సరదాగా సుక్కు అని పిలుచుకోవచ్చు కదా అని. ముగ్గురం సుక్కులమే. సుక్కు1, సుక్కు2, సుక్కు3. పిల్లల్ని కూడా స్కూల్లో సుక్కు అనే పిలుస్తారు. అమ్మాయి పెద్దది. ఏడో తరగతి చదువుతోంది. బాబు ఇప్పుడు ఫస్ట్ క్లాస్.

● **రాజకీయాలపై ఆసక్తి ఉందా?**

అస్సలు లేదు. రాజకీయాలు పడవని కాదు. వాటి గురించి తెలుసుకుంటుంటా. అంతే తప్ప ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశం లేదు.

● **ధార్మిక కార్యక్రమాలపై దృష్టి...**

ఉంది. అదే ఆలోచిస్తున్నాను. మా నాన్నగారి పేరుమీద ఏదైనా చేయాలని ఉంది. ఇంకా ఒక కార్యరూపంలోకి అయితే ఏదీ రాలేదు.

గలగలలు ఏరుకున్నా..

● **పాపికొండల్లో షూటింగ్ ఎలాంటి అనుభూతినిచ్చింది?**

నన్ను నేను గుర్తు తెచ్చుకున్నా.. నా జ్ఞాపకాలను నెమరేసుకున్నా. ఎందుకంటే నేనీ సినీ పరిశ్రమలోకి వచ్చాక షూటింగ్‌ల కోసం ఎన్నో దేశాలు తిరిగా.. ఐరోపా దేశాలు, అమెరికా, అరబ్ దేశాలు... ఇలా ఎన్నో.. కానీ ఎక్కడా లేని సంతృప్తి నాకు రంగస్థలం షూటింగ్ కోసం పాపికొండలు వెళ్లినప్పుడు కలిగింది. పొద్దున్నే లేవగానే పలకరించే గోదావరి, పాపికొండల మధ్య సన్నని నడుములా సాగిపోయే ప్రవాహం, పిల్లతిమ్మెరలు, తెలిమంచు కిరణాలు, ఆహ్లాదకరమైన వాతావరణం. పక్షుల కుహుకుహురావాలు.. నన్ను నేను మైమరచిపోయేవాడ్ని. చిన్నప్పుడు నేను తిరిగినదంతా గోదారి ప్రాంతమే కాబట్టి మళ్లీ ఆ రోజుల్లోకి వెళ్లిపోయేవాడ్ని. అంత అద్భుతమైన వాతావరణమది. ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలి..

● **రంగస్థలం ఎప్పుడో తీసి ఉండాల్సిందని అనుకున్నారా?**

ఎప్పుడో తీయాలని ఆలోచన వచ్చి.. అప్పుడే తీసుంటే న్యాయం చేయలేకపోదునేమో! ఇప్పుడు నాలో పూర్తి పరిపక్వత (మెచ్యూరిటీ) వచ్చింది అనుకుంటున్నా. అందుకే ఇంత చక్కగా ఈ సినిమా తీయగలిగానని భావిస్తున్నా. అప్పట్లో గోదారికి దగ్గరగా ఉండేవాడ్ని. మధ్యలో గోదారి దూరమైంది. ఆ లోటు తెలిసొచ్చింది. దేనికి దూరమయ్యానో అర్థం చేసుకున్నా. దాన్ని ఇప్పుడు దగ్గర చేసుకున్నా. గోదారి గలగలలను ఇప్పుడు ఏరుకున్నాను.

● **చిట్టిబాబు, రామలక్ష్మిల కెమిస్ట్రీ..?**

వీళ్లిద్దరూ ఈ సినిమాకు కచ్చితంగా ప్లస్ పాయింటే. చెర్రీకి తనలోని నటుడిని బయటకు తీసే అవకాశం ఈ రంగస్థలంలో కలిగింది. అతను తన సామర్థ్యాన్ని చూపించాడు. సమంత తన పాత్రలో ఒదిగిపోయింది. పక్కా పల్లెటూరి అమ్మాయిలా మెప్పించింది. నటనకు ఆస్కారం కల్పించే పాత్రల్ని మనం ఇవ్వగలిగితే.. ఎన్ని అద్భుతాలు జరుగుతాయో ఈ సినిమా చూస్తే తెలుస్తుంది. కళాకారులు అన్నవాళ్లు ఎప్పుడైనా సరే తమ అత్యున్నత స్థాయి ప్రదర్శన చేయడానికే చూస్తారు.



పాఠాలతో పిల్లలను మెప్పించిన ఈ లెక్కల మాస్టారు ప్రేక్షకులను తన పజిల్స్‌తో కట్టిపడేయడంలో మహాదిట్ట. కథలో మేజిక్.. కథనంలో లాజిక్.. ఇదీ దర్శకుడు సుకుమార్ శైలి. సినిమా తీయడంలో ఎప్పుడూ పదేళ్లు ముందుండే ఈ డైరెక్టర్.. ఈసారి ఏకంగా మూడున్నర దశాబ్దాలు వెనక్కి వెళ్లిపోయాడు.. ఆర్య, 100% లవ్, నేనొక్కడినే, నాన్నకు ప్రేమతో.. చిత్రాలతో అలరించిన సుకుమార్.. ఇప్పుడు 80ల నాటి సంగతులు రంగరించి.. 'రంగస్థలం'తో పలకరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో దర్శకుడు సుకుమార్‌తో 'హాయ్' మాటామంతీ..

పాపికొండల్లో నన్ను నేను వెతుక్కున్నా

● **ప్రపంచమంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటూ భవిష్యత్తులోకి తొంగి చూస్తుంటే.. మీరేంటి మళ్లీ 80ల్లోకి వెళ్తున్నారు?**

రంగస్థలం 1980ల నాటి కథ అని అందరికీ తెలిసిందే. సాంకేతికత ఇంకా వంటబట్టని రోజులవి. ముఖ్యంగా పల్లెటూళ్లు వీటికి మరీ దూరం.. అప్పట్లో ఇంటింటా రేడియోలే ఉండేవి. టీవీలు, ఫోన్లు ఒకటో రెండో! ఏదైనా విషయం చేరవేయాలంటే.. పరిగెత్తుకుంటూ వెళ్లడమో, సైకిల్ మీద వెళ్లడమో తప్ప వేరే దారి ఉండేది కాదు. మనుషులతో మనుషులు మాట్లాడుకుంటూ.. కోపాలైనా, తాపాలైనా.. అన్నీ నేరుగానే ఉండేవి. సాంకేతికత కంటే మానవ సంబంధాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్న రోజులవి. అలాంటి పరిస్థితులను కళ్లకు కట్టాలన్నది నా ఉద్దేశం. చిన్నప్పటి స్మృతులన్నవి ఎప్పటికీ మరిచిపోలేం. స్కూలు మాస్టర్లు, స్నేహితులు, ఊర్లోవాళ్లు.. ఇలా ఎవరైనా సరే ఇప్పటికీ పేర్లతో సహా చెప్పగలను. అదే ఆర్య ప్రారంభానికి ఎవరొచ్చారు అని అడిగితే మాత్రం ఒకింత ఆలోచించాల్సిందే.. అప్పుడు మనకు ఒత్తిళ్లు లేవు. ఏదైనా హాయిగా గడిపేసేవాళ్లం. అలా ఆ జ్ఞాపకాలతో కూడిన కథను నలుగురితోనూ పంచుకోవాలన్నదే నా ఉద్దేశం.

● **అప్పటి కథ ఇప్పటి తరానికి చేరువవుతుందని నమ్ముతున్నారా?**

కథ ఎనభైల నాటిదైనా.. అందరికీ చేరువ అవుతుంది. ఇందులో ఎమోషన్స్ అలాంటివి. తరాలు మారొచ్చు.. భావోద్వేగాలకు అందరూ కనెక్ట్ అవుతారు. దంగల్ సినిమానే తీసుకుందాం. అందులో ఎమోషన్స్ ప్రేక్షకులను కట్టి పడేశాయి. 60ల్లో ప్రాచుర్యంలో ఉన్న హాకీ గురించి చక్‌దే ఇండియాలో చెబితే చూడలేదా! నేను 100 % లవ్ తీస్తున్నప్పుడు ఒక క్లాసులో ఇద్దరు చదువుకున్న వాళ్ల మధ్య పోటీ ఈ సినిమా అని మా గురువుగారికి కథ చెబితే.. 'ఇప్పుడు క్లాసుకి ఇద్దరెక్కడరా.. కాలేజీకి ఇద్దరు కూడా చదవట్లేదు.. ఎలా తీద్దామనుకుంటున్నావ్.. జనాల్లోకి ఎలా వెళ్తుంద'ని అడిగారు. అంటే ఎమోషన్స్, కథ ఇక్కడ ప్రధానమని చెప్పి ఆయనను ఒప్పించాను. అదెంత పెద్ద హిట్టో మీకు తెలిసిందే కదా! తరాలు మారిపోయాయని మనం అనుకోకూడదు. ఆ రోజుల్లో మా తాతయ్యలు, నాన్నలు ఇలా ఉండేవారా.. వాళ్లు ఇంత ఎంజాయ్ చేశారా.. ఆ రోజుల్లో మనం కూడా ఉండి ఉంటే ఎంత బాగుండునో కదా.. అని ఇప్పటి తరం అనుకునేలా ఎమోషన్స్ పండించగలగాలి. రంగస్థలంలో నేను చేసింది అదే.



● **బాగా సంతృప్తిగా ఉన్నట్టున్నారు?**

ఇందులో చూపించినవి నా చిన్ననాటి అనుభూతులే. రంగస్థలం సినిమా నాకు మానసిక ఆనందాన్ని కలిగించిందని మాత్రం చెప్పగలను. పూర్తి సంతృప్తి అనేది ఎప్పటికీ ఉండదు. అలా అనుభూతి చెందడమంటే అక్కడితో అయిపోయినట్లే. అసంతృప్తి నుంచే అద్భుతాలు పుడతాయి. మనం అనుకున్నవన్నీ ఏ ఒక్క సినిమాతోనో సంతృప్తి పరచలేం. ఉదాహరణకు చిరంజీవి గారికి ఖైదీ ఎంత పెద్ద హిట్టో అందరికీ తెలుసు. అలాగని అక్కడితో ఆగిపోలేదు కదా.. ఆ తర్వాత స్వయంకృషి, జగదేకవీరుడు-అతిలోక సుందరి.. ఇలా ఎన్నో ఒకదాన్ని మించిన సినిమాలు ఒకటి.. ఎన్నో వచ్చాయి. అంతమాత్రాన మనం ఖైదీని తక్కువచేసి చూడగలమా.. దేని ప్రత్యేకత దానిదే.

● **అసలు దర్శకుడ్ని అవుతానని ఎప్పుడు అనుకున్నారు?**

ఆ ఆలోచన అయితే ఉండేది. దానికంటే ముందు ఎందులోనైనా సరే... గొప్ప పేరు తెచ్చుకోవాలని ఉండేది. సైంటిస్టు అవుదామని అనుకునేవాడిని. ఒకసారి సైన్సు ఫెయిర్‌కి వెళ్తే మనకంటే మేధావులు ఉన్నారని తెలిసింది. చిన్నప్పటినుంచి కథలు, కవితలు రాయడం అలవాటు. అదే కొనసాగించా. ఇంటర్‌లో నా దగ్గరున్న కథలతో హైదరాబాద్ వచ్చేయాలన్నంత పూనకం వచ్చేసేది. కుదరలేదు కాని.. కథలు రాయడం మానలేదు. వంశీగారి ప్రభావంతో చిన్నప్పటినుంచి డైరెక్టర్ అవ్వాలనే ఆలోచన మాత్రం వదులుకోలేదు. కానీ, ఎవరికీ చెప్పలేదు. నా క్రియేటివిటీని డబ్బుగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నా. దీనికి సినిమానే మార్గంగా మలుచుకున్నా. సినిమా అనేది ఓ కష్టమైన ఫీల్డు. నాకెందుకో ఇందులో ఆనందం కంటే కష్టమే ఎక్కువ కనబడుతుంది. మరి ఎందుకు చేస్తున్నావంటే.. ఏమో నాకే తెలియదు. ఆ కష్టంలోనే సంతోషాన్ని వెతుక్కుంటున్నానేమో.. సినిమా హిట్ అయితే ఓ రెండు, మూడు రోజులు ఆ ఆనందం ఉంటుందేమో.. మళ్లీ కథ మొదలెట్టాల్సిందే.

● **సినిమాల్లోకి వచ్చాక.. ఎందుకొచ్చాన్రా నాయనా.. అని బాధపడిన సంఘటనలు ఏవైనా ఉన్నాయా..?**

ఈ పరిశ్రమలో అసిస్టెంట్ డైరెక్టర్ అవడం చాలా కష్టం. కలెక్టర్ అవ్వాలంటే డిగ్రీ చదవాలి, ఫలానా ఉద్యోగం చేయాలంటే గ్రూప్ సర్వీసులు పాసవ్వాలనే నిబంధనలు ఉంటాయి. ఇక్కడ అలాంటివేం ఉండవు. నేను అసిస్టెంట్ డైరెక్టర్ అవ్వాలని వచ్చి దాదాపు రెండేళ్లు కష్టపడ్డాను. డైరెక్టర్ అవ్వడానికి పెద్దగా ఇబ్బందిపడలేదు. చేస్తున్న ఉద్యోగం వదిలేసి ఏదో చేసేద్దామనకుని వచ్చి.. ఏమీ చేయలేక తిరిగే రోజులు చాలా దారుణంగా ఉంటాయి. కాకినాడ ఆదిత్య కాలేజీలో ఉద్యోగం మానేసి వచ్చేసేటప్పుడు అక్కడ అందరితో.. 'నేను సినిమా పరిశ్రమకు వెళ్లిపోతున్నా.. డైరెక్టర్‌ను అవుతా' అని చెప్పా. కానీ, ఇక్కడ ఏ అవకాశం రాక.. నిలదొక్కుకో లేక.. మళ్లీ వెనక్కి వెళ్లిపోయాను. అయితే అంతలా చెప్పుకుని వచ్చేసినవాడ్ని మళ్లీ అక్కడికి వెళ్లలేక భీమవరం ఆదిత్యాలో చేరా. ఆయినా పట్టు వదల్లేదు. మళ్లీ తిరిగొచ్చా. ఈసారి సక్సెసయ్యా.

బహుమతులన్నీ నాకే..

మాది చాలా పల్లెటూరు. పేరు మట్టపర్రు. కనీసం ఒక్క బస్సు కూడా రాదు. పైగా మా ఊరు వెళ్లాలంటే రాజోలు నుంచి శివకోడు మీదుగా మూడు కిలోమీటర్లు లోపలికి వెళ్లాలి. హైస్కూలు శివకోడులో చదివా. వెళ్లేవాళ్లం. పొద్దున్న పదింటికి స్కూలు. ఇంటి దగ్గర గబగబా నాలుగు మెతుకులు తినేసి బాక్స్ సర్దుకుని ఫ్రెండ్స్‌తో కలిసి బయల్దేరేవాళ్లం. ఓ చేత్తో భుజం మీద పుస్తకాలు.. దానిపైన లంచ్ బాక్స్‌తో నడక మొదలుపెట్టేవాళ్లం. మళ్లీ సాయంత్రం స్కూలు విడిచిపెట్టాక.. అదే ప్రయాణం. చీకటిపడితే ఆ దారిలో వెళ్లలేం. మట్టపర్రు ఊళ్లోకి అడుగుపెట్టేవరకు వీధి దీపాలు ఉండవు. అంత పక్కా పల్లెటూరు మాది. నేను క్లాసులో మెరిట్ విద్యార్థిని. ఆగస్టు 15కి స్కూల్లో పోటీలు పెట్టేవారు. ఆరో తరగతిలో ఉన్నప్పుడు వ్యాసరచన, వక్తృత్వం.. ఇలా అన్నిట్లోనూ నాకే ప్రైజులొచ్చాయి. ఆరోజు ఒక్కో విభాగం పేరూ చదువుతూ నన్ను స్టేజీ మీదకు పిలవడం.. నేను బహుమతి తీసుకుని కిందకు వెళ్లేలోపే మళ్లీ పేరు చదవడం.. దీంతో అప్పటి మా ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామచంద్రమూర్తి గారు.. ఒరేయ్ బాబూ ఇక్కడే ఉండి అన్ని ప్రైజులూ తీసుకున్నాకే కిందకెళ్లు అని చెప్పగానే చాలా గర్వంగా అనిపించింది. అది మర్చిపోలేను. ఆ ప్రైజులన్నీ పట్టుకుని ఇంటికెళ్తుంటే అందరూ నాకేసి వింతగా చూడటమే. ఎనిమిదో తరగతిలో ఓసారి మా స్కూలుకు డీఈఓ (జిల్లా విద్యాధికారి) వచ్చారు. 'భారతదేశం నా మాతృభూమి' అంటూ నేను చదివిన ప్రతిజ్ఞ విని ముచ్చటపడి ఒక ఫౌంటెయిన్ పెన్ బహుమతిగా ఇచ్చారు. ఇలాంటి మర్చిపోలేని అనుభూతులెన్నో..

కథ తర్వాతే ఎవరైనా..

● **ఐటమ్ సాంగ్, ఫైట్స్.. మాస్ మసాలా సుకుమార్ బలమా?**

ఏ సినిమాకైనా కథాబలం ప్రధానం. తర్వాతే హీరో అయినా. ఐటమ్ సాంగ్ అయినా! కానీ, అవే ప్రధానం అనను. నా సినిమాలో మాస్ మసాలాలు ఏవీ ఉండవు. ప్రేక్షకుల్ని రంజింపచేయడమే ప్రధానం. ఎప్పుడూ ఒక విభిన్న శైలి కోసం ప్రయత్నిస్తుంటా. ఐటమ్ సాంగ్ అంటే అదేదో ఇబ్బందికరమనే దురభిప్రాయం ఉంది. శ్రుతి మించనంత వరకు శృంగారమైనా, రసజ్ఞత అయినా అవసరం. దీన్నే ఆర్యలో చూపించాను. అది ఎప్పుడైతే క్లిక్ అయిందో సహజంగానే దాన్ని సక్సెస్ ఫార్ములాగా తీసుకుంటాం.

● **14 సంవత్సరాల్లో.. ఏడంటే ఏడు సినిమాలు తీశారు. ఇది మీ కెరీర్‌కు ఇబ్బంది అని భావించడం లేదా?**

నా నిర్మాతలకు ఎలాంటి ఇబ్బందీ లేదు. నష్టమల్లా నాకే! ఎక్కువ వ్యవధి తీసుకోవడం వల్ల నా సినిమాలే తగ్గిపోతాయి. సినిమా మొదలుపెడితే ఏడాదిలోపే పూర్తవుతుంది. నాకు కథ ఓ పట్టాన నచ్చదు. బాగా కసరత్తు చేస్తాను. అక్కడే ఎక్కువ సమయం పడుతుంది. కథ బాగా రావాలనే ఈ తపనంతా! రంగస్థలం గతేడాది ఏప్రిల్‌లో మొదలుపెట్టాం. ఈ మార్చిలో విడుదలవుతోంది. అంటే ఏడాదిలోపే పూర్తయిందిగా. ఇక నా కెరీర్ అంటారా.. ఒక వ్యక్తి నెమ్మదిగా నడుస్తాడు, ఇంకో వ్యక్తి చాలా వేగంగా నడుస్తాడు. అది వాళ్లవాళ్ల స్వభావాన్ని బట్టి ఉంటుంది.

● **మీ విజయ రహస్యం?**

గందరగోళం! అవును నిజమే. నేను చాలా కన్‌ఫ్యూజ్ అవుతుంటాను. అందువల్ల ఎక్కువ కష్టపడాల్సి వస్తుంది. సానుకూల ఫలితం రావాలన్న పట్టుదలతో కష్టపడుతూ ఉంటాను.

– బెహరా శ్రీనివాసరావు


ఈనాడు సినిమా



చిరంజీవి

సైరా... స్వరాల కోసం

చిరంజీవి ప్రస్తుతం 'సైరా నరసింహారెడ్డి' పనుల్లో బిజీగా ఉన్నారు. హైదరాబాద్‌లో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ సెట్లో 'సైరా' షూటింగ్ జరుగుతోంది. చిరంజీవి, నయనతారలపై కీలకసన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రామ్‌చరణ్ నిర్మాత. గత కొంతకాలంగా సంగీత దర్శకుడి కోసం అన్వేషణ సాగిస్తోంది 'సైరా' టీమ్. అంతకు ముందు ఎ.ఆర్.రెహమాన్‌ను టీమ్‌లోకి తీసుకున్నారు. అయితే ఆయన వ్యక్తిగత కారణాల వల్ల ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. ఆ స్థానంలో బాలీవుడ్ స్వరకర్త అమిత్ త్రివేది వచ్చినట్టు తెలుస్తోంది. 'క్వీన్', 'కాయ్‌పోచి', 'ఉడ్తా పంజాబ్', 'డియర్ జిందగీ' లాంటి చిత్రాలకు సంగీతం అందించారు అమిత్. ఈవారంలోనే అమితాబ్‌బచ్చన్ కూడా 'సైరా' సెట్లో అడుగుపెట్టబోతున్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.



అమిత్ త్రివేది



వెంకట్ కుంచం, కె.రాఘవేంద్రరావు, శివాని, అడవి శేష్, రాజమౌళి, కృష్ణంరాజు, శ్యామలాదేవి, జీవిత, శివాత్మిక, రాజశేఖర్

రెండు రాష్ట్రాలు కలిశాయి!

రాజశేఖర్ - జీవితల కుమార్తె శివానీ రాజశేఖర్ కథానాయికగా అరంగేట్రం చేస్తున్న చిత్రం '2 స్టేట్స్'. అడవిశేష్ కథానాయకుడు. లక్ష్య ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎం.ఎల్.వి సత్యనారాయణ నిర్మాత. వెంకట్ కుంచం దర్శకుడు. శనివారం హైదరాబాద్‌లో చిత్రీకరణ లాంఛనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి క్లాప్‌నిచ్చారు. నటుడు కృష్ణంరాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. కె.రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. రాజశేఖర్, జీవిత, శివాత్మిక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "చేతన్ భగత్ రాసిన నవల 'టూ స్టేట్స్' ఆధారంగా బాలీవుడ్‌లో వచ్చిన చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. తెలుగులో వచ్చిన అత్యుత్తమ చిత్రాల్లో ఇదొకటిగా నిలుస్తుందన్న నమ్మకం ఉంది. ఏప్రిల్ 5 నుంచి 19 వరకూ హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుతాం. కోల్‌కతాలో కొంత భాగం, అమెరికాలో మరికొంత భాగం తెరకెక్కిస్తామ"న్నారు. "టూ స్టేట్స్' చిత్రాన్ని మూడుసార్లు చూశా. ఎప్పటి నుంచో ఇలాంటి కథలో నటించాలని అనుకుంటున్నా. ఇప్పటికి ఆ అవకాశం దొరికింద"న్నారు అడవిశేష్. "తొలి చిత్రంతోనే నటిగా సవాల్ విసిరే పాత్ర చేస్తున్నా. అనూప్ సంగీతం అంటే నాకు చాలా ఇష్టం. నా తొలి చిత్రానికి ఆయన పాటలు అందివ్వడం మరింత ఆనందంగా ఉంద"ని శివానీ చెప్పింది. దర్శకుడు మాట్లాడుతూ "ఓ విజయవంతమైన కథని మరో భాషలో తెరకెక్కించడం సవాలే. మా వంతు కృషి చేస్తాం. మంచి టీమ్ దొరికింది. స్క్రిప్టు దశలోనే అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. అనూప్ ఇప్పటికే మూడు పాటలు అందించారు. సంగీత పరంగానూ ఈ చిత్రం ఆకట్టుకుంటుంద"న్నారు. "నాకు నచ్చిన హిందీ చిత్రాల్లో 'టూ స్టేట్స్' ఒకటి. మంచి సంగీతం అందివ్వడానికి ఆస్కారం ఉన్న చిత్రమిద"న్నారు అనూప్. రజత్‌కపూర్, భాగ్యశ్రీ, లిజి, ఆదిత్య మేనన్, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ తదితరులు నటిస్తున్నారు. ఛాయాగ్రహణం: శానియల్ డియో, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

మరో మనవడొచ్చాడు



బాలకృష్ణ

'తాతయ్యా...' అనే పిలుపుతో మురిసిపోతున్నారు నందమూరి బాలకృష్ణ. ఇప్పటికే బ్రాహ్మణి కుమారుడు దేవాన్ష్.. 'తాతయ్య' దగ్గర గారాబాలు పోతున్నాడు. "దేవాన్ష్‌తో ఆడుకుంటున్నప్పుడల్లా నేనూ చిన్నపిల్లాడిని అయిపోతున్నా. నా మీసాల్ని లాగుతూ... అల్లరి చేస్తున్నాడు" అని సంబరపడిపోతుంటారు బాలయ్య. ఇప్పుడు దేవాన్ష్‌తో పాటుగా అల్లరి చేయడానికి మరో మనవడు వచ్చేశాడు. బాలయ్య రెండోసారి తాతయ్య అయ్యాడు. బాలకృష్ణ రెండో కుమార్తె తేజస్విని - శ్రీభరత్ దంపతులకు ఇటీవల పండంటి మగబిడ్డ జన్మించాడు. దాంతో నందమూరి కుటుంబంలో ఆనందాలు వెల్లివిరిశాయి.



రకుల్‌ప్రీత్ సింగ్

వినోదాల టాక్సీవాలా..

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా జిఏ 2, యువి పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'టాక్సీవాలా'. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. ఎస్.కె.ఎన్. నిర్మాత. ప్రియాంక జవాల్కర్, మాళవికా నాయర్ కథానాయికలు. ఫస్ట్‌లుక్‌ను శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "విజయ్ పాత్రను దర్శకుడు చక్కగా తీర్చిదిద్దాడు. మే 18న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే వినోదాత్మక చిత్రమిది. విజయ్‌లోని కొత్తకోణాన్ని చూస్తారు. త్వరలో ఈ సినిమాకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేస్తామ"న్నారు. కల్యాణి, మధునందన్, ఉత్తేజ్, రవిప్రకాష్ తదితరులు నటిస్తున్నారు. సంగీతం: జేక్స్ బిజాయ్, కూర్పు: శ్రీజిత్ సారంగ్, ఛాయాగ్రహణం: సుజిత్ సారంగ్.



విజయ్ దేవరకొండ

అందుకే ఈ పేరు పెట్టాం!



ఉపేంద్ర మాధవ్

"ఆనందమే ఆరోగ్యం. అలాంటి ఆనందాన్ని సినిమాల ద్వారా అందించాలి. వినోదాత్మక సినిమాతోనే దర్శకుడిగా పరిచయం అవ్వాలనుకున్నా. 'ఎం.ఎల్.ఎ'తో ఆ కోరిక తీరింద"న్నారు ఉపేంద్ర మాధవ్. ఆయన దర్శకుడిగా పరిచయమైన చిత్రం 'ఎం.ఎల్.ఎ'. కల్యాణ్‌రామ్, కాజల్ జంటగా నటించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఉపేంద్రమాధవ్ విలేకర్లతో మాట్లాడుతూ "ప్రియదర్శినిరామ్ వద్ద దర్శకత్వశాఖలో రెండు సినిమాలకి చేశా. ఆ తరవాత శ్రీను వైట్ల దగ్గర 'దూకుడు' నుంచి 'బ్రూస్లీ' వరకు పనిచేశా. నిర్మాత భరత్‌చౌదరితో ఉన్న పరిచయంతో కథ వినిపించా. ఆ కథ కల్యాణ్‌రామ్‌కు నచ్చడంతో 'ఎం.ఎల్.ఎ' సెట్స్‌పైకి వెళ్లింది. కథానాయకుడు ప్రేమించిన అమ్మాయితో ఏడడుగులు నడవాలంటే 'ఎం.ఎల్.ఎ' అవ్వాలి. ఈ ఒక్క కారణంతోనే సినిమాకి 'ఎం.ఎల్.ఎ' పేరు పెట్టాం. సందేశాన్నీ అందించాం. కల్యాణ్‌రామ్ నటన, లుక్, సంభాషణలు బాగున్నాయంటున్నారు. కాజల్ నటన సినిమాకి బలాన్ని చేకూర్చింది. నా రెండో చిత్రాన్నీ ఇదే సంస్థలో తెరకెక్కిస్తా. ఈ ఏడాదిలోనే ప్రారంభం అవుతుంది. కథని బట్టే కథానాయకుడు అనే సూత్రాన్ని పాటిస్తాను"అన్నారు.

నాకు నేనే పరీక్ష

నా మాటలే కాదు, నా ఆలోచనలూ తెలుగులోనే అని చెప్పే నాయిక రకుల్‌ప్రీత్ సింగ్. ఆమెకి తెలుగు భాషతోనూ, తెలుగు సినిమాతోనూ అంతటి అనుబంధం. కానీ ప్రస్తుతం ఇతర భాషల్లోనే ఆమె సినిమాలు చేస్తోంది. "నేనెక్కడ సినిమాలు చేసినా తెలుగు కథానాయికని అని చెప్పుకోవడానికే ఇష్టపడతా" అని చెబుతుంటుంది రకుల్. తన పనితీరు గురించి, ఆలోచనల గురించి ఆమె మాట్లాడుతూ "పరాజయాలు మంచి పాఠాల్ని నేర్పుతాయి. ముఖ్యంగా విజయం విలువెంతో చాటి చెబుతాయి. అయితే గతం పంచిన అనుభవాలతో పాఠాలు నేర్చుకొంటూ ముందుకెళ్లాలి తప్ప, అక్కడే ఉండిపోకూడదు" అని చెప్పింది రకుల్. మంచి కథల్ని ఎంపిక చేసుకొని ప్రయాణం చేస్తున్న ఈ దశ ఎలా ఉందని అడిగితే... "కష్టపడటంలో తేడా ఏమీ లేదు. ఇప్పుడంటే నేను సినిమాల్ని ఎంపిక చేసుకొంటున్నా కానీ, తొలినాళ్లలో అందరిలాగే నన్ను ఎంపిక చేసుకొనే సినిమా గురించే ఎదురు చూశా. ప్రతి ఒక్కరి కెరీర్‌కీ ఆ సినిమా చాలా కీలకం. ఆ అవకాశం దొరికినప్పుడు మన ప్రతిభని చూపించాల్సిన సమయం ఇదే అంటూ ఎలాగైతే కసిగా కష్టపడతామో, ఇప్పుడు కూడా అంతే. కాకపోతే ఇప్పుడు నా ప్రతిభకి నేనే పరీక్ష పెట్టుకొనేలా సవాళ్లతో కూడిన కథల్ని ఎంచుకొంటున్నా" అంటోంది రకుల్.

ఎన్టీఆర్ ఎంపిక చేసిన ట్యూన్!

అప్పటి ముచ్చట!



ఎన్టీఆర్

అఖండ విజయాలు సాధించిన విజయా వారి చిత్రాల్లో 'జగదేకవీరుని కథ' అందరికీ గుర్తుండిపోతుంది. ఎన్టీఆర్‌కి రాకుమారుడిగా మరింత గ్లామర్‌ను పెంచిన చిత్రం. పింగళి సంభాషణలు, పాటలు ఈ చిత్రంలో కొత్త పుంతలు తొక్కాయి. 'జలకాలాటలలో..', 'ఓ చెలీ ఓహో సఖీ..', 'వరించి వచ్చిన మానవ వీరుడు..', 'అయినదేమో అయినదీ..', 'శివ శంకరీ..', లాంటి పాటలు ఇందులోనివే! మరో విశేషం ఏమిటంటే ఎన్టీఆర్‌కి పాడిన ఘంటసాల ఇందులో రేలంగికి కూడా 'ఆశ.. ఏకాశ..' అనే పాట పాడటం! వీటన్నిటితో పాటు కరుణరస ప్రధానమైన మరోపాట కూడా ఇందులో ఉంది. అదే 'రారా కనరారా.. కరుణ మాలినారా.. ప్రియతమలారా..!'. దివి నుంచి దిగి వచ్చిన దేవకన్యలు తనను ప్రేమలో ముంచెత్తి, తమకు వీలు చిక్కగానే విడిచి వెళ్లిపోతున్న ఘట్టంలో వారిని ఉద్దేశిస్తూ, గుండెలు కరిగేలా హీరో పాడే పాట ఇది. పింగళి అద్భుతంగా ఈ పాటను రాశారు. దీనికి సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు అనేక రాగాల్లో రకరకాలుగా ట్యూన్లు కట్టారు. వాటిని విన్న నిర్మాత, దర్శకులకు అన్ని ట్యూన్లూ నచ్చాయి. ఏది ఎంచుకోవాలో తేల్చుకోలేక, చివరకు హీరో ఎన్టీఆర్‌ని పిలిచి "వీటిలో మీకు ఏ ట్యూన్ నచ్చిందో చెప్పండి" అని అడిగారట. వాటిని శ్రద్ధగా విన్న ఎన్టీఆర్, 'భాగేశ్వరి' రాగంలో చేసిన ట్యూన్‌ని ఎంపిక చేశారట! సన్నివేశంలోనే ఫీల్‌ని చక్కగా ఎలివేట్ చేసిన ఆ ట్యూన్ ఎంతగానో హిట్ అయింది. తెర వెనుక ఘంటసాల గళం- తెర మీద ఎన్టీఆర్ నటన ఆ పాటను అమోఘంగా పండించాయి. ఆ సన్నివేశాన్ని చూస్తూ ప్రేక్షకులు కరిగిపోయారు... కంట తడిపెట్టారు.

\- శ్రీవత్స

గీతోపదేశం

(శ్రీరామ నవమి సందర్భంగా...)

పల్లవి:
అందాలరాముడు ఇందీవరశ్యాముడు
ఇనకులాబ్ధి సోముడు ఎందువలన దేముడు?
॥అందాల॥

1 చరణం:
తండ్రిమాటకై పదవుల త్యాగమేజేసెను
తన తమ్ముని బాగుకై తాను బాధ పొందెను
అందాల రాముడు అందువలన దేవుడు
॥అందాల॥

2 చరణం:
అనుభవించదగిన వయసు అడవి పాలుజేసెను
అడుగుపెట్టినంత మేర ఆర్య భూమిజేసెను
అందాల రాముడు అందువలన దేవుడు
॥అందాల॥

3 చరణం:
ధర్మపత్ని చెరబాపగ దనుజుని దునుమాడెను
ధర్మము కాపాడుటకా సతినే విడనాడెను
అందాల రాముడు అందువలన దేవుడు
॥అందాల॥

చివరి పల్లవి:
అందాలరాముడు ఇందీవరశ్యాముడు
ఇనకులాబ్ధిసోముడు ఇలలో మనదేవుడు
॥అందాల॥

చిత్రం: ఉయ్యాల జంపాల
రచయిత: ఆరుద్ర
పంపినవారు: కె. శాంతి, వరంగల్

ఎవరు చేసిన పాపమో ఈ గాలి దీపాలు

"దిక్కులేని వారికీ దేవుడే దిక్కు ఆ దేవుడెప్పుడూ కనిపించడు అదే కదా చిక్కు" అంటూ 'చిట్టితమ్ముడు' (1962)లో ఆరుద్ర...
"తల్లివి నీవే తండ్రివి నీవే.." అంటూ మళ్లీ ఆరుద్రే 'మూగనోము' (1969)లో...
అంతకుముందు అటు ఉత్తరాదిన "తుమ్హీ హో మాతా పితా తుమ్హీ హో మాతా పితా తుమ్హీ హో' అంటూ రాజేంద్రకిషన్ 'మైచుప్ రహూంగీ' (1962)లో...
ఈ రెండిటికీ మూలం అయిన 'అమ్మావుమ్ నీయే అప్పావుమ్ నీయే' ద్వారా కమల్ హాసన్‌ని జాతీయ స్థాయిలో బాలనటునిగా పరిచయం చేసిన 'కళత్తూర్ కణ్ణమా' (1960)లో టి.కె. సుందర వాద్యార్...
అదే సంవత్సరం విడుదలైన ఆ చిత్రం డబ్బింగ్ వెర్షన్ 'మా వూరి అమ్మాయి'లో 'కనిపించు తల్లీ..' పాటతో అనిసెట్టి...

కొత్తపాట గురూ!

చిత్రం: సత్యగ్యాంగ్
సాహిత్యం: చంద్రబోస్
సంగీతం: ప్రభాస్
గానం: విజయ్ ఏసుదాసు

పల్లవి:
ఎవరు చేసిన పాపమో
ఈ గాలి దీపాలు
ఎవరు చేసిన ద్రోహమో
ఈ బాల రూపాలు
ఎంగిలాకుల వేటలో- ఈ
రంగు వెలసిన పువ్వులు
చెత్తకుప్పల చాటులో
నిలువెత్తు గాయాలు.. ॥ఎవరు॥

చరణం:
అమ్మ తెలియదు
నాన్న తెలియదు
తెలిసినది అవమానము
గూడు దొరకదు
నీడ దొరకదు
దొరికినది దురదృష్టము
నేస్త మెవ్వరు లేని వేళలో
వీధి కుక్కలే దోస్తులు
లాలి పాటలు లేని బ్రతుకులో
దోమ పాడెను జోలలు
ఏది తాగితే కడుపు నిండెనో
పంపు నీళ్లో కన్నీళ్లో

చరణం:
దారి పొడుగున
బిచ్చమడిగే
దాన కర్ణుని తమ్ముళ్లు
ఇనుప ముక్కలు
ఏరి బ్రతికే స్వర్ణ భారత పౌరులు
గోనెసంచి మోసి అలసె
గాంధీ తాత మనవలు
చాయి కప్పులు కడిగి కరిగే
చంద్రగుప్తుని గురుతులు
మోస మెరుగక నేర మెరుగక
సిలువ మోసే చిన్ని యేసులు..



సత్యగ్యాంగ్

\- ఇలా ఇందరు ఇన్ని రకాలుగా దిక్కు మొక్కులేని అనాథ బాలల గురించి రాసేశారు. ఇప్పుడు కొత్తగా రాయాలంటే కవితా వస్తువు నేపథ్యం మారిపోవాలి. పూర్వ కవుల ప్రయోగాలకు భిన్నంగా ఆలోచించాలి. అదీ ఇప్పటి దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. గాలిలో దీపాల్లాగా పెరుగుతున్న ఈ అనాథలు ఎవరు చేసిన పాపమో, ఎవరు చేసిన ద్రోహమో అని ప్రశ్నించుకుంటూ పోతే పల్లవికి సరిపోతుంది. దానికి 'ఎంగిలాకుల వేటలో రంగు వెలసిన పువ్వులు' వంటి ఉదాహరణ - వాస్తవానికి దగ్గరగా ఉపమానానికి ఉత్తమంగా ఉంటుంది. దీంతో పల్లవి అయిపోయింది.

ఇక చరణం

ఇది కూడా వాస్తవానికి దగ్గరగా ఉండేదే- వీధి కుక్కలు, దోమలు, పంపు నీళ్లు, కన్నీళ్లు ఇవీ ఈ చరణానికి కవితా వస్తువులు. వాటిని జాలి, దయ, కరుణ కలిగేట్టు ఉపయోగించుకోవాలి. వీటిలో కొసరాజు- పంపు నీళ్ల బందైతే స్నానానికి నోచుకోము అంటూ పంపు నీళ్లని, గుయ్యమని దోమలు దాడి చేస్తే శివరాత్రి జాగరణ చేసేమంటూ దోమల్ని- హాస్యపరంగా వాడుకోగా, తెగ కుట్టి వదిలి పెట్టిన గణిత వైజాగు దోమలశ్వత్థామల్ అని వ్యంగ్యంగా అన్నాడు శ్రీశ్రీ తన 'సిరి సిరి మువ్వలు'లో. కానీ ఇక్కడ కావాల్సింది హాస్యం, వ్యంగ్యం కాదు- కనికరం.

అది 'లాలిపాటలు లేని బతుకులో దోమ పాడెను జోలలు' ద్వారా పండింది. మరి రెండో చరణం మాత్రం కాస్త క్లిష్టమై కూచుంది. గాంధీ తాతకి గోనె సంచికి సంబంధం ఏమిటి? చంద్రగుప్తుని చాయ్ కప్పులు ఎలా గుర్తు చేస్తాయి? ఈ అనాథబాలల్ని దాన కర్ణుని తమ్ముళ్లుగా పోల్చడంలో ఔచిత్యం ఏమిటి? వీటన్నిటినీ ఈ పాట రచయిత చంద్రబోస్ ముందుంచితే...

200 ఏళ్ల పాటు ఇండియాని పాలించి రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యంగా పేరు తెచ్చుకున్న ఆంగ్లేయులని చెత్త ఏరి అవతల పారేసినట్టు తరిమికొట్టాడు గాంధీ. కానీ రేపటి పౌరులుగా స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాల్సిన ఈ అనాథ బాలల శ్రమశక్తి రోడ్ల మీది చెత్తని గోనె సంచుల్లోకెత్తడంతోనే అలసిపోతోంది. మొత్తం భారతదేశాన్ని ఒక గొడుగు కిందికి తెచ్చి ఏక ఛత్రాధిపత్యంగా పాలించాలని కలలుగన్నవాడు చంద్రగుప్తుడు. గుప్తుల కాలాన్ని స్వర్ణ యుగంగా చెప్పుకుంటారు. అటువంటి స్వర్ణ యుగానికి గుర్తులుగా మిగలాల్సిన వీళ్ల బ్రతుకు చాయ్ కప్పులు కడగటంతోనే తెల్లారిపోతోంది.

ఇంక దానకర్ణుని తమ్ముళ్లు అని రాయడానికి స్ఫూర్తి ఆత్రేయగారే. 'మన తల్లి అన్నపూర్ణ... మన అన్న దానకర్ణ' అని రాశారాయన 'ఆకలిరాజ్యం' సినిమాలోని "సాపాటు ఎటూ లేదు.." పాటలో. చరిత్రని చూసుకుంటే ఏ యుద్ధం వచ్చినా, ఏ కష్టం కలిగినా ఎటువంటి ఆంక్షలూ లేకుండా ఎవరైనా వచ్చి తలదాచుకునే దేశం, ప్రదేశం ఒక్క భారత దేశమే. వాళ్లని ఆదరించి, అన్నం పెట్టి, తగిన వసతులు కల్పించే వితరణ, దానగుణం మనకి మాత్రమే ఉంది. అటువంటి దాన గుణం కలిగిన కర్ణునికి భారతదేశంలో జన్మించిన వారు ఏ తరం వారైనా తమ్ముళ్లే. ఆ తమ్ముళ్లు దానమిచ్చే పరిస్థితుల్లో లేకపోవడమే కాక బిచ్చం అడుక్కుంటున్నారు. స్వర్ణ భారతానికి ప్రతీకలుగా మిగలాల్సిన ఈ పిల్లలు ఇనుప ముక్కలు ఏరుకుని వాటిని అమ్ముకుని బ్రతుకుతున్నారు. "రెండో చరణం రాయడంలో నా మనసులో రూపుదిద్దుకున్న ఆలోచనలివీ" అని విపులంగా వివరించారు చంద్రబోస్.

చదివినవి, విన్నవి, చూసినవి కలగలుపుకుంటూ ఆ అనుభవాలకి అనుభూతిని మేళవిస్తూ సృష్టించే ఏ కళకయినా రమ్యత చేకూరుతుంది. అది వెనువెంటనే అయినా, ఆలస్యంగానైనా, అకస్మాత్‌గానైనా సరే!



చంద్రబోస్

\- రాజా (మ్యూజికాలజిస్ట్)

పెళ్లిలో ఎన్ని వింతలో..



నందు

నందు, సౌమ్య వేణుగోపాల్ జంటగా నటించిన చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో..'. వరప్రసాద్ వరికూటి దర్శకత్వం వహించారు. ఎస్.శ్రీకాంత్, రామమోహనరావు ఇప్పిలి నిర్మాతలు. ఏప్రిల్ 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "ఓ జంటకి సంబంధించి నిశ్చయ తాంబూలం నుంచీ పెళ్లి అయ్యేంత వరకూ జరిగే అనూహ్యమైన సంగతుల సమాహారం ఈ చిత్రం. మూడు పాటలున్నాయి. నందు, సౌమ్యల నటన ఆకట్టుకుంటుంద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "కథాకథనాలు ఆసక్తిగా సాగుతాయి. యాజమాన్య సంగీతం ప్రధాన ఆకర్షణ" అన్నారు. పాటలు: సురేష్ ఉపాధ్యాయ, ఛాయాగ్రహణం: ఎస్.మోహన్ రెడ్డి.

ఆ కిట్‌లో ఈ కిటుకులు

కొందరికి మేకప్ అలవాటు ఉండదు. అలాంటి వారు మొదటిసారి వేసుకుందామనుకునేటప్పుడు ఏమేం కొనుక్కోవాలో తెలియదు. వారికే ఈ చిట్కాలు. ఆ కిట్‌లో ప్రాథమికంగా ఏవి ఉండేలా చూసుకోవాలంటే...



● అలంకరణ కన్నా ముందు కావాల్సింది మాయిశ్చరైజర్. అది ఒక బేస్‌కోట్‌లా పనిచేసి అలంకరణ ఎక్కువసేపు చెక్కుచెదరకుండా ఉండేలా చేస్తుంది. అది కూడా మరీ జిడ్డుగా ఉండేది ఎంచుకోకూడదు. చర్మతత్వం బట్టే ఎంచుకోవాలి. అలంకరణకన్నా ముందు చర్మం తడిపొడిగా ఉన్నప్పుడు దాన్ని రాసుకోవాలి.

● చర్మ రంగులో కాస్త మార్పు తీసుకొచ్చేది ఫౌండేషన్. అయితే జిడ్డు చర్మతత్వం ఉన్నవారు మ్యాటీ ఫౌండేషన్లు ఎంచుకోవాలి. ఇవి జిడ్డును పీల్చుకుని ముఖం తాజాగా కనిపించేలా చేస్తాయి. పొడి చర్మతత్వం ఉన్నవారైతే క్రీం, లిక్విడ్ ఫౌండేషన్లు ఎంపిక చేసుకోవచ్చు.

● ఫౌండేషన్ తరువాత కావాల్సింది సెట్టింగ్ పౌడర్. ఇది ముఖం ఎక్కువసేపు తాజాగా కనిపించేలా చేస్తుంది. దీన్ని రాసుకోవడానికి పఫ్ లేదంటే గుండ్రటి మేకప్ బ్రష్ ఒకటి కొనుక్కుంటే మేలు.

● కనుబొమల కోసం ఐ బ్రో పెన్సిల్ లేదంటే బ్రో పౌడర్ ఇలా ఏదో ఒకటి దగ్గరుంటే చాలు. వాటితో పాటే ఒక లిక్విడ్ ప్రూఫ్ ఐ లైనర్, మస్కారా తప్పకుండా దగ్గరుంచుకోవాలి. అలాగే పెదాలకు లిప్‌స్టిక్, లిప్‌గ్లాస్ అవసరమవుతాయి.

● అలంకరణ మొత్తం పూర్తయ్యాక సెట్టింగ్ స్ప్రేని ఒక్కసారి ముఖంపై చల్లుకోవాలి. ఇలా చేయడం వల్ల అలంకరణ ఎక్కువసేపు చెక్కు చెదరకుండా ఉంటుంది. అలానే మేకప్‌ను తొలగించుకోవడానికి ఒక క్లెన్సర్‌ను ఎంచుకోవాలి. ఇది కూడా మన చర్మతత్వానికి అనుగుణంగా ఎంపిక చేసుకోవాలి. లేదంటే పసిపిల్లలకు వాడే బేబీఆయిల్ అయినా ఉండేలా చూసుకోవాలి.

అమ్మలకు గురువులయ్యారు



గోశిక సుశీలది తెలంగాణలోని మారుమూల ప్రాంతమైన నారాయణ ఖేడ్ మండలంలోని హన్మంతరావు పేట. నలభైఎనిమిదేళ్ల ఆమెకు చదువురాక పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఎక్కడికైనా వెళ్లాలంటే ఏ బస్సు ఎక్కాలో ఇతరుల్ని అడిగేది. సంతకం పెట్టమంటే బొటన వేలు చూపేది. మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్న ఆమె ఇప్పుడు సంతకం చేస్తోంది. ఆ అవకాశం వచ్చినప్పుడల్లా గర్వంగా తల ఎత్తుకొని తన పేరును రాస్తుంది. ఈమె మాత్రమే కాదు సంగారెడ్డి జిల్లాలో మహిళా సంఘాల్లో ఉన్న 50వేల పైచిలుకు నిరక్షరాస్య మహిళలు ఇప్పుడు అక్షరాస్యులుగా మారారు. జిల్లా యంత్రాంగం తీసుకున్న చొరవే దీనికి కారణం. ఇప్పటికే నాలుగు ప్రాథమిక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన వీరు ఇవాళ తుది పరీక్షకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా...

2011 గణాంకాల ప్రకారం సంగారెడ్డి జిల్లాలో అక్షరాస్యత 64.08 శాతం. అందులో పురుషుల శాతమే ఎక్కువ. దీంతో అక్షరాస్యత విషయంలో ఆ జిల్లా రాష్ట్రంలో పదమూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని మెరుగుపర్చడంతో పాటు ప్రతి మహిళకూ కనీస అక్షరజ్ఞానం ఉండాలనే ఉద్దేశంతో అక్కడి యంత్రాంగం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. జిల్లాలో మహిళల సంఖ్య 7.49లక్షలు. 21,309 స్వయం సహాయక సంఘాల్లో మొత్తం 2,32,115 మంది సభ్యులు ఉన్నారు. పొదుపు చేస్తూ రుణాలు తీసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్న వీరిలో కేవలం నలభై ఆరువేల మందికి మాత్రమే చదవడం, రాయడం వచ్చు. మిగతావారంతా నిరక్షరాస్యులే. ఇవన్నీ గమనించిన అక్కడి జిల్లా యంత్రాంగం గతేడాది మార్చిలో ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందిరాక్రాంతి పథం, సాక్షరభారత్ సిబ్బందీ, మహిళా సంఘాల్లో బాగా చదువుకున్న వారిని, నిరక్షరాస్యుల ఇళ్లలో ఉన్న చదువుకునే పిల్లలను భాగస్వాములను చేస్తూ అక్షరయజ్ఞాన్ని ప్రారంభించింది. గతంలో ఇక్కడ పనిచేసిన పాలనాధికారి మాణిక్యరాజ్ ఆలోచనతో 'అమ్మకు అక్షరమాల' పేరిట నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చారు. ముందుగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులున్న సంఘాలను గుర్తించారు. ఇలా జిల్లా మొత్తంగా తొలిదశలో 50,134 మంది మహిళలను గుర్తించి ఏడాది కాలంగా వారికి చదువు చెబుతున్నారు.

పరీక్షలు రాశారు...

ఇందుకోసం నాలుగు బుక్‌లెట్‌లను ప్రత్యేకంగా రూపొందించారు. అక్షరాలు నేర్పడం నుంచి రెండు, మూడు అక్షరాలున్న పదాలను గుర్తించి, వాటిని రాసేలా వీరిని తీర్చిదిద్దారు. చదువురాని మహిళలున్న ఇంట్లో వారి పిల్లలకూ ఈ బాధ్యతను అప్పగించి అమ్మలకు అక్షరాలు నేర్పించేలా చూశారు. మరోవైపు సాక్షర భారత్ సిబ్బందితో పాటు దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ క్షేత్రస్థాయిలో వీరు నేర్చుకుంటున్నారో లేదో పరిశీలించింది. ఐదు మండలాల్లోని మహిళా సంఘాలను కలిసిన ఆ అధికారులు నివేదికను జిల్లా యంత్రాంగానికి అందించేందుకు సిద్ధమయ్యారు. నాలుగు బుక్‌లెట్లను విజయవంతంగా పూర్తి చేసిన ఆ 50,134 మంది మహిళలు ఈరోజు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్‌స్కూలు వారు నిర్వహించే తుది పరీక్ష రాయనున్నారు. వారికి ఆల్ ది బెస్ట్ చెబుదామా!

– రాజేందర్ సురకంటి, ఈనాడు, సంగారెడ్డి



'అమ్మా.. నన్ను క్లాస్‌లో ఏడిపిస్తున్నారు. ఎదురు మాట్లాడితే కొడుతున్నారు. వాళ్లెవరూ నాకు నచ్చట్లేదు' అంటూ ఫిర్యాదు చేసే పిల్లలు కొందరైతే... తోటివారి వస్తువులు తీసేసుకోవడం, అబద్ధాలు ఆడటం... మరికొందరు చేసే పని. వాటిల్లో వాస్తవం ఉండొచ్చు కానీ.. అన్నిసార్లు కాకపోవచ్చు.

అలాంటప్పుడు పెద్దయ్యాక వాళ్లే మారతారులే అని తేలిగ్గా తీసుకున్నామా... సమస్యే.

అందుకే మొక్కగానే వంచేద్దాం. ఎప్పటికప్పుడే మార్చే ప్రయత్నం చేద్దాం.

మొక్కగానే వంచేద్దాం!

☛ నిత్యకి ఎనిమిదేళ్లు. రోజూ స్కూలు నుంచి రాగానే క్లాస్‌లో ఎవరూ తనతో సరిగా మాట్లాడట్లేదనీ, టీచర్ పుస్తకాలు లాగేసుకుందని తల్లికి చెప్పేది. మొదట్లో తేలిగ్గానే తీసుకుంది. చివరకు స్కూలుకెళ్తే నిత్యే తోటి పిల్లల్ని కొడుతోందని టీచర్లు చెప్పేసరికి ఆ తల్లి అవాక్కైంది.

☛ అఖిల్ స్కూలు నుంచీ రాగానే చెప్పాపెట్టకుండా ఆడుకోవడానికి వెళతాడు. బ్యాగు తీసిచూస్తే రకరకాల పెన్నులూ, పెన్సిళ్లూ, ఎరేజర్లూ, స్కేళ్లూ.. కనిపిస్తుంటాయి. కొడుక్కి ఎవరైనా తోటి పిల్లలు ఇస్తున్నారేమోనని తల్లి మొదట్లో అనుకునేది. ఒకసారి టీచర్ వాడి డైరీలో 'మీ అబ్బాయి ఇతరుల వస్తువులు తీసేసుకుంటున్నాడని రాసిన ఫిర్యాదు చూసి భయపడింది.

ఈతరం తల్లుల్లో కొంతమంది ఇలాంటి ఉదాహరణలు బోలెడు చెబుతుంటారు. అలాగని ఇవి తేలిగ్గా తీసుకునేవి కాదు. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించకపోతే పెద్దయ్యేకొద్దీ ఇంకా పెరుగుతాయి. అందుకే సమస్య తెలిసిన వెంటనే చెక్ పెట్టడం మంచిది.

ఇవన్నీ అవలక్షణాలే..

తోటి పిల్లలతో గొడవ పడటం, వారిని కొట్టడం వంటివేవీ చిన్న విషయాలు కావు. కొన్నిసార్లు వాటిని పెద్దలూ నియంత్రించలేరు. అలాంటి పిల్లలు పెరిగాక కూడా తల్లిదండ్రులతోనూ వితండవాదం చేస్తారు. తాను చేసేది తప్పు కాదని వాదిస్తారు. లేదా ఇతరులపై ఆ తప్పుల్ని రుద్దుతారు. ఈ క్రమంలో పెద్దల్ని శత్రువుల్లా భావించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అలానే కారణం లేకుండా కక్ష్య సాధిస్తున్నట్లుగా ప్రవర్తించడం, తోబుట్టువులపైనా ద్వేషం పెంచుకోవడం చేస్తుంటారు. నచ్చిన వస్తువులు ఎలాగైనా సొంతం చేసుకోవాలనుకుంటారు. ఇలా చాలా రకాల ప్రతికూలతలు చిన్నారుల్లో కనిపిస్తుంటే వీలైనంత త్వరగా అదుపు చేయాలి. లేదా అవసరం అనుకుంటే మానసిక నిపుణులను సంప్రదించాలి. ప్రవర్తనాపరమైన చికిత్సలతో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తారు. అలాగే ఇంటి పరిస్థితులు ఎంత వరకూ వారిమీద ప్రభావం చూపుతున్నాయో గమనించాలి. ఎలాంటి వాతావరణం కల్పించాలనే అవగాహన తల్లిదండ్రులకు ఉండటం కూడా చాలా అవసరం అంటున్నారు మానసిక నిపుణురాలు డాక్టర్ పూర్ణిమా నాగరాజ.

ఇల్లే తొలి తరగతి...

80 శాతం మంది చిన్నారులు జన్మతః బాగుంటారు. ఇరవై శాతం మంది మానసిక అవలక్షణాలతో ఉంటారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మొదటి ఎనభై శాతం మందికి ఇల్లూ, కుటుంబసభ్యులే తొలిప్రపంచం. తరువాత వారిపై స్నేహితులూ, పాఠశాల ప్రభావం ఉంటుంది. అప్పుడే ప్రపంచాన్ని చూడ్డం మొదలుపెట్టిన చిన్నారులకు పెద్దలు అద్దంలాంటివారు. చిన్నారులు వారిని చూసే నేర్చుకుంటారు. అంటే మంచైనా, చెడైనా పెద్దలు ఏది చేస్తే పిల్లలూ అదే ఆచరించాలని అనుకుంటారు. పెద్దలు సరదాకో, అవసరానికో అబద్ధాలాడటం చూస్తే ఆ తరవాత నుంచీ వారు అలా చేయడం తప్పుకాదనే నిర్ణయానికి వచ్చేస్తారు. ఇక, మిగిలిన 20 శాతం చిన్నారుల్లోనైతే పుట్టుకతోనే కొన్ని స్వభావాలుంటాయి. వారి గుణంలో సానుభూతీ, దయా ఉండకపోవడంతో హింసాత్మకమైన కోణం పెరిగేకొద్దీ కనిపిస్తుంది.

ఫిర్యాదులు వద్దు...

ఇంట్లో పెద్దవారిపై అమ్మానాన్నలు ఫిర్యాదులు చేసుకోవడం, పక్కింటివారి గురించి ఆరోపణలు, బంధువుల్నీ, స్నేహితుల్ని నిందించడం వంటివి పిల్లల్లో కండక్ట్ డిజార్డుకు బీజం పడేలా చేస్తాయి. తల్లిపై తండ్రి దాడి చేసినా చిన్నారుల మనసులో ప్రతికూల భావం పడుతుంది. క్రమంగా అది పెరిగి ఇతరుల్ని హింసించడంలోనే ఆనందం ఉందనుకుంటారు. అలాగే ఇంట్లో అమ్మానాన్నలు నిత్యం గొడవపడుతూ వాదించుకుంటుంటే వారికి ఇతరులపై ద్వేషం పెరుగుతుంది. దీనివల్ల కొందరు సమాజాన్ని ద్వేషించడం మొదలుపెడతారు. ఇందుకు ఈమధ్య హైదరాబాద్‌లో జరిగిన ఓ సంఘటనే ఉదాహరణ. తమ పెంపుడు కుక్క తనని చూసి మొరుగుతోందనీ, ఆ అబ్బాయితో కాకుండా అందరితో ప్రేమగా ఉంటోందని దాని కాళ్లు విరిచేశాడు ఓ చిన్నారి. మరో రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పిల్లలు కొందరు పక్కింటి వారి కుక్కని పై అంతస్తు నుంచి విసిరేసిన సంఘటన వారి వికృత చేష్టకు పరాకాష్టగా చెప్పుకోవచ్చు. ఇలాంటి ఆలోచనా విధానమే కండక్ట్ డిజార్డరుకు కారణం. ఇలా జరగకుండా ఉండాలంటే తల్లిదండ్రులు ఏం చేయాలో తెలుసా..



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్



మీరే మార్గనిర్దేశకులు...

★ తల్లిదండ్రులు పిల్లలకి ఇంట్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి. ప్రతి విషయంలోనూ వారికి మార్గనిర్దేశకులుగా ఉండాలి. పెద్దలతో అన్నీ పంచుకునే చొరవ ఇవ్వాలి. 'అమ్మకి చెబితే ఏమవుతుందో' అనే బెరుకు లేకుండా చూసుకోవాలి. అబద్ధాలు చెబితే.. వెంటనే దాన్ని మానేసేలా చూడాలి. కథల రూపంలో నిజాయతీగా ఉండటం వల్ల కలిగే లాభాల్ని వారికి తెలియజేయాలి.

★ పిల్లలు బడి నుంచి రాగానే ఆటలు ఆడుకోవడానికో, ఫోన్లకో పరిమితం కానివ్వకుండా కబుర్లు చెప్పాలి. తరగతిలో విషయాలు తెలుసుకోవాలి. పలు రకాల ప్రశ్నలు వేసి వారితో మాట్లాడించాలి. అప్పుడే బడిలో తోటివారితో ఉండే విధానం, ఇతర పిల్లల పట్ల వ్యవహరించే తీరూ తెలుస్తుంది. వారు చెప్పే సమాధానాన్ని బట్టి పిల్లల మానసిక స్థితిని కొంతవరకూ అంచనా వేయొచ్చు. ★ చిన్నారుల స్కూలు డైరీలు నిత్యం చదవాలి. ఉపాధ్యాయులు రాసే ఫిర్యాదులూ, ప్రశంసలూ తెలుసుకోవాలి. వీలైతే వారానికోసారి వారితో ప్రత్యక్షంగా మాట్లాడి పిల్లల మానసిక ప్రతిభ, చదువులో ఎలా ఉన్నారన్నదీ తెలుసుకోవాలి. వారి స్నేహ సరీ ఏంటి, ఏం కొనిస్తున్నాం, వారి బ్యాగులో ఏముంటున్నాయి వంటివీ గమనించాలి. కొత్త వస్తువులు కనిపిస్తే వెంటనే ఎక్కడివో ఆరా తీయాలి. 'నాకు తెలియకుండా ఎలా వచ్చింది' అని అడగాలి. 'స్నేహితుల్ని అడిగి తెచ్చా...' అని సమాధానం ఇచ్చినా సరే.. వెంటనే తిరిగి ఇప్పించే ప్రయత్నం చేయాలి.

★ పిల్లలు సున్నిత మనస్కులు. తమ ముందు పెద్దలు వాదించుకున్నా.. ఇతరుల ముందు పెద్దలు తమని తిట్టినా తట్టుకోలేరు. కాబట్టి ఎన్ని ఇబ్బందులున్నా తల్లిదండ్రులు వారి ముందు పరస్పరం గౌరవ మర్యాదలు ఇచ్చి పుచ్చుకోవాలి. పిల్లల్ని నిత్యం కసురుకుంటూ, విసుక్కుంటూ ఉండకుండా ప్రేమగా వ్యవహరించాలి. తప్పు చేసినా నిదానంగా మందలించాలి. సున్నితంగా కోప్పడాలి. వారి అవసరాలను తెలుసుకుని కావల్సినవి సమకూరుస్తుండాలి.

★ మంచి పనులు చేస్తే ప్రశంసించి, బహుమతి ఇవ్వాలి. తప్పు చేస్తే క్షమాపణ ఉత్తరం రాసే అలవాటు చేయాలి. ఇది కాగ్నిటివ్ థెరపీలో ఓ భాగం. ఈ పద్ధతి వారిని మంచి మార్గంలో నడిపిస్తుంది. తల్లిదండ్రులు తప్పులు చేసినా చిన్నారులకు అలానే రాసివ్వాలి.

★ చిన్నారులకు పచ్చని పూలకుండీలూ, పెంపుడు జంతువులూ, అక్వేరియం వంటివి బహుమతిగా ఇచ్చేందుకు ప్రయత్నించాలి. ప్రాణుల్ని ప్రేమగా చూసుకునే క్రమంలో వారిలో ఒత్తిడి దూరమవుతుంది. ప్రేమను పంచే గుణం అలవడుతుంది. ఒక్కోసారి చిన్న సమస్యే కదాని వారిని వదిలేస్తే అది తీవ్ర తప్పిదానికి కారణమవుతుందని తల్లిదండ్రులు గుర్తించాలి.

స్క్వాట్స్‌తో సొగసుగా

స్క్వాట్స్ వ్యాయామం వల్ల కాళ్ల కండరాలు దృఢంగా మారతాయి. శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. దీన్ని కొత్తగా మొదలుపెట్టేవారు గోడసాయంతో చేయాలి. కొత్తలో 10 సార్లు చేయాలి. ఆ తరువాత క్రమంగా సంఖ్యను పెంచాలి. ఈ స్క్వాట్స్‌వల్ల కాళ్లూ, చేతులూ, పొట్టా, వెన్ను ఇలా అన్ని భాగాలకూ మంచి వ్యాయామం అందుతుంది. ఆ భాగాల్లో ఉండే కొవ్వు కరగడమే కాకుండా కండరాలు బలపడతాయి. అయితే ఇది చేసే ముందు వార్మ్‌అప్ తప్పనిసరి.



1 కుర్చీలో కూర్చున్నట్లుండే భంగిమ ఇది. చిత్రంలో చూపినట్లు కాళ్లను ఎడంగా పెట్టి చేతులను కాళ్లపై ఆనించాలి. వెన్నును నిటారుగా ఉంచాలి. ఇలా వీలైనంతసేపు ఉండి తిరిగి మామూలు స్థితికి రావాలి. ఈ వ్యాయామం చేయడం వల్ల కాళ్లూ, వెన్ను కండరాలు బలపడతాయి.




2 ఈ స్థితిలో కాళ్లను కాస్త దగ్గరగా పెట్టుకుని మోకాళ్లు మడిచి కొద్దిగా వంగాలి. ఆ తరువాత చేతులను తల దాకా తీసుకొచ్చి సమాంతరంగా ముందుకు చాపాలి. ఇలా చేయడం వల్ల బరువంతా తొడలూ, పిరుదులూ, కాళ్లపై పడుతుంది. ఇక్కడ ఉండే కొవ్వు తగ్గడమే కాకుండా కండరాలు దృఢంగా మారతాయి.



3 ఇంతకు ముందున్న స్థితిలోనే ఉంటూ ఒకవైపు తిరగాలి. నెమ్మదిగా గాలి వదులుతూ మామూలు స్థితికి రావాలి. కుడి ఎడమలు రెండు వైపులా తిరుగుతూ ఈ వ్యాయామం చేయడం వల్ల కాళ్లూ, చేతులకు మంచి వ్యాయామం అందుతుంది. దీన్ని పదిసార్లు చేస్తే మంచిది.



4 ఇంతకు ముందున్న స్థితిలోనే ఉంటూ గాలి పీలుస్తూ చేతులను చిత్రంలో చూపిన విధంగా రెండు కాళ్ల మధ్య నుంచి వెనక్కి చాపాలి. కొన్ని సెకన్ల తరువాత మామూలు స్థితికి రావాలి. ఈ వ్యాయామంలో పొట్టపై ఒత్తిడి పెరిగి అక్కడి కండరాలు దృఢంగా మారడమే కాకుండా కొవ్వూ కరుగుతుంది.



డాక్టర్ మణిపవిత్ర
యోగా నిపుణురాలు

ఆధునికంగా ఉండాలనుకుంటున్నా...!

మేముండేది చిన్న ఊళ్లో. ఇప్పటివరకూ సంప్రదాయబద్ధంగా ఉండే దుస్తులనే వేసుకోవడానికి ఇంట్లో ఒప్పుకునే వారు. దాంతో సల్వార్‌లూ, పరికిణీలూ, చీరలూ మాత్రమే వేసుకున్నా. ఈ మధ్యే నాకు పెళ్లి కుదిరింది. త్వరలోనే పెళ్లి. ఆయనకు నేను ఆధునికంగా ఉంటే నచ్చుతుంది. నాకూ అదే ఇష్టం. పెళ్లయ్యాక నేను అలానే మారాలనుకుంటున్నా. నా ఎత్తు ఐదడుగుల మూడంగుళాలు. నేనెలాంటి దుస్తుల్ని ఎంచుకుంటే బాగుంటుంది.

– నవ్యత, శ్రీకాకుళం

డియర్ వసుంధర



ధన్యాగుత్తా
ఫ్యాషన్ డిజైనర్

మార్పు మంచిదే కానీ...అది ఒక్కసారే కాకుండా చూసుకోండి. మీరు ఇప్పటివరకూ సల్వార్‌లు తప్ప మరేదీ వేసుకోలేదు అన్నారు. ఈసారి కుర్తాలూ, జెగ్గింగ్‌లు ప్రయత్నించి చూడండి. అలానే కుర్తీలకు బదులుగా ఎసిమెట్రికల్ ట్యూనిక్‌లూ, అనార్కలీలను ఎంచుకోవచ్చు. సల్వార్‌లకి బదులు ధోతీలూ, మోకాలివరకూ ఉండే నీ లెంగ్త్ టాప్‌లూ వాటికి జతగా పలాజోలు మరింత కొత్తగా కనిపించేలా చేస్తాయి. మీ లుక్‌ని సహజంగా మారుస్తాయి. అయితే ఏది ఎంచుకున్నా అది మీకు నప్పేలా ఉండాలి. మీ శరీరాకృతికి తగ్గట్లు ఉండాలనే విషయం మరిచిపోవద్దు. పరికిణీలు, చీరల్ని కూడా ఎప్పటిలా కాకుండా కాస్త భిన్నంగానే ప్రయత్నించొచ్చు. చీరకట్టులోనూ చిన్న చిన్న మార్పులతోనే కొత్తగా కనిపించొచ్చు. అలానే బ్లవుజుల్నీ బోట్‌నెక్, ఆఫ్‌షోల్డర్, కోల్డ్‌షోల్డర్ వంటి డిజైన్‌లతో కుట్టించుకుంటే చూడ్డానికి బాగుంటుంది. వీటిమీదకు వేసుకునే యాక్సెసరీల విషయంలోనూ కాస్త జాగ్రత్తపడాలి. మరీ ఎక్కువగా కాకుండా సింపుల్ చెయిన్, యాంటిక్ సిల్వర్ జుంకాలూ, స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్, స్టేట్‌మెంట్ వాచ్ వంటివన్నీ కూడా మార్పు కనిపించేలా చేస్తాయి. ప్రయత్నించి చూడండి.

– మీ సందేహాలను, సమస్యల్ని vasufashion@eenadu.net కు పంపించగలరు.


నజరానా

జీన్స్ ప్యాంట్‌పై ఇంకు మరకలు పడ్డాయా... నెయిల్ పాలిష్ రిమూవర్‌లో ముంచిన దూది ఉండతో రుద్ది చూడండి.

బంగారం వెండి

24న ముగింపు-క్రితం


తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,957	2,939
వెండి (గ్రా)	41.60	41.60



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,560	31,540	31,500	31,570	31,500	31,400	31,050	30,860	31,770	31,490
ఆర్నమెంట్	29,810	29,700	29,300	29,300	29,210	29,120	29,570	29,390	29,550	29,290
వెండి(కిలో)	39,600	39,500	39,800	39,800	39,600	39,600	39,900	41,600	39,900	39,900

అరచేతిలో ఇంటికి రూపం!





కొత్త ఇల్లు కట్టుకుంటున్నప్పుడో, లేదంటే పాత ఇల్లునే కాస్త మార్చాలనుకున్నప్పుడో దానికి వేయాల్సిన రంగులూ, ఫర్నిచర్ గురించి సతమతమవుతుంటాం. ఏ రంగు వేస్తే ఎలా ఉంటుందో ముందుగానే ఒకసారి చూసుకునే అవకాశం వస్తే బాగుంటుంది కదూ! 'హోమ్ స్టైలర్ ఇంటీరియర్ డిజైన్ అండ్ డెకొరేటింగ్ ఐడియాస్' యాప్ ద్వారా అది సాధ్యమే. దీంట్లో ఒక గది ఫొటోను అప్‌లోడ్ చేసి, అందులో ఎలాంటి ఫర్నిచర్ నప్పుతుందో, గదులకు ఏ రంగు బాగుంటుందో మనమే ఎంపికచేసి నచ్చిన స్థలంలో అమర్చుకోవచ్చు. ఈ యాప్‌లో వివిధ బ్రాండ్‌లకు సంబంధించిన వస్తువులు కూడా ఉంటాయి. ఏదైనా నచ్చితే అదే బ్రాండ్‌కు సంబంధించింది కాకపోయినా కాస్త పోలికున్న దాన్ని బయట కొనుక్కోవచ్చు. దీంట్లో గది రంగుల నుంచీ షాండ్లియర్లూ, వెంటిలేటర్లూ, ఓవెన్లు... ఇలా ప్రతిదీ మన ఇంటికి నప్పుతుందో లేదో తెలుసుకునే ప్రయత్నం చేయొచ్చు.

ఆహా!

.. ఏమి రుచి

aha@eenadu.in

పుల్లమామిడి అంటే పిచ్చి మనకి! ఎంతంటే...
ఆ పులుపుకి కళ్లు మూతలుపడుతున్నా.. నాలుక కొట్టుకుపోతున్నా లెక్కచేయం. పప్పులో వేయడానికి సరిపడవు అని తెలిసినా పిల్లలతో పోటీపడి మనమూ కొసరికొసరి తింటాం. రోడ్డువారన కారంతో ఊరిస్తున్న మామిడి ముక్కలు కనిపిస్తే మనసు చిన్నపిల్లలా మారం చేస్తుంది. అదీ మనసుకి, మామిడికీ ఉన్న ఆకర్షణ. మామిడిపండుతో పోలిస్తే కాయ పోషకాలపరంగా చాలా ప్రత్యేకం. ఎందుకంటే...

పచ్చిమామిడి పోషకాల ఒడి



కూరగాయల బండి వస్తే తక్కిన వాటి మాట పక్కనపెట్టి... మామిడికాయల కోసం వెతుకుతాం. వీటిని పప్పులో వేయొచ్చు.. ఆదివారం అయితే మటన్‌తోనో, చేపలతోనో కలిపి కుమ్మేయొచ్చు. అప్పటికప్పుడు తాజాగా ముక్కపచ్చడి పెట్టి నాలుకకి, మనసుకి రుచుల పాఠాలు నేర్పించొచ్చు. పచ్చిమామిడి రుచిలోనే కాదు పోషకాల పరంగా కూడా చాలా ప్రత్యేకం. పండుతో పోలిస్తే దీనిలో నిరోధశక్తిని పెంచే సి, బి విటమిన్లు అధికంగా ఉంటాయి.



డా. అరుణ
పోషకాహార నిపుణురాలు

ఉప్పు రాసుకుని తింటే మంచిదే...

వేసవిలో ఎక్కువగా బాధించే వేడి, వడదెబ్బ మొదలుకుని డయేరియా వరకూ అనేక సమస్యలకు పచ్చిమామిడి దివ్యౌషధంలా పనిచేస్తుంది. పీచు, సి విటమిన్లకి పెట్టింది పేరు. 100గ్రా పచ్చిమామిడి నుంచి 60 కెలొరీలు మాత్రమే అందుతాయి. అదే పండిన మామిడి పండులో అయితే ఈ కెలొరీలు ఎక్కువగా ఉంటాయి. దీనిలో 1.6 గ్రాముల పీచు ఉంటుంది. అంటే మొత్తం కెలొరీల్లో ఆరు శాతం అన్నమాట. విటమిన్ ఎ అయితే 22 శాతం ఉంటుంది. విటమిన్ సి 61 శాతం ఉంటుంది. క్యాల్షియం..ఐరన్ ఒక్కశాతం చొప్పున ఉంటాయి. పచ్చిమామిడి కాయ తినడం వల్ల గ్యాస్ట్రో ఇంటస్టైన్ ఇబ్బందులు అంటే.. పొట్టకు సంబంధించిన వివిధ రకాల నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. మామిడికాయ ముక్కలపైన ఉప్పు చల్లుకుని తింటాం కదా! ఇలా తినడం వల్ల శరీరంలోని వేడిని జయించొచ్చు. జీర్ణశక్తి పెరుగుతుంది. ఉప్పుతో కలిపి తినడం వల్ల సమ్మర్ డయేరియా, పైల్స్, గర్భిణుల్లో కనిపించే మార్నింగ్ సిక్‌నెస్(వికారం), అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. తేనె, ఉప్పు కలిపి తీసుకున్నా మంచిదే.



రక్తహీనత రాకుండా...

రక్తహీనత రాకుండా ఉండేందుకు మనం ఐరన్ సమృద్ధిగా ఉంటే ఆహారం తీసుకుంటాం. కానీ విటమిన్ సి అధికంగా ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు ఇనుముని శరీరం సులభంగా గ్రహిస్తుంది. విటమిన్‌సి అధికంగా ఉండే పచ్చిమామిడి ఇందుకు బాగా సహకరిస్తుంది. కొత్త రక్తకణాలు ఉత్పన్నమయి రక్తహీనత రాకుండా ఉంటుంది. మామిడి వ్యాధినిరోధకశక్తిని పెంచి క్షయ, కలరా రాకుండా చూస్తుంది. అందుకే పచ్చిమామిడిని 'ఇమ్యునో న్యూట్రియంట్' అని పిలుస్తారు. పచ్చిమామిడిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీవక్రియలు చురుగ్గా జరిగి బరువు అదుపులో ఉంటుంది. గుండెలో మంట, బీపీ, మధుమేహం సమస్యలున్న వారికి పచ్చిమామిడి చక్కని ఆహారం. దీనిలోని లోగ్లైసిమిక్ స్థాయిలే ఇందుకు కారణం. కంటి ఆరోగ్యానికి మంచిది. ముఖంపై మొటిమలు రాకుండా ఉంటాయి. దీనిలోని బీటాకెరొటిన్ ఆస్థమా నుంచి ఉపశమనం కలిగిస్తుంది. కాలేయ సంబంధిత సమస్యలూ రాకుండా ఉంటాయి. చర్మంలోని కొలాజిన్ తగ్గిపోకుండా చేసి చర్మం ముడతలు పడకుండా చేస్తుంది. కణాల ఉత్పత్తి ప్రక్రియని సవ్యంగా జరిగేటట్టు చూస్తుంది.

పచ్చళ్లు మంచివే...

ఆవకాయ, మాగాయ వంటి ఊరగాయలు మంచివి కావనే అభిప్రాయం మనలో బలంగా ఉంది. అయితే రోజుకి 5గ్రా మించకుండా తినడం వల్ల ఏ హాని జరగదు. బీపీ ఉంటే మాత్రం దూరంగా ఉండటమే మంచిది. మామిడిని ఎండబెట్టి, మెంతిపొడితో చేసే మాగాయి కూడా శరీరానికి మంచిదే. కానీ మితం పాటించడం ముఖ్యం. ఈ మధ్యకాలంలో మామిడి టీకి ఆదరణ పెరుగుతోంది.. తొక్క తీసేసి గుజ్జుని నీటిలో వేసి మరిగించి ఆ నీటికి కొద్దిగా టీపొడి కలిపి గ్రీన్‌మాంగో టీని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.

- పప్పులో వేయడం కన్నా తాజాగా పచ్చడి రూపంలో తినడం వల్ల విటమిన్ సి ఎక్కువగా అందుతుంది.
- పప్పులోవేస్తే విటమిన్ సి శాతం తగ్గినా వండే క్రమంలో విటమిన్ ఎ ఎక్కువగా లభిస్తుంది.




- ఉదయం, సాయంత్రం మనం చిరుతిళ్లు తినే సమయంలో కొద్దిగా ఉప్పుచల్లిన మామిడిముక్కలని తినడం వల్ల శరీరం చెమట కారణంగా కోల్పోయిన లవణాలను తిరిగి పొందుతుంది.
- మామిడిని ఎండబెట్టి చేసే ఆమ్‌చూర్ పొడిని మసాలా దినుసులా వాడుకోవచ్చు. కూరల్లో ఆమ్‌చూర్ పొడిని వేస్తే మంచిది. చాట్ మసాలాతో పాటు దీనిని కూడా చేర్చుకోవచ్చు.
- చిగుళ్ల నుంచి రక్తం కారే స్కర్వీ సమస్యకు పచ్చిమామిడి చక్కని ఉపశమనం.
- రోజుకి 100గ్రా వరకూ పచ్చిమామిడిని ఆహారంలో చేర్చుకోవచ్చు.

మటన్‌తో కలిపి...

కావల్సిన పదార్థాలు: మటన్- అరకిలో, అల్లంవెల్లుల్లి పేస్ట్- చెంచాన్నర, పసుపు- కొద్దిగా, కారం- రెండు చెంచాలు, ఉల్లిపాయ- ఒకటి, ఉప్పు- తగినంత, చెక్కుతీసేసిన మామిడికాయ ముక్కలు- కప్పున్నర, దాల్చినచెక్క- చిన్నది ఒకటి, లవంగాలు- మూడు, స్టార్ పువ్వు- సగం, యాలకులు- ఒకటి, నూనె- తగినంత

తయారీ: ముందుగా కుక్కర్‌లో మటన్, పసుపు, కారం, అల్లంవెల్లుల్లి, ఉల్లిపాయ ముక్కలు, కొద్దిగా నీళ్లు పోసి ఉడికించుకోవాలి. వేరేపాత్రలో మామిడికాయ ముక్కలు, ఉప్పు, కారం వేసి నీళ్లుపోసి మెత్తగా ఉడికించుకోవాలి. ఒక పాత్రలో నూనె పోసి వేడెక్కాక అందులో లవంగాలు, దాల్చిని, యాలకులు, ఉల్లిపాయలు వేసి వేయించుకోవాలి. అవి వేగిన తర్వాత ఉడికించుకున్న మాంసం, మామిడి గుజ్జు వేసి కలిపి కూర దగ్గరకు రానివ్వాలి. వేడివేడి మటన్ మామిడికాయ కూర సిద్ధం.



సముద్ర చేపతో..

కావల్సినవి: వంజరం- 500గ్రా (సముద్ర చేప ఏదైనా మంచిదే). చేపకు పట్టించడం కోసం ఉప్పు, పసుపు, అల్లంవెల్లుల్లి ముద్ద, ధనియాల పొడి తీసుకోవాలి. ఓ అరగంట ముందు ఇవన్నీ చేప ముక్కలకు బాగా పట్టించి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. కప్పు నీళ్లలో నిమ్మకాయంత చింతపండుని తీసుకుని నానబెట్టి చిక్కగా రసం తీసి పక్కనపెట్టుకోవాలి. అలాగే చిటికెడు మెంతులు, అరచెంచా జీలకర్ర, అరచెంచా ఆవాలు తీసుకుని పెనంపైన నూనెలేకుండా పొడిగా వేయించుకుని మెత్తగా పొడికొట్టుకుని పెట్టుకోవాలి.

కూర కోసం: ఆవాలు- అరచెంచా, జీలకర్ర- అరచెంచా, ఎండుమిర్చి- రెండు, పచ్చిమామిడికాయ(పుల్లనిది)- ఒకటి, ఉల్లిపాయ ముక్కలు-కప్పున్నర, పచ్చిమిర్చి- నాలుగు, కారం- రెండు చెంచాలు, అల్లంవెల్లుల్లి పేస్ట్- చెంచా, ఉప్పు, పసుపు, నూనె- తగినంత



తయారీ: కడాయిలో నూనె పోసి, వేడయిన తర్వాత ఆవాలు, ఎండుమిర్చి, జీలకర్ర వేసి అవి చిటపటలాడుతున్న సమయానికి పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించుకోవాలి. అవి వేగాక అల్లంవెల్లుల్లి ముద్ద, కరివేపాకు వేసి పచ్చివాసన పోయిన తర్వాత పసుపు, కారం, ధనియాలపొడి, ముందుగా పొడికొట్టుకుని పెట్టుకున్న మసాలా పొడి కూడా వేసుకోవాలి. వీటన్నింటినీ కలిపిన తర్వాత... మామిడికాయ ముక్కలు తొక్క తీయకుండా వేసి ఐదారు నిమిషాల పాటు మూతపెట్టేయాలి. అవి ఉడికి మెత్తబడిన తర్వాత చింతపండు రసం వేసుకోవాలి. రసం మరుగుతున్నప్పుడు మసాలా పట్టించిన చేపముక్కలు వేసి మూతపెట్టేయాలి. కొద్దిగా మంట పెంచి పదినిమిషాలు ఉంచితే చేపముక్కలు ఉడికిపోతాయి. కొత్తిమీర వేసి దించేసి వేడివేడిగా తినడమే.

ముక్కల పచ్చడి...

కావల్సిన పదార్థాలు: మామిడి ముక్కలు- కప్పున్నర, సోంపుగింజలు- చెంచా, జీలకర్ర- చెంచా, ఉప్పు- తగినంత, కారం- చెంచా, ఆవనూనె- చెంచాన్నర, ఇంగువ- పావుచెంచా



తయారీ: ముందుగా నాన్‌స్టిక్ పెనంపై జీలకర్ర, సోంపుగింజలని దోరగా వేయించుకోవాలి. చక్కని పరిమళం వస్తున్న సమయానికి తీసి చల్లార్చి చాప్‌బోర్డుమీద ఉంచి అప్పడాల కర్రతో కచ్చాపచ్చాగా పొడి చేసుకోవాలి. మామిడికాయ ముక్కలపైన ఈ సోంపు, జీలకర్ర పొడి వేసి దానిపై ఉప్పు, ఇంగువ, పసుపు, కారం వేసి చివరిగా తగినంత ఆవనూనె వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి గంటపాటు పక్కన పెట్టేస్తే సరి.. చక్కగా ఊరి అన్నంలోకి బాగుంటుంది.

పనసపిక్కలు పచ్చిమామిడి...

కావల్సిన పదార్థాలు: తొక్క తీసిన మామిడికాయ ముక్కలు- కప్పు, పనస పిక్కలు(తొక్క తీసినవి)- కప్పు, నూనె- రెండు చెంచాలు, ఎండుమిర్చి- రెండు, తాజా కొబ్బరి- అరకప్పు, ఆవాలు- అరచెంచా, పసుపు- కొద్దిగా, ఉల్లిపాయలు- మూడు, పచ్చిమిర్చి- ఐదు, కరివేపాకు- రెండు రెమ్మలు, ఉప్పు- తగినంత



తయారీ: ముందుగా పనసగింజలని పసుపు వేసి కుక్కర్‌లో ఉడికించుకోవాలి. అవి ఉడికాక మామిడికాయ ముక్కలు కూడా వేసి మరోసారి ఉడికించుకోవాలి. మిక్సీలో కొబ్బరి, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కాసిని నీళ్లు వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పొయ్యిమీద ఉంచి పచ్చివాసన పోయిన తర్వాత ఇందులో ఉడికిన పనస పిక్కలు, మామిడికాయ ముక్కల పేస్ట్ వేసి సన్నసెగ మీద ఉంచాలి. ఇప్పుడు ఒక పాత్రలో నూనె పోసి వేడెక్కాక అందులో ఆవాలు, ఎండుమిర్చి, కరివేపాకు కొద్దిగా ఉల్లిపాయలు వేసి వేయించుకోవాలి. ఇందులో ఉడికించి పెట్టుకున్న పనసపిక్కలు, మామిడికాయ మిశ్రమం వేసి దగ్గరకు వచ్చిన తర్వాత దింపుకోవాలి.

కాజా బిర్యానీ.. వండకుండానే కొనేసుకుంటారు!

కొబ్బరి చెట్ల మధ్యలోంచి, ఓ సాయంత్రపు వేళ.. రయ్‌మంటూ వెళుతున్న మోటార్‌సైకిల్‌కి ఒక్కసారిగా బ్రేక్ పడుతుంది. అక్కడ దంచికొట్టే మసాలా వాసనల్ని ఆస్వాదిస్తూ శ్వాస ఆనందిస్తుంది. ఆ వెంటే నోట్లో నీళ్లూరతాయి. కాళ్లు అప్రయత్నంగా కాజా బిర్యానీ సెంటర్‌లోకి నడిచేస్తాయి. ఓ మాంచి ధమ్ బిర్యానీ రుచి చూసేందుకు సిద్ధపడుతూ...



పక్కాలోకల్

పెద్ద నగరాల నుంచి చిన్న పట్టణాల వరకు ఇప్పుడైతే ధమ్ బిర్యానీ మామూలే కావచ్చు. దాదాపుగా పదిహేనేళ్ల కిందట, రుచికరమైన ధమ్‌బిర్యాని అన్నిచోట్లా దొరికేది కాదు. గోదారోళ్లకైతే అప్పటికి ఈ రుచి గురించి పెద్దగా తెలియదు. అలాంటి సమయంలో వాళ్లకు అద్దిరిపోయే రుచితో ధమ్ బిర్యానీని పరిచయం చేసింది 'కాజా బిర్యానీ'. కాజా అనగానే జీడిపప్పులు కానీ వేసి ఈ బిర్యానిని చేస్తారేమో అనుకునేరు. అదేంకాదు కాజా అనేది ప్రాంతం పేరు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలు వెళ్లే రోడ్డులో పదిహేను నిమిషాలు ప్రయాణిస్తే కాజ అనే చిన్న ఊరొస్తుంది. మామూలుగా అయితే ఈ ఊరి పేరు ఎవరికీ తెలిసి ఉండేది కాదేమో. కానీ ఇక్కడ దొరికే బిర్యానీతోనే ఈ చిన్న పల్లె పేరు భలే ఫేమస్ అయిపోయింది. ఫలితంగా ఆ దుకాణానికీ 'కాజా బిర్యానీ' అనే పేరొచ్చేసింది. ఈ దుకాణం యజమాని పేరు మేళం రామాంజనేయులు. చికెన్‌తో పంజాబీ ధమ్ బిర్యానీ చేయడం నేర్చుకుని 'శ్రీరామ్ పంజాబీ బిర్యానీ' పేరుతో దీన్ని చిన్న పూరి పాకలో ప్రారంభించారు. కొంత కాలానికే ఆయన చేతి బిర్యానీ రుచి, ఆ ప్రత్యేకమైన మసాలా ఘాటు స్థానికులందరికీ తెగ నచ్చేసింది.

తారలు మెచ్చిన ఆయిల్‌లెస్ బిర్యాని...



చిరంజీవి, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, సిద్ధార్థ, ప్రభాస్... వంటి తారలు ఈ బిర్యానీని రుచి చూసి ఫిదా అయిపోయినవారే. వీరే కాదు.. ఈ చుట్టుపక్కల షూటింగులకొచ్చే చాలా యూనిట్ల వాళ్లు ప్యాకప్ చెప్పేయగానే ఈ బిర్యాని పార్శిళ్లు తెప్పించుకుని తినేందుకు ఉవ్విళ్లూరతారు. ఈ చిన్న పల్లెకు దగ్గర్లోనే గోదావరి, దాని తీరంలో చాలా రిసార్టులు ఉన్నాయి. అక్కడికి వచ్చే పర్యటకులంతా ఈ బిర్యానీ రుచి చూసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అన్నట్టు ఇందులో నూనె ఉపయోగించరు. చికెన్ కోసం వాడే మారినేషన్‌లో నేతిని వాడతారు. దాంతోనే ధమ్ చేస్తారు కాబట్టి ప్రత్యేకించి నూనె వాడరు. బిర్యానీ గిన్నె పొయ్యి ఎక్కక ముందే బిర్యానీ పొట్లాలు ముందుగా బుక్ అయిపోయేవి. లైన్‌లో నిలబడి టోకెన్లు ముందుగా తీసుకున్న వారికే తయారైన తర్వాత బిర్యానీ ప్యాకెట్ చేతికొచ్చేది. పక్క ఊర్లలో, పట్టణాల్లో కూడా పోటీగా ధమ్ బిర్యానీ సెంటర్లు అందుబాటులోకి వచ్చినా దీని డిమాండ్ దీనిదే.

– వి.వై.దీపిక పద్మశ్రీ


పానకం.. పోషకం!

పండగ రుచులు!




శ్రీరామనవమి అంటే మనకి గుర్తుకొచ్చేవి పానకం, వడపప్పే. తక్కిన పండగలకేమో... బొబ్బట్లు, బూరెలు, గారెలు, అరిసెలు. ఈ పండక్కి మాత్రం చాలా సులభంగా అయిపోయే పానకం, వడపప్పు.. మరికొన్ని వంటకాలు. ఎందుకిలా అనే సందేహం ఎప్పుడైనా వచ్చిందా? చాలా సులభంగా చేసుకునే ఆ వంటకాల్లోనే బోలెడు పోషకాహార సూత్రాలు కూడా చెప్పారు మన పెద్దవాళ్లు. అవేంటో తెలుసుకుందాం...

ఈ పండగ పూర్తిగా ఎండలు ముదరకుండా.... వేసవి ఆరంభంలో వస్తుంది. రాబోయే రోజుల్లో ఎండలకు తట్టుకోవడానికి మనం ఎటువంటి ఆహారం తీసుకోవాలో చెబుతుంది ఈ వడపప్పు, పానకం. వేసవిలో ఎండ, వేడిమి కారణంగా చెమట రూపంలో చాలా సహజంగా మన శరీరం పోషకాలని కోల్పోతుంది. దాంతో నీరసం, నిస్సత్తువ ఆవహిస్తాయి. సరైన ఆహారం తీసుకోకపోతే రక్తహీనత రావడానికి ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. శరీరాన్ని వేడి బారి నుంచి రక్షించి ఐరన్ లోపం రాకుండా చూడ్డానికే పానకంలో బెల్లం వేస్తారు. గొంతు సమస్యలు రాకుండా, తిన్న ఆహారం సులభంగా జీర్ణమయ్యేందుకు మిరియాలు, శొంఠిపొడి వంటివి ఉపయోగపడతాయి. మిరియాలు జీవక్రియలను చురుగ్గా ఉండేట్టు చూస్తాయి. యాలకులకు చలువ చేసే గుణం ఉంది. మొత్తం మీద పానకం శరీరంలో నీటినిల్వలని, లవణాలని కోల్పోకుండా చేస్తుంది. ఇక వడపప్పులో పెసరపప్పు ఎందుకు వేస్తారంటే... ఈ కాలంలో చాలా సులభంగా జీర్ణమయ్యే పప్పు ఇది. చిన్నపిల్లలకు కూడా హాయిగా పెట్టొచ్చు. చాలాచోట్ల వడపప్పుని అలాగే తినేయకుండా అందులో నిమ్మరసం, పచ్చికొబ్బరి తురుము, కీరదోస ముక్కలు, మామిడికాయ తురుము వేసి చేస్తారు. ఈ ఆహారం మనకి అవసరం అయిన ప్రొటీన్లని అందించడంతో పాటు సి విటమిన్ లోపం లేకుండా, సూక్ష్మపోషకాల లోపం రాకుండా చూస్తుంది. పచ్చికొబ్బరి కూడా అరుగుదలకి చాలా మంచిది. ఈ కాలంలో వేపుళ్లు మంచివి కావు. అందుకే ఈ పండగ వంటకాల్లో ఎక్కడా డీప్‌ఫ్రై వంటకాలు మీకు కనిపించవు. వేసవిలో త్వరగా నీరసించి పోతారు. ఇలాంటి సమయంలో రక్తహీనత వస్తే కోలుకోవడం కష్టం. ఆ సమస్యకు విరుగుడుగానే ఈ ఆహారం. వీటితోపాటు ఈ పండక్కి రవ్వకేసరి, పెసరపప్పు పాయసం, సగ్గుబియ్యం పాయసం, కొమ్ము సెనగలతో తాలింపు, ఉసిరికాయ రోటి పచ్చడి, ఫూల్‌మఖనీ పాయసం వంటివి చేసుకుంటారు. చిన్న ఉసిరికాయల్లో జీలకర్ర, ఉప్పు, పచ్చిమిర్చి, ఎండుమిర్చి, కరివేపాకు వేసి దంచి పచ్చడి చేస్తారు.





రోజ్ ఫలూద ఇంట్లోనే...



ఫలూద అంటే మా ఇంట్లో అందరికీ చాలా ఇష్టం. ఎక్కువగా బయట తాగడానికే ఇష్టపడతాం. బయట కొన్న రుచితో ఇంట్లోనే ఫలూదాని చేసుకోవచ్చా?

- **నీలిమ,** కూకట్‌పల్లి

ప్ర & జ

వేసవిలో వేడి నుంచి ఉపశమనం కోసం సబ్జాగింజలు నానేసుకుని తాగుతాం. తెలుసుగా!.. సబ్జాగింజలు నల్లగా చూడ్డానికి ఆవాల్లా ఉండి నీటిలో వేస్తే తెల్లగా ఉబ్బుతాయి. వేసవిలో తలెత్తే అనారోగ్య సమస్యలకు ఊరటనిచ్చే ఈ సబ్జా గింజలతో చేసే పానీయాన్నే ఫలూద అంటారు. ఫలూదాలో సబ్జాగింజలతో పాటు సేమియాని ప్రధానంగా వాడతారు. సేమియా, సబ్జాగింజలు, పండ్లు, ఐస్‌క్రీం, పంటికింద చిత్రంగా నలిగే డ్రైఫ్రూట్స్ ఒకదానిపై ఒకటి పొరలుగా ఉండి తింటుంటే భలే మజాగా ఉంటుంది. అదే ఫలూద ప్రత్యేకత. దీనిలో రెండు రకాలుంటాయి. ఒకటి ఈ కాలంలో దొరికే తాజా పండ్ల ముక్కలు వేసి చేసేది. రెండోది పండ్లు లేకుండా ఆ ఫ్లేవర్లు మాత్రమే ఉపయోగించి సేమియా వేసి చేస్తారు. ఫలూద సేమియా అని బయట అమ్ముతారు. అది దొరక్కపోతే సన్నని సేమియాలు కానీ, ఇంట్లో దొరికే సేమియా కూడా వాడుకోవచ్చు. ఈ రెండు కాకుండా చిక్కని కాచిచల్లార్చిన పాలు, వెనిల్లా ఐస్‌క్రీం, డ్రైఫ్రూట్స్ దీని తయారి కోసం కావాల్సి ఉంటుంది. మీరు అడిగిన రోజ్ ఫలూద కోసం అయితే రోజ్‌సిరప్ అదనంగా కావాలి.

ఫలూద తయారీ:



సబ్జాగింజలని అరగంటపాటు నానబెట్టుకోవాలి. అలాగే సేమియాలని ఉడికించి పెట్టుకోవాలి. వీటిని మరీ ముద్దలా ఉడికించేయొద్దు. ఉడికించిన వెంటనే నీళ్లు వడకట్టి చల్లని నీటిని సేమియాలపై నుంచి ధారగా వదిలితే దేనికవి విడిపోయి పొడిపొడిగా తినడానికి బాగుంటాయి. పొడవాటి గాజు గ్లాసు తీసుకోవాలి. మొదట గ్లాసులో మామిడి, ద్రాక్ష, అరటి వంటి పండ్లముక్కలని సన్నముక్కలుగా తరిగి వేసుకోవాలి. దీనిపై చెంచాన్నర రోజ్‌సిరప్ వేసుకోవాలి. రోజ్‌సిరప్ మార్కెట్లో దొరుకుతుంది. తీపి ఎక్కువగా తినేవారు మరికొంచెం రోజ్‌సిరప్ వేసుకోవచ్చు. ఇప్పుడు రెండు చెంచాలు నానబెట్టిన సబ్జాగింజలు వేసుకోవాలి. కెలొరీల పరంగా బాలెన్స్ చేయాలనుకుంటే మూడుచెంచాల సబ్జాగింజలు వేసుకోవాలి. దీనిపై ఒక పొర ఉడికించిన సన్న సేమియాలు వేసుకోవాలి. దానిపై సన్నగా తరిగిన డ్రైఫ్రూట్స్‌ని చల్లుకోవాలి. ఆపై కాచి చల్లార్చిన పాలను పొరలు చెదిరిపోకుండా నెమ్మదిగా గ్లాసుకు ఒక పక్కన నుంచి పోసుకోవాలి. వీటితో 80 శాతం గ్లాసు నిండిపోతుంది. దీనిపైన రెడీమేడ్‌గా దొరికే వెనిల్లా ఐస్‌క్రీంని స్కూప్‌తో తీసి ఉంచాలి. ఆపై అందంగా కనిపించడం కోసం టూటీ ఫ్రూటీలు కూడా వేసుకోవచ్చు. రుచి గురించి ఇక ప్రత్యేకంగా చెప్పేదేముంది.

– శ్రీదేవి, హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణురాలు





వధువు కావలెను

యాదవ: 27, 5'9" MBBS, MD జనరల్ మెడిసిన్ చేస్తున్న సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. 9581635726 (A).

పద్మశాలి: 28, 5'10" MBBS MD జనరల్ మెడిసిన్ చేస్తున్న మంచి ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. Ph: 8142540968 (A).

కాపు: 26, 5'10" MBBS MD రేడియేషన్ అంకాలజిస్ట్ చేస్తున్న వెరీవెల్ సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. 8125210344 (A).

Kapu/ B.Tech, Bits/ 5'.8"/ 26/ 14L PA ★ B.Tech, IIT/ 5'.9"/ 25/ 24L PA ★ M.Tech/ NIT/ 5'.7"/ 25/ 15L PA ★ B.Tech/ 5'.9"/ 28/ SBI. శివరాంనాయుడు ✆ 98482 17771. (B)

Vysya/ B.Tech/ 5'.6"/ 24/ Bank PO ★ BEMS/ 5'.10"/ 26/ 120K/ 10 Cr. ★ B.Tech/ 5'.9"/ 27/ Infosis/ 10 Cr. ★ B.Tech, NIT/ 6'/ 28/ 18L PA. కస్తూరి మ్యారేజెస్ ✆ 99632 32758. (B)

Padmasali/ B.Tech/ 5'.7"/ 27/ ONGC/ 18 L PA ★ IRS/ 5'.9"/ 26/ Asst. Commissioner ★ M.Tech, IIT/ 5'.9"/ 28/ 18L PA. కస్తూరి మ్యారేజెస్. ✆ 81217 95786, 0866- 2438222. (B)

Velama/ B.Tech/ 5'.9"/ 28/ 14L PA ★ B.Tech/ 6'/ 27/ Bank PO ★ B.Tech/ BITS/ MS/ 5'.10"/ 28/ 120K/ 10 Cr. ★ B.Tech/ 5'.10"/ 29/ AEE, Govt. కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771. (B)

Mala/ B.Tech/ 5'.11"/ 26/ SBI ★ B.Tech/ 5'.11"/ 27/ LIC ★ Group-II/ 5'.10"/ 30 ★ M.Tech/ 5'.9"/ 30/ ONGC ★ B.Tech, IIT/ 5'.10"/ 27/ 12L PA. కస్తూరి మ్యారేజెస్ ✆ 99632 32758. (B)

Madiga/ M.Tech/ 5'.7"/ 28/ DRDO ★ B.Tech/ 5'.8"/ 25/ LIC ★ B.Tech/ 5'.11"/ 28/ HPCL ★ B.Tech/ 5'.7"/ 28/ BSNL ★ MS, Genl/ 5'.9"/ 29. కస్తూరి మ్యారేజెస్ ✆ 81217 95786. (B)

వైదికి వెలనాడు 52 వయస్సు, 5'10" ఫెయిర్ డైవర్సీ అయిన ప్రభుత్వ ఉద్యోగి జీతం లక్షాపది వేలు తగిన బ్రాహ్మణ వధువు కావలెను. ✆ 9100829445 (A)

రెండో పెళ్లి రెడ్డి 43 ప్రైవేట్ జాబ్ వరునకు డైవర్సీ, విడో, పేద, అనాథ, ఆశ్రమం వారెవరైనా 35 సం॥లలోపు వయసు గల వధువు కావలెను. ✆ 9908921725 (A)

Reddy/ B.Tech/ MS/ H1/ USA/ 25/6/ 160K/40Cr-(Prop) ★ B.Arc/ USA/ 25/6'/ 50Cr ★ 27/5'9"/ 50Cr ★ 30/ 5'7"/ 50Cr ★ Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309 (A)

Reddy/ Very Big Business/ For Property (Objection to Menction) V.Rich/ B.Tech/ MS/ 27/6' ★ Cont: K.C.Reddy-Hyd-Ph: 9849321309 (A)

Reddy/ MBBS/ Res-doc-USA ★ 28/6'/ 50Cr ★ 31/6' ★ 30/5'7" ★ 31/5'7" ★ 27/5'8" ★ 30/5'10"/ ★ Cont: K.C.Reddy-Mar-Bur-Hyd-Ph: 9849321309 / 9347807015

కాపు/ B.Tech, MBA/ C. Govt. J.T.O. (BSNL)/ 80,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886512010. (A)

కమ్మ/ B.Tech, MBA/ C. Govt. Asst. మేనేజర్ (HPCL)/ 80,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506. (A)

పద్మశాలి/ B.Tech, MBA/ C. Govt. A.E. (IOCL)/ 80,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678. (A)

గౌడ/ M.Tech/ C. Govt. కస్టమ్స్, ఎక్సైజ్ ఆఫీసర్/ 9.2 Lakhs P.A./ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9989450693. (A)

బెస్త/ M.Tech/ C. Govt. J.E. (రైల్వే)/ 80,000/- PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298. (A)

వెలమ/ B.Tech, MBA/ C. Govt. ఎలక్ట్రానిక్ ఇంజనీర్ (BHEL)/ 10 Lakhs PA/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014. (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతి స్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మాల/ కట్న ప్రసక్తి లేదు/ M.Tech/ C. Govt. క్వాలిటి కంట్రోల్ ఆఫీసర్ (FCI)/ 10 Lakhs PA/ 5'11" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9703794175. (A)

మున్నూరుకాపు/ M.Tech (IIT)/ Govt. A.E. (TS ట్రాన్స్‌కో)/ 75000/- PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885050879. (A)

ముదిరాజ్/ కట్న ప్రసక్తి లేదు/ B.Tech/ C. Govt. Asst. మేనేజర్ (రిజర్వ్ బ్యాంక్)/ 65000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. ✆ 9052296834. (A)

యాదవ 28 5'8 B.Tech, MBA 20L.p.a., 30 5'7" MBBS, PG 12L.p.a., వరులకు తగిన వధువు కావలెను. ✆ 98493 06274, 83748 25889.(I)

రెడ్డి/ 28/ 5'7"/B.Tech/ P.M- 60 వేలు. (6 కోట్ల ప్రాపర్టీ) / సాఫ్ట్‌వేర్ / CNB Very Urgent అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9849324378 (A)

CNB 45, 5'7" C.Govt, Employee, 70,000 PM, డైవర్సీ, పిల్లలు లేని వరుడికి వధువు కావలెను. 9676564376 (A)

కాపు 25 5'10" B.Tech SWE TCS 75,000/-PM వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయ కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. 9290022700 (A)

గౌడ (కట్నప్రసక్తి లేదు) 27/5'10" B.Tech/ SWE/ WIPRO 85,000/-PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9246964555 (A)

విశ్వబ్రాహ్మణ 29 5'9" M.Tech IIT సివిల్ సర్వేయర్ / C.Govt జాబ్ 1Lakh P.M. వరునికి సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువు కావలెను. 9866158793 (A)

కాపు (కట్నప్రసక్తి లేదు) 27/5'10" B.Tech/ SWE/ HCL 85,000/-PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9246555529 (A)

SC మాదిగ కట్నప్రసక్తిలేదు 29/5'11' M.Tech IIT, Asst. Ex.Eng. ONGC 1లక్ష P/M వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. అర్జెంటు ✆ 8019705648 (A)

కాపు (కుల/కట్న ప్రసక్తిలేదు) 2nd మ్యారేజ్ 29/5'10" B.Tech/ SWE/ TCS 95,000/-PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9246171703 (A)

బ్రాహ్మణ/ రెండవపెళ్ళి/ 35/ 5'8"/ B.Tech/ MNC/ 14 Lakhs. P.A/ Hyd/ వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. చదువు ప్రసక్తిలేదు. ✆ 8309527614/ 9676812525 (A)

విశ్వబ్రాహ్మణ/ 30/ 5'8" B.Tech (CSE), VIT/ SWE/ 9L. P.A. వరునికి తగిన డిగ్రి/ PG వధువు కావలెను. ✆ 9676812525 (A)

బ్రాహ్మణ/ 25/ BITS/ 12L ★ 29/ B.Tech/ MBA/ MNC/ 22L ★ 27/ B.Tech/ (IIT)/ MS (US) $ 120K ★ 31/ B.Tech/ Govt/ 28/ MBBS/ MS ★ 8555024711 (A)

కుమ్మరి: CA/ చార్టర్డ్ అకౌంటెంట్, 80,000/- pm, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

పద్మశాలి: B.Tech, Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఎలక్ట్రికల్ Dept., 40,000/- pm, 5'10" ఎత్తు, 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9908222406 (A)

రజక: M.Tech, IIT, SWE, 1 Lakh PM, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

ముదిరాజ్: M.Tech, Govt. Asst. ఇంజనీర్, ఇరిగేషన్ Dept., 50,000/- pm, 6' ఎత్తు, 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

బెస్త, గంగపుత్ర, M.Tech, C.Govt., ఎలక్ట్రికల్ ఇంజనీర్, రైల్వేస్, 65,000/- pm, 5'11" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

యాదవ: B.Tech, MBA, C.Govt. Sr. ఇంజనీర్, BHEL, 1 Lakh P/M, 5'10" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007652 (A)

గౌడ: B.Tech, C.Govt, సైంటిస్ట్, DRDL, 72,000/- pm, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007918 (A)

కమ్మ 15 కోట్ల ప్రాపర్టీ 28, 6', B.Tech, MBA, SWE, TCS, 1 లక్ష P/M వెల్ సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. అర్జెంట్ ✆ 9666567123 (A)

వైశ్య కట్నప్రసక్తిలేదు 29/ 5'11", Fr. B.Tech, MBA, SWE అమెజాన్ 1 లక్ష P/M వెల్ సెటిల్డ్ వరుడికి అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువు కావలెను. ✆ 9533855373 అర్జెంట్ (A)

SC మాదిగ హిందూ 30/ 5'8", M.Tech/ NMDCలో సెంట్రల్ Govt లో అసిస్టెంట్ మేనేజర్, 1,50,000/- PM. వెల్‌సెటిల్డ్ హ్యాండ్‌సమ్ వరునికి వధువు కావలెను. 8712865419 (A)

రెడ్డి 26/ 5'9", MS/ USA. Green Card Holder/ 60 Cr/ SWE/ USA/ Fair వరునకు తగిన Good Family వధువు కావలెను. Ph: 9949877738 (A)

రెడ్డి 1989/5'11" B.Tech/ MBA/ Business/ 80Cr/ Hyd ★ 1985/6', MBBS/ Residency 1st Year/ USA ✆ 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1989/ 5'11", B.Tech/ MS/ Australia P.R/ 25Cr. ★ 1990/ 5'11", B.Tech/ MS/ 100K. నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో, ✆ 9848221166/ 9505551788 (A)

SC మాల హిందూ 32, B.Tech/ SWE/ 12L PA ★ 30/B.Tech/ 90,000/-PM/ Govt. ఆఫీసర్. వరులకి వధువు కావలెను. (కట్నప్రసక్తి లేదు) ✆ 8897263011 (A)

CNB/ 47/B.Com/5'10" Fair/ S.Govt. Job/ Own House/ Late Marriage, తగిన వధువు కావలెను. No Brokers ✆ 9908506506 (Hyd) (A)

ఆమె తల్లి.. ఆయన తండ్రి!

జానకి దోసిట కెంపుల ప్రోవై.. కెంపుల ప్రోవై
రాముని దోసిట నీలపురాశై.. నీలపు రాశై
ఆణిముత్యములు తలంబ్రాలుగా
ఆణిముత్యములు తలంబ్రాలుగా
శిరముల మెరిసిన
సీతారాముల కల్యాణము చూతము రారండీ
శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండీ



శ్రీరామనవమి సందర్భంగా ఊరూవాడా ప్రతి పందిట్లో వినిపించే పాట ఇది. అందరినీ ఆసాంతం మాధుర్యప్రవాహంలో తేలియాడించే మనోహరగీతమిది.

ఆదర్శ దంపతులు అనగానే మొదట భారతీయులకు గుర్తొచ్చేది సీతారాములే! సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకాము రామచంద్రా అన్నాడు కంచెర్ల గోపన్న.

సీతాదేవి అందరికీ అమ్మే! అందుకే 'సీతమ్మ' అన్నాడాయన. ఆమె అమ్మ అయితే శ్రీరాముడు మనకు 'అయ్య' కదా! ప్రతిస్త్రీని అమ్మగానూ ప్రతి పురుషుడినీ అయ్యగానూ గౌరవించే సంస్కృతి మనది. ఏ మగపేరుకైనా అయ్య అనీ, ఆడపేరుకు అమ్మ అని జతచేయడం తెలుగువారికి తరతరాలుగా పెద్దలు అందించిన ఉత్తమ సంస్కారం. ఈ తరానికి నాజూకుగా ఉండక పోవచ్చుగానీ ఇప్పటికీ కృష్ణను 'కృష్ణయ్య' అనీ, రాధను 'రాధమ్మ' అనీ పార్వతిని 'పార్వతమ్మ' అని గ్రామీణ ప్రాంతాలలో పిలవడం అందరికీ తెలిసిందే.

సీతారాములు కలసి ఉన్న కాలం కంటే విడిగా ఉన్న కాలమే ఎక్కువ అన్పిస్తుంది. ఆ లెక్కన వారెందుకు ఆదర్శ దంపతులు అయ్యారనే ప్రశ్న వస్తుంది. చేరువలో లేకున్నా ఒకరి తలపులో ఒకరు వారు ఎల్లవేళలా ఉన్నారు. ఒకరినొకరు పరిపూర్ణంగా అర్థం చేసుకున్నారు. ఒకరికోసం ఒకరు జీవించారు. వారిది ఆత్మాగతానుబంధం. వారి నడుమ కలిగిన ఎడబాటైనా లోక కల్యాణం కోసమే తప్ప ఒకరిపై ఒకరు క్రోధంతోనో ద్వేషంతోనో జరిగింది కాదు. స్వార్థంకోసం, సంతానం కోసం జనాన్ని గాలికొదిలేసే పాలకులున్న ఈ కాలంలో ప్రజలకోసం భార్యనే విడనాడాడు రామచంద్రుడు. రాజ్యభారం తమ్ముళ్లు వహిస్తే తాను సీతతో కలిసి తిరిగి వనాలకు వెళ్తానన్నాడాయన. కానీ వారెవరూ ముందుకు రాకపోవడంవల్లే ఆయన భార్యను త్యజించాల్సి వచ్చింది. కేవలం ఒక్కడంటే ఒక్కడు నిందించినంత మాత్రాన అలా చేయాలా అని వాదిస్తారు కొందరు. దేశమంతా వద్దుపొమ్మన్నా కుర్చీలను వదలని నేతలను చూస్తున్న మనకు ఇది వింతగానే ఉంటుంది. నూటికి నూరుశాతం ప్రజానీకానికి తన పాలన నచ్చాలనేది రామయ్యతండ్రి ఆలోచన.

రాజులు, చక్రవర్తులు వందలమంది భార్యలతో కొనసాగుతున్న ఆ కాలంలో మానవాళికి ఏకపత్నీవ్రతాన్ని ఆచరించి చూపినవాడు శ్రీరాముడు. తన తండ్రి పినతల్లికిచ్చిన మాటను దృష్టిలో పెట్టుకుని అందివచ్చిన సింహాసనాన్ని అవతలకు నెట్టి అరణ్యమార్గం పట్టాడాయన. భర్త వద్దంటున్నా కూడా ఆయన వెంటే నడిచింది సీతమ్మ. అడవైనా భర్త ఉన్న తావే తనకు అంతఃపురమని పలికిందామె.

సీతమ్మ నాగేటిచాలులో జనకమహారాజుకు లభించింది.. కనుకనే ఆమెపేరు సీత అయింది.

యజ్ఞపురుషుడి కటాక్షంతో దశరథ మహారాజుకు జనించాడు శ్రీరామచంద్రుడు.

ఇద్దరూ పెద్దల మాటను ఏనాడూ కాదనలేదు. గురువుల ఆదేశాల్ని తోసిపుచ్చలేదు. సహనాన్ని కోల్పోలేదు. తోబుట్టువులను అసూయాద్వేషాలతో చూడలేదు.

'అమ్మా నీకోసం స్వయంవరం సిద్ధం చేస్తున్నాను' అని తండ్రి పలకగానే అంగీకారాన్ని తెలియచెప్పిందే తప్ప వితర్కించలేదు జానకి.

యజ్ఞపరిరక్షణానంతరం విశ్వామిత్రులవారు 'రామా జనకమహారాజు తమ కుమార్తెకోసం స్వయంవరం సిద్ధం చేశారట.. విదేహ రాజ్యానికి వెళ్లి ఆ వేడుక చూద్దాం..' అనగానే మారుమాటాడకుండా ఒప్పుకున్నాడు శ్రీరామచంద్రుడు. శివధనుర్భంగం జరిగింది. రాముడి అజేయపరాక్రమం లోకానికి తెలిసింది. సీతారాములు దంపతులయారు. ఆదర్శ జంటగా నిలిచారు.

పెద్దలను గౌరవించడం, బాధ్యతగా మెలగడం, సహనంగా ఉండడం, పరస్పరం ప్రేమానురాగాలతో గడపడం, పరిపూర్ణ విశ్వాసంతో ఒకరికొకరుగా ఉండడం వంటి లక్షణాలు నేటి నవదంపతులు సీతారాముల జంటనుంచి అలవరచుకోవాలి.

(శ్రీరామనవమి సందర్భంగా)

- సీపీ

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

Brahmin 6N 40-Y 5'.5" Bhardwaja Gothram, Practising CA at Vizag well settled seeks Compatible Bride from Traditional Brahmin Family Subsect Nobar. ✆ 8977899909/ 9890034229. (C)

Cosmopolitan Bride Wanted well Educated, Mature, Tall, Good Looking below 37xRS, without issues from cultured Telugu upper, Middle Class Family for Tall, Fair, Handsome PMT Commission Indian Navy Ofcr, Earlyforties, Legally DVC, well to do Naidu Family, Req Contact with full Details, PIC, EMail Whatsapp only. ✆ 7731914771. (C)

USA/ కమ్మ, 28Y, 5'.11", Fair, MS, 120K, H1B, 4 Cr. ★ 29Y/ 6', MS, 150K, H1B వీసా, 10 Cr.కి తగిన వధువు కావలెను. ✆ 73863 38574. (B)

బ్రాహ్మణ/ లేట్‌మ్యారేజ్/ 40 Yr/ కాశ్యపస/ 5-11/ సొంత బిజినెస్/ వెల్‌సెటిల్ వరునకు/ 10th to Degree బ్రాహ్మణ వధువు కావలెను. No Brokers ✆ 9573908795. (A)

కాపు/ బలిజ: 27Y/ 5'9"/ B.Tech (ECE)/ S/W in Banglur/ 14 Lakhs P/A/ 4 Cr property ఉన్న వరునికి తగిన వధువుకావలెను. 93909 14215 (D)

క్షత్రియ, 28, 5'10", V.Fair, B.Tech, IIT, MBA, ISB, MNC, B'lore, 20 LPA, 10 Crores వరునికి వధువు కావలెను. 93944 66119 (D)

Kamma 28Yrs. 5'.9" Handsome, Charted Accountant Vizag seeks Educated Bride from good Family (CNB) Cont: ✆ 7989223446. (C)

Velama 29/5'.8" B.Tech NTPC (A.M) 27/5'.10" B.Tech, MBA, I.O.C.L., 30/5'.9" M.S. USA 31/5'.8" M.S (G.S) 28/5'.9" MBA IIM Cont: ✆ 9246670571, 9848190571. (C)

తమిళ స్మార్త బ్రాహ్మణ 16.3.1972 M.Tech Professor, Engg College 50,000 PM భాషశాఖా పట్టింపులు లేదు. Mob: 09980602083. (E).

డైవర్సీ/ కాపు/ 32Yrs/ 5'10"/ B.Tech-SWE, 28 Lakhs P/A అందమైన వరుడికి తగిన నవ వధువు కావలెను. ✆ 9676627686, 9482007015 (వాట్సప్) (A)

★ ★ ★

O.C. కులపట్టింపులేని డిగ్రీ చదివి, ఖమ్మంలో హోటల్ బిజినెస్ చేస్తున్న 32 సం॥గల వరుడుకు అందమైన డిగ్రీ చదివిన వధువు కావలెను. ✆ 9848166434, 9008539393. (C)

వైశ్య/ 31 Yrs/ Govt. Teacher/ 5' 6", 40K/PM గల అబ్బాయికి, వైశ్య/OC/BC కులం గల వధువు కావలెను. సంప్ర: 90327 05090 (N).

వైశ్య, 29, ఎరుపు, 5.6, M.Sc, M.Ed, D.Ed లెక్చరర్, 40 వేలు అబ్బాయికి వైశ్య అమ్మాయి కావలెను. ఇల్లు, 3 ఎ॥ భూమి, డైరెక్ట్. MIG 9, మునుగోడు, నల్గొండ. ✆ 96184 18981.

గౌడ్, 2వ పెళ్ళి, కులపట్టింపు లేదు, Govt.Job వరునికి B.C 1వ/ 2వ వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ 91778 12839, 83095 77508.

రెడ్డి (కట్నప్రసక్తిలేని) 40, 5'6" B.Pharma Job Pharmacist well Educated family (క్యాస్ట్ నోబార్) వధువు కావలెను. ✆ 7702278534/ 040- 40042253 (A)

కురుమ లేట్‌మ్యారేజ్ 40Y 5'6" ప్రైవేట్ జాబ్ Cast No Bar వరునికి తగిన వధువు కావలెను. సంప్రదించండి: 9652468667. (A)

★ ★ ★

కమ్మ/ 40, 5'8" డిగ్రీ బిజినెస్ ఆయిల్ కంపెనీ 24 లక్షలు PA, 3 కోట్లు ప్రాపర్టీ తగిన వధువు కావలెను. 1/ 2 వ మ్యాచ్ నోబార్ ✆ 7660003534 (A).

కమ్మ 41 5'10" Very Handsome BE, MS 400K Above 50 Crs, డైవర్సీ వరునకు కట్న ప్రసక్తిలేని వధువు కావలెను. ✆ 95422 44627.(I)

డైవర్సీ: కమ్మ / 42/ 5'7"/ Software ఒంటిరికి ఏబాధర బందీలేని ఒంటరి 25-40 సం॥ మధ్య ఉన్న వధువు కావలెను. ✆ 9703551199 (A)

బిజినెస్ కులపట్టింపులేదు. 40 Yrs/ 5'7" ఒంటరి 2వ పెళ్ళిగల వరునికి తగిన సాంప్రదాయంగల వధువు కావలెను. డైరెక్ట్. ✆ 9393218489 (A)

డివోర్స్ కాస్ట్ నో బార్ 42/ 5'6"/ చామనఛాయ/ డిగ్రి/ MNC Job/ 45 వేలు Own House Hyd Settled కి కుల పట్టింపులేని వధువు కావలెను. ✆ 6300056418 (డైరెక్ట్) (A)

CNB, లేటుమ్యారేజ్, 50/ 5'4"/ ఓన్ బిజినెస్/ 30,000/-PM గల వరునికి తగిన వధువు కావలెను. Ph: 7286996739 (A)

మున్నూరుకాపు: 26, B.Tech/ IIT/ IIM ఢిల్లీ పేరెంట్స్, డాక్టర్స్, well-to-do, ఫ్యామిలీ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9346344474/ 7702346670 (A)


క్షత్రియరాజులు/ 42 సం./ డైవర్స్/ 1 పాప/ బిజినెస్ 40 వేలు P.M; మంచి ఆస్తి కలిగిన వరుడుకు తగిన వధువు కావలెను. ✆ 97040 72239. (B)

పద్మశాలి 34/ 5'9"/ 1 Cr/ MBA/ ప్రస్తుతం Hydలో జాబ్, వచ్చే నెల కెనడా వెళ్తున్న అందమైన వరుడికి ఏదైనా PG చేసే వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. 8885441133. (A)

బ్రాహ్మణ 40/ 5'6"/ MBA, MCA/ SWE బెంగుళూరులో 1 లక్ష P/M సంపాదిస్తున్న వరుడుకి పేద కుటుంబం వధువు కావలెను. Ph: 9948666645. (A)

విశ్వబ్రాహ్మణ/ డైవర్సీ / 44Yr/ 5'7"/ డిగ్రీ / 30K PM వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ కలిగిన వరునికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ Ph: 9059081941 (A)

కాపు 34/5'6", PG/ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెలకు లక్ష జీతం, కోటి ఆస్థి కల వరుడుకు మొదటి/ రెండవ వధువు కావలెను. కట్న ప్రసక్తిలేదు. డైరెక్ట్: 9491576523 (A)



వరుడు కావలెను

కమ్మ: 25, 5'5" MBBS MS గైనిక్ చేస్తున్న అందమైన మంచి ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. 9494038601 (A).

గౌడ: 25, 5'3" MBBS, MS గైనిక్ చేస్తున్న అందమైన సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. 8125210356 (A).

SC క్రిస్టియన్: 26, 5'4" MBBS, MD సూపర్ స్పెషాలిటి చేస్తున్న సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. 9494038701 (A).

హిందూ-మాల 5'.5", 27 Years, M.Tech J.E సెంట్రల్ గవర్నమెంట్. సంప్ర॥ మాల, మాదిగ వివాహముల కొరకు. ఉలవపాడు - 89858 72097. Email: dasarimarriagebeauro2018@gmail.com (J)

Velama/ B.Tech/ 5'.6"/ 22/ CTS ★ B.Tech/ 5'.3"/ 25/ IBM ★ CA/ 5'.3"/ 25/ Bank PO ★ BDS/ 5'.3"/ 23/ 50L ★ MBBS/ 5'.3"/ 23/ 4 Cr. కస్తూరి మ్యారేజెస్ ✆ 98482 17771, 0866- 2433788. (B)

Mala/ B.Tech/ 5'.6"/ 24/ Andhra Bank ★ B.Tech/ 5'.5"/ 23/ Accenture ★ M.Tech, IIT/ 5'.5"/ 25/ 10L PA ★ MS, ENT/ 5'.3"/ 25. కస్తూరి మ్యారేజెస్ ✆ 99632 32758. (B)

Madiga/ B.Tech/ 5'.3"/ 24/ Andhra Bank ★ B.Tech/ 5'.4"/ 25/ BSNL ★ B.Tech/ 5'.4"/ 24/ Wipro ★ MD, Genl/ 5'.3"/ 26 ★ MBBS, DGO/ 5'.5"/ 25. కస్తూరి మ్యారేజెస్ ✆ 81217 95786. (B)

Kapu/ CA/ 24/ MNC/ 10 Cr. ★ B.Tech/ 5'.5"/ 23/ Infosis/ 1 Cr. ★ BEMS/ 5'.4"/ 23/ 5 Cr. ★ BEMS/ 5'.4"/ 26/ 100K/ 2 Cr. ★ MS, Gynec/ 5'.4"/ 25. శివరాంనాయుడు ✆ 98482 17771. (B)

Vysya/ B.Tech/ 5'.3"/ 24/ Accenture ★ B.Tech/ 5'.3"/ 22/ Infosis ★ B.Tech/ MBA, IIM/ 5'.4"/ 23/ 14L PA ★ B.Tech/ 5'.3"/ 22/ 10 Cr. కస్తూరి మ్యారేజెస్ ✆ 99632 32758. (B)

Padmasali/ B.Tech/ 5'.5"/ 23/ Infosis ★ B.Tech/ 5'.4"/ 23/ IBM ★ B.Tech, MBA, IIM/ 5'.3"/ 25/ 18L PA ★ CA/ 5'.5"/ 24 ★ BDS/ 5'.4"/ 25/ 1 Cr. కస్తూరి మ్యారేజెస్ ✆ 81217 95786. (B)

ఆర్యవైశ్య, 23, 5'4", 15 లక్షలు & 29, 5'3", 20 లక్షలు, రెండోపెళ్లి, 34, 5'3", 45 లక్షలు & 41, 5'2", Govt, 55 లక్షలు. జి.సుప్రజా గుప్తా "మా సేవ" ✆ 9493163996 (A)

Reddy/ Rich Family/ Now in Hyd/ B.Tech/MS/ Most Beautiful/ 25/5'6"/ 50Cr+/ Needs-India Well Settled/ Cont K.C.Reddy-Hyd-Ph: 9849321309 (A)

Reddy/ Reddy/ Big Industrialist/ B.Tech/MBA/ 27/5'8"/ 50Cr+More ★ MBBS/ 22/5'5"/ 30Cr ★ Cont: K.C.Reddy-Mar-Bur-Hyd. Ph: 9849321309 / 9347807015 (A)

Reddy/ B.Tech/ BITS/ MBA(USA)/H1/200K 30/5'5"/ 15Cr-(Prop) ★ 29/5'3"/ 200K ★ 28/5'4" ★ 27/5'2"/110K ★ Cont: K.C.Reddy-Hyd Ph: 9849321309 / 9347807015 (A)

కమ్మ/ 27/ 5'7"/ B.Tech, MS/ USA/ SWE/ 90K/ 25 Cr. ప్రాపర్టి Fair/ చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8500864134. (A)

మాదిగ/ B.Tech/ Govt. Sr. Asst. (రెవెన్యూ Dept.)/ 60,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9642459724. (A)

పద్మశాలి/ ఏకైకకుమార్తె/ 3 Cr. ఆస్తి/ వెల్‌సెటిల్డ్/ B.Tech/ C. Govt. క్యాషియర్ (SBI)/ 28,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886957298. (A)

చౌదరి విడో, 35 సం॥, 5'4" MBA, ఫుల్‌ఫెయిర్ సొంత షాపింగ్ కాంప్లెక్స్, 3 లక్షల ఆదాయం, పిల్లలు లేరు, కుల పట్టింపులేదు, 26 కోట్ల ఆస్తిగల అందమైన వధువుకు 1,2 వరుడు కావలెను. WhatsApp 83417 30029.(I)

రెడ్డి, B.Tech, C.Govt. AE (రైల్వే) 35,000/- pm, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014 (A)

కుమ్మరి, B.Tech, C.Govt. అకౌంటెంట్ (BHEL), 25,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9989450693 (A)

గంగపుత్ర (బెస్త) B.Tech, Govt. బ్యాంక్ PO (ఆంధ్రా బ్యాంక్), 35,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7288048678 (A)

మాదిగ, B.Tech, Govt. Jr. Asst. (పంచాయతీరాజ్ Dept) 28,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886512010 (A)

గౌడ, B.Tech (IIT), Govt. AE (TS జెన్‌కో) 45,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9703978131 (A)

రజక, B.Tech, Govt. Jr. Asst. (RWS), 25,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

చౌదరి, 24 సం॥, 5'5", B.Tech, ఫుల్‌ఫెయిర్, ఒకకుమార్తె, 8 ఎకరాల మాగాణి, Hydలో సొంత గ్రానైట్ బిజినెస్ 18 కోట్ల ఆస్థిగల అందమైన వధువుకు Job & బిజినెస్ చేసే వరుడు కావలెను. WhatsApp 89851 08199.(I)

ముస్లీం/2వ పెళ్ళి /48Y/ఫెయిర్/H: 5.2" ఎడ్యుకేటెడ్ గల పిల్లలులేని వధువుకు చదువుకున్న సెటిల్డ్ వరుడు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ ✆ 94946 73860 (M)

గౌడ, 29 సం॥లు, B.Tech, 60 వేలు, ఎరుపు, 5'.4", 1 కోటి ఆస్తి, అందమైన సంప్రదాయ వధువుకు తగిన వరుడు కావలెను. గౌడ సంపన్నుల వివాహ వేదిక - 96425 77386. (G)

కమ్మ ప్రత్యేకం 25/B.Tech 5 Cr, Ind/ B.Tech MS USA అందమైన వధువులకు వరుడు కావలెను. సంప్ర/శారద: 9849413031 (A)

వైశ్య/ 22Y/ 5'4", B.Tech/ SWE/ 375k, PA/ అందమైన వధువుకి/ తగిన బిజినెస్ or Job/ వరుడు కావలెను. 9059158811 (A)

కాపు 26Y 5'5" B.Com అందమైన వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. బిజినెస్ or జాబ్ ok. 8978691424/ 040-48542181 (A)

పద్మశాలి, డైవర్సీ, 32, 5'4" గౌటి, జాబ్, 45K, 2 Cr ఆస్తి గల వెల్‌సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపులేదు. 8522011967/ 8522000858 (A)

కమ్మ 25 5'3" Fr B.Tech SWE Infosys 50,000/- PM సాంప్రదాయ కుటుంబానికి చెందిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. 9618483383 (A)

రజక 24/5'5" B.Tech/ SWE/ IBM 35,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246333320 (A)

రెడ్డి/ కులపట్టింపు లేదు 24/ 5'5" B.Tech (ECE)/MS (USA)/ SWE 6Cr ప్రాపర్టీగల అందమైన వధువుకు OC/BC వరుడు కావలెను. 8019864386 / 9032906177 (A)

విశ్వబ్రాహ్మణ 24/5'5"/B.Tech/ SWE/ USA/ IBM 4 లక్షలు PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246151501 (A)

హిందూమాల/ కుల పట్టింపులేదు డైవర్సీ 32/5'2" M.Sc.,B.Ed/Govt టీచర్ 30,000/-PM Hydలో ఓన్‌హౌస్ గల ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. వాట్సాప్ - 9550296562 (A)

కమ్మ 24/5'5" B.Tech/ SWE/ TCS 40,000/- PM 8Cr ప్రాపర్టీగల అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246964555 (A)

బ్రాహ్మణ/ 19/ 5'3"/ 9th ★ 22/ 5'4"/ 10th ★ 25/ 5'3"/ 7th వధువులకు మంచి కుటుంబం వరులు కావలెను. పూజారి అయినా Ok. ✆ 7674078296/ 8106446865 (A)

బ్రాహ్మణ/ 22/ B.Com/ ★ 25/ B.Tech/ 3L ★ 23/ CA/ Wkg ★ 27/ 5'4"/ B.Sc/ 2L ★ 26 B.Tech MS (US)/ SWE/ ★ 24/ MBBS/ ★ 9494096081 (A)

వెలమ: 20 లక్షల ఆస్తి, B.Tech, SWE, 50,000/- pm, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9908222406 (A)

రజక: B.Tech, Govt. Asst. ఇంజనీర్, R&B, 50,000/- pm, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

అగ్నికుల క్షత్రియ: B.Tech, Govt. Asst. ఇంజనీర్, ట్రాన్స్‌కో, 45,000/- pm, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

వడ్డెర: B.Tech, C.Govt. క్యాషియర్, SBI బ్యాంక్, 30,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

వాల్మీకిబోయ: B.Tech, C.Govt. అకౌంటెంట్ ఆఫీసర్, ఇన్‌కమ్ ట్యాక్స్ Dept., 45,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

పద్మశాలి, 3 డిగ్రీస్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయ్ 20,000/- (P/M) 5'.5" ఎత్తు 58 సం॥ ఫెయిర్‌గా వున్న వధువుకు తగిన వరుడు కావలెను. Cast Nobar. ✆ 9703506513. (C)

కులపట్టింపులేదు/ రెడ్డి/ 45/ 5'4"/ MA, B.Ed (HM). Govt టీచర్ 75K (PM), ఫెయిర్ ప్రాపర్టీస్ ఉన్న అందమైన వధువుకి వరుడు కావలెను. (లేట్ & 2nd మ్యాచ్ ok) 8897587747 (A)

కులపట్టింపులేదు బ్రాహ్మణ/ 22Y/ 5'4"/ 1st మ్యాచ్/ ఇంటర్/ ఫెయిర్/ సొంత ఇల్లు కల్గిన అందమైన వధువుకి వరుడు కావలెను. (1st/ 2nd మ్యాచ్ ok) సంప్ర॥ 8897587959 (A)

కమ్మ/ విడో/ 30Y/ 5'4"/ ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్/ 16 కోట్ల ప్రాపర్టిగల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ✆ 9515337427 (A)

రెడ్డి/ డైవర్సీ/ 28Y/ 5'3"/ గ్రానైట్ బిజినెస్/ 15 కోట్ల ప్రాపర్టిగల అందమైన వధువుకు, కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9010168909 (A)

Yadava, Divorced, 29/ 5'6" MS/ US/ Machilipatnam/ 9440831748 ★ 29/ 5'5", B.Tech/ Qualicum/ Vijayawada/ 9441735157 ★ 27/ 5'5"/ B.Tech/ IOB Bank (Guntur/ 9440759945 (A)

రెడ్డి 1995/ 5'6" MBBS/ Fair & Rich ★ 1993/ 5'4", B.Tech/ 4.5L. P.A/ 6Cr. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో ✆ 9848221166/ 9505551788 (A)

రెడ్డి, 1990/ 5'4", B.Tech/ MS/ US/ 75K/ Fair ★ 1994/ 5'6", B.Tech/ SWE 4L. P.A/ V.Fair నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1989/ 5'4 1/2, B.Tech/ MS/ US/ V.Fair & Rich ★ 1992/ 5'3" B.Tech/ MS/ US, నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో ✆ 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1990/ 5'5", MBBS/ MS (OBG) 2nd Year/ V.Fair ★ 1990/ 5'4", B.Tech/ SWE/ 6L. P.A/ V.Fair ✆ 9848221166/ 9505551788 (A)

బ్రాహ్మణ /28, 5'4" గౌతమస గోత్రం B.Sc ప్రైవేట్ జాబ్ రిక్రైర్‌మెంట్ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ Pvt, Govt Job & పురోహితం అయినా OK. ✆ 7285997452, 8187000164 (A)

కాపు, 2వ పెళ్ళి, 28, B.Tech/ SWE అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. Cont: 7780300068 (కులప్రసక్తి లేదు) (A)

కాపు, 24/5'4", B.Tech/ SWE, విప్రో, Hyd, నెలకు 50,000/- జీతం గల సాంప్రదాయమైన వధువుకు తగిన వరుడు కావలెను. (Govt/ SWE/ డాక్టర్స్ ✆ 8978799956 (A)

రెడ్డి, 24/5'4", B.Tech/ SWE/ Infosys/ Hyd. నెలకు 50,000/- జీతంగల చాలా అందమైన ఫేర్, ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. (అర్జెంట్) 9059098156 (A)

USA/ కమ్మ, 32Y, 5'.4", Fair, MS, 85K, H1B వీసా ఆఫర్. మిడిల్‌క్లాస్ వధువుకి USA కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574. (B)

రాజమండ్రి, సూర్యవంశ క్షత్రియరాజులు, 45Y., ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్, విడో, పిల్లలు లేరు. సొంత ఇల్లు, 34 ఎ. పొలంకల మహిళకు వరుడు కావలెను. ✆ 70953 36641. (B)

S.C.Hindu Mala MCA 34 Yrs 5'.3" fair Vizag looking for suitable Profile from Hindu Family. No Brokers. ✆ 9007589581, 9502092060. (C)

క్షత్రియ, 26, 5'3", వైట్, బి.టెక్, MBA, SWE, MNC, 4 L.P.A, Well settled వధువుకి వరుడు కావలెను. 0877 2230289, 76610 24447 (D)

చౌదరి – కమ్మ, 25, 5'4", వైట్, బి.టెక్, SWE, TCS, 5 L.P.A, 10 Cro. వధువుకి వరుడు కావలెను. 73961 57727, 79010 12671 (D)

రెడ్డి, లేట్‌మ్యారేజ్ 30 Y, 5'.5" ఫెయిర్ B.Tech, సొంత వ్యాపారం కోట్ల ఆస్తి, ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 7396896673. (C)

కమ్మ, డైవర్సీ: 34Y/ 5'8"/ Mech Engineer/ Project Engineer/ 1.8 L P/M well settled వరునికి తగిన వధువు కావలెను. 93461 24845 (No Dowry) (D)

కమ్మ, డైవర్సీ: 34Y/ 5'6"/ MBBS/ PG (Cardiologist) NRI Hospital/ 1.20 Lakh P/M/ 5 Cr. property ఉన్న వధువుకు తగిన వరుడు కావలెను. 93461 24845 (D)

పద్మశాలి: 24 Y/ 5'5"/ V.Fair/ B.Tech (ECE)/ S/W in Infosys/ 50,000 P/M/ well settled వధువుకి తగిన వరుడు కావలెను. 93938 63645 (D)

కమ్మ: 25Y/ 5'5"/ B.Tech (IT)/ S/W in Hyd/ 9 Lakhs P/A/ 5 Cr. pro. ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97045 66499 (D)

రెడ్డి: 24Y/ 5'4"/ B.Tech (CSE)/ S/W in Deloitte/ 7 Lakhs P/A/ well settled ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97041 88499 (D)

రెడ్డి, 5'6", V.Fair, B.Tech, Wipro, B'lore, 8 LPA, 20 Cr. property ఉన్న వధువుకు తగిన వరుడు కావలెను. 93966 55166 (D)

★ ★ ★

మాల హిందూ: A:24, Ht. 5.5", B.Tech, GHMC, A.E.E; A:27, Ht.5.3", B.Tech (IIT) DRDO Scientist Sal : 14 లక్షలు, 78930 13265 (N).

పద్మశాలి 28 Yrs, 5'2" MA, B.Ed., Govt టీచర్ 50,000/- PM గల వధువుకి Govt Job గల వరుడు కావలెను. Contact: 9490617148 (A)

★ ★ ★

డైరెక్ట్ బలిజకాపు, 24 సం॥లు, 5'4" ఎత్తు, Fair, M.Tech, TCS, SWE, అందమైన వధువుకు తగిన FC or OC ఇంటర్‌క్యాస్ట్ వరుడు కావలెను. ✆ 9346086399 (A)

విశ్వబ్రాహ్మణ 33 5'2" ఫెయిర్ డైవర్సీ పిల్లలు లేని అందమైన వధువుకు పిల్లలు లేని వెల్‌సెటిల్డ్ విశ్వబ్రాహ్మణ వరుడు కావలెను. డైరెక్ట్ 9247372131/ 9100184393 (A)

కాపు/ 33/ 5'4"/ B.Tech/ Fair/ 3 Cr ప్రాపర్టీ/ 50,000/- PM/ అందమైన వధువుకి వరుడు కావలెను. Contact: 7396558669 (A)

2వ పెళ్లి డైవర్సీ కాపు 5'2" 55 Yrs Pvt. జాబ్ ఏ బాదరబందీలేని వధువుకు కమ్మ, కాపు, రెడ్డి S/C, Govt. Pen. వరుడు కావలెను. ✆ 9000792592/ 7780162473 (A)

మున్నూరుకాపు: 24/ 5'5" V. ఫెయిర్ B.Tech/ MBA, Well-to-do పేరెంట్స్ బిజినెస్, గుడ్‌ఫ్యామిలీ వధువుకి తగిన వరుడు కావలెను. 9346344474/ 7702346670 (A)

SC మాల 25 5'5" ఫెయిర్ B.Tech MS/US work in USA వెల్‌సెటిల్డ్ వధువుకు (ఓన్లీ US/ NRI) వరుడు కావలెను. 8125777297/ 9885754039 (A)

గంగపుత్ర బెస్త 29/ 5'4" M.Sc చేసిన Pharmacyలో జాబ్ జీతం 30,000 P/M వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. No బ్రోకర్స్. ✆ 8897091964. (A)

గౌడ 27/ 5'2" B.Tech/ MBA, 2 కోట్ల ఆస్తిగల Fair అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. గౌడ్ మ్యారేజ్ బ్యూరో ✆ 9440454842 (A)

Divorce Goud 37Yrs 5'3" Settled in Newzeland with Permenent Resident Status Interested May Contact ✆ 9848055569 (A)

ఆర్యవైశ్య అందమైన అమ్మాయి వెరీఫెయిర్ 21Y/5'4"/ డిగ్రీ మంచి కుటుంబానికి చెందిన జాబ్/ బిజినెస్ వరుడు కావలెను. అమ్మాయికి తగిన ఆస్తి డైరెక్ట్ ✆ 8790060297 (A)

కాపు 25/ 5'3"/ 1 Cr./ బి.టెక్/ Hydలో జాబ్ చేస్తున్న అందమైన వధువుకు జాబ్/ బిజినెస్ చేస్తున్న వరుడు కావలెను. Ph: 9948666645. (A)



వివాహ వేదిక

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.com లో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాల ఫోన్ నెంబర్లను ఫ్రీగా చూసుకోండి. ✆ 97016 59125.(I)

కమ్మ ప్రత్యేకం: ఓన్లీ డాక్టర్స్, ఆల్ బ్రాంచెస్ & సివిల్ సర్వీసెస్, గుడె వెంకటప్పయ్య చౌదరి. ఆఫీస్: గాయత్రి రెసిడెన్సీ, కానూరు, VJA. ✆ 94401 53991 (B).

20సం॥ల అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహవేదిక శ్రీసత్యసాయి వివాహవేదిక ✆ 9849414098, 040-66317515, satyasaivivahavedika.com (A)

ది.పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ, తెనాలి(గుంటూరు జిల్లా) గత 6 సం॥లుగా అత్యధిక ప్రొఫైల్స్‌తో వివాహ పరిచయవేదిక ఘనంగా నిర్వహించియున్నాము. మా 7వ పరిచయవేదికను ది. 29-4-18 ఆదివారం ఉ॥ 9 - సా॥ 5 వరకు నిర్వహించబడును. ✆ 99639 24665, 72070 57000.(I)

కుల పట్టింపులేని వారికి 2వ, లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2pm - 5pm పరిచయవేదిక జరుగును. 1000 మంది వధూవరుల లిస్ట్ ఇవ్వబడును. కుదుర్చబడును. Hyd. ✆ 9440937900 (A)

వెంకటేశ్వర మ్యారేజ్‌బ్యూరో హైదరాబాద్ కమ్మ మరియు అన్ని కులాల వారికి Govt/ Employees/ Doctors, ఇంజనీరింగ్, 1వ, 2వ సంబంధములు కుదుర్చబడును. రి.ఫ్రీ. ✆ 9000975005 (A)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

సర్పదోషములు, కాలసర్పదోషములు, కుజ దోషములు వార్కి మాత్రమే, అన్ని కులాలు, అన్ని వయస్సుల వార్కి సంబంధములు కుదర్చబడును. శ్రావణి మ్యారేజ్ బ్యూరో - 82475 57959. (G)

నాయీబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక. ఏప్రిల్ 1st ఆదివారం ఉ॥ 10 గం॥ నుండి సా॥ 4 గం॥ల వరకు. S.కన్వెన్షన్ ఎదురుగా, దుర్గానగర్ కాలనీ, కర్మాన్‌ఘాట్ రోడ్, హైదరాబాద్, సెల్: 99499 92909, www.apnbs.com (G)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్: (ఆల్ క్యాస్ట్స్) MBBS/ MD/MS MCH/ DM/ BDS & బిజినెస్ మ్యాన్స్‌కి 1వ, 2వ/ విడో దేశ/ విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 99668-08059 (A)

అన్ని కులముల, మతముల వారికి 1వ, 2వ, పెళ్ళిసంబంధములు 10 రోజుల్లో చూడబడును. 8919080864, 9951618797 (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ Hyd. ✆ 9248600342, 8019207503. brahmininformationmatri@gmail.com (A)

అన్ని కుల, కులాంతర దేశ, విదేశ, 1వ, 2వ, డా॥, ఇంజనీర్, PG, డిగ్రి వధూవరుల సంబంధాలకై సంప్రదించండి. ✆ 8497939432 (A)

గౌడ మ్యారేజ్‌బ్యూరో Hyd. Only for Gouds, 10 సం॥ అనుభవం దేశ/ విదేశ, 1వ/2వ, డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ Govt/ Pvt. ఎంప్లాయిస్, బిజినెస్. సం॥లకై. ✆ 9440454842 (A)

సుజాత మ్యారేజ్‌బ్యూరో అన్నికులాల వారికి మొదటి, రెండవ, డైవర్సీ, విడో సంబంధాలు కుదుర్చబడును. 9642364646 sujathamarriagebeaureo@gmail.com (A)

Since1989 శ్రీకన్యవివాహవేదిక, Hyd. అన్ని కులాల & కులాంతర 1వ, 2వ, లేట్ మ్యారేజెస్. ఇండియా/ అబ్రాడ్. వేల్పుల బిక్షపతి. 27619998/ 9396617778. వాట్సప్ - 9347009998 (A)

గంగపుత్రుల పెళ్ళి సంబంధాలకై శ్రీగంగాభవాని గంగపుత్రుల వివాహ పరిచయాలు అగ్నికులక్షత్రియ, బెస్త, గూండ్ల, జాలరి, వాడబలిజ & ఇతర. అంబర్‌పేట్, Hyd. 9000541008 (A)

ఓన్లీ కమ్మచౌదరి: డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, MBA, Govts, హైరిచ్చర్స్, బిజినెస్‌మెన్స్ & All 1వ, 2వ, విడో, దేశ, విదేశ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

Specially Doct (3000 ప్రొఫైల్స్) MBBS MD, MS, DM, MCH, BDS, MDS & డా॥కి మాత్రమే. 1వ/ 2వ/ లేటు దేశ/ విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదుర్చబడును. ✆ 9963632698 (A)

2వ గంగపుత్ర మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల, మతాల వారికి 1వ, 2వ, డైవర్సీ, లేటు సంబంధాలు వ్యక్తిగత శ్రద్ధతో వెంటనే కుదుర్చబడును. ✆ 7396195102 (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com Hyd. 9440831748, Gunt. ✆ 9440759945, VSP. 9441735157 (A)

Whatsapp Your Photo & Biodata to 9347262769. We will Send the suitable Matches. www. pellisandadi.com. Estd. 1991. (A)

సుజితమ్యారేజ్‌బ్యూరో అన్నికులాలవారికి వయస్సుతో నిమిత్తంలేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్‌చేస్తూ 1 నెలలో సంబంధాలు కుదర్చబడును. స్త్రీ॥కు.ఫ్రీ. పు॥ సర్వీస్ ఛార్జ్ ✆ 7893688248 (A)

నేడే Jio వివాహ పరిచయవేదిక 30000 ప్రొఫైల్స్ 300 మంది అసోసియేట్స్‌తో అన్ని కులాల వారికి www.jiomatrimony.in ✆ 8885410555/ 8885428555. (A)

కమ్మ పెళ్ళిసంబంధములు: NRI's, డాక్టర్స్, SWE, ఎంప్లాయిస్, High & Middle క్లాస్ మరియు లేట్ మ్యారేజ్ సంబంధములు కొరకు సంప్ర: ✆ 98665 21319. (B)

P. Supriya Reddy, Rich Reddy Boys & Girls India & Abroad Matches, All EMP/ GOvt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from all Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762. Email: palletisupriyareddy@gmail.com (A)

★ ★ ★

ఓన్లీ మున్నూరుకాపు మ్యారేజ్ బ్యూరో, కరీంనగర్: డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ Govt. మీరు కోరిన పెళ్లి సంబంధాలకు సంప్ర: భ్రమరాంబ M.B. ✆: 99484 83542 (F)

శుభం గౌడ్స్ మ్యాట్రిమోని గౌడ్స్ వధూవరులకై దేశ, విదేశ, 1వ, 2వ, డా॥ ఇంజనీర్ PG, డిగ్రీ, సం॥లకై సంప్ర॥ బుర్ర శ్రీనివాస్ గౌడ్ హైద్రాబాద్ ✆ 9246214511 (A).

"భావన వివాహ వేదిక " గత 26 సం॥లుగా మీ సేవలో అన్ని కులముల వివాహ సంబంధాలకై సంప్ర ✆ 9885444980/ 8008106262, www.bhavanamarriage.com (A).

★ ★ ★

విశ్వబ్రాహ్మణ వధు వరులకు వివాహ సంబంధాలు కుదుర్చబడును. JNTU కూకట్‌పల్లి, Hyd. సం॥ లక్ష్మీనారాయణ గారు. ✆ 9297407310, 9247917622 (A)

ముదిరాజ్ వధూవరులకు గత 15 సం॥లనుండి మేము పెళ్లి సంబంధాలను చూస్తున్నాము. SWE/ Govt Jobs/ Abroad/ B.Tech/ PG/ Degree. ✆ 9848239706 (A)

శుభమస్తు "మ్యారేజ్‌బ్యూరో" TM Estd: 1995 గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, 1వ/ 2వ/ దేశవిదేశ సంబంధాలకై సం॥ శారదగౌడ్ లింగలాకాంప్లెక్స్, DSNR Hyd. ✆ 9490479371/ 24150704 (A)

ఈనాడు బిజినెస్ వారాంతం

ఆడుతూ.. కోట్లు కొల్లగొడుతూ..

కొత్త శిఖరాలకు క్రీడల ప్రాయోజితం




ఒకప్పుడు క్రీడలంటే దేశ ప్రతిష్ఠ, పేరు ప్రఖ్యాతులు. రెండు దేశాల మధ్య జరిగే ఆటలు చిన్నపాటి యద్ధాన్నే తలపించేవి. అయితే కాలంతో పాటు పరిస్థితులూ మారాయి. ఎప్పుడైతే క్రీడల్లోకి కార్పొరేట్లు ప్రవేశించారో అవి పూర్తి వాణిజ్యమయంగా మారిపోయాయి. క్రీడాకారులను తమ ఉత్పత్తులకు ప్రచారకర్తలుగా నియమించుకోవడానికి కంపెనీలు పోటీపడుతుంటడంతో ఆటగాళ్లు రాత్రికి రాత్రి కోటీశ్వరులుగా మారుతున్నారు. ఒకవైపు ఆటతో మరోవైపు ప్రకటనలతో హల్‌చల్ చేస్తున్నారు. అందుకే భారత్‌లో క్రీడల ప్రాయోజిత పరిశ్రమ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది.

భారత్‌లో క్రీడల ప్రాయోజిత (స్పాన్సర్‌షిప్) విపణి కొత్త శిఖరాలకు చేరుతోంది. 2016లో రూ.6,400 కోట్లు ఉన్న ఈ విపణి 2017లో రూ.7,300 కోట్లకు చేరింది. అంటే ఏడాదిలో దాదాపు 14 శాతం పెరిగిందన్నమాట. ముఖ్యంగా మీడియా పెట్టుబడులు ఇందుకు దోహదపడుతున్నాయి. మొత్తం ఖర్చుల్లో మీడియా పెట్టే వ్యయాలు 55 శాతం ఉంటే.. ఆ తర్వాతి స్థానంలో గ్రౌండ్ (ఆటస్థలం) స్పాన్సర్‌షిప్‌లు ఉన్నాయి. ఇదే విషయాన్ని ఈఎస్‌పీ ప్రోపర్టీస్-స్పోర్ట్స్ పవర్ నివేదిక స్పష్టం చేసింది. టీవీ ప్రకటనలు దన్నుగా నిలవడంతో క్రీడల్లో మీడియా వ్యయాలు 15.8 శాతం పెరిగి రూ.3,511 కోట్ల నుంచి రూ.4,065 కోట్లకు చేరాయి. గ్రౌండ్ ప్రకటనలు 14.7 శాతం అధికమై రూ.1,165 కోట్ల నుంచి రూ.1,337 కోట్లకు పెరిగాయి. టీం స్పాన్సర్‌షిప్ రూ.700 కోట్ల నుంచి 17.1 శాతం పెరిగి రూ.819 కోట్లకు చేరింది. 2016లో ఐసీసీ టీ20 ప్రపంచ కప్, ఒలింపిక్స్, కబడ్డీ ప్రపంచ కప్ వంటి భారీ ఈవెంట్లు జరగ్గా.. 2017లో భారీ క్రీడల కొరత కనిపించింది.

అంతా లీగ్‌ల చలవే: క్రీడల వ్యాపారానికి 2017ను పెద్ద ఏడాదనే చెప్పుకోవచ్చు. ప్రపంచంలో బహుళ ఆదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. ఇక ప్రో కబడ్డీ ప్రజాదరణ పొందిన లీగ్‌గా నిలిచింది. క్రికెటేతర ఆటల ప్రాయోజితం గత ఏడాదిలో గణనీయంగా వృద్ధి చెందింది. ఫుట్‌బాల్ ఏకంగా 64 శాతం వృద్ధి నమోదు చేసింది. ప్రేక్షకుల హాజరు పరంగా చూస్తే అండర్-17 ఫుట్‌బాల్ ప్రపంచ కప్ కొత్త అధ్యాయాన్ని లిఖించగా.. క్రీడా ప్రకటనల వ్యాపారం కొత్త శిఖరాలను అధిరోహించింది. ఇండియన్ సూపర్‌లీగ్ స్పాన్సర్‌షిప్ (ఐఎస్ఎల్) సైతం 22 శాతం పెరిగింది. ఈ ఏడాదిలో అయిదు ఫ్రాంచైజీ ఆధారిత లీగ్‌లు సైతం ప్రారంభయ్యాయి. అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ), సూపర్ బాక్సింగ్ లీగ్ (ఎస్‌బీఎల్), సూపర్ ఫైట్ లీగ్, క్యూ స్లామ్ (బిలియర్డ్స్, స్నూకర్), పీ1 పవర్ బోటింగ్‌లు ఇందులో ఉన్నాయి. క్రికెట్ ఫ్రాంచైజీ ఫీజుల్లో పెద్దగా మార్పులు లేనప్పటికీ.. ఇతర క్రీడల ఫ్రాంచైజీ ఫీజుల్లో 25 శాతం పెరుగుదల కనిపించింది.

రారాజు కోహ్లి: బ్రాండ్ ప్రచారకర్తల పరంగా చూస్తే.. భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి అగ్రస్థానంలో నిలిచాడు. ఏకంగా 19 బ్రాండ్లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న కోహ్లి.. వీటి ద్వారా రూ.150 కోట్లకు పైగా ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. రెండో స్థానంలో మహేంద్ర సింగ్ ధోని నిలవగా.. ఆ తర్వాతి స్థానాలను బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, సచిన్ తెందూల్కర్‌లు దక్కించుకున్నారు. క్రికెటేతర ప్రచారకర్తల్లో పీవీ సింధు మొదటి స్థానంలో నిలిచారు. 11 బ్రాండ్లకు ప్రచారం చేస్తున్న ఈమె.. రూ.30 కోట్లకు పైగా ఆదాయం గడిస్తున్నారు. దేశంలో క్రీడలకు ఆదరణ పెరుగుతుండటంతో.. దిగ్గజ ఆటగాళ్లు తమ సొంత బ్రాండ్‌ల ప్రచారాన్ని సైతం పెంచుకుంటున్నారు. అయితే మొత్తం ప్రచారకర్తల ఆదాయం మాత్రం స్వల్పంగా తగ్గింది. మొత్తంగా చూస్తే.. 90 బ్రాండ్లకు క్రికెట్ ఆటగాళ్లు ప్రచారం చేస్తోంటే.. 78 బ్రాండ్‌ల ప్రచారకర్తలుగా క్రికెటేతర ఆటగాళ్లు వ్యవహరిస్తున్నారు.

విదేశీ మారకపు రేట్లు



(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.15	68.59	ఆస్ట్రేలియా డాలరు	59.15	68.59	కువైట్ దీనార్	179.35	223.41
పౌండ్ స్టెర్లింగ్	83.61	96.98	సింగపూర్ డాలరు	44.96	53.26	ఒమన్ రియాల్	156.87	179.47
యూరో	73.06	84.74	థాయ్ బాత్/100	189.60	226.77	సౌదీ రియాల్	15.73	18.63
జపనీస్ యెన్/100	56.47	65.49	బహ్రెయిన్ దీనార్	160.19	183.57	యూఏఈ దిర్హమ్	16.10	18.82

ఎండల్లో హాయ్.. హాయ్!



జీవితం ఓ ప్రయాణం లాంటిది.. మరి అలాంటి జీవితంలో ప్రయాణాలు లేకపోతే ఎలా? అందుకే ఎక్కువ మంది భారతీయులు విహార యాత్రలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడమే ఆలస్యం.. పిల్లలతో కలిసి వేసవి విహారాలకు వెళ్లడానికి ప్రణాళిక రచిస్తున్నారు. ఇందుకోసం ఎక్కువగా సాంకేతికతను వాడుతున్నారు. వారు వెళ్లాలనుకుంటున్న ప్రదేశాలను, అక్కడకు ఎలా చేరుకోవాలనే దారులను అంతర్జాలంలో ముందే వెతికేస్తున్నారు.

- వేసవి విహారయాత్రలకు సిద్ధం
- రూ.లక్షకు తక్కువ కాకుండా బడ్జెట్
- కార్డు ద్వారా చెల్లింపులకే ప్రాధాన్యం

రూ.లక్షకు తక్కువ కాకుండా విహార యాత్రకు ఖర్చు చేయాలని ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. యాత్ర బుక్ చేసుకునేందుకు, అక్కడ ఎదురయ్యే ఖర్చుల్ని చెల్లించేందుకు కార్డుల్ని వాడేందుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. గ్లోబల్ ట్రావెల్ రీసెర్చ్ ఇంజిన్ 'కాయక్' సర్వే, వీసా (ప్రధాన పేమెంట్స్ టెక్నాలజీ) నివేదికలో పలు అంశాలు వెలుగుచూశాయి. ఆ వివరాలు...

- ★ ఈ వేసవిలో కనీసం రూ.లక్షకు తక్కువ కాకుండా విహార యాత్రకు ఖర్చు చేయాలని 45 శాతం మంది ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.
- ★ 16 శాతం మంది ఏకంగా రూ.3 లక్షలు విహార యాత్రకు కేటాయించనున్నారు.
- ★ షాపింగ్, ఆహారం, ఇతర రోజువారీ కార్యకలాపాల కంటే ప్రయాణాల మీద ఎక్కువగా ఖర్చు పెట్టేందుకు ఇష్టపడేవారు 38 శాతం ఉన్నారు.
- ★ 36-55 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు ప్రయాణాలపై ఎక్కువగా ఖర్చు చేసేందుకు అమితాసక్తి ప్రదర్శిస్తున్నారు.
- ★ ప్రయాణాలు చేస్తున్న సమయంలో షాపింగ్‌పై ఖర్చు తగ్గించుకోవడానికి ఇష్టపడతామని 53 శాతం మంది తెలిపారు.
- ★ హాలీడేస్‌కు వెళ్లినప్పుడు ఖర్చు చేయడం కోసం ప్రత్యేకంగా డబ్బులు పోగు చేస్తుంటామని 57 శాతం మంది చెప్పారు.
- ★ ప్రయాణం కోసం డబ్బులు మిగుల్చుకునేందుకు షాపింగ్‌ను పక్కన పెట్టేవారు 34 శాతం ఉండగా, 22 శాతం మంది దాన్ని అదనపు బాధ్యతగా భావిస్తామని వెల్లడించారు.
- ★ ఎక్కువ మంది భారతీయులు ప్రయాణాల్లో ఖర్చు తగ్గించుకునేందుకు చౌకైన ప్రత్యామ్నాయాల వైపు మొగ్గు చూపుతున్నారు. షాపింగ్ (53 శాతం), వసతి (38 శాతం), స్థానిక రవాణా (37 శాతం) చౌకగా ఉండేలా చూసుకుంటామని తెలిపారు.
- ★ చాలా తక్కువ మంది విహార యాత్రలకు వెళ్లిన చోట అందాల్ని చూడటానికి (సైట్ సీయింగ్) ఇష్టపడటం లేదు. కార్ల అద్దెలు, భోజనం విషయంలోనూ నాణ్యతను పట్టించుకోవడం లేదు. అయితే ఎక్కువ మంది సెలవును (హాలీడే) మంచి జ్ఞాపకంగా గుర్తుపెట్టుకోవడానికే మొగ్గు చూపుతున్నారు.

ఆన్‘లైన్’ కడుతున్నారు..

ఆదాయం పెరుగుతుండడం, యువత జనాభా కూడా ఎక్కువగా ఉండడంతో ప్రయాణాల విషయంలో కొత్త తరం సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తున్నారు. ఎంతలా అంటే అంతర్జాతీయ డిజిటల్ ప్రయాణ విక్రయాల్లో 3.7 శాతం వాటాను పొంది.. ఆసియా-పసిఫిక్(అపాక్) ప్రాంతంలోనే మూడో అతిపెద్ద మార్కెట్‌గా మారే అవకాశం కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. ఆన్‌లైన్ ప్రయాణ బుకింగ్‌లు సైతం 2017-21 మధ్య ఏటా 14.8 శాతం మేర పెరిగే అవకాశాలున్నాయని విశ్లేషిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు, అంతర్జాలం, వైవిధ్యమైన యాప్‌లతో ప్రయాణ, ఆతిథ్య రంగాలు కొత్త రూపును సంతరించుకుంటున్నాయి.

పెరిగిన కార్డు చెల్లింపులు

భారత ప్రయాణికుల్లో 84 శాతం మంది విహార యాత్రలకు బుకింగ్ చేసుకునేటప్పుడు కార్డు ద్వారా చెల్లింపులు చేస్తున్నారని, అక్కడ అయ్యే ఖర్చుల్ని చెల్లించడానికి 51 శాతం మంది కార్డుల్నే ఆశ్రయిస్తున్నారని వీసా (ప్రధాన పేమెంట్స్ టెక్నాలజీ) నివేదిక వెల్లడించింది. 2017లో ప్రయాణం, పర్యాటకంపై ప్రపంచ పోకడలు ఎలా ఉన్నాయన్న దానిపై వీసా ఓ నివేదిక తయారుచేసింది. దీనిప్రకారం విహారయాత్రకు వెళుతున్న వారిలో నగదు తీసుకెళుతున్నవారు 94 శాతం మంది ఆ మొత్తాన్ని తిరిగి వెనక్కు తీసుకొస్తున్నారు. డిజిటల్ చెల్లింపులు, కార్డు చెల్లింపులు పెరిగాయనడానికి ఇదే నిదర్శనం. గత రెండేళ్లుగా భారత ప్రయాణికులు సరాసరిన 5.6 ప్రయాణాలు చేస్తున్నారని వీసా తెలిపింది. ఇదే సమయంలో ఆసియా-పసిఫిక్ దేశాల వారు 4.7, ప్రపంచవ్యాప్తంగా 4.2 ప్రయాణాలు చేస్తున్నారు. భారతీయ ప్రయాణికులు 2,334 డాలర్లు విహారయాత్రలకు ఖర్చు చేస్తుంటే ఆసియా-పసిఫిక్ దేశాల వారు 1,677 డాలర్లు మాత్రమే వినియోగిస్తున్నారు. రాబోయే రెండేళ్లలో దీన్ని 21 శాతం పెంచాలని చూస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. ఆసియా-పసిఫిక్ దేశాలు, ప్రపంచ ప్రయాణికులతో పోలిస్తే భారతీయులు కుటుంబ బంధాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అందుకే విహారయాత్రలకు కుటుంబసమేతంగా వెళ్లి ఆనందిస్తుంటారు. డబ్బులు ఖర్చు చేసే విషయంలో పెద్దగా ఆలోచించరు. సమూహాలుగా ప్రయాణాలు చేసేందుకు భారతీయులు ఎక్కువగా ఇష్టపడతారు. అదే సమయంలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఒంటరిగా వెళ్లేందుకే ఆసక్తి చూపిస్తున్నారని వీసా నివేదిక తెలిపింది. 97 శాతం మంది భారతీయులు 2017లో తాము వెళ్లాలనుకున్న గమ్యస్థానాలను సాంకేతికత సాయంతో ముందుగానే తెలుసుకుని ప్రణాళికాబద్ధంగా ప్రయాణాలు చేశారని నివేదిక వెల్లడించింది.

ప్రభుత్వమూ చేయూతనివ్వాలి

పర్యాటక రంగంలోకి సాంకేతికతను చొప్పించడానికి ప్రభుత్వం కూడా ముందుకు రావాలి. వినూత్న ప్రయాణానికి అన్ని బ్యాంకులను మొబైల్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫాంలకు అనుసంధానం చేయాల్సింది ప్రభుత్వమేనని కేపీఎమ్‌జీ, ఫిక్కీలు అభిప్రాయపడుతున్నాయి. తద్వారా స్థానిక, విదేశీ పర్యాటకులు సులువుగా లావాదేవీలు చేసుకోవడానికి వీలవుతుందన్నది వారి భావన. మొబైల్ బ్యాంకింగ్ విషయంలో విధానాలను మరింత మెరుగుపరచి.. చెల్లింపు సేవలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అవి అంటున్నాయి.

కోడిగుడ్లు



24న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	300	వరంగల్	302
చిల్లరగా (ఒక గుడ్డు)	3.60	విశాఖపట్నం	315
బెంగళూరు	355	చెన్నై	355
25వ తేదీకి		చిత్తూరు	348
విజయవాడ/గోదావరి	310	నమక్కల్	345

ఏసీల విపణిలో జపాన్ వేడి



- భారత్ కోసం ప్రత్యేక ఉత్పత్తులు
- ఇన్వర్టరు ఏసీలకు పెరుగుతున్న ఆదరణే కారణం
- ఖరీదు ఎక్కువైనా ఫర్వాలేదంటున్న వినియోగదారులు

ఈనాడు - హైదరాబాద్

ఎండలు ముదరకముందే ఎయిర్ కండీషనర్ల (ఏసీ) విపణి జపాన్ కంపెనీలతో వేడెక్కుతోంది. దేశీయ విపణిలో ఇన్వర్టరు ఏసీలకు ఏటికేడాది ఆదరణ పెరగడం.. ఈ సాంకేతిక పరిజ్ఞానంపై జపాన్ కంపెనీలకు పట్టు ఉండడం, అక్కడి మార్కెట్ ఇప్పటికే ఎంతో పరిపక్వత చెందడం వంటి అంశాలు భారత్ మార్కెట్‌లో జపాన్ కంపెనీలు విస్తరించడానికి సానుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. అత్యాధునిక ఇన్వర్టరు సాంకేతిక పరిజ్ఞానంతో ఏసీలను తయారు చేస్తున్న పానసోనిక్, ఫుజిత్సు జనరల్, మిత్సుబిషి, డైకిన్ తదితర కంపెనీలు జపాన్‌కు చెందినవే. ఏసీలు దీర్ఘకాలం వినియోగిస్తారు. అందువల్ల వినియోగదారులు నాణ్యతకు, సదుపాయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఖరీదైనా సరే.. ఎక్కువగా చల్లబరిచే సామర్థ్యం, వేగం, విద్యుత్ ఆదా వంటి సదుపాయాలున్న ఏసీలను కోరుకుంటున్నారు. ఇటువంటి సదుపాయాలున్న ఏసీలను జపాన్ కంపెనీలు ప్రవేశపెట్టగలుగుతున్నాయి. దేశీయ వాణిజ్య ఏసీల (వేరియబుల్ రిఫ్రిజిరేషన్ ఫ్లో) మార్కెట్‌లో దాదాపు 85-90 శాతం వాటా జపాన్ కంపెనీలదే. రూమ్ ఏసీ విభాగంలో ఇన్వర్టరు ఏసీల విక్రయాల్లో జపాన్ కంపెనీలకు దాదాపు సగం వాటా ఉన్నట్లు అంచనా. రూమ్ ఏసీల విభాగంలో జపాన్‌లో 100 శాతం ఇన్వర్టరు ఏసీలనే వినియోగిస్తున్నారు. సింగపూర్‌లో 90 శాతం, చైనాలో దాదాపు 50 శాతం వాటా ఇన్వర్టరు ఏసీలదే. అయిదారేళ్ల క్రితం దేశీయ ఏసీల మార్కెట్‌లో కొరియన్ కంపెనీల హవా ఉండేది. దీన్ని జపాన్ కంపెనీలు ఆక్రమిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

మారిన నక్షత్ర రేటింగ్ విధానం

ఈ ఏడాది జనవరి నుంచి అమలులోకి వచ్చే విధంగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ (బీఈఈ) ఇండియన్ సీజనల్ ఎనర్జీ ఎఫీషియన్సీ రేషియో (ఐఎస్ఈఈఆర్) పేరుతో కొత్త నక్షత్ర రేటింగ్ ప్రమాణాలను అమలులోకి తీసుకువచ్చింది. ఈ ప్రమాణాలతో సంప్రదాయ ఏసీలను తయారు చేయాలంటే.. ఏసీ పరిమాణం పెరగడంతోపాటు వ్యయం పెరుగుతుంది. దీనివల్ల సాధారణ ఏసీలకు, ఇన్వర్టరు ఏసీలకు మధ్య వ్యయం పరంగా వ్యత్యాసం తగ్గుతుందని, ఇది జపాన్ కంపెనీలకు అనుకూల పరిణామమని భారత్‌లో ఫుజిత్సు జనరల్ అనుబంధ కంపెనీ ఈటీఏ జనరల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.ఇజాజుద్దీన్ ‘ఈనాడు’కు తెలిపారు. ‘ఇన్వర్టరు సాంకేతిక పరిజ్ఞానాన్ని జపాన్ కంపెనీలు అభివృద్ధి చేశాయి. అందుకని ఇన్వర్టరు ఏసీలను కొనుగోలు చేయడానికి వినియోగదారులు జపాన్ కంపెనీలనే ఎంచుకుంటారన్నారు. జపాన్ కంపెనీలు భారత్ మార్కెట్ కోసం ప్రత్యేక ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి. మొదటి సారి ఏసీలను కొనుగోలు చేసే వినియోగదారులపై దృష్టి పెడుతున్నాయి. జపాన్ కంపెనీల ఏసీల ధరలు సాధారణంగా ఎక్కువ ఉంటాయి. గతంలో రెండోసారి ఏసీలను కొనుగోలు చేసే వారు జపాన్ కంపెనీల ఏసీలను కొనుగోలు చేయడానికి మొగ్గు చూపేవారు. ఇప్పుడు ఆ ధోరణి మారింది. మొదటిసారే వినియోగదారులు ఖరీదైన ఇన్వర్టరు ఏసీలను కొనుగోలు చేస్తున్నారన్నా’రు. ఇన్వర్టరు ఏసీల ధరలు ఎక్కువగా ఉన్నా.. 2-3 ఏళ్లలో వినియోగదారులు చెల్లించిన ధర విద్యుత్ ఆదా రూపంలో వారికి లభిస్తోంది.

మార్కెట్ వాటా లక్ష్యం..

దాదాపు ఎనిమిదేళ్ల క్రితం భారత్ మార్కెట్‌లోకి అడుగు పెట్టిన ఫుజిత్సు జనరల్ ప్రీమియం ఏసీల విక్రయాలపైనే దృష్టి పెడుతోంది. ఈ కంపెనీ ఏసీల ధరలు సాధారణ ఏసీల ధరల కంటే దాదాపు 50 శాతం అధికంగా ఉంటాయి. రూమ్ ఏసీల విభాగంలో ప్రస్తుతం కంపెనీకి భారత్‌లో 4 శాతం వాటా ఉంది. దీన్ని పెంచుకోవాలని ఫుజిత్సు భావిస్తోంది. భారత్‌లో విక్రయాలతోపాటు మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతులు చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని కంపెనీ పరిశీలిస్తోంది. వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఇటీవల ఫుజిత్సు జనరల్ దేశీయ విపణిలోకి 25 కొత్త శ్రేణి ఏసీలను విడుదల చేసింది. దాదాపు 40 రకాల ఏసీలను ఈ కంపెనీ విక్రయిస్తోంది. పానసోనిక్‌కు దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం 7 శాతం వాటా ఉండగా.. వచ్చే మూడేళ్లలో దీన్ని 15 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, సాంకేతిక పరిజ్ఞానం పరంగా అత్యంత నాణ్యమైన ఏసీలను విడుదల చేయడం, మార్కెటింగ్, పంపిణీ సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా వాటాను పెంచుకోవాలని భావిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పానసోనిక్ 60 ఏళ్లలో 10 కోట్ల ఏసీలను విక్రయించింది. భారత్ తమకు కీలకమైన మార్కెట్ అని, ముఖ్యంగా దక్షిణాది మార్కెట్‌లో ప్రీమియం ఇన్వర్టరు ఏసీలకు గిరాకీ ఆకర్షణీయంగా పెరుగుతోందని కంపెనీ ప్రతినిధి తెలిపారు. దేశీయ విపణిలోకి ఇన్వర్టరు ఏసీలను ప్రవేశపెట్టిన డైకిన్ చేతిలో దాదాపు నాలుగో వంతు వాటా (ఇన్వర్టరు ఏసీలు) ఉంది. ఇన్వర్టరు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనేక దేశాలకు డైకిన్ పరిచయం చేసింది.

భారత్ విపణి ఆకర్షణీయం

ఇప్పటికీ భారత్‌లో ఏసీలను చాలా తక్కువ మందే వినియోగిస్తున్నారు. దేశంలో విస్తరణ (పెనిట్రేషన్) 3-4 శాతం మాత్రమే ఉంది. గత కొద్ది సంవత్సరాలుగా దేశీయ ఏసీల విపణి దాదాపు 15 శాతం చొప్పున వృద్ధి చెందుతోంది. వచ్చే కొద్ది సంవత్సరాల్లో కూడా ఈ వృద్ధిరేటు కొనసాగగలదని, వచ్చే ఆర్థిక సంవత్సరానికి దేశీయ విపణి 50 లక్షల ఏసీల (యూనిట్లు) స్థాయికి చేరగలదని పరిశ్రమ వర్గాల అంచనా. ప్రస్తుతం మొత్తం ఏసీల విక్రయాల్లో ఇన్వర్టరు ఏసీల విక్రయాలు 25 శాతం ఉన్నాయని.. ఇవి త్వరలోనే 50 శాతానికి చేరతాయని ఏసీ తయారీ కంపెనీలు భావిస్తున్నాయి. విద్యుత్ లభ్యత మెరుగు కావడం, నగరీకరణ, మధ్యతరగతి వర్గాల ఆదాయాలు, ఆకాంక్షలు పెరగడం వంటి అంశాలు దేశీయ ఏసీ మార్కెట్ వృద్ధికి దోహదం చేయనున్నాయి. విస్తరణ తక్కువగా ఉన్నందున రీప్లేస్‌మెంట్ మార్కెట్ కన్నా కొత్త యూనిట్ల కొనుగోళ్లు అధికంగా ఉన్నాయి. సాధారణంగా ఫ్రిజ్, టీవీలు ఒక్కటే కొనుగోలు చేస్తారు. ఏసీలు అలా కాదు. ప్రతి గదికి ఏసీని ఏర్పాటు చేస్తారు.

ఇన్వర్టరు సాంకేతిక పరిజ్ఞానం అంటే..

సాధారణ ఏసీలతో పోలిస్తే ఇన్వర్టరు ఏసీలతో 30-40 శాతం వరకూ విద్యుత్ ఆదా అయ్యేందుకు అవకాశం ఉంది. ఈ సాంకేతిక పరిజ్ఞానంలో కంప్రెసర్ మోటారు వేగాన్ని అవసరానికి తగ్గట్టుగా ఇన్వర్టరు నియంత్రిస్తుంది. కంప్రెసర్‌కు ఎక్కువ విద్యుత్ అవసరమైతే ఎక్కువ, తక్కువ విద్యుత్ అందేలా సూచస్తుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని జపాన్ అభివృద్ధి చేసింది. జపాన్‌లో ఏసీలు, రిఫ్రిజిరేటర్లలో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని విజయవంతంగా వినియోగిస్తున్నారు. ఇన్వర్టరు సాంకేతిక పరిజ్ఞానం స్ప్లిట్ ఏసీల్లోనే లభ్యమవుతుంది.

ఈ చుక్కలు ఏం చెబుతాయంటే..



ప్రస్తుతం స్టాక్ మార్కెట్ సూచీలు జీవన కాల గరిష్ఠ స్థాయిల నుంచి కిందకు వచ్చి.. గట్టి మద్దతు కోసం తచ్చాడుతున్నాయి. ఈ సమయంలో తక్కువ స్థాయిలోకి వచ్చిన షేర్లను కొనాలా? లేక మరీ పడిపోతే వచ్చిన లాభాలు కూడా పోతాయని అంచనా కట్టి అమ్ముకోవాలా? అన్న సందిగ్ధంలో మదుపర్లు ఉన్నారు. ఇటువంటి సమయంలోనే బ్రోకరేజీ సంస్థలు ఆయా షేర్లకు ఇచ్చే రేటింగ్‌లు కాస్త ఉపయోగపడుతుంటాయి. ఈ నేపథ్యంలో అసలు ఆ రేటింగ్‌లను మనం ఎలా అర్థం చేసుకోవాలన్నది ఈ వారం ‘మార్కెట్ మాట’లో తెలుసుకుందాం.

సాధారణంగా ఏదైనా షేరును ‘కొనొచ్చు’, ‘అమ్మొచ్చు’, లేదా ‘అట్టేపెట్టిఉంచుకోవచ్చు’ అని బ్రోకరేజీ సంస్థలు మదుపర్లకు సిఫారసు చేస్తుంటాయి. అదే సమయంలో ఆ షేర్లు ఏ స్థాయికి చేరవచ్చో చెబుతూ ‘లక్ష్యం’ ధరను సైతం ఇస్తుంటాయి. కొన్ని బ్రోకరేజీ సంస్థలు మద్దతు, నిరోధ స్థాయిలను సైతం ఇస్తుంటాయి. అలా ఆ షేరు మార్కెట్ ధరతో పోలిస్తే ఆ కంపెనీ వాస్తవిక ధరను అవి అంచనా కడుతుంటాయి. దాన్ని బట్టి మదుపర్లు కొంత అవగాహనకు రావొచ్చు. ఒక వేళ ప్రస్తుత ధర కంటే లక్ష్యం చాలా ఎక్కువగా ఉందనుకోండి.. అపుడు ఆ కంపెనీ పనితీరుపై సదరు బ్రోకరేజీకి చాలా విశ్వాసం, ధీమా ఉందని అర్థం చేసుకోవచ్చు.

ఎలా రేటింగ్ కడతారు..

కొనండి, అమ్మండి అని సిఫారసు చేయడం ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. దాని వెనక పెద్ద కసరత్తే జరుగుతుంది. సదరు కంపెనీ ఆర్థిక ఫలితాల అంచనాలను, మూలాలను, భవిష్యత్ ప్రణాళికలను, సాంకేతిక చార్టులను గమనించి.. ఆ కంపెనీ షేరు పెరుగుతుందా లేదా తగ్గుతుందా అన్న నిర్ణయానికి వస్తారు. ఒక్కో బ్రోకరేజీ సంస్థ ఒక్కో విధానాన్ని పాటిస్తుంటుంది. కంపెనీ వ్యాపార విస్తృతి, కార్పొరేట్ పాలన, పోటీతత్వం తదితరాలతో పాటు.. షేరు విలువ, ఈక్విటీపై ప్రతిఫలాలు, వడ్డీ, పన్ను, తరుగుదల తదితరాలకు ముందు లాభం, మొత్తం మీద కంపెనీ పనితీరును ఇలా అన్నిటినీ బేరీజు వేసుకునే క్రమంలో ఒక్కో సంస్థ ఒక్కో విధానంలో అడుగులు వేస్తుంటుంది.

బుల్ ఉంటే.. బేర్ ఉంటే..

మార్కెట్ పరిస్థితులు కూడా రేటింగ్‌పై ప్రభావాన్ని చూపొచ్చు. బాగా పెరుగుతూ ఉన్న మార్కెట్లో సెంటిమెంటు కూడా సాధారణంగా బాగానే ఉంటుంది. అపుడు ప్రతి విశ్లేషకుడు ‘కొనుగోలు’ రేటింగ్‌ను ఎక్కువ కాలం పాటు కొనసాగించవచ్చు. లక్ష్యం ధరలను ఎప్పటికప్పుడు పెంచుతూ పోయే అవకాశాలూ ఉంటాయి. బుల్ మార్కెట్లో అన్ని షేర్లూ పెరుగుతూనే ఉంటాయి కాబట్టి వారు అలా చేస్తూ ఉండొచ్చు. బేర్ మార్కెట్ సమయంలో కూడా ‘అమ్మండి’ రేటింగ్ కొనసాగుతూ ఉండొచ్చు. అటు బుల్ మార్కెట్ అయినా.. ఇటు బేర్ మార్కెట్ అయినా.. ఎంపిక చేసిన కొన్ని కంపెనీలు మాత్రం సానుకూల, ప్రతికూల పరిణామాల(ఆ కంపెనీకి చెందినవి)ను బట్టి చలిస్తూ ఉంటాయి. అపుడే విశ్లేషకుల అసలు సామర్థ్యం బయటపడుతుంది.

ఇవి మనమే కనిపెట్టాలి

కేవలం బ్రోకరేజీ సంస్థలిచ్చే రేటింగ్‌లే అన్ని విషయాలు చెప్పలేవు. అదీ కాక అవన్నీ అంచనాలు మాత్రమే. ఒక్కోసారి నిర్దిష్ట కంపెనీ షేరును ‘విక్రయించండి’ అని చెప్పడానికి బ్రోకరేజీలు వెనకడావచ్చు. అలా చెబితే ఆ కంపెనీతో ఉన్న సంబంధాలు దెబ్బతింటాయోమోనని ఆలోచించవచ్చు. అందుకే ఎక్కువగా ‘అమ్మండి’ అనే రేటింగ్‌లు కనిపించవు. అంటే కొన్న షేర్లను విక్రయించే విషయంలో మనమే సొంత నిర్ణయం తీసుకుంటే మంచిదన్నమాట.

–ఈనాడు వాణిజ్య విభాగం

రేపటి ఆశ...

జనరేషన్ జడ్!

ప్చ్... ఎప్పుడూ సెల్‌ఫోన్లు, ఛాటింగులు.. సినిమాలు, పిచ్చి తిరుగుళ్లు.. ఇంతేగా.. వాట్సాప్, ఫేస్‌బుక్కులకు అతుక్కోటానికి తప్పించి వీళ్లెందుకు పనికొస్తారండీ.. వీళ్లకసలు ఈ లోకం పడుతుందా? ఇక్కడి సమస్యలేం అర్థమవుతాయ్.. నేటి యువత పూర్తిగా చెడిపోయిందండీ!

.... తరచూ వినపడే ఈసడింపు మాటలివి!

కానీ ఇందులో నిజం ఎంత? నేటి యువతరం నిజంగానే ఇంతటి అధమస్తపు లోకంలో కూరుకుపోయిందా?
ఈ విషయం తేల్చుకునేందుకే ఇంగ్లండ్‌కు చెందిన వార్కే ఫౌండేషన్ భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా 20 దేశాలకు చెందిన యువతీయువకుల్ని పలకరించింది. ముఖ్యంగా ప్రపంచ భవిష్యత్తును నిర్దేశించబోతున్న 'జనరేషన్ జడ్'ను ప్రత్యేకంగా లోతుగా ప్రశ్నించింది. ఈ తరం ఆలోచనలు, ప్రవర్తనలు, వైఖరుల్లోకి తొంగిచూస్తే.. రేపటి ప్రపంచపు ప్రాధాన్యాలేమిటో మనకు స్పష్టంగా కనబడుతున్నాయి.

జనరేషన్ జడ్ - ఏమంటోంది?

68% ప్రపంచ యువతలో 68% మంది తాము సంతోషంగా ఉన్నట్టు చెబుతున్నారు. సంతోషం, సంతృప్తి విషయంలో ఫ్రాన్స్, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి సంపన్న దేశపు యువత కంటే ఇండొనేషియా, నైజీరియా, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని యువతే ముందున్నారు.

51% సగం మంది యువత తమను ఆందోళనకు గురిచేస్తున్న ముఖ్యాంశాల్లో 'డబ్బు' ఒకటని చెప్పారు.

30% మూడోవంతు మంది మాత్రమే మానసికంగా తాము ఆరోగ్యంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఎక్కువమందిని ఇబ్బంది పెడుతున్నవి: **ఆందోళన, ప్రేమరాహిత్యం, ఒంటరితనం, తమపై ఇతరుల పెత్తనం**

46% మంది స్కూలు, కాలేజీ చదువులు ఒత్తిడికి కారణమవుతున్నాయని వెల్లడించారు.

3% సంతోషానికి, ఉజ్వల భవిష్యత్తుకు కేవలం 3% మంది మాత్రమే పేరుప్రఖ్యాతులు, సెలిబ్రిటీ, స్టార్ హోదాలు ముఖ్యమని చెప్పారు. ఎక్కువమంది నైపుణ్యాలను పెంచుకోవటమే తమ లక్ష్యమని చెప్పటం విశేషం.

42% యువతలో సగటున సగం మంది మాత్రమే మతవిశ్వాసాలన్నవి ముఖ్యమన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. (ఒక్క ఆఫ్రికాలోనే 77% మంది మతం ముఖ్యమంటే జపాన్‌లో 61% మంది తమ జీవితాల్లో మతానికి పాత్ర ఉండదని చెప్పారు)

89% ప్రతి పది మందిలో తొమ్మిది మంది ఆడపిల్లలను-మగపిల్లలను సమానంగానే చూడాలని గట్టిగా అభిప్రాయపడ్డారు.

74% నాలుగింట మూడొంతుల మంది హిజ్రాలకు కూడా సమాన హక్కులుండాలన్నారు.

89% విలువల విషయంలో కుటుంబం, తల్లిదండ్రుల ప్రభావం తమపై బలంగా ఉందని చెప్పారు.

17% స్నేహితులను ఎంచుకునే విషయంలో వాళ్ల మతం ఏమిటో చూస్తామని కేవలం 17% మందే చెప్పారు.

64% మూడింట రెండొంతుల మంది ఇతర మతాలకు చెందిన వారిలో తమకు సన్నిహితులు, స్నేహితులున్నారన్నారు.

83% ఈ ప్రపంచానికి ఉగ్రవాదం, అంతర్యుద్ధాల నుంచే ముప్పు ముంచుకొస్తోందని అభిప్రాయపడ్డారు. (చైనాలో మాత్రం 82% మంది కాలుష్యం తొలి ముప్పు అన్నారు. మొత్తమ్మీద 30% మంది అనూహ్య వేగంతో మారిపోతున్న టెక్నాలజీతోనూ ముప్పే అన్నారు)

20లో 16 సర్వేలో పాల్గొన్న 20 దేశాల్లో 16 దేశాల యువత.. మన ప్రపంచం పరిస్థితి నానాటికీ దిగజారుతోందని ఆవేదన చెందారు.

84% భవిష్యత్తుపై ఆశలు కల్పిస్తున్న అంశాల్లో సాంకేతిక పురోగతి కీలకమని అభిప్రాయపడ్డారు.

80% మంది విద్య ప్రపంచాన్ని మారుస్తుందని, ప్రపంచ భవిష్యత్తుకు ఇదే ఆశాకిరణమని అభిప్రాయపడ్డారు.

56% మతవర్గాలకు అతీతంగా ప్రజలకు వాక్‌స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ ఉండాలని అభిప్రాయపడుతున్నారు. (చైనాలో మాత్రం 39%, నైజీరియాలో 35% మందే ఈ స్వేచ్ఛను సమర్థించారు)

చిన్నదేగానీ.. ఇదీ ముఖ్యమే!

సంతోషంగా ఉన్నామని చెప్పటంలో యుక్తవయసు ఆడపిల్లల కంటే యువకులే ముందున్నారు. ఈ విషయంలో ఆడపిల్లలు తటపటాయిస్తుండటం మనం విస్మరించలేని, తప్పకుండా పట్టించుకోవాల్సిన వాస్తవం.



జనరేషన్ జడ్

1995-2001 మధ్య పుట్టిన వాళ్లను ప్రస్తుతం 'జనరేషన్ జడ్' అంటున్నారు. డిజిటల్ యుగంలో పుట్టిన ప్రత్యేక తరం ఇది. వీళ్లు పుట్టినప్పుడే డీవీడీలు పుట్టుకొచ్చాయి. వీళ్లు బుడిబుడి అడుగులేస్తున్న రోజుల్లోనే ఫేస్‌బుక్, ఐఫోన్ సంరంభం మొదలైంది. వీళ్లకు ఇంటర్నెట్ దాదాపుగా ఇంటిపేరులా తయారైంది. సామాజిక మాధ్యమాలు, సంబంధాలు, సమాచార గోప్యత.. ఈ సంరంభాలు, సంక్షోభాలు, విప్లవాల మధ్య పెరుగుతున్న తరం ఇది. అంతా బాగుంటే 22వ శతాబ్దాన్ని చూడబోతున్న తొలితరం ఇది. ఏ రకంగా చూసుకున్నా కూడా దీన్నే 'తొలి గ్లోబల్ తరం' అనుకోవచ్చు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఈ తరం 'చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష' అని గిరి గీసుకునే తరం కాదని అర్థమవుతోంది. లండన్‌కు చెందిన వార్కే ఫౌండేషన్ 20 దేశాల్లో వేలాది మందిని పలకరించినప్పుడు వీరంతా కూడా తమకోసం, తమ కుటుంబం కోసమే కాదు.. సమాజానికి తోడ్పడటం, ఎంతో కొంత సానుకూలంగా సహకరించటం ముఖ్యమని బలంగా నమ్ముతున్నట్టు తేలింది. వాస్తవానికి తమ తల్లిదండ్రులు, తాతముత్తాతలు ఏమీ చెయ్యలేక చేతులెత్తేసిన ఎన్నో ప్రపంచ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఈ తరం నెత్తినే పడబోతోంది. ఈ తరం పెరిగిపెద్దై.. ప్రపంచ నాయకత్వం వహించి.. ఈ ప్రపంచాన్ని మెరుగైన సమాజంగా తీర్చిదిద్దగలదా? అన్న సందేహాలూ తరచూ వినపడుతున్నాయి. గోరంతలు కొండంతలైపోతున్న ఈ 'సామాజిక మాధ్యమాల' హడావుడి యుగంలో నేటి యువతకు సంబంధించిన వాస్తవాలు మరుగునపడిపోతున్నాయి. అయితే ఈ యవ్వన తరం మనసులోకి తొంగిచూసినప్పుడు ఇంతటి భయాలు పెట్టుకోవాల్సిన అవసరం కనబడటం లేదని సర్వే అభిప్రాయపడటం విశేషం. ప్రాపంచిక దృక్పథంలోగానీ, పురోగామి ఆలోచనల్లోగానీ, లింగ, మత వివక్షలకు దూరంగా అందరినీ సమాదరణతో కలుపుకుపోవటంలోగానీ.. యువత ఎక్కడా వెనకబడిలేరని సర్వేలో తేలటం విశేషం. అమెరికా, ఐరోపాలతో సహా ప్రపంచవ్యాప్తంగా 'బ్రెగ్జిట్' వంటి పరిణామాల నేపథ్యంలో.. ఎక్కడికక్కడ ప్రజల మధ్య సమైక్యతను కాకుండా వైరుధ్యాలను, వ్యత్యాసాలను పెంచి చూపించే సంకుచిత జాతీయవాదాలు పెల్లుబుకుతూ, ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టే విధానాలు బలం పుంజుకుంటున్న తరుణంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ యువతరం అభిప్రాయాలను తెలుసుకోవటం గొప్ప ఊరటనిస్తోందని వార్కే ఫౌండేషన్ వ్యాఖ్యానిస్తోంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

కేంద్ర సహాయమంత్రి గజేంద్రసింగ్ షెకావత్

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: భారతీయ వ్యవసాయ పద్ధతుల ద్వారానే సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సూచించారు. 'నాటి వృక్ష ఆర్వేదం' అనే పుస్తకంలో అనేక వ్యవసాయ పద్ధతులు ఉన్నాయని వాటిని నేడు పాటించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో 'భూ సంపోషణ్' అనే అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. ఏకలవ్య ఫౌండేషన్, అక్షయకృషి పరివార్, ఐఐసీటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సదస్సు ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనదేశంలో మూడు వందల ఏళ్ల క్రితమే వెదురు బొంగుల ద్వారా బిందు సేద్యంతో పంటలు సాగు చేశారని.. కానీ వాటిని గుర్తించకుండా నేడు ఇజ్రాయెల్ నుంచి బిందుసేద్యం పద్ధతులను దిగుమతి చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న పద్ధతులను గుడ్డిగా అనుసరించడం తగదన్నారు. 2025 నాటికి యూరియా వాడకాన్ని సగానికి తగ్గించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి సూర్యప్రతాప్ మాట్లాడుతూ.. భూతల్లి సంరక్షణ కోసం సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. పంటలకు ఎక్కువ మోతాదులో వాడడంతోనే రైతులకు నష్టాలు వస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ మాజీ కార్యదర్శి భాగయ్య, ఎన్ఐఆర్‌డీ నుంచి డా. డబ్ల్యూఆర్ రెడ్డి, ఇంఫాల్‌లోని సీఏయూ ఉపకులపతి డా.ప్రేమ్‌జీత్‌సింగ్, ప్రొ. జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఉపకులపతి డా.ప్రవీణ్ రావు తదితరులు ప్రసంగించారు.

అమెరికా వైమానిక స్థావరంలోకి కారుతో చొరబడ్డ భారతసంతతి వ్యక్తి

- వాహనంలోనే సజీవదహనం

న్యూయార్క్: అమెరికాలోని ఓ వైమానిక స్థావరంలోకి.. భారత సంతతికి చెందిన హఫీజ్ కాజీ (51) అనే వ్యక్తి కారుతో చొరబడ్డాడు. అనంతరం వాహనం ప్రమాదానికి గురై.. మంటల్లో చిక్కుకుంది. దీంతో కారులోనే అతడు సజీవదహనమయ్యాడు. ఫెయిర్‌ఫీల్డ్‌లోని ట్రావిస్ వైమానిక స్థావరంలో బుధవారం ఈ ఘటన జరిగింది. కాజీ కారులో ఐదు ప్రొపేన్ ట్యాంకులు, ఇంధనంతో ఉన్న మూడు ప్లాస్టిక్ డబ్బాలు, కొన్ని లైటర్లు, ఓ బ్యాగు ఉన్నట్లు ఎఫ్‌బీఐ అధికారులు గుర్తించారు. కాజీ ఎందుకు ఈ చర్యకు పాల్పడ్డాడన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదని.. అతడికి ఉగ్రవాద సంబంధాలున్నట్లుగా ఆధారాలేవీ తమకు లభించలేదని పేర్కొన్నారు. 1993 నుంచి కాజీ అమెరికాలో నివాసముంటున్నాడని.. అమెరికాలో అతడి కుటుంబ సభ్యులు ఎవర్నీ తాము గుర్తించలేకపోయామని తెలిపారు. భారత్‌లోని అతడి బంధువుకు మాత్రం సమాచారం చేరవేశామని పేర్కొన్నారు.

భద్రాద్రిలో వైభవంగా ధ్వజారోహణం



రామాలయం ఉత్తరద్వారం వద్ద కళాకారుల సహస్ర గళార్చన.(అంతర్‌చిత్రంలో కీర్తనలను ఆలపిస్తున్న సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ తదితరులు)

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం బంగారు తులసి అర్చన వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. శాస్త్రోక్తంగా రెండు రకాల చెట్ల చెక్కలతో అగ్నిని పుట్టించి యాగశాలలో అగ్ని ప్రతిష్ఠాపన చేయడంతో ఈ వేడుక నయనానంద భరితమైంది. ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని గరుడ మూర్తికి ఆరగింపు చేసి భక్తులకు అందించారు. దేవతలంతా వచ్చి సీతారాముల కల్యాణాన్ని వీక్షించాలని దేవతాహ్వానం పలికారు. ఆదివారం ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుందని, 26న జరిగే కల్యాణానికి అన్ని ఏర్పాట్లుపూర్తయ్యాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రభాకర శ్రీనివాస్ తెలిపారు.

సహస్ర గళార్చన: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉత్తరద్వారం ఎదుట సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ నేతృత్వంలో సహస్ర గళార్చన ఘనంగా జరిగింది. వెయ్యి మంది కళాకారులు భక్త రామదాసు కీర్తనలను ఆలపించి సీతారాములకు తమ గానామృతంతో అభిషేకం చేశారు.

దేశ ప్రజలకు ఉప రాష్ట్రపతి శుభాకాంక్షలు

ఈనాడు, దిల్లీ: పితృవాక్య పరిపాలకుడైన శ్రీరాముడి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆయన దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ధర్మానికి ప్రతీకగా నిలిచి.. న్యాయానికి, విలువలకు, సత్యానికి కట్టుబడి.. శ్రీరాముడు సుపరిపాలన అందించినట్లు పేర్కొన్నారు.

'ఎర్త్ అవర్'కు పార్లమెంటు సంఘీభావం

- గంటపాటు దీపాలు ఆర్పివేత

దిల్లీ: 'వరల్డ్ ఎర్త్ అవర్'కు దేశవ్యాప్తంగా సంఘీభావం వ్యక్తమైంది. శనివారం రాత్రి 8.30-9.30 గంటల మధ్య దిల్లీలోని పార్లమెంటు భవన సముదాయం, రాష్ట్రపతి భవన్, ఇండియా గేట్, నిర్మాణ్‌భవన్, శాస్త్రి భవన్‌ల వద్ద దీపాలను ఆర్పివేశారు. హైదరాబాద్‌లోని బుద్ధవిగ్రహం, కోల్‌కతాలోని హౌరా బ్రిడ్జి వద్ద కూడా దీపాలను ఆర్పివేసినట్లు... ఈ ప్రచార కార్యక్రమ నిర్వహణ సంస్థ 'వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్' అధికారులు తెలిపారు. వివిధ రంగాల ప్రముఖులు, రాజకీయ నేతలు కూడా తమ కార్యాలయాలు, నివాసాల వద్ద దీపాలను ఆర్పివేయడం ద్వారా తమ మద్దతు ప్రకటించారు.



ఎర్త్ అవర్ సందర్భంగా శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 వరకూ చీకటిలో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రాంగణం

నేరాలు మనదేశంలోనే తక్కువ

- అభివృద్ధి చెందిన దేశాల్లో అధికం
- అమెరికాలో ప్రతి లక్ష మందిలో 666 మంది జైళ్లలోనే..
- భారత్‌లో ఆ సంఖ్య 33 మందే

దిల్లీ: కాలుష్యం, అపరిశుభ్ర పరిసరాలు, పేదరికం, అవినీతి తదితర అంశాల్లో ప్రపంచ దేశాలతో పోల్చినప్పుడు మన దేశానికి గౌరవప్రదమైన రికార్డులేవీ లేని విషయం తెలిసిందే. సంతోష సూచీలోనూ మన స్థానం అట్టడుగునే. అయితే, ఒక అంశంలో మాత్రం అభివృద్ధి చెందిన దేశాల కన్నా ఎంతో మెరుగైన స్థితిలో ఉన్నాం. అగ్రరాజ్యాల్లో నేరాలు, నేరగాళ్ల సంఖ్య అత్యధికంగా ఉండటం గమనార్హం. అమెరికాలో ప్రతి లక్ష మంది జనాభాలో 666 మంది నేరగాళ్లే. సుమారు 21.5 లక్షల మంది ఆ దేశంలో కారాగార ఊచలు లెక్కిస్తున్నారు. ప్రతి లక్ష జనాభాకు 410 మంది నేరస్థులతో ఆ తర్వాత స్థానంలో రష్యా ఉంది. భారత్‌లో ఈ సంఖ్య అత్యల్పంగా 33 మందేనని బ్రిటన్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినల్ పాలసీ రీసెర్చ్ (ఐసీపీఆర్) వెల్లడించింది. పొరుగుదేశాలైన చైనా(118), శ్రీలంక (78), నేపాల్ (65), పాకిస్థాన్ (44)తో పోల్చుకున్నా మనదేశంలో నేరాల సంఖ్య తక్కువగా ఉండటం ఊరట కలిగించే అంశమే.

భారత్	జపాన్	జర్మనీ	ఇటలీ	ఫ్రాన్స్	చైనా	బ్రిటన్	బ్రెజిల్	రష్యా	అమెరికా
33	45	77	95	101	118	143	323	410	666

మన జైళ్లలో 67% మంది విచారణ ఖైదీలే..

మన దేశంలో జైళ్లలో ఉన్న వారిలో మూడింట రెండువంతుల మంది విచారణ ఖైదీలే. కారాగారాల్లో ఉన్న ఖైదీల్లో 67.2% మంది తీర్పుల కోసం ఎదురుచూస్తున్నారు. అమెరికా జైళ్లలో విచారణ పూర్తికావాల్సిన వారి శాతం 20.3% మాత్రమే. బ్రెజిల్‌లో వీరు 36.2%. ఇక కిక్కిరిసిన జైళ్లలో 454% ఆక్యుపెన్సీతో హైతీ అగ్రస్థానంలో ఉంది. కారాగారాల సామర్థ్యానికి నాలుగున్నర రెట్లు అధికంగా అక్కడ జైళ్లలో ఖైదీలను కుక్కుతున్నారు. ఈ విషయంలో భారత్... ప్రపంచంలోని 205 దేశాల్లో 86వ స్థానంలో ఉంది. భారతదేశ జైళ్లలో 100 మంది ఖైదీలను ఉంచాల్సిన చోట 114 మందిని నిర్బంధిస్తున్నారు. అమెరికాలో ఈ శాతం 104గా ఉంది. వసతుల విషయంలో మన దేశ జైళ్లు వెనుకబడే ఉన్నాయి.

ఖైదీల సంఖ్య...	
అమెరికా	21,45,100
చైనా	16,49,804
బ్రెజిల్	6,72,722
భారత్	4,19,623

తెలుగులోనే..రైతు పేరు

- రైతు బంధు చెక్కులపై ముద్రించేందుకు వ్యవసాయశాఖ యత్నాలు
- రెవెన్యూ నుంచి సరైన సమాచారం రాక ఇబ్బందులు

ఈనాడు, హైదరాబాద్: 'రైతుబంధు' పథకం కింద ఎకరానికి రూ.4 వేల చొప్పున ఇచ్చే చెక్కుపై రైతు పేరును తెలుగులోనే ముద్రించేందుకు వ్యవసాయశాఖ ప్రయత్నిస్తోంది. 'జాతీయ సమాచార కేంద్రం'(ఎన్‌ఐసీ)లో తెలుగు సాఫ్ట్‌వేర్ ద్వారా గత రెండు రోజులుగా ఈ మేరకు కసరత్తు చేస్తోంది. ఆంగ్లంలో రైతు పేరును టైప్ చేస్తే తెలుగు అక్షరాలు కొన్నిచోట్ల సరిగా రాకపోవడంతో.. వాటిని సరిచేసేందుకు సాఫ్ట్‌వేర్ నిపుణులతో చర్చలు జరుపుతోంది.

సాధారణంగా చెక్‌పై పేరును ఆంగ్లంలో రాయడం బ్యాంకుల ఆనవాయితీ. రైతు బంధు పథకం కింద తెలుగులో పేరు ముద్రించి ఇచ్చేలా వ్యవసాయశాఖ బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతోంది. మొత్తం ఆరు బ్యాంకులకు చెక్‌ల ముద్రణ బాధ్యతలు ఇవ్వగా.. రెండు మాత్రమే హైదరాబాద్‌లో ముద్రించే అవకాశాలున్నాయి. మిగతా బ్యాంకులు కర్ణాటకలోని మణిపాల్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ముద్రిస్తామని తెలిపాయి. ముద్రణ పూర్తయ్యాక వాటిని బ్యాంకులు వ్యవసాయ కమిషనర్ కార్యాలయానికి అప్పగిస్తాయి. అటు తర్వాత మండలాలు, జిల్లాల వారీగా వ్యవసాయాధికారులను పిలిపించి.. వాటిని అప్పగించేందుకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. 'రైతుల్లో చాలామంది తక్కువ అక్షరజ్ఞానం ఉన్నవారే. ఆంగ్లంలో పేరు రాస్తే గుర్తించడం కష్టం. అదే తెలుగులో ఇస్తే సులభంగా గుర్తించడంతోపాటు.. ఎక్కువగా సంతోషిస్తారు. అందుకే ఈ దిశగా ప్రయత్నం చేస్తున్నాం.' అని అధికార వర్గాలు తెలిపాయి.

డిజిటల్ సమాచారంలోనూ తప్పులు...

రెవెన్యూ శాఖ నుంచి శనివారం వరకూ కూడా పూర్తిస్థాయిలో భూముల ఖాతాల వివరాల డిజిటల్ సమాచారం వ్యవసాయశాఖకు అందలేదు. దశలవారీగా వీటిని ఇస్తున్నందున ఆ శాఖ చెక్కుల ముద్రణ నిమిత్తం వాటిని ఎన్‌ఐసీకి ఇస్తూ వస్తోంది. మరోవైపు చెక్‌ల ముద్రణలో భాగంగా రెవెన్యూశాఖ వ్యవసాయశాఖకు ఇస్తున్న వివరాల్లో అక్కడక్కడ తప్పులు దొర్లుతున్నట్టు సమాచారం. కొన్ని గ్రామాల్లో వాస్తవంగా భూమి సాగుచేస్తున్న రైతు పేరుతో పట్టాదారు పాసుపుస్తకం ఉన్నా.. అతని పేరుతో రెవెన్యూ దస్త్రాల్లో మ్యుటేషన్ జరగలేదని వ్యవసాయశాఖ గుర్తించింది. భూ దస్త్రాల ప్రక్షాళన అనంతరం పంచాయతీ కార్యాలయాల్లో ప్రకటించిన జాబితాల్లో తమ పేర్లు లేవని కొందరు రైతులు తహసీల్దారు, వ్యవసాయాధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 'భూములు కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు రెవెన్యూ కార్యాలయాల్లోని దస్త్రాల్లో ఆ వివరాలు నమోదు చేయించుకోవాలి. చాలామంది అలా చేయించుకోలేదు. అలాంటి వాళ్లంతా తమకు చెక్కు ఇస్తారా? లేదా? అంటూ వ్యవసాయాధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వాళ్లు సదరు రైతులను తహసీల్దార్ కార్యాలయాలకు పంపి.. దస్త్రాల్లో పేర్లు మార్చేందుకు సహకరిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది పేర్లు ఆన్‌లైన్‌లో నమోదుచేసిన వెంటనే.. ఆ వివరాలను ఎప్పటికప్పుడు ఎన్‌ఐసీ కార్యాలయానికి చేరుస్తూ..చెక్కుల ముద్రణకు ఏర్పాట్లు చేస్తున్నాం. అందుకు వ్యవసాయాధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం.' అని వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్ 'ఈనాడు'కు చెప్పారు.

17 గంటల్లో ఆస్ట్రేలియా నుంచి బ్రిటన్‌కు..!

- తక్కువ వ్యవధిలో చేరుకునే తొలి నాన్‌స్టాప్ విమానం ప్రారంభం

పెర్త్: 'కంగారూ మార్గం'గా పిలిచే ఆస్ట్రేలియా నుంచి బ్రిటన్‌కు అతి తక్కువ వ్యవధిలో చేరుకునే తొలి నాన్‌స్టాప్ (ఎక్కడా ఆగకుండా వెళ్లే) ప్రయాణికుల విమానం శనివారం ప్రారంభమైంది. ఆస్ట్రేలియాకు చెందిన కంటాస్ విమానయాన సంస్థ నడుపుతున్న ఈ విమానం పెర్త్ - లండన్ నగరాల మధ్య 14,498 కి.మీ.ల దూరాన్ని 17 గంటల్లో చేరుతుంది. ప్రపంచంలో ప్రయాణికులతో అత్యంత దూరం ప్రయాణించే విమానాల్లో ఇది మూడోదిగా నిలుస్తుందని కంటాస్ వెల్లడించింది. అలాగే అత్యంత ఎక్కువ దూరం ప్రయాణించే బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కూడా ఇదేనని తెలిపింది. ఆస్ట్రేలియా తూర్పు తీరప్రాంతం నుంచి ఐరోపాకు ఎక్కడా ఆగకుండా వెళ్లే ఈ ప్రయాణాన్ని 'ప్రాజెక్ట్ సన్‌రైజ్'గా సంస్థ అభివర్ణించింది. తక్కువ వ్యవధిలోనే ప్రయాణికులను చేరవేసే ఈ విమాన సేవల ద్వారా ఆస్ట్రేలియాలో పర్యాటకుల సంఖ్య పెరుగుతుందన్న ఆశాభావాన్ని కంటాస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అలాన్ జోయ్స్ వ్యక్తం చేశారు. 1947లో సిడ్నీ-లండన్ మార్గంలో కంటాస్ తొలిసారి విమానం నడిపినప్పటికీ అది 9 చోట్ల ఆగి.. 4 రోజులు ప్రయాణించేది. ప్రపంచంలో అత్యంత ఎక్కువ దూరం (అంతర్జాతీయ మార్గంలో) విమానాన్ని ఖతార్ ఎయిర్‌వేస్ దోహా నుంచి ఆక్లాండ్‌కు (14,535 కి.మీ.లు) నడుపుతోంది.

శాసనసభ సమావేశాల పొడిగింపు!

- 28, 29 తేదీల్లోనూ సభ
- పంచాయతీరాజ్ బిల్లు కోసం ప్రభుత్వం సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ సమావేశాలను మరో రెండు రోజులు పొడిగించే అవకాశం ఉంది. గతంలో నిర్ణయించిన ప్రకారం ఈనెల 27తో శాసనసభ సమావేశాలు ముగియాల్సి ఉంది. అయితే కొత్త పంచాయతీరాజ్ చట్టంపై బిల్లు ఇప్పటివరకూ సభకు రాలేదు. ఈ సమావేశాల్లోనే దీన్ని తప్పనిసరిగా ప్రవేశపెడతామని సీఎం కేసీఆర్ చెప్పారు. దీనిని అనుగుణంగా సమావేశాలను పొడిగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఆదివారం ఓస్పష్టత వచ్చే అవకాశం ఉంది. పంచాయతీరాజ్ చట్టాన్ని ఈనెల 26వరకూ సిద్ధం చేసి, 27న ఉదయం మంత్రిమండలి సమావేశంలో ఆమోదించాలని భావిస్తున్నారు. 27న శాసనసభ కార్యకలాపాల సలహా కమిటీ(బీఏసీ) సమావేశాన్ని నిర్వహించి, సమావేశాల పొడిగింపుపై నిర్ణయం తీసుకుంటారు. 28, 29 తేదీల్లో జరిగే సభలో పంచాయతీరాజ్ బిల్లు, దాని అనుబంధంగా గ్రామ పంచాయతీలను పట్టణాల్లో విలీనం చేసే బిల్లులపై చర్చించి, ఆమోదం తీసుకునే అవకాశం ఉంది. సమావేశాల పొడిగింపుపై ఆదివారం జరిగే సమావేశాల్లో స్పష్టత వస్తుంది. సీఎం సూచనలకు అనుగుణంగా పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనకు అధికారులు కృషి చేస్తున్నారు.

మేలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుని పదవీ విరమణ

తెలంగాణ పబ్లిక్ కమిషన్ సభ్యుడు సీహెచ్‌విద్యాసాగర్‌రావు వచ్చే మే24న పదవీ విరమణ పొందనున్నారు. నిబంధనల మేరకు 62 సంవత్సరాల వయస్సు నిండుతున్నందున ఆయన పదవీ విరమణకు అనుమతిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.



రాష్ట్రపతిభవన్ వద్ద జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్ వాల్టర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ దంపతులు, ప్రధాని మోదీ

మోదీతో జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్ భేటీ

వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతంపై చర్చలు

దిల్లీ: వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్ వాల్టెర్ స్టీన్‌మియెర్‌తో భారత అధినాయకత్వం శనివారం చర్చలు జరిపింది. ఉగ్రవాదం ఏ రూపంలోనున్నా కూకటివేళ్లతో పెకలిస్తామని ప్రతిన బూనింది. ఐదురోజుల పర్యటన నిమిత్తం దిల్లీ వచ్చిన ఫ్రాంక్‌తో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ చర్చలు జరిపారు. మధ్య దిల్లీలోని 90 ఎకరాల్లోఉన్న సువిశాల సుందర్ ఉద్యానవనంలో ఈ భేటీ జరిగింది. భిన్న అంశాలపై విస్తృత స్థాయిలో ఫ్రాంక్‌తో చర్చలు జరిపామని మోదీ ఓ ట్వీట్‌చేశారు. ద్వైపాక్షిక అంశాలతోపాటు అంతర్జాతీయ పరిణామాలపైనా చర్చలు జరిగినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ కూడా వెల్లడించారు. మరో వైపు భారత్, జర్మనీ ఒకేలాంటి ముప్పులను ఎదుర్కొంటున్నట్లు వెంకయ్యానాయుడు చెప్పారు. మన పొరుగున్న దేశం ఉగ్రవాదులను ప్రోత్సహిస్తోందంటూ పరోక్షంగా ఆయన పాకిస్థాన్‌పై విమర్శలు సంధించారు. ఉదయం రాష్ట్రపతి భవన్‌లో ఫ్రాంక్‌కు గౌరవ స్వాగతం లభించింది.

క్షయ రహిత ప్రపంచానికి ఉద్యమించండి!

ప్రధాని మోదీ పిలుపు

దిల్లీ: క్షయ వ్యాధి (టీబీ)ని సమూలంగా నిర్మూలించేందుకు దేశ పౌరులు, వివిధ సంస్థలు ఉద్యమించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా 'క్షయ రహిత ప్రపంచానికి' పౌరులే నాయకులు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇది మానవాళికి అద్భుతసేవగా అభివర్ణించారు. 2030 నాటికి క్షయను నిర్మూలించేందుకు ప్రపంచం లక్ష్యం పెట్టుకోగా.. భారత్‌లో అది 2025 నాటికే సాధ్యమయ్యేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

ఆఫ్రికా దేశాల పర్యటనలకు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి

ఈనాడు, దిల్లీ: భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ ఏడాది వివిధ ఆఫ్రికా దేశాల్లో పర్యటించనున్నారు. ఆ దేశాల్లో చైనా ప్రాబల్యం పెరుగుతున్న నేపథ్యంలో వాటితో సత్సంబంధాలకు కేంద్ర సర్కారు ప్రాధాన్యమిస్తోంది. దీంతోపాటు ఐక్యరాజ్యసమితి భద్రత మండలిలో శాశ్వత సభ్యత్వం పొందడానికి 55 ఆఫ్రికా దేశాల మద్దతును కూడ గట్టాల్సిన అవసరం ఉంది. ఉప రాష్ట్రపతి హోదాలో తొలి విదేశీ పర్యటన నిమిత్తం వెంకయ్యనాయుడు మే నెలలో లాటిన్ అమెరికా దేశాలైన పనామా, గ్వాటెమాలాలకు వెళ్లనున్నారు. అక్టోబరులో రెండో పర్యటన నిమిత్తం ఆఫ్రికాలోని బోట్స్‌వానా, మలావీ, గినియాలకు ఆయన వెళ్తారు. రాష్ట్రపతి కోవింద్ ఏప్రిల్‌లో మూడు (గినియా, స్వాజిలాండ్, జాంబియా) ఆఫ్రికా దేశాల్లో పర్యటించబోతున్నారు. గత అక్టోబరులోనే ఆయన తొలి విదేశీ పర్యటనగా ఇథియోపియా, జిబూతి దేశాలకు వెళ్లారు. తక్కువ వ్యవధిలోనే మళ్లీ ఆఫ్రికా పర్యటనకు ఆయన వెళ్తున్నారంటే దానికి భారత ప్రభుత్వ ప్రాధాన్యాలే కారణం. ఆఫ్రికా దేశాల్లో వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, నీటిపారుదల తదితర రంగాలను అభివృద్ధి చేయడానికి రూ.51,200 కోట్ల రుణాలను కేంద్ర ప్రభుత్వం సమకూర్చింది. బుర్కినాఫాసో, కామెరూన్, కాంగో, గినియా, లైబీరియా, రువాండా, సియెర్రాలియోన్, సోమాలియా సహా 18 ఆఫ్రికా దేశాల్లో 2018-21 మధ్య భారత రాయబార కార్యాలయాలు ఏర్పాటుకానున్నాయి.

ఆఫ్రికా దేశాల అభివృద్ధికి భారత్ చేయూత: ఉప రాష్ట్రపతి

దిల్లీ: ఆఫ్రికా దేశాలు చేస్తున్న అభివృద్ధి ప్రయత్నాలకు భారత్ చేయూతనిస్తుందని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. జింబాబ్వే ఉపాధ్యక్షుడు కాన్‌స్టాంటినో చివెంగా, ఉగాండా ఉపాధ్యక్షుడు ఎడ్వర్డ్ కివానుక స్సెకాండీ, మలావీ ఉపాధ్యక్షుడు సౌలోస్ క్లాస్ చిలీమాలతో వెంకయ్యనాయుడు శనివారం వేర్వేరుగా భేటీ అయ్యారు. ఆఫ్రికా దేశాలతో ఆర్థిక, సాంకేతిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు భారత్ ప్రాధాన్యమిస్తోందని చెప్పారు.

16 వరకూ కార్తీ అరెస్టు వద్దు!

దిల్లీ: ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో కార్తీ చిదంబరంను ఏప్రిల్ 16 వరకు అరెస్టు చేయకుండా దిల్లీ కోర్టు శనివారం ఆదేశాలిచ్చింది. సీబీఐ, ఈడీలు నమోదు చేసిన ఈ కేసుకు సంబంధించి కార్తీ ముందస్తు బెయిల్‌కు విజ్ఞాపన దాఖలు చేసిన నేపథ్యంలో.. రెండు దర్యాప్తు సంస్థలూ 3 వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ప్రత్యేక న్యాయమూర్తి ఓపీ సైనీ ఆదేశాలిచ్చారు. అలాగే అనుమతి లేకుండా కార్తీ దేశం విడిచివెళ్లరాదని న్యాయస్థానం ఆదేశించింది. కార్తీ తరఫున సీబీఐ దాఖలు చేసిన కేసులో సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్, ఈడీ కేసులో గోపాల్ సుబ్రమణ్యంలు వాదనలు వినిపించారు. కార్తీ తండ్రి కాంగ్రెస్ నేత పి.చిదంబరంతో పాటు తల్లి నళిని చిదంబరం కూడా విచారణ సందర్భంగా న్యాయస్థానానికి వచ్చారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తీకి దిల్లీ హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

ఛత్తీస్‌గఢ్‌లో పేలుడుకు పాల్పడ్డ మావోయిస్టులు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని సుకమా జిల్లాలో మెరుగుపరిచిన విధ్వంసకర పరికరంతో (ఐఈడీ)తో మావోయిస్టులు పేలుడుకు పాల్పడ్డారు. ఘటనలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. సిర్సెట్టి గ్రామంలో శనివారం జిల్లా రిజర్వు దళం (డీఆర్‌జీ) పోలీసులు మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ చేపడుతున్న సమయంలో ఈ పేలుడు జరిగినట్లు అధికారులు తెలిపారు.

కశ్మీర్‌లో ఇద్దరు పాక్ ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో జైషే మహమ్మద్ ఉగ్రవాదులకు, భద్రత దళాలకు మధ్య ఎదురుకాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు పోలీసులు తెలిపారు. దూరు ప్రాంతంలోని ఓ గ్రామంలో ముష్కరుల గురించి సమాచారం అందడంతో.. భద్రత దళాలు శుక్రవారం రాత్రి ప్రత్యేక గాలింపు ఆపరేషన్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు, భద్రత దళాల మధ్య ఎదురుకాల్పులు జరిగినట్లు తెలిపారు. అనంతరం రాత్రిపూట ఆపరేషన్ నిలిపివేసి.. ముష్కరులు పారిపోయేందుకు వీలులేకుండా ప్రాంతాన్ని భద్రత దళాలు ముట్టడించాయని.. శనివారం ఉదయం మళ్లీ రెండు వర్గాల మధ్య కాల్పులు జరిగాయని పేర్కొన్నారు.

తుపాకుల సంస్కృతిపై గళమెత్తిన యువత



అమెరికాలో అనేక దారుణాలకు కారణమవుతున్న తుపాకుల సంస్కృతిపై అక్కడి యువత ఆందోళన వ్యక్తం చేస్తోంది. దాదాపు ఐదు లక్షల మంది శనివారం వాషింగ్టన్‌లోని శ్వేతసౌధం వరకు ర్యాలీ నిర్వహించారు. శ్వేతసౌధాన్ని చేరుకోవడానికి ఉన్న రెండు ప్రధాన రహదారులైన కానిస్టిట్యూషన్ అవెన్యూ, పెన్సిల్వేనియా అవెన్యూల మీదుగా ప్లకార్డులతో తమ నిరసన వ్యక్తం చేశారు. అమెరికా చరిత్రలో తుపాకుల సంస్కృతిని నిరసిస్తూ ఈ స్థాయిలో ఆందోళన జరగడం ఇదే ప్రథమం. పెన్సిల్వేనియా అవెన్యూ మార్గంలో పోటెత్తిన ప్రజాగ్రహానికి దర్పణమీ చిత్రం

వివాదం ముగుస్తుందా? ముదురుతుందా?

- **తమ ప్రయోజనాలను కాపాడుకుని తీరుతామని విస్పష్టం చేసిన చైనా**
- **మేధో హక్కులను ఉల్లంఘించిందంటూ ఆ దేశంపై డబ్ల్యూటీవోకు అమెరికా ఫిర్యాదు**
- **అగ్రరాజ్యం ఆర్థిక మంత్రితో ఫోన్‌లో సంప్రదింపులు జరిపిన చైనా ఉప ప్రధాని**

బీజింగ్: అమెరికా-చైనాల నడుమ 'వాణిజ్య ఆంక్షల' వివాదం ముగుస్తుందో, ముదురుతుందోనన్న డోలాయమానం నెలకొంది. అమెరికా వాణిజ్య ఆంక్షల నేపథ్యంలో... ఆ దేశంతో చైనా సంప్రదింపులను ప్రారంభించింది. అయితే, తన ప్రయోజనాలను పరిరక్షించుకుంటానని మాత్రం గట్టిగానే చెబుతోంది. ట్రంప్ సర్కారు ఆంక్షలను విధించిన తర్వాత... చైనా ఉపప్రధాని లియూ హె అమెరికా ఆర్థిక మంత్రి స్టీవెన్ మ్యూచిన్‌తో శనివారం ఫోన్‌లో మాట్లాడారు. "రెండు దేశాలు హేతుబద్ధంగా వ్యవహరిస్తాయనీ.. వాణిజ్య సంబంధాలు కొనసాగేందుకు కలిసికట్టుగా కృషి చేస్తాయని చైనా ఇప్పటికీ ఆశిస్తోంది. తన ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి కృతనిశ్చయంతో ఉంది" అని లియూ అన్నట్లు చైనా మీడియా వెల్లడించింది.

ఆ దేశాన్ని నిలదీయండి...

తమ సంస్థలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని అమెరికా పెట్టుబడిదారులపై చైనా ఒత్తిడి తెచ్చిందనీ... యథేచ్ఛగా మేధో హక్కుల ఉల్లంఘనకూ పాల్పడిందని అమెరికా అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై 'అమెరికా వాణిజ్య చట్టం-1974' కింద 8 నెలలపాటు ఆ దేశ అధికారులు విచారణ చేపట్టారు. ఈ నివేదికను అందజేస్తూ... చైనాపై ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూటీవో)కు ఫిర్యాదు చేశారు. "మేధో హక్కుల ఉల్లంఘన; వివక్ష పూరితంగా సాంకేతిక అనుమతి ఒప్పందాలు చేసుకోవడంపై... చైనాను ప్రశ్నించాలని డబ్ల్యూటీవోకు తమ ఆర్థికశాఖ (యూఎస్‌టీఆర్) ఫిర్యాదు చేసింది" అని అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ లైథైజర్ వెల్లడించారు. ఈ పరిణామం పట్ల చైనా విచారం వ్యక్తం చేసింది. తాము డబ్ల్యూటీవో నిబంధనలను ఉల్లంఘించలేదంది. అమెరికా ప్రయోజనాలే ప్రపంచ ప్రయోజనాలు కాదంది. "స్వదేశ, విదేశీ సంస్థల న్యాయబద్ధమైన, మేధోపరమైన హక్కుల పరిరక్షణకు గట్టి చర్యలు తీసుకున్నాం" అని చైనా వాణిజ్యశాఖ పేర్కొంది.

కార్పొరేట్ వర్గాల్లో ఆందోళన


చైనా ఉత్పత్తులపై 60 బిలియన్ డాలర్ల వార్షిక దిగుమతి సుంకాన్ని విధిస్తూ గురువారం ట్రంప్ సర్కారు కార్యనిర్వాహక ఆదేశాలను జారీచేయడంతో- రెండు దేశాలమధ్య వర్తక పోరుకు తాజాగా తెరలేచింది. దీనికి ప్రతీకారంగా శుక్రవారం చైనా 3 బిలియన్ డాలర్ల విలువుండే 128 రకాల అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను 15% నుంచి 25% వరకూ పెంచుతామని హెచ్చరించింది. ఇదే జరిగితే అమెరికా వ్యవసాయ, ఇనుము, అల్యూమినియం తదితర ఉత్పత్తులకు ఎదురుదెబ్బ తప్పదు. ఆ దేశంలో ఉత్పత్తయ్యే సోయాలో మూడొంతులకుపైగా చైనాయే వినియోగిస్తోంది. రెండు దేశాల మధ్య వర్తక పోరు పట్ల కార్పొరేట్ దిగ్గజాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరు దేశాలు సంయమనం పాటించాలని బ్లాక్‌రాక్ సీఈవో లారీ ఫింక్, ఆపిల్ సీఈవో టిమ్ కుక్ తదితర అమెరికా సంస్థల ప్రముఖులు పిలుపునిచ్చారు. ప్రస్తుతం బీజింగ్‌లో జరుగుతున్న వాణిజ్య సదస్సులో వారు పాల్గొన్నారు.

ఇక ఉచిత వర్తకం సాగదు: ట్రంప్

మునుపటిలా చైనా ఇక ఉచితంగా అమెరికాలో వర్తకం చేసుకోవడం కుదరదని అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ''మేము చైనాతో ఎంతో స్నేహంగా ఉన్నాం. ఆ దేశంతో గొప్ప సంబంధాలున్నాయి. కానీ...చైనా కారణంగా గతేడాది 500 బిలియన్ డాలర్ల వర్తకం కోల్పోయాం. ఇకపై ఇలా జరగనివ్వం. చాలా ఏళ్లుగా చైనా ఉచితంగా వర్తకం సాగించింది. సమయం వచ్చింది. ఇకపై ఉచితం కుదరదు. బహుశా మా పట్ల చైనా నిష్పక్షపాత వైఖరి ఇక ముగియవచ్చు" అని ట్రంప్ విలేకరులతో అన్నారు. వర్తక లోటు కారణంగా 20 లక్షల మంది అమెరికన్లు నిరుద్యోగులయ్యారని శ్వేతసౌధం పేర్కొంది.

రాజుకుంటున్న అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం

చైనా ఉత్పత్తులపై 60 బిలియన్ డాలర్ల వార్షిక సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనికి ప్రతీకారంగా చైనా కూడా దీటుగానే స్పందించింది. మూడు బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను పెంచుతామని ప్రకటించింది.



చైనా వర్తక లక్ష్యాలు

వ్యవసాయం: అమెరికా సోయా బీన్స్ ఎగుమతులకు అతిపెద్ద మార్కెట్ చైనాయే. 2017లో 13.9 బిలియన్ డాలర్ల విలువైన సోయా ఎగుమతయింది.

బోయింగ్

2017లో బోయింగ్ 202 విమానాలను చైనాకు సరఫరా చేసింది. మరో 37 బిలియన్ డాలర్ల మొత్తాలకు ఒప్పందాలు చేసుకుంది. దీని వల్ల అమెరికాలో 1.50 లక్షల ఉద్యోగాలొచ్చాయి.

మోటార్ వాహనాలు

జనరల్ మోటార్స్ 3.9 మిలియన్ వాహనాలను గతేడాది చైనాలో విక్రయించింది. అమెరికాలో చైనా 3 మిలియన్ వాహనాలను అమ్మింది.

ఎలక్ట్రానిక్స్: చైనాలోని షెన్‌జెన్ నగరంలో ఆపిల్ సంస్థ ఐఫోన్ ఉత్పత్తి కేంద్రం ఉంది.

ఆర్థిక వ్యవస్థ: రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం కారణంగా మదుపుదార్లు పెట్టుబడులను సురక్షిత సాధనాలపై మళ్లించే పరిస్థితి వస్తుంది. స్టాక్ మార్కెట్లపై ప్రభావం ఉంటుంది.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

మాచ్‌ఖండ్(ఒడిశా), న్యూస్‌టుడే: ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా మత్తిలి సమితి పరిధి తులసి పర్వత శ్రేణుల వద్ద పోలీసులు, మావోయిస్టుల మధ్య శనివారం చోటుచేసుకున్న కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్పీ జగమోహన్ మీనా తెలిపిన వివరాల ప్రకారం... మల్కాన్‌గిరి జిల్లా డీవీఎఫ్ బలగాలు తులసి పర్వత శ్రేణుల వద్ద శనివారం కూంబింగ్ నిర్వహించాయి. మధ్యాహ్న సమయంలో పోలీసులకు మావోయిస్టులు ఎదురుపడడంతో వారి మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. సంఘటనలో ఓ మావోయిస్టు మృతిచెందగా, మిగిలినవారు తప్పించుకున్నారు. ఘటనా స్థలిలో బలగాలకు ఓ తుపాకీ, మావోయిస్టుల సాహిత్యం, ఇతర సామగ్రి లభించాయి. మృతిచెందిన మావోయిస్టు చత్తీస్‌గఢ్‌కు చెందిన ఏసీఎం ఒర్రా కవామిగా గుర్తించారు. మృతదేహాన్ని సాయంత్రం జిల్లా కేంద్రానికి తరలించారు.

నీరవ్ మోదీ ఇంటిలో రూ. 26 కోట్ల వస్తువులు స్వాధీనం

- **ఒక్క ఉంగరమే రూ. 10 కోట్లు!**
- **ముంబయిలో 3 రోజులుగా ఈడీ సోదాలు**



ముంబయి/ దిల్లీ: ఒక వజ్రపుటుంగరం రూ. 10 కోట్లు.. పెయింటింగులు రూ. 10 కోట్లు.. వాచీల ఖరీదు రూ. 1.4 కోట్లు.. ఇలాంటి విలువైన వస్తువులను నీరవ్ మోదీ ఇంటి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తాజాగా స్వాధీనం చేసుకుంది. రూ. 12 వేల కోట్ల పీఎన్‌బీ మోసం కేసులో ముంబయిలోని నీరవ్ మోదీకి చెందిన అపార్టుమెంటులో సీబీఐతో కలిసి ఈడీ 3 రోజులుగా సోదాలు నిర్వహించింది. విలువైన ప్రాచీన ఆభరణాలు సహా మొత్తం రూ. 26 కోట్ల వస్తువులను స్వాధీనం చేసుకుంది. ఇందులో అమృతా షేర్-గిల్, ఎం.ఎఫ్. హుస్సేన్, కె.కె. హెబ్బర్ వంటి ప్రముఖ చిత్రకారుల పెయింటింగులు కూడా ఉన్నాయి. వొర్లీ ప్రాంతంలో నీరవ్‌కు చెందిన విలాసవంతమైన సముద్రమహల్ అపార్టుమెంటులో ఈనెల 22 నుంచి సోదాలు జరిపినట్లు అధికారులు తెలిపారు. పీఎన్‌బీ మోసం వ్యవహారంలో నీరవ్ మోదీతో పాటు, అతని సమీప బంధువు గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీలపై అక్రమ నగదు చెలామణికి సంబంధించి ఈడీ 2 కేసులు నమోదు చేసింది. వారిద్దరూ దేశం విడిచి వెళ్లిపోయిన నేపథ్యంలో అంతర్జాతీయ అరెస్టు వారెంట్ కోసం ఇంటర్‌పోల్‌ను కోరింది. కాగా ఈడీ విజ్ఞప్తి మేరకు ముంబయి ప్రత్యేక న్యాయస్థానం ఇద్దరిపైనా బెయిల్‌కు వీల్లేని వారెంట్లు కూడా జారీచేసింది. మొత్తంగా ఈ వ్యవహారంలో ఈడీ దేశవ్యాప్తంగా ఇంతవరకు 251 సోదాలు నిర్వహించింది. వజ్రాలు, బంగారం, జాతిరాళ్లు తదితర చరాస్తులు, ఇతర స్థిరాస్తులు కలిపి దాదాపు రూ. 7,638 కోట్ల మేర ఆస్తులను జప్తు చేసింది.

రాజ్యాంగాన్ని ఇష్టారాజ్యంగా మార్చనివ్వం

- **జనాశీర్వాద యాత్రలో రాహుల్‌గాంధీ స్పష్టీకరణ**
- **అధికారంలోకి వచ్చాక జీఎస్టీని మారుస్తాం..**



చాముండి మాతను దర్శించుకున్న రాహుల్‌కి ప్రసాదం అందజేసి ఆశీర్వదిస్తున్న పురోహితుడు

ఈనాడు, బెంగళూరు: భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తనకు అనుకూలంగా రాజ్యాంగాన్ని ఇష్టమొచ్చినట్లు మార్చేందుకు కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. తమిళనాడు సరిహద్దులోని చామరాజనగర పట్టణంలో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార బహిరంగ సభ-జనాశీర్వాద యాత్రలో ప్రసంగించారు. కోస్తా, ఉత్తర కర్ణాటకలో ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక విధానాల్ని విమర్శించిన రాహుల్ గాంధీ, పాత మైసూరు ప్రాంత పర్యటనలో దళితులు ఎక్కువగా ఉండే చామరాజనగరలో రాజ్యాంగ సవరణ విషయాన్ని ఎత్తుకున్నారు. 'భాజపా నేతలు కొత్త శైలిలో రాజ్యాంగంపై దాడిని ప్రారంభించారు. అంబేడ్కర్ రాజ్యాంగం కోసం పోరాడారు. కమలనాథులు ఇప్పుడు రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే మా హెచ్చరిక.. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజ్యాంగాన్ని తిరగ రాసేందుకు అంగీకరించమ'ని పేర్కొన్నారు.

ప్రజల ఆస్తి శ్రీమంతులకు దారాదత్తం: 'భాజపా పాలకులు ప్రజల ఆస్తిని శ్రీమంతులకు దారాదత్తం చేస్తున్నారు. బడా శ్రీమంతులకు ఇచ్చిన రూ.2.5 లక్షల కోట్ల రుణాల్ని అవలీలగా మాఫీ చేశారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల రుణాల్ని మాఫీ చేసేందుకు మాత్రం మనసు రావడం లేదం'టూ ధ్వజమెత్తారు.

గబ్బర్ సింగ్ టాక్స్‌ను మారుస్తాం: 2019 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని చేపట్టిన తర్వాత గబ్బర్ సింగ్ టాక్స్‌గా మారిన జీఎస్టీను మారుస్తామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మైసూరు మహారాణి కళాశాల విద్యార్థినులతో ముఖాముఖి సందర్భంగా ఈ మేరకు హామీ ఇచ్చారు. ఒకటే దేశం, ఒకటే పన్ను విధానాన్ని అవలంబిస్తామన్నారు 'పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బ. మా పార్టీ దీనిని వ్యతిరేకించిందని' ఆయుష్య అనే విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అవినీతిపరుల భరతం పట్టేలా..: దిల్లీలో సమాజ సేవకుడు అన్నా హజారే చేపట్టిన నిరశన నేపథ్యంలో.. 'మేము రాజ్యాధికారాన్ని చేపడితే నూటికి నూరు పాళ్లు అవినీతిపరుల భరతం పట్టే లోక్‌పాల్ శాసనాన్ని అమలు చేస్తామని' భరోసా ఇచ్చారు. డోక్లామ్ వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించే సమర్థత తమకుందన్నారు.

'సర్' అనొద్దు ..రాహుల్ అని పిలవండి: ముఖాముఖిలో విద్యార్థినులు రాహుల్‌ను 'సర్' అని సంబోధించగా. .రాహుల్ స్పందిస్తూ 'మీకు ఇబ్బంది లేకుంటే నన్ను పేరు పెట్టి పిలవండి' అన్నారు. దీంతో విద్యార్థినులు రాహుల్, రాహుల్ అంటూ ప్రశ్నించటాన్ని ఆరంభించారు. తనకు రాజకీయమే జీవితమైందని, రాజకీయాల్ని వదలి మరో రంగం వైపు దృష్టి మళ్లించలేకపోయానన్నారు.

సెల్ఫీ కోసం వేదిక దిగి..: గంభీరంగా ముఖాముఖి కార్యక్రమం జరుగుతుండగా.. ముస్లిం విద్యార్థిని ఒకరు 'మీతో సెల్ఫీ' అంటూ విన్నవించారు. వెంటనే రాహుల్ వేదిక నుంచి కిందకు దిగి ఆమె చెంతకు వెళ్లి నిలుచున్నారు. ఆ యువతి 'స్మైల్ ప్లీజ్' అనటంతో రాహుల్ అలానే చేశారు. మైసూరుకు పది గంటల ప్రాంతంలో వచ్చిన రాహుల్ విమానాశ్రయం నుంచి చాముండి కొండకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.


కేసులు పేరుకుపోతుంటే పట్టించుకోరేం?: రాహుల్

దిల్లీ: దేశంలోని అన్ని న్యాయస్థానాల్లో కేసులు భారీగా పేరుకుపోతుంటే కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. న్యాయమూర్తుల కొరతను భర్తీ చేయాల్సింది పోయి... ప్రజలపై తప్పుడు సమాచారాన్ని బలవంతంగా రుద్దడంలో మంత్రివర్యులు నిమగ్నమయ్యారని ఆయన విమర్శించారు. వివాదాస్పద డేటా సంస్థ-కేంబ్రిడ్జి అనలిటికా సేవల్ని కాంగ్రెస్ వినియోగించుకొందని మంత్రి ఇటీవల చేసిన ఆరోపణ నేపథ్యంలో రాహుల్ శనివారం ట్విటర్లో స్పందించారు. సుప్రీంకోర్టులో 55 వేలు, హైకోర్టుల్లో 37 లక్షలు, దిగువ కోర్టుల్లో 2.6 కోట్ల కేసులు పేరుకుపోయాయని ఆయన చెప్పారు. హైకోర్టుల్లో 400కి పైగా న్యాయమూర్తుల ఖాళీలను, దిగువ కోర్టుల్లో 6000 ఖాళీలను భర్తీ చేయలేదని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంలో జాప్యానికిగానూ ప్రధాని నరేంద్రమోదీని రాహుల్ తప్పుపట్టారు. '2016లో ఉత్తరాఖండ్‌లో విధించిన రాష్ట్రపతి పాలనను ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్ తప్పుపట్టారు. అందుకే సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియామకానికి ఆయన పేరు పరిశీలనకు వచ్చినప్పుడు మోదీ అహం దెబ్బతింది. ఉన్నత న్యాయస్థానాల్లో నియామకాలకు వచ్చిన 100 మందికి పైగా పేర్లను కేంద్రం అట్టిపెట్టింది. ఇది జ్యుడిషియరీ డీమానిటైజేషన్' అని రాహుల్ మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఆధార్ డేటా లీక్ కాలేదు: ఉడాయ్

దిల్లీ: ఆధార్ డేటా తాజాగా లీక్ అయిందంటూ వ్యాపార సాంకేతిక వార్తా పోర్టల్-జడ్‌డీనెట్‌లో వెలువడిన కథనాన్ని 'భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ' (ఉడాయ్) తోసిపుచ్చింది. దీనిలో ఎంతమాత్రం నిజం లేదనీ, ఆ పోర్టల్‌పై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామనీ ఉడాయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏమాత్రం వాస్తవాల్లేకుండా బాధ్యతారాహితంగా, తప్పుడు సమాచారాన్ని ఆ పోర్టల్ ప్రచారం చేసిందని పేర్కొంది. 'కేవలం ఆధార్ సంఖ్య మూడో వ్యక్తి వద్ద ఉన్నంతమాత్రాన అది సంబంధిత వ్యక్తి భద్రతకు ముప్పేమీ కాదు. దానివల్ల ఆర్థిక నేరాలేమీ జరిగిపోవు. ఎందుకంటే ఆధార్ ద్వారా ఒక లావాదేవీ పూర్తి కావాలంటే వేలిముద్రలు, ఐరిస్, లేదా కార్డుదారునికి పంపించే ఏకకాల సంకేతం (ఓటీపీ) అవసరం' అని స్పష్టం చేసింది. ఆధార్ తీసుకున్నవారి పేర్లు, వారి ఆధార్ సంఖ్యలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర ప్రైవేటు సమాచారమంతా ఒక ప్రభుత్వరంగ కంపెనీ ద్వారా సులభంగా లభిస్తుందని ఈ పోర్టల్ వెల్లడించింది. 'ఇది కచ్చితంగా భద్రతపరమైన వైఫల్యమే. యూనిఫాం రీసోర్స్ లొకేటర్ ఉంటే చాలు. 20 నిమిషాల్లోపే ఎవరైనా వివరాలు పొందవచ్చు' అని పేర్కొంది. ఆధార్ డేటా బయటకు వెళ్లే అవకాశమే లేదని ఆ సంస్థ ఇటీవల సుప్రీంకోర్టులో కరాఖండీగా చెప్పిన నేపథ్యంలో ఇది చర్చనీయాంశమయింది.

లాలూకు 14 ఏళ్ల జైలు



రాంచీ: దాణా కుంభకోణానికి సంబంధించిన నాలుగో కేసులో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు కఠిన శిక్ష పడింది. ఆయనకు 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.60 లక్షల జరిమానాను విధిస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు శనివారం తీర్పు చెప్పింది. ఈ కుంభకోణానికి సంబంధించిన వేరు వేరు కేసుల్లో లాలూకు పడిన శిక్షల్లో ఇదే అత్యంత తీవ్రమైనది కావడం గమనార్హం. ఈ తీర్పును ఎగువ కోర్టులో సవాల్ చేస్తామని లాలూ తరఫు న్యాయవాది తెలిపారు.

1990లలో అవిభాజ్య బిహార్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా లాలూ వ్యవహరించిన సమయంలో ఈ దాణా కుంభకోణం చోటుచేసుకుంది. ఇందులో దుమ్కాలోని కోశాగారం నుంచి రూ.3.13 కోట్లను అక్రమంగా విత్‌డ్రా చేయడానికి సంబంధించిన నాలుగో కేసులో లాలూతోపాటు 18 మందిని ప్రత్యేక సీబీఐ కోర్టు ఈ నెల 19న దోషులుగా తేల్చిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్ర సహా 12 మందిని నిర్దోషులుగా ప్రకటించింది. దోషులకు శిక్షలను ఖరారు చేస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శివ్‌పాల్ సింగ్ తీర్పు చెప్పారు. లాలూకు భారత శిక్షా స్మృతి (ఐపీసీ)లోని పలు సెక్షన్ల కింద ఏడేళ్ల జైలు శిక్ష, రూ.30 లక్షల జరిమానా, అవినీతి నిరోధక చట్టాల కింద మరో ఏడేళ్లు, రూ.30 లక్షల జరిమానాను విధించారు. ఈ రెండు శిక్షలను ఒకదాని తర్వాత ఒకటి అనుభవించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. జరిమానా చెల్లించకుంటే మరో రెండేళ్ల పాటు జైల్లో గడపాల్సి ఉంటుందన్నారు.

ఈ కేసులో దోషులుగా తేలిన మిగతా 17 మందికి కూడా శిక్షను కోర్టు ఖరారు చేసింది. పశు సంవర్ధకశాఖ మాజీ ప్రాంతీయ సంచాలకుడు ఒ.పి.దివార్కర్‌కూ లాలూ ప్రసాద్ స్థాయిలో శిక్ష పడింది. ఆ శాఖకు చెందిన 9 మంది అధికారులకు, మాజీ ఐఏఎస్ అధికారి ఫూల్‌చంద్ సింగ్‌కు ఏడేళ్ల కారాగారం, రూ.30లక్షల చొప్పున శిక్ష పడింది. జరిమానా కట్టకుంటే అదనంగా 18 నెలల చొప్పున శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఏడుగురు దాణా సరఫరాదారులకు మూడున్నరేళ్ల కారాగారవాసం, రూ.15లక్షల జరిమానాను కోర్టు విధించింది.

- ★ చయబసా కోశాగారం నుంచి రూ.37.7 కోట్లను అక్రమంగా విత్‌డ్రా చేసిన తొలి కేసులో లాలూపై 2013లో దోషనిర్ధారణ జరిగింది. ఐదేళ్ల జైలుశిక్ష పడింది. ఫలితంగా ఆయన లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. ఆ తర్వాత ఆయన సుప్రీంకోర్టు నుంచి బెయిలు పొందారు.
- ★ దేవ్‌గఢ్ కోశాగారం నుంచి రూ.89.27 లక్షల అక్రమ విత్‌డ్రాకు సంబంధించిన రెండో కేసులో గత ఏడాది డిసెంబర్‌లో లాలూ దోషిగా తేలారు. ఆ కేసులో విధించిన మూడున్నరేళ్ల జైలుశిక్షను ఆయన ప్రస్తుతం అనుభవిస్తున్నారు.
- ★ రూ.37.62 కోట్ల విత్‌డ్రాకు సంబంధించిన మూడో కేసులో ఈ ఏడాది జనవరి 24న ఆయనకు ఐదేళ్ల జైలు శిక్ష పడింది.
- ★ రాంచీలోని దొరందా కోశాగారం నుంచి రూ.139 కోట్లు కొల్లగొట్టడానికి సంబంధించిన ఐదో కేసు ఇంకా పెండింగ్‌లో ఉంది.
- ★ ఛాతీలో నొప్పి, అసౌకర్యంగా ఉందని చెప్పడంతో లాలూను గత వారం రాంచీలోని రిమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆయన అక్కడే చికిత్స పొందుతున్నారు.

ఆర్జేడీ, భాజపా మాటల యుద్ధం

దాణా కుంభకోణంలో లాలూకు శిక్ష పడటంపై ఆర్జేడీ, భాజపా మధ్య మాటలయుద్ధం చెలరేగింది. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు మొత్తం రాజకీయ ప్రేరేపితమని ఆర్జేడీ జాతీయ అధికార ప్రతినిధి మనోజ్ ఝా ఆరోపించారు. దర్యాప్తే లోపభూయిష్ఠంగా జరిగినప్పుడు తీర్పు న్యాయబద్ధంగా వస్తుందని ఆశించలేమని ఆయన పేర్కొన్నారు. భాజపా వంటి రాజకీయ పార్టీల కుట్రకు లాలూ బాధితుడయ్యారని ఆరోపించారు. భాజపాకు వ్యతిరేకంగా విపక్షాలను ఏకతాటిపైకి తెస్తున్న తన తండ్రి ప్రాణానికి ముప్పు పొంచి ఉందని లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందని బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ చెప్పారు. 1996లో లాలూకు వ్యతిరేకంగా పట్నా హైకోర్టులో పిటిషన్లు వేసినవారిలో సుశీల్ కూడా ఉన్నారు. ఆ పిటిషన్ ఆధారంగానే కోర్టు ఈ కుంభకోణంలో సీబీఐ విచారణకు ఆదేశించింది. లాలూ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందన్న ఆరోపణలను సుశీల్ కొట్టిపారేశారు. జైల్లో ఆయనకు గట్టి భద్రతను కల్పిస్తున్నట్లు చెప్పారు. దాణా కుంభకోణం కేసులు నమోదయ్యేటప్పుడు భాజపా అధికారంలో లేదన్న విషయాన్ని ఆర్జేడీ నేతలు గమనించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు.

మాటలే.. పైసల్లేవు

- కేంద్రం నయాపైసా సాయం చేయలేదు
- ఐటీఐఆర్ కోసం దిల్లీ చుట్టూ 20సార్లు తిరిగా
- విభజన హామీలను అమలు చేయడం లేదు
- శాసనసభలో మంత్రి కేటీఆర్ ధ్వజం
- కేంద్రాన్ని దోషిగా చేయొద్దు: కిషన్‌రెడ్డి
- పద్దులపై చర్చలో సంవాదం

ఈనాడు - హైదరాబాద్

కేంద్రం నుంచి మాట సాయమే తప్ప పైసా సాయం ఉండటం లేదని తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం విభజన హామీలు నెరవేర్చడం లేదని.. తెలంగాణ, ఆంధ్రలకు పన్ను రాయితీలను నేటికీ ప్రకటించలేదని చెప్పారు. కేంద్రం ప్రకటించిన ఐటీఐఆర్‌కు నిధుల కోసం 20సార్లు దిల్లీ చుట్టూ తిరిగినా పైసా కూడా అందలేదన్నారు. అయినా ఐటీపరంగా అభివృద్ధిలో ముందున్నామని చెప్పారు. టెక్స్‌టైల్ పార్కుకు సాయమడిగితే తమ దగ్గర అలాంటి విధానమే లేదని కేంద్ర మంత్రి స్మృతిఇరానీ వ్యాఖ్యానించారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటును పొందుపర్చినందున దాన్ని మంజూరు చేయాలని ఎంతగా కోరినా కేంద్రం స్పందించనే లేదని విమర్శించారు. దీనికి భాజపా సభ్యుడు కిషన్‌రెడ్డి స్పందిస్తూ అన్నింటికీ కేంద్రాన్ని దోషిగా చేయొద్దన్నారు.

బడ్జెట్ పద్దులపై చర్చకు మంత్రి కేటీఆర్ సమాధానమిస్తూ కేంద్రం తీరును ఎండగట్టారు. 'తెలంగాణ సర్కారు చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ఇక్కడి భాజపా సభ్యులు విమర్శిస్తుంటారు. కేంద్ర మంత్రులు రాష్ట్రానికి వచ్చినప్పుడు మాత్రం పథకాలు అద్భుతమని ప్రశంసిస్తుంటారు. అవసాన దశలో ఉన్న పరిశ్రమలకు చేయూత ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండస్ట్రీస్ హెల్త్ క్లినిక్‌కు కేంద్రం ఇచ్చిందేమీ లేదు. ఐటీ విస్తరణలో జాతీయ సగటు 9 శాతమైతే తెలంగాణ సగటు 14 శాతం. గిరిజన, దళిత పారిశ్రామికవేత్తలకు ఏప్రిల్ 14న రాయితీ బకాయిలు అందిస్తాం. కాలుష్యం ఉత్పన్నం కాకుండా ప్రపంచంలోనే అత్యున్నతమైన ఔషధనగరి (ఫార్మాసిటీ)ని ముచ్చర్లలోని 19,333 ఎకరాల్లో నెలకొల్పుతాం. నగరంలోని 400 బల్క్ డ్రగ్ పరిశ్రమలను అక్కడికే పంపే యోచన ఉంది. నగరాన్ని కాలుష్య రహితం చేయడానికి 100 పరిశ్రమలను బాహ్యవలయ రహదారి అవతలకు పంపబోతున్నాం' అని చెప్పారు.

మీరిక్కడ.. మేమక్కడ అవుతాం: కిషన్‌రెడ్డి



భాజపా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ప్రతిపక్షంలో ఉన్నట్లు మాట్లాడారన్నారు. భవిష్యత్తులో భాజపా అధికారంలోకి వస్తుందని, అప్పుడు తెరాస సభ్యులు మేం కూర్చున్నచోట ఉండాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజల గొంతుకగా ప్రతిపక్షానికి సమస్యలను వెల్లడించే హక్కు ఉందన్నారు. కేటీఆర్ స్పందిస్తూ కేంద్రంలోని భాజపా ప్రభుత్వంతో విభజన హామీలను అమలు చేయించేలా రాష్ట్ర భాజపా సభ్యులు కృషి చేస్తే మంచిదన్నారు. ఒకప్పుడు ఇద్దరు ఎంపీలున్న భాజపా ఇప్పుడు అధికారంలో ఉందని, భవిష్యత్తులో తిరిగి రెండు స్థానాలకు వచ్చే అవకాశాలు కూడా ఉంటాయని వ్యాఖ్యానించారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న మీరు హైకోర్టు విభజన, పన్ను రాయితీల లాంటి విభజన హామీలను తీర్చాలని సూచించారు.

కిషన్‌రెడ్డి రాజీనామా చేయలేదు: నాయిని

హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయని కిషన్‌రెడ్డి ఇప్పుడు ప్రజల గొంతుక అనడం బాలేదన్నారు. కిషన్‌రెడ్డి బదులిస్తూ మొదటిసారి తాను పదవికి రాజీనామా చేశానన్నారు. తెలంగాణకు కట్టుబడి ఉండగా రాజీనామా అవసరం లేదని భాజపా జాతీయ నాయకులు చెప్పడంతో రెండోసారి చేయలేదన్నారు. ఉద్యమం నాటి కేసుల్లో ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నానన్నారు. కానిస్టేబుళ్లకు పదోన్నతులివ్వాలని, హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పోస్టింగులు ఇవ్వని వారికి వేతనాలు ఇవ్వాలని కిషన్‌రెడ్డి, సండ్ర వీరయ్య, సున్నం రాజయ్య, ఆర్.కృష్ణయ్య అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేషన్ల ఛైర్మన్లు ప్రొటోకాల్ వాహనాల్లో తిరుగుతున్నారని సండ్ర వీరయ్య చెప్పారు. రాష్ట్రంలో 11 వేల పోలీస్ ఉద్యోగాల నియామకాలను చేపట్టామని, త్వరలో మరో 14 వేల ఉద్యోగాలను భర్తీ చేయబోతున్నట్లు హోం మంత్రి నాయిని చెప్పారు. సూర్యాపేటలో కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఎస్సైపై వేటు వేశామని, అనుమతి లేని జంతువధ కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని కిషన్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు కమిటీ ఏర్పాటు చేశామని సున్నం రాజయ్య ప్రశ్నకు జవాబిచ్చారు. కోర్టు ఉత్తర్వులు లేకుండా ఆలయ భూములను ఇతర కార్యకలాపాలకు వినియోగించే అవకాశం లేదని దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, నిర్మల్‌లో కోతుల పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని అటవీ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు



రాజధానిలో రూ.26 వేల కోట్లతో 52 పనులు

మున్సిపల్ మంత్రి కేటీఆర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: 'హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్, రద్దీ నియంత్రణకు వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం(ఎస్ఆర్డీపీ) అమలు చేస్తున్నాం. ఇందుకు రూ.26,459.81 కోట్లు ఖర్చు చేస్తున్నాం' అని తెలంగాణ మున్సిపల్ వ్యవహారాలశాఖ మంత్రి కె.తారకరామారావు శనివారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు. ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, జాఫర్ హుస్సేన్ మిరాజ్‌ల పశ్నలకు జవాబిచ్చారు. 'ఎస్ఆర్డీపీ కింద చేపట్టిన 52 పనుల్లో 16 పనులు వేగంగా సాగుతున్నాయి. మున్సిపల్‌తోపాటు రైల్వే, రహదారులు, భవనాలశాఖ సమన్వయంతో మరికొన్ని పనులు చేపట్టేందుకు త్వరలో సమావేశం నిర్వహిస్తాం. పనులన్నింటికీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించలేదనటం వాస్తవంకాదు. నగరాభివృద్ధిలో భాగంగా మిలటరీ ప్రాంతం నుంచి 100ఎకరాలను సేకరించాలి. ఇందుకు ప్రతిగా 600ఎకరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. దీంతోపాటు ఏడాదికి రూ.30 కోట్లు సొమ్ము అదనంగా ఇవ్వమని కేంద్రం అడుగుతోంది. దీనిపై ఇప్పటికే ముగ్గురు రక్షణ మంత్రులను కలిసినా ఫలితం రాలేదు. కంటోన్మెంట్‌లో అండర్‌పాస్ నిర్మాణంపై ప్రజాభిప్రాయం సేకరిస్తే వారినుంచి విశేషస్పందన లభించింది'. అన్నారు. నూతన మున్సిపాలిటీల ఏర్పాటుపై ఈసమావేశాల్లో చట్టాన్ని తీసుకురాబోతున్నట్లు ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఇదేం నాణ్యత: కిషన్‌రెడ్డి

నగరంలోని అయ్యప్ప సొసైటీలో నిర్మించిన అండర్‌పాస్ మార్గం రెండు నెలలకే దెబ్బతింది. ఈఅంశంపై 'నాణ్యత డొల్ల' శీర్షికన 'ఈనాడు'తో వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ.. ప్రతిని స్పీకర్‌కు పంపారు. దీనికి కేటీఆర్ స్పందిస్తూ.. కిషన్‌రెడ్డి మాటలతో ఏకీభవిస్తామన్నారు.

భూగర్భ జలమట్టం పెరుగుతోంది: తుమ్మల

భూగర్భ జలమట్టాన్ని పెంచాలన్న ఉద్దేశంతో 193 బ్రిడ్జిల వద్ద చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గువ్వల బాలరాజు, రాథోడ్ బాపూరావులు అడిగిన ప్రశ్నలకు ర.భ.శా. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జవాబిచ్చారు. 'రూ.647.94 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 94 బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి 2019 డిసెంబరుకల్లా పూర్తిచేస్తాం' అన్నారు.

సీసీకుంటలో జూనియర్ కళాశాల: కడియం

వచ్చే విద్యాసంవత్సరం నుంచి సీసీకుంటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తామని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి.. ఎమ్మెల్యే ఆళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దేవరకద్రలో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు ప్రతిపాదనలపై సర్వే నిర్వహించాం. అవసరమనే నివేదిక వచ్చింది. ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం' అన్నారు.

9,493 కేసులు: మహేందర్‌రెడ్డి

నిబంధనలను అతిక్రమిస్తున్న ప్రయివేటు వాహనాలపై 9,493 కేసులు నమోదు చేసినట్లు రవాణాశాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే వి.శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ '54 పర్మిట్లను రద్దుచేశాం. 89 వాహనాల యాజమాన్యానికి నోటీసులిచ్చాం. రెండో డ్రైవర్ ఉండాలన్నదానిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో 1,100 బస్సులు తిరిగేవి. ప్రస్తుతం ఈసంఖ్య ఆరొందలకు తగ్గింది.' అన్నారు.

రాష్ట్ర హక్కులను తెరాస కాలరాస్తోంది

కాంగ్రెస్ శాసనసభాపక్ష ఉపనేత జీవన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్ర హక్కులను కాలరాసేలా పార్లమెంటులో తెరాస పార్టీ వ్యవహరిస్తోందని కాంగ్రెస్ శాసనసభాపక్ష ఉపనేత జీవన్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు, రాష్ట్రపతి ఎన్నికలు ఇలా ప్రతి విషయంలో కేంద్రానికి మద్దతిచ్చిన కేసీఆర్ నాలుగేళ్లుగా ప్రధానితో అంటకాగారన్నారు. ఎన్నికలు దగ్గర పడటం, ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత దృష్ట్యా ఇప్పుడు రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రంపై నెడుతున్నారని ఆరోపించారు. అవిశ్వాసం తీర్మానానికి మద్దతిస్తే రిజర్వేషన్ల అంశంతో పాటు విభజన హామీలు చర్చకు వచ్చే అవకాశం ఉందన్నారు. రిజర్వేషన్లపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై కాంగ్రెస్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చి, రాష్ట్ర ప్రయోజనాలపై సాగే చర్చలో పాల్గొనాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఇంటర్ విద్యార్థులకిస్తున్న ఫీజులను పెంచాలి: ఆర్.కృష్ణయ్య

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: వృత్తి విద్యా కోర్సులు చదివే బీసీ, ఈబీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లించి, ఇంటర్ విద్యార్థులకిస్తున్న రూ.1800 ఫీజును రూ.10వేలకు పెంచాలని తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంచి కళాశాలల్లో సీట్లు వచ్చినా ఫీజులు కట్టే స్తోమత లేక బీసీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. దీనిపై శాసనసభలో మాట్లాడే అవకాశం ఇవ్వకుండా గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మతాలు, కులాల వారిగా ఫీజుల మాఫీ వర్తింపు సరికాదన్నారు. దీని వల్ల హిందువులుగా పుట్టిన బీసీలు అన్యాయమైపోతున్నారన్నారు.

డిసెంబర్ నాటికి కాళేశ్వరం నీళ్లు

- 20 లక్షల ఎకరాలకు అందిస్తాం
- వానాకాలంలోపే మధ్యమానేరుకు జలాలు
- కాళేశ్వరానికి అన్యాయం చేసింది కాంగ్రెస్సే
- విభజన చట్టంలో చేర్చి ఉంటే జాతీయహోదా వచ్చేది: హరీశ్‌రావు

ఈనాడు- హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, 2018 చివరినాటికి స్థిరీకరణతో సహా 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. మధ్యమానేరు పనులు 99 శాతం పూర్తయ్యాయని.. మిగిలినవి వారం, పది రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. వర్షకాలంలోపే కాళేశ్వరం నుంచి 25 టీఎంసీల సాగునీటిని మధ్యమానేరుకు అందిస్తామని తెలిపారు. కాళేశ్వరం పనుల పురోగతిపై శాసనమండలిలో జరిగిన లఘుచర్చలో హరీశ్‌రావు మాట్లాడారు. 'కాళేశ్వరానికి జాతీయ హోదా రాకుండా అన్యాయం చేసింది కాంగ్రెస్సే. రాష్ట్ర విభజన చట్టంలో పోలవరంతో పాటు దీన్ని చేర్చలేదు. జాతీయ హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తాం. కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహట్టి నుంచి నీళ్లు తీసుకుపోతామని ప్రతిపాదించారు. సీఎం కేసీఆర్ పునరాకృతి చేసి ఉండకపోతే ఆ ప్రాజెక్టు తాగునీటి అవసరాలు కూడా తీర్చలేకపోయేది. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత తక్కువగా ఉందని కేంద్ర జలసంఘం చెప్పడంతో దిగువనున్న మేడిగడ్డకు మార్చాం. 18,25,700 ఎకరాల కొత్త ఆయకట్టుకు పనులు రేయింబవళ్లు సాగుతున్నాయి. మరో



18,82,970 ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తాం. మొత్తంగా 37 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుంది. కాళేశ్వరం తొలి ఫలితం వరంగల్ జిల్లాకు దక్కుతుంది. సీఎం కేసీఆర్ వందేళ్ల ముందుచూపుతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. భవిష్యత్తులో కృష్ణా జలాలు రాకపోయినా హైదరాబాద్‌కు ఇబ్బంది ఉండదు. గతంలో చేపట్టిన పనులు వృథాకాకుండా ప్రాణహిత ప్రాజెక్టును యథాతథంగా కొనసాగిస్తూ ఆదిలాబాద్ జిల్లా అవసరాలు తీర్చేలా చేస్తున్నాం.

పోలవరం కంటే వేగంగా..

ఏపీలో పోలవరం కంటే కాళేశ్వరం పనులు ఎన్నోరెట్లు వేగంగా జరుగుతున్నాయి. 2008- 14 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నికరంగా ఖర్చు చేసింది రూ.1,300 కోట్లే. మూడున్నరేళ్లలో మేం రూ.23 వేల కోట్ల పనులు చేశాం. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో కట్టిన ప్రాజెక్టులతో 14-15 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తుంటే తెరాస ప్రభుత్వం ఇప్పటికే 12 లక్షల ఎకరాల ఆయకట్టు తెచ్చింది. ఏ ఆయకట్టు పరిధిలో లేని గోదావరి ఒడ్డునున్న భూములకూ చిన్నచిన్న ఎత్తిపోతల పథకాలతో నీరందిస్తాం. ప్రాజెక్టుల్లో నిర్మించే రిజర్వాయర్లలో చేపల పెంపకంతో వచ్చే ఆదాయాన్ని శాశ్వతంగా ముంపు గ్రామాల ప్రజలకే అందిస్తాం. మల్లన్నసాగర్ రిజర్వాయర్ పూర్తికి మూడు, నాలుగేళ్లు పడుతుంది. అప్పటివరకు ఫీడర్ ఛానళ్లు వంటి ప్రత్యామ్నాయాల ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టుకు, హైదరాబాద్‌కు నీళ్లందించడంపై యోచిస్తున్నాం" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాళేశ్వరం నీళ్లలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే ఆ నీళ్లలో కొట్టుకుపోతామన్న భయంతో కాంగ్రెస్ నేతలు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, పగటి దొంగల్లా వ్యవహరిస్తున్నారని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 20 నెలల్లో ప్రాజెక్టు పూర్తయ్యేలా భగీరథ ప్రయత్నం చేస్తుంటే భూసేకరణ, పర్యావరణ అనుమతుల పేరుతో పనుల్ని ఆపేందుకు ప్రయత్నించారన్నారు. ఈ కేసుల వెనుక ఎవరున్నారు? న్యాయవాదికి ఫీజులు ఎవరి క్రెడిట్‌కార్డుల నుంచి చెల్లించారన్న ఆధారాలున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీలు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి సభలో ఉన్నప్పుడు బయటపెడతానన్నారు. వేగంగా నిర్మాణం విషయంలో కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రోజుకు 2 లక్షల బస్తాల సిమెంటును ఉపయోగిస్తున్నామన్నారు. పోలవరంలో ఒకచోట నాలుగు వేల మెట్రిక్ టన్నుల కాంక్రీటు పనిచేస్తుంటే.. కాళేశ్వరంలోని లింకు-1 (మేడిగడ్డ బ్యారేజి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు) పనుల్లోనే రోజుకు 25 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

ఏప్రిల్ నుంచి జీహెచ్ఎంసీలో బస్తీ దవాఖానాలు: లక్ష్మారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: పల్లెలకంటే పట్టణాల్లోని బస్తీలో ఉండే వారు ఎక్కువ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని.. పట్టణ నిరుపేదలకోసం జీహెచ్ఎంసీ పరిధిలో 45 బస్తీ దవాఖానాల్ని ప్రతిపాదించామని, వీటిలో 17 ఆసుపత్రులు ఏప్రిల్ నుంచి పనిచేస్తాయని ఆరోగ్యశాఖమంత్రి సి.లక్ష్మారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వైద్యులకొరత ఉన్న మాట వాస్తవమేనని, 570 మంది డాక్టర్ల నియామక ప్రక్రియ జరుగుతోందన్నారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి సమాధానమిస్తూ ఆహార కల్తీ నియంత్రణకు వ్యాపారులకు అవగాహన కల్పిస్తామన్నారు. కఠినంగా వ్యవహరించడానికి కేంద్ర చట్టానికి సవరణ చేయాలన్నారు. ఉద్యోగులు, పాత్రికేయుల ఆరోగ్యపథకం అమల్లో మార్పులు లేవని, పాలనాఅంశాల్లో భాగంగా సీఈఓను మార్చామని లక్ష్మారెడ్డి తెలిపారు. అదనంగా ఈఓను నియమించామని, త్వరలో పూర్తిస్థాయి సీఈఓను నియమిస్తామని చెప్పారు.

యథాతథంగా వెల్‌నెస్ కేంద్రాలు



తెలంగాణలో ఉద్యోగులు, పాత్రికేయుల వైద్యసేవల కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రాలు యథాతథంగా నడుస్తాయని, వాటిని ఆరోగ్యశ్రీలో కలిపే ప్రసక్తే లేదని వైద్యఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. ఉద్యోగులు, పాత్రికేయుల వైద్యసేవల పథకాలైన ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్‌ల నిర్వహణకు తాత్కాలికంగా నిమ్స్ సంచాలకులు మనోహర్‌ను ఇన్‌ఛార్జిగా పెట్టామని, త్వరలోనే వీటికోసం ప్రత్యేక కార్యనిర్వహణాధికారిని నియమిస్తామని వెల్లడించారు. శనివారం శాసనసభా ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 'వెల్‌నెస్ కేంద్రాలను గతంలో కంటే మెరుగ్గా, మరింత సమర్థంగా నిర్వహిస్తాం. మందుల కొరత త్వరలోనే తీరుతుంది. ఉద్యోగులు, పాత్రికేయులు, పింఛనుదారులు, వారి కుటుంబాలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం. ఎలాంటి అపోహలకు గురికావద్దు' అని పేర్కొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో మినీ ట్యాంక్‌బండ్: హరీశ్‌రావు

తెలంగాణలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో 90చోట్ల చెరువుల్ని సుందరీకరించి, మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామని సాగునీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.287 కోట్లతో జీహెచ్ఎంసీ 21 చెరువుల్ని సుందరీకరిస్తోందన్నారు. రాచకొండ రిజర్వాయర్ సర్వే వేగవంతంగా పూర్తిచేసి 4నెలల్లో పనులు చేపడతామన్నారు. మండలిలో మాట్లాడుతూ డిండి ప్రాజెక్టులో భాగంగా ఉన్న శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి 60రోజుల్లో 6టీఎంసీల నీటిని రాచకొండ రిజర్వాయర్‌కు అందిస్తామని.. ఇబ్రహీంపట్నం చెరువునూ నింపుతామని చెప్పారు.

గిరిజన, విశ్వకర్మ ఆలయాలకూ ధూపదీప నైవేద్యం: ఇంద్రకరణ్‌రెడ్డి

ధూపదీప నైవేద్యం పథకంలో గిరిజన, విశ్వకర్మ ఆలయాలకూ అవకాశం కల్పిస్తామని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హామీ ఇచ్చారు. గిరిజన ఆలయాలకు రిజిస్ట్రేషన్ లేకపోవడంతో అవకాశం కోల్పోతున్నాయని తెరాస ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నారు. ధూపదీప నైవేద్య పథకాన్ని విస్తరించి మరో మూడువేల ఆలయాలకు అమలు చేస్తామన్నారు.

దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపైనా శ్రద్ధ పెట్టాలి: రామచంద్రరావు

కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్ని వేగవంతంగా చేపట్టాలని, దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపైనా ఇదే శ్రద్ధపెట్టి పూర్తి చేయాలని భాజపా ఎమ్మెల్సీ రామచంద్రరావు పేర్కొన్నారు. మండలిలో కాళేశ్వరం పనుల పురోగతిపై లఘు చర్చలో మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయని, ఎప్పటిలోగా పూర్తిచేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. అంతర్రాష్ట్ర అనుమతుల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో భాజపా కూడా కృషి చేసిందన్నారు. కాళేశ్వరానికి జాతీయహోదా రాకపోవడం దురదృష్టకరమని తెరాస ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. పెద్దపల్లి ప్రాంతానికి న్యాయం జరగాలంటే పత్తిపాక రిజర్వాయర్ కట్టాలని భానుప్రసాదరావు కోరారు. జాతీయహోదా వచ్చేలా రాష్ట్ర భాజపా చొరవ తీసుకోవాలని బోడెకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో కాళేశ్వరం రూపొందించారని, మంత్రి హరీశ్‌రావు కష్టపడి ప్రాజెక్టు పనుల్ని ముందుకు తీసుకెళుతున్నారని మజ్లిస్ ఎమ్మెల్సీ జాఫ్రీ పేర్కొన్నారు.

రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ అధికమే

- పారదర్శకంగానే కొనుగోళ్లు
- ఇప్పటికి రూ. 20,585 కోట్లు వెచ్చించాం
- విద్యుత్తుశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: 'రాష్ట్రంలో విద్యుత్తు డిమాండు గణనీయంగా పెరిగింది. డిమాండు పెరుగుతున్నా ముఖ్యమంత్రి ఆశయం మేరకు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. 2024 నాటికి తెలంగాణ విద్యుత్తు మిగులు రాష్ట్రంగా నిలుస్తుంది' అని విద్యుత్తుశాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి చెప్పారు. శనివారం శాసనసభ ప్రారంభం కాగానే స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఎమ్మెల్యేలు జి.కిషన్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్, చింతల రామచంద్రారెడ్డిల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 'రైతులకు 24 గంటల విద్యుత్తు అందచేస్తున్నది దేశంలో తెలంగాణ మాత్రమే. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్తు డిమాండ్ 10,300 మిలియన్ యూనిట్లు.



ఇప్పటివరకు 48,486 మి.యూ. విద్యుత్తుకు రూ.20,585 కోట్లు ఖర్చు చేశాం. కొనుగోళ్లు పారదర్శకంగా ఓపెన్ టెండర్ల ద్వారానే సాగుతున్నాయి. ఈఆర్సీలు ఆమోదించిన ధరలకే కొంటున్నాం. ఆంధ్రప్రదేశ్ ఒక్కో యూనిట్‌ను రూ.4.56కు కొంటుంటే తెలంగాణలో రూ.4.15లకు కొంటున్నాం' అన్నారు.

సరఫరాల నష్టాలు గణనీయంగా తగ్గాయి

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో సరఫరా నష్టాలు(లైన్ లాసెస్) తగ్గాయి. తెలంగాణ ఏర్పడినపుడు 12.5 శాతం ఉన్నాయి. ప్రస్తుతం 10.3 శాతానికి తగ్గింది. సౌరవిద్యుదుత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాం. 24 గంటల ఉచిత విద్యుత్తుకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందటంలేదు. వివిధ పథకాల కింద రూ.1,100 కోట్ల కోసం ప్రతిపాదనలు పంపాం' అన్నారు.

సౌరవిద్యుత్తు కొనుగోళ్లల్లో పొరపాట్లు

ప్రభుత్వం సౌరవిద్యుత్తు కొనుగోళ్లలో పొరపాట్లు చోటు చేసుకున్నట్లు అనుమానాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి కొన్న విద్యుత్తు ధర ఎక్కువన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొనుగోళ్లపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి.

–కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, చింతల రామచంద్రారెడ్డి భాజపా

ఛార్జీలు పెంచే యోచన లేదు

విద్యుత్తు ఛార్జీలను పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని ఎమ్మెల్యేలు సోలిపేట రామలింగారెడ్డి, ఆరూరి రమేష్, వై.అంజయ్యయాదవ్ ప్రశ్నలకు మంత్రి జగదీశ్‌రెడ్డి జవాబిచ్చారు. 625 సబ్‌స్టేషన్లను నిర్మించాం. హెచ్‌టీలైన్లు 4,559 సర్క్యూట్ కిలోమీటర్లు, పంపిణీ లైన్లు 35,094 సర్క్యూట్ కిలోమీటర్ల మేర నిర్మించామని వివరించారు.

సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించండి

ఆహార కమిషన్‌కు మంత్రి ఈటల సూచన

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆహార భద్రత పథకాల ఫలాలను లబ్ధిదారులకు అందించే బాధ్యత రాష్ట్ర ఆహార కమిషన్‌పై ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పాటైన రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆహార భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం, పౌరసరఫరా శాఖ ద్వారా ప్రజలకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. పిల్లలు, గర్భిణులకు ఇస్తున్న గుడ్లు చిన్నగా ఉన్నాయని, సరిపోవడం లేదని వచ్చే ఆరోపణలు, ఫిర్యాదులను ఇకపై ఆహార కమిషన్ పరిశీలిస్తుందన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఆహార భద్రత చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో సహకారం అందిస్తామన్నారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో పర్యటిస్తామని కమిషన్ ఛైర్మన్ తిర్మల్‌రెడ్డి తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు చేపట్టండి

కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్, న్యూస్‌టుడే: అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే ఎ.రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇసుక దోపిడి యథేచ్ఛగా జరుగుతుందని, అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని... ఇప్పుడు ఆరోపణలకు బలం చేకూరుస్తూ మీడియా ఆధారాలతో సహా బయట పెట్టిందన్నారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర గనులశాఖ మంత్రి కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి శనివారం బహిరంగ లేఖ రాశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని, పట్టుబడిన వాహనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రతి ఇసుక రీచ్ వద్ద నిరంతరం పని చేసే సీసీ కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు జిల్లా కేంద్రాల్లో కమాండ్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. ఇసుక లారీల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షల పరిహారాన్ని ప్రభుత్వమే చెల్లించాలని రేవంత్‌రెడ్డి లేఖలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రజా ఆందోళన చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

ఫార్మాసిటీ రాకుండా అడ్డుకుంటాం

- దీని ఏర్పాటుకు భాజపా వ్యతిరేకం: చింతల
- అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయండి
- శాసనసభలో పద్దుల చర్చ సందర్భంగా సభ్యుల వినతి

ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 19 వేల ఎకరాల్లో ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన ఫార్మాసిటీని అడ్డుకుంటామని భాజపా సభ్యుడు చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. కాలుష్యం వెలువడే బల్క్‌డ్రగ్ పరిశ్రమలను సముద్ర తీరప్రాంతాల్లో పెట్టుకుంటారన్నారు. కాలుష్యం వల్ల విశాఖపట్టణంలోనూ ప్రజలు వ్యతిరేకించారన్నారు. అలాంటిది ఇక్కడ ఏర్పాటు చేయడం ప్రమాదమని, దాన్ని అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఫార్మాసిటీకి భాజపా వ్యతిరేకమని స్పష్టంచేశారు. శాసనసభలో శనివారం హోం, కార్మికశాఖ, గృహనిర్మాణం, దేవాదాయ, అటవీ, పట్టణాభివృద్ధి, వాణిజ్యం, ఐటీ, ఎస్‌టీ, పర్యాటక శాఖల ఆర్థిక పద్దులపై చర్చ సాగింది. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ జవహర్‌నగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తేనే చుట్టుపక్కల భూగర్భ జలాలు కలుషితమయ్యాయంటూ ప్రజలు ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు. అలాంటిది బల్క్‌డ్రగ్ పరిశ్రమలంటే కాలుష్య తీవ్రత మాటల్లో చెప్పలేమన్నారు. హైదరాబాద్‌లో మహిళలపై వేధింపులు, అపహరణలు, మహిళల రవాణా కేసులు పెరిగిపోతుంటే.. భద్రత ఎక్కడిదని ప్రశ్నించారు. డ్రగ్స్ విక్రయాలపై కేవలం 10రోజులు హడావిడి చేశారన్నారు. నయీం కేసులో ఎందరో రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని పత్రికల్లో వచ్చిందని, ఎంతమంది పెద్దలు దొరికారో చెప్పాలని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా కమిషనరేట్ ఏర్పాటు చేయాలన్నారు. 77,322 ఎకరాల ఆలయాలభూమి అన్యాక్రాంతమైనా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు.

కనీసం ఒక్కటైనా!: హైదరాబాద్‌లో అగ్నిమాపక కేంద్రాలను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎంఐఎం సభ్యుడు మోజంఖాన్ కోరారు. తెరాస సభ్యురాలు గొంగడి సునీత మాట్లాడుతూ అగ్నిమాపక కేంద్రాలను ఆధునికీకరించాలన్నారు. ఆలేరు నియోజకవర్గంలో మంత్రి మంజూరుచేసినా ఇప్పటివరకు పనులు ప్రారంభమ్వలేదని ఆవేదన చెందారు. షీ టీములను ఇతర నగరాలకు విస్తరిస్తే మహిళలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. భాజపా సభ్యుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెరాస సభ్యులు పువ్వాడ అజయ్‌కుమార్, వినయ్‌కుమార్ మాట్లాడారు.

ఏపీలోని పార్టీలవి దిగజారుడు రాజకీయాలు: తలసాని

ఈనాడు, హైదరాబాద్: ఏపీలోని రాజకీయ పార్టీలు ప్రత్యేక హోదా పేరిట దిగజారుడు రాజకీయాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధ్వజమెత్తారు. అవిశ్వాసం పేరిట ఆ పార్టీల నేతలు గందరగోళం సృష్టిస్తున్నారని, వారికి ఏ మాత్రం పోరాట స్ఫూర్తి లేదని, పసలేని వాదనలు, ఆపరేషన్లు, ఎవరు ఎవరిని కలిశారు వంటి పనికిరాని అంశాలపై చర్చిస్తూ సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. శనివారం శాసనసభా ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేకహోదా కావాలంటే సాధించుకోవడానికి ఎన్నో మార్గాలున్నాయన్నారు. అవిశ్వాసంతో ప్రయోజనాలు ఉండవని అక్కడి రాజకీయాలు చూసుకోకుండా తెరాసను నిందించడం ఏపీ నేతలకు తగదని తలసాని పేర్కొన్నారు.

బీఎల్ఎఫ్ బలోపేతానికి వేదికలా సీపీఎం మహాసభలు: తమ్మినేని

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్)ను బలోపేతం చేసేందుకు తమ పార్టీ జాతీయ మహాసభలను వేదికలా ఉపయోగించుకోనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఈ మహాసభల ప్రచారంకోసం రూపొందించిన పాటల సీడీలను శనివారమిక్కడ ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, తెరాసలకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా బీఎల్ఎఫ్ ఏర్పాటు జరిగిందన్నారు.

డ్రైవర్ లేని కారు ఢీకొడితే... బాధితులకు దిక్కెవరు?



- బాధ్యులను ఎలా గుర్తించాలి
- బీమా కంపెనీలు నష్టపరిహారం చెల్లిస్తాయా?
- కొత్త నిబంధనలు అవసరం అంటున్న నిపుణులు

ఏదైనా ఒక కారు ప్రమాదానికి గురయితే, ఆ కారు డ్రైవర్‌ను బాధ్యుడిని చేయవచ్చు. కానీ డ్రైవర్ లేని కారు (సెల్ఫ్- డ్రైవింగ్) ప్రమాదానికి కారణమయితే పరిస్థితి ఏంటి? అమెరికాలోని అరిజోనాలో గత ఆదివారం రాత్రి ఉబెర్ నిర్వహిస్తున్న చోదకుడు లేని (సెల్ఫ్-డ్రైవింగ్) కారు ఒక మహిళ మృతికి కారణమైన తర్వాత ఎదురైన సందేహం ఇది. దీనిపై కార్ల తయారీ సంస్థలు, బీమా సంస్థలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్న సంస్థలు... మరోసారి ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన పరిస్థితి వచ్చింది. అంతేకాదు డ్రైవర్ లేని వాహన పరిజ్ఞానంపై ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక భాగం డ్రైవర్ తప్పిదం వల్లే జరుగుతాయి. అందుకు డ్రైవర్‌ను బాధ్యుడిని చేసి శిక్షించే వ్యవస్థలు అన్ని దేశాల్లోనూ ఉన్నాయి. లేదా మరేదైనా కారణంతో ప్రమాదం జరిగితే, దాన్ని విశ్లేషించి బాధ్యులను గుర్తించే అవకాశం ఉంది. కానీ చోదకుడు లేని కార్ల విషయంలో ఇది సాధ్యం కాదు. ఈ కార్లలో స్టీరింగ్ ముందు డ్రైవర్ ఉండడు. సాంకేతిక నైపుణ్యం సాయంతో కారు సొంతంగా ప్రయాణిస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రమాదం జరిగితే... దోషులను గుర్తించటం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితి బాధితులకు, ప్రభుత్వాలకు, అటు కారు తయారీ సంస్థలకు, బీమా కంపెనీలకు సమస్యాత్మకంగా మారింది.

దశాబ్ద కాలానికి పైగా శ్రమఫలితం

- డ్రైవర్ అవసరం లేని, తనంతట తానే ప్రయాణాన్ని సాగించే కారుకు అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించడానికి శాస్త్రవేత్తలు దశాబ్దకాలానికి పైగా శ్రమిస్తున్నారు.
- సెన్సర్లు, మ్యాపింగ్, నావిగేషన్, కంట్రోళ్లు, ఎలక్ట్రానిక్ కళ్లు, రాడార్.. ఇలా ఈ తరహా కారుకు అవసరమైన పూర్తి స్థాయి సాంకేతిక పరిజ్ఞానం రూపుదిద్దుకుంది. దీనిపై ఇప్పుడు పెద్దఎత్తున ప్రయోగాలు నిర్వహిస్తున్నారు.
- త్వరలో మానవ చోదకుడు అవసరం లేని చోదకుడు లేని కార్లు రహదార్ల మీదకు వచ్చేస్తాయని, ఇది రవాణా రంగంలో విప్లవాత్మకమైన మార్పు కాబోతోందని ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, ఆటోమొబైల్ రంగ నిపుణులు భావిస్తున్నారు.
- ట్యాక్సీ సేవల దిగ్గజమైన ఉబెర్ చోదకుడు లేని కారును ఆవిష్కరించటంలో చొరవ తీసుకుంది. దీనిపై ప్రయోగాల నిర్వహణలో క్రియాశీలకమైన పాత్ర పోషిస్తోంది. ఇందుకోసం వోల్వో, ఫోర్డ్ తదితర ఆటోమొబైల్ కంపెనీలతో జట్టు కట్టింది.
- ఇప్పటికే అమెరికాలో ప్రయోగాత్మకంగా ఈ తరహా కార్లు తిరుగుతున్నాయి.
- కానీ అనూహ్యంగా అరిజోనాలో జరిగిన ఉబెర్ కారు ప్రమాదం ఈ సాంకేతిక పరిజ్ఞానంపై సందేహాలు వ్యక్తం చేసేవాళ్లలో మరింత భయాన్ని రేకెత్తించింది.

చట్టాలను తిరగ రాయాలి

ఇప్పటికిప్పుడు కాకపోయినా చోదకుడు లేని కార్లు రహదార్ల మీదకు రావటం అయితే తథ్యం. అందువల్ల ఈ మార్పుకు తగినట్లుగా చట్టాలను తిరగ రాయవలసి ఉంటుంది. ఈ తరహా కార్లలో లోపాలను గుర్తించి, బాధ్యులను శిక్షించే అవకాశం ప్రస్తుత చట్టాల ప్రకారం లేదు. అదేవిధంగా ప్రమాద నష్టాన్ని బీమా కంపెనీలు ఎంతమేరకు, ఏవిధంగా భర్తీ చేయాలనే అంశం కూడా సంక్లిష్టమైన అంశమే.

సవాళ్లు ఎన్నో

- మానవ చోదకుల కంటే చోదకుడు లేని కార్లే క్షేమకరమని శాస్త్రవేత్తల విశ్వాసం. అమెరికాలో రోడ్డు ప్రమాదాల్లో 2016లో 37,461 మంది చనిపోయారు. చోదకుడు లేని కార్లతో ఈ ప్రమాదాలు ఇంకా తగ్గుతాయని నమ్ముతున్నారు.
- కానీ రహదారిపై ఎదురయ్యే క్లిష్టమైన పరిస్థితులను అర్థం చేసుకొని దానికి అనుగుణంగా స్పందించే నైపుణ్యాన్ని చోదకుడు లేని కార్లకు ఎలా నేర్పాలో.. వారికి అర్థం కావటం లేదు.
- గూగుల్ సెల్ఫ్‌డ్రైవింగ్ కారు ప్రాజెక్టుపై వయమో సంస్థ 2009 నుంచి ప్రయోగాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు 50 లక్షల మైళ్లు ప్రయాణించాయి.
- గూగుల్ మాతృసంస్థ అయిన ఆల్ఫాబెట్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల విభాగమైన వయమో, అరిజోనాలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయటానికి డ్రైవర్‌లేని సెల్ఫ్‌డ్రైవింగ్ కార్లను వినియోగిస్తోంది.
- సాంకేతిక దిగ్గజమైన టెస్లా, 'ఆటోపైలెట్' సెల్ఫ్ డ్రైవింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించింది. 2016లో టెస్లా కార్లో ఆటోపైలెట్ పద్ధతిలో ప్రయాణిస్తున్న వ్యక్తి, ఆ కారు ఫ్లోరిడా హైవేలో ప్రమాదానికి గురి కావటంతో ప్రాణాలు కోల్పోయాడు.

సెన్సార్ డేటా కీలకం



- చోదకుడు లేని కార్లలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉంటుంది. అందువల్ల కారు ప్రమాదానికి గురయితే, ఆ ప్రమాదం ఎలా జరిగిందీ తెలుసుకునేందుకు ఆ కార్లలోని సెన్సర్లు దోహదపడతాయి.
- కారు వెళ్లే మార్గంలోని నావిగేషనల్ సెన్సర్లు పూర్తి సమాచారాన్ని కలిగి ఉంటాయి. రహదారిపై వాహనాలు, పాదచారులు ఎదురవుతున్నప్పుడు... దాన్నంతా మరొక ప్రత్యేకమైన సెన్సార్ రికార్డు చేస్తుంది.
- ఇవే కాకుండా కారు స్థితిగతులు, ఇంధనం, టైర్లు, బ్రేకుల కండిషన్... తదితర అంశాలను నిరంతరం పరిశీలించే సెన్సార్లు ఉంటాయి.
- అందువల్ల చోదకుడు లేని కారు ప్రమాదానికి కారణమైనప్పుడు, ప్రమాదం ఎలా జరిగింది, ఎంత తప్పు చోటుచేసుకుందీ.. అనే అంశాన్ని నిర్ధారించటం కష్టం కాకపోవచ్చు.

హ్యాక్ చేయవచ్చు కూడా...

చోదకుడు లేని కార్లు ఎక్కువగా సాఫ్ట్‌వేర్, కృత్రిమ మేథస్సు (ఏఐ) మీద ఆధారపడి ఉంటాయి. అందువల్ల ఈ తరహా కార్లను హ్యాక్ చేసే అవకాశం ఉంటుంది. ఎక్కడో కూర్చొని తన కంటే ఎంతో దూరంలో ఉన్న కారును హ్యాక్ చేయటం ద్వారా దాన్ని పూర్తిగా తమ అదుపాజ్ఞల్లోకి తీసుకోవచ్చు. స్టీరింగ్, బ్రేకులు, స్పీడు.. అన్నింటినీ నియంత్రించవచ్చు. తద్వారా ఆ కారును ప్రమాదానికి గురిచేయవచ్చు. లేదా తాము లక్ష్యంగా చేసుకున్న ఎదుటి వాహనానికో లేక పాదచారికో ఢీకొట్టవచ్చు. చోదకుడు లేని కారు ప్రమాదానికి ఇటువంటి కారణాలు కూడా ఉండవచ్చు.



సమస్యలు తప్పవు...

నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చే తొలినాళ్లలో కొన్ని సవాళ్లు తప్పవు. కానీ చోదకుడు లేని కార్ల వల్ల ఎదురయ్యే సమస్యలను తగ్గించటానికి, ప్రమాదానికి బాధ్యులను గుర్తించేందుకు స్పష్టమైన నిబంధనలను ఉండాలని నిపుణులు కోరుతున్నారు. దీనిపై ఇప్పుడు కార్ల తయారీ సంస్థలు, ఐటీ కంపెనీలు, బీమా కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి.

– ఈనాడు ప్రత్యేక విభాగం

సమాజ్‌వాదీలతో పొత్తు కొనసాగిస్తాం

బీఎస్పీ అధినేత మాయవతి స్పష్టీకరణ

లఖ్‌నవూ: రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి ఓటమి.. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)తో ఇప్పుడిప్పుడే కుదురుతున్న పొత్తుల అవగాహనపై ఎలాంటి ప్రభావం చూపబోదని బీఎస్పీ అధినేత మాయావతి తెలిపారు. 2019 సాధారణ ఎన్నికల్లో భాజపా ఓటమి కోసం మరింత దృఢచిత్తంతో రెండు పార్టీలు కలిసి పనిచేస్తాయని ఆమె విస్పష్టం చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓటమితో అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీకి బీఎస్పీకి మధ్య దూరం పెరుగుతుందన్న భాజపా నేతల ఆశల నెరవేరబోవని శనివారం ఆమె లఖ్‌నవూలో అన్నారు. శుక్రవారం నాటి రాజ్యసభ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిని గెలిపించటానికి ఎస్పీ 10 మంది ఎమ్మెల్యేలను కేటాయించినప్పటికీ భాజపా ఆ సీటును సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, అఖిలేశ్ స్థానంలో తాను ఉన్నట్లయితే సొంత పార్టీ అభ్యర్థిని త్యాగం చేసి అయినా సరే మిత్రపక్ష అభ్యర్థిని గెలిపించుకోవటానికే ప్రాధాన్యం ఇచ్చేవారమని, తద్వారా మా మిత్ర బంధానికి అవరోధాలు కల్పించే సాహసం చేయకుండా భాజపాకి గుణపాఠం చెప్పేవారమని మాయావతి అన్నారు. అఖిలేశ్‌కు తగినంత రాజకీయానుభవం లేకపోవటం వల్లే చిన్న పొరపాటు జరిగిందని, కమలం పార్టీకి ఎలా బుద్ధి చెప్పాలో త్వరలోనే ఆయన తెలుసుకుంటారని చెప్పారు.

ఇద్దరు ఎమ్మెల్యేలు బహిష్కరణ.. ఉత్తర్‌ప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థికే ఓటు వేయాలన్న పార్టీ ఆదేశాలను ధిక్కరించి భాజపా అభ్యర్థికి ఓటు వేసిన తమ ఎమ్మెల్యేలను ఆర్ఎల్‌డి, నిషాద్ పార్టీలు బహిష్కరించాయి. ఈ రెండు పార్టీలకు యూపీ అసెంబ్లీలో ఒక్కో ఎమ్మెల్యే ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్లపై ట్రంప్ పాదం

సైన్యంలో చేరకుండా నిషేధం విధించేందుకు కొత్త ఆదేశం

వాషింగ్టన్: అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యంలో ''చాలావరకు'' ట్రాన్స్‌జెండర్లపై నిషేధం విధించే కీలక ఆదేశంపై దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ట్రాన్స్‌జెండర్లు సేవలందించేందుకు ఈ ఆదేశం వీలుకల్పిస్తోంది. దీంతో ఎల్‌జీబీటీ హక్కుల సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. లింగ గుర్తింపు రుగ్మత బాధిత ట్రాన్స్‌జెండర్లే (వైద్య చికిత్స అవసరమైనవారు) లక్ష్యంగా తాజా ఆదేశాన్ని సిద్ధంచేశారు. వీరిని అనుమతించేందుకు వీలుకల్పించే ''ప్రత్యేక పరిస్థితుల''పై ఎలాంటి వివరణా ఇవ్వలేదు. అయితే ఈ విషయంలో రక్షణ మంత్రి, హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగానికి అధికారాలు కల్పించారు. తమ అధికారాన్ని ఉపయోగించి వీరు తగిన విధాన నిర్ణయాలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. మరోవైపు ప్రస్తుతం సేవలందిస్తున్న ట్రాన్స్‌జెండర్లు మాత్రం కొనసాగొచ్చని స్పష్టీకరించారు. గత ఆగస్టులోనూ సాయుధ బలగాల్లో ట్రాన్స్‌జెండర్లపై సంపూర్ణ నిషేధం విధిస్తూ ట్రంప్ ఓ ఆదేశాన్ని తీసుకొచ్చారు. రెండు నెలల తర్వాత కోర్టులో ఆయనకు చుక్కెదురైంది. అయితే కొత్త ఆదేశాన్ని తీసుకొచ్చేందుకు ఇదివరకటిదాన్ని రద్దుచేశామని శ్వేతసౌధ ప్రెస్ సెక్రటరీ సారా శాండెర్స్ తెలిపారు.

బీసీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో బీసీలకు రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. రెండేళ్లుగా రుణాల ప్రక్రియను పక్కన పెట్టిన సర్కారు 2018-19 ఏడాదికిగాను ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సహకార సమాఖ్యలు, ఎంబీసీలు, బీసీలు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జీహెచ్ఎంసీకి రూ.26 కోట్ల నజరానా

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మున్సిపల్ బాండ్ల రూపంలో నిధులు సేకరించినందుకుగాను కేంద్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీని ప్రశంసిస్తూ రూ.26 కోట్ల ప్రత్యేక ఆర్థిక పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ డా.బి.జనార్దన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాండ్ల రూపంలో వెయ్యి కోట్ల రూపాయలను సేకరించడం ద్వారా జీహెచ్ఎంసీ దేశంలోని మున్సిపల్ రంగంలో సరికొత్త చరిత్రకు నాంది పలికిందన్నారు. మున్సిపాలిటీలు బాండ్ల రూపంలో నిధులను సేకరించేలా ప్రోత్సహించేందుకు బాండ్ల ద్వారా నిధులను సేకరించే 20 మున్సిపాలిటీలకు కూడా ఇక నుంచి ప్రతి ఏడాది ఈ విధమైన ఆర్థిక పురస్కారాన్ని అందజేయాలని కేంద్రం నిర్ణయించినట్లు వెల్లడించారు. మెట్రో రైలు ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లాంటి మున్సిపల్ కార్పొరేషన్లు నిధులను బాండ్ల రూపంలో సేకరించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు ప్రధాని మోదీ సూచించిన విషయం తెలిసిందే. దీనికనుగుణంగా గ్రేటర్‌లో చేపడుతున్న భారీ ప్రాజెక్టుల వేగవంతానికి రూ.వెయ్యికోట్లను బాండ్ల రూపంలో సేకరించాలని నిర్ణయించినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

సరిహద్దుల్లో 'యథాతథ స్థితి'ని మార్చొద్దు!

- చైనాకు భారత్ స్పష్టీకరణ

బీజింగ్: భారత్-చైనా సరిహద్దు వెంబడి.. యథాతథ స్థితిలో ఎలాంటి మార్పులు చేసినా మరో డోక్లామ్ తరహా సంక్షోభం తప్పదని భారత రాయబారి గౌతమ్ బాంబవాలే హెచ్చరించారు. నాటి డోక్లామ్ సంక్షోభానికి చైనా యథాతథ స్థితిలో మార్పులకు ప్రయత్నించడమే కారణమని గుర్తుచేశారు. చైనా సైన్యం డోక్లామ్ సమీపంలో బలం పెంచుతున్నట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో గౌతమ్ ఈమేరకు హెచ్చరించారు. హాంగ్‌కాంగ్‌కు చెందిన ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. చైనా మరిన్ని సైనిక స్థావరాలను ఏర్పాటు చేస్తే.. భారత్ కూడా అంతే సులువుగా చేయగలుగుతుందని స్పష్టం చేశారు. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలకు సమీపంలో చైనా సైనికులు రహదారి నిర్మాణం చేపట్టకుండా భారత దళాలు జోక్యం చేసుకోవడాన్ని ఆయన ఆయన గట్టిగా సమర్థించారు. యథాతథ స్థితిలో ఎలాంటి మార్పు జరగరాదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అలాంటి సున్నిత ప్రాంతాల్లో ఏవైనా చర్యలు చేపట్టదలిస్తే భారత్‌కు తప్పక తెలపాలన్నారు.

బాలల సంరక్షణలో తెలంగాణ అగ్రస్థానం: కేకే

బాలల సంరక్షణలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని ఎంపీ కేశవరావు తెలిపారు. రాష్ట్రాన్ని బాలల స్నేహపూర్వక తెలంగాణగా మార్చేందుకు సహకారం అందిస్తామన్నారు. శనివారం మర్రిచెన్నారెడ్డి మానవవరుల కేంద్రంలో స్నేహపూర్వక బాలల తెలంగాణ అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. బాలల ఎదుర్కొంటున్న సమస్యలను, వారి అభివృద్ధి కోసం సర్కారు చేపడుతున్న కార్యక్రమాలను మహిళాశిశు సంక్షేమ కార్యదర్శి జగదీశ్వర్ వివరించారు. ప్రతినిధులు చేసిన సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, వినోద్ తెలిపారు.

డిప్లొమా ఏఈలను అణిచివేస్తున్నారని నిరసన

పంజాగుట్ట, న్యూస్‌టుడే : వివిధ శాఖల్లో పని చేస్తున్న డిప్లొమా ఏఈలను అణిచివేస్తున్నారని ఎనిమిది ఇంజినీరింగ్ శాఖల సహాయక ఇంజినీర్లు, వివిధ హోదాల్లోని ఉద్యోగులు శనివారం నిరసన చేపట్టారు. పదోన్నతులు, నియామకాల విషయంలో అన్యాయం చేస్తున్నందుకే నిరసన చేయాల్సి వచ్చిందని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఇంజినీర్స్ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం భోజన విరామ సమయంలో హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో పలు శాఖల ఇంజినీర్లు ధర్నాకు దిగారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా ఏఈల నియామకాలే చేపట్టలేదని, 2016లో వెయ్యి మందిని నియమించినా వారికీ పదోన్నతులు రాకుండా కొత్త నిబంధనను తీసుకొచ్చేందుకు ఈఎన్‌సీ యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఎక్స్‌ప్రెస్ మెట్రో!

- రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు
- 20 నిమిషాల్లోపే చేరుకునేలా ప్రణాళిక
- 30.7 కి.మీ.కు..రూ.4,650 కోట్ల వ్యయం అంచనా
- టౌన్‌షిప్‌ల అభివృద్ధితో ఆర్థిక దన్ను
- నిధుల సమీకరణ కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయం వరకు ఎక్స్‌ప్రెస్ మెట్రోరైలు పనులు ఈ ఏడాదిలోనే ప్రారంభించాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. అందుకు అనుగుణంగా నిర్ణయాలు చకచకా జరిగిపోతున్నాయి. తాజా బడ్జెట్‌లో రూ.400 కేటాయించడంతో పాటు.. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పీవీ) ఏర్పాటుకు సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విమానాశ్రయం నుంచి ఏటా 1.80 కోట్ల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రయాణికులు మరింత పెరిగే అవకాశం ఉండటం..అవుటర్ వెంట గ్రోత్ కారిడార్‌లో టౌన్‌షిప్‌ల అభివృద్ధితో విమానాశ్రయానికి మెట్రో అనుసంధానం తప్పనిసరని సర్కారు భావిస్తోంది. ఇందులో భాగంగా రెండో దశలో (ఫేజ్-2ఏ)లో భాగంగా రాయదుర్గం నుంచి గచ్చిబౌలి బాహ్య వలయ రహదారి వెంట శంషాబాద్ వరకు ఎక్స్‌ప్రెస్ మెట్రో నిర్మించాలనేది ప్రభుత్వ ఆలోచన. 30.7 కి.మీ. దూరం ఈ మార్గానికి రూ.4,650 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా.

దిల్లీ ఎక్స్‌ప్రెస్ మెట్రో తరహాలో..

సాధారణంగా మెట్రో గరిష్ఠ వేగం 85 కి.మీ కాగా.. కనిష్ఠం 33 కి.మీ. ప్రతి కిలోమీటర్‌కు ఒక స్టేషన్ ఉంటున్న నేపథ్యంలో అవి ఇంతకుమించి వేగంగా వెళ్లలేవు. అందుకు భిన్నంగా దిల్లీ ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ మెట్రో మాదిరిగా గరిష్ఠంగా గంటకు 135 కి.మీ., కనిష్ఠంగా 100 కి.మీ. వేగంతో వెళ్లేలా ప్రస్తుతం మార్గాన్ని ప్రతిపాదించారు. ఈ మార్గాన్ని ఐదారు స్టేషన్లకే పరిమితం చేయడం ద్వారా 20 నిమిషాల్లోనే ట్రాఫిక్ సమస్యలు లేకుండా గమ్యస్థానం చేరుకునే వీలు కలుగుతుంది.

రుణ సమీకరణకు మార్గం..

విమానాశ్రయం వరకు నిర్మించే ఎక్స్‌ప్రెస్ మెట్రోని ప్రభుత్వమే చేపట్టనుంది. హెచ్ఎంఆర్ఎల్‌కు ఆస్తులు లేవు కాబట్టి వేర్వేరు ఆర్థిక సంస్థల నుంచి పెద్దమొత్తంలో నిధుల సమీకరించేందుకు సాంకేతికంగా సాధ్యం కాదు. అందుకే కొత్తగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.



హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డినే దీనికి ఎండీగా నియమించారు. భూముల లభ్యత ఉన్న హెచ్ఎండీఏను ఇందులో భాగస్వామిని చేశారు. హెచ్ఎంఆర్ఎల్ వాటా 51 శాతంకాగా, హెచ్ఎండీఏ వాటా 49 శాతంగా ఎస్‌పీవీలో చేర్చారు. ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదికను దిల్లీ మెట్రోరైలు సంస్థకు అప్పగించారు.

టౌన్‌షిప్‌లతో నిలదొక్కుకునేలా..

ప్రాథమిక నివేదిక ఆధారంగా 30.7 కి.మీ. మార్గంలో నాలుగైదు చోట్ల మాత్రమే మెట్రో స్టేషన్లు నిర్మిస్తారు. ఆయా ప్రాంతాల్లో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసి ఈ ప్రాజెక్ట్‌కు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తారు. విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్..తాజా విస్తరణలో టౌన్‌షిప్‌ల అభివృద్ధి పనులనూ చేపట్టేందుకు సంసిద్ధత వ్యక్తంచేసినట్టు సమాచారం. మెట్రో అధికారుల సంప్రదింపుల అనంతరం ఎక్స్‌ప్రెస్ మెట్రో నిర్మాణ వ్యయంలో రూ.400 కోట్ల వరకు వ్యయం చేసేందుకు ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. 'ఈ మార్గంలో రవాణా ఆధారిత అభివృద్ధితో పాటూ మరిన్ని టౌన్‌షిప్పుల అభివృద్ధికి కృషి చేస్తాం. శివార్ల నుంచి ఉద్యోగులు మెట్రోలో ఐటీ కేంద్రాలకు చేరుకునే వీలు కల్పిస్తాం. తద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుందని భావిస్తున్నాం.' అని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు.

వందశాతం ఎల్ఈడీ లైటింగ్‌పై రైల్వేమంత్రి అభినందన

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మొత్తం 733 రైల్వేస్టేషన్లలో ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటు చేయడంపై రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ జోన్ జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్‌ను అభినందించారు. ద.మ.రైల్వే చేపట్టిన చర్యలతో ఏడాదికి రూ.2.70 కోట్ల ఆదాపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎన్ఎంఎంఎస్ఈ ఫలితాలు విడుదల

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్ఈ) ఫలితాలను విడుదల చేశామని, వాటిని bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకు బి.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 5వ తేదీన ఈ పరీక్ష జరిగింది. అర్హులైన విద్యార్థులు జాతీయ బ్యాంకుల్లో ఖాతాలను తెరవడంతోపాటు ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి వాటిని సంబంధిత ప్రధానోపాధ్యాయుని ద్వారా జిల్లా విద్యాశాఖాధికారికి అందజేయాలని ఆయన సూచించారు.

పోడు సాగుదారుల పక్షాన పోరాటం: చాడ

ఈనాడు డిజిటల్, మహబూబాబాద్: రాష్ట్రంలో పోడు భూములను సాగు చేసుకుంటున్న పేద ప్రజలకే ఆ భూములు దక్కేలా పోరాడుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లో శనివారం జరిగిన ఆ పార్టీ జిల్లా ప్రథమ మహాసభలో చాడ మాట్లాడారు. కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్‌నగర్, మహబూబాబాద్ తదితర జిల్లాలోని పోడు సాగుదారులకు పట్టాలు ఇచ్చేందుకు అటవీ భూముల హక్కు చట్టం ఉన్నా కేసీఆర్ దాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. వర్షాలు కురవగానే పోడు భూముల్లో పేదలతో సాగుపనులు చేయిస్తామన్నారు.

దక్షిణ కొరియాతో చర్చలకు ఉత్తర కొరియా అంగీకారం

సియోల్: దక్షిణ కొరియాతో ఓ కీలక సదస్సుపై వచ్చే వారం ఉన్నత స్థాయి చర్చలు జరిపేందుకు ఉత్తర కొరియా అంగీకరించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియాలోని కొరియా ఏకీకరణ మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. రెండు వైపుల నుంచీ ముగ్గురు చొప్పున ఉన్నతస్థాయి అధికారులు, నాయకులతో కూడిన బృందం సరిహద్దుల్లోని పన్‌ముంజుమ్ గ్రామంలో చర్చలు జరుపుతుందని పేర్కొంది. ఏప్రిల్‌లో జరుగనున్న ''అంతర కొరియా సదస్సు'' తేదీల ఖరారు, అజెండాపై చర్చిస్తుందని వెల్లడించింది. దక్షిణ కొరియాలోని కొరియా ఏకీకరణ మంత్రి చో మ్యోంగ్ గ్యాన్, ఉత్తర కొరియాలోని కొరియా ఏకీకరణ మంత్రి రీ సన్ గ్వాన్‌లు ఈ చర్చల్లో పాల్గొననున్నట్లు తెలిపింది. అమెరికాతో సంయుక్త సైనిక విన్యాసాల సమయాన్ని కుదించుకుంటున్నామని దక్షిణ కొరియా ప్రకటించిన నేపథ్యంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు మే నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జాంగ్ ఉన్ ముఖాముఖి చర్చలు జరిపే అవకాశముందని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం

తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘానికి కొత్త కార్యవర్గాన్ని శనివారం టీజీవోభవన్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్రాధ్యక్షునిగా రాజేందర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు ఏడుకొండలు, కార్యనిర్వాహక అధ్యక్షుడు పుప్పాల అశోక్, సహాధ్యక్షుడు కృష్ణసాగర్, ఉపాధ్యక్షులు యూసుఫ్, మాణిక్య అబ్రహం, రషీద్, వెంకటయ్య, సురేశ్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, సంయుక్త కార్యదర్శులుగా ప్రమోద్ రెడ్డి, గోపాల్, అశోక్, లక్ష్మణాచారిలను ఎన్నుకున్నారు.

'భగీరథ' పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు

ఈనాడు, హైదరాబాద్: మిషన్ భగీరథ పనుల్లో వేగం పెంచేందుకు వివిధ రకాల తనిఖీలకు సంబంధించిన నిబంధనల్లో కొన్నింటిని ప్రభుత్వం సడలించింది. తాగునీటి సదుపాయాలకు అవసరయ్యే సామగ్రిని గుత్తేదారు తెచ్చేటప్పుడు వాటిని ఆయా ప్రాంతాల్లోనే అధికారులు పరిశీలించి ధ్రువీకరించాలనే నిబంధనలు ఉన్నాయి. ఇలా పరిశీలించేందుకు ఆయా పరికరాల స్థాయికి అనుగుణంగా ఇంజినీరింగ్ అధికారుల హోదాలు ఉంటాయి. ఈహోదాల్లో ప్రభుత్వం ఇప్పుడు కొన్ని మార్పులు చేసింది. కొన్ని రకాల తనిఖీలనూ తొలగించింది. గ్రామాల్లో అంతర్గత పైపులైన్ల ఏర్పాటుకు సంబంధించిన సామగ్రి చాలా వరకు గుజరాత్, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాల నుంచే వస్తోంది. అక్కడి నుంచి వచ్చే వాటికి చాలా సమయం పడుతుండటం.. పనిఒత్తిడి వంటి కారణాల వల్లనే నిబంధనలకు సవరణలు అవసరమైనట్లు ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

పంటల ఉత్పాదకత పెంపుపై పరిశోధనలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పంటల ఉత్పాదకతను పెంచడంలో జియోలైట్ ఖనిజం వినియోగంపై పరిశోధనలు చేయడానికి కెనడాకు చెందిన ఇఛానా ఇండో-కెనడా జియోలైట్ కార్పొరేషన్, జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. వర్సిటీ పరిపాలన భవనంలో శుక్రవారం ఉపకులపతి డా.ప్రవీణ్‌రావు సమక్షంలో ఈ మేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. జియోలైట్ వాడితే భూమిలో తేమను పెంచి ఉత్పాదకత పెంపునకు దోహదం చేస్తుందని కెనడా సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.సుధీర్‌కుమార్, ఆ సంస్థ ఎండీ బాలప్రతాపరెడ్డి, వర్సిటీ అధికారి డా.జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ విద్యార్థులు 15శాతం ఉండాలి వ్యవసాయ విశ్వవిద్యాలయాల పరిధిని పెంచడానికి అంతర్జాతీయ విద్యార్థులు కనీసం 15 శాతం మంది ఉండేలా చూడాలని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.కె.రామస్వామి అన్నారు.

మళ్లీ తెరపైకి తిరుపతిరావు కమిటీ


ఈనాడు, హైదరాబాద్: ప్రైవేట్ పాఠశాలల్లో రుసుముల నియంత్రణ మార్గదర్శకాల కోసం ఏర్పాటు చేసిన తిరుపతిరావు కమిటీ పదవీ కాలాన్ని ప్రభుత్వం మళ్లీ మూడు నెలలు పొడిగించింది. జిల్లా రుసుముల నియంత్రణ కమిటీ(డీఎఫ్ఆర్‌సీ)లకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు గడువు పొడించినట్లు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నివేదిక సమర్పించిన మూడు నెలల తర్వాత కమిటీ పదవీకాలాన్ని మళ్లీ పొడిగించడం విశేషం. పొడిగింపు ఉత్తర్వులు ఈనెల 19నే జారీ కాగా ఆ విషయాన్ని విద్యాశాఖ గోప్యంగా ఉంచడం కూడా అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే తిరుపతిరావు కమిటీకి పలుమార్లు గడువు పొడిగించగా చివరికి 2017 డిసెంబరు 30న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దానిపై చట్టం చేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోయింది. యాజమాన్యాలు వచ్చే విద్యా సంవత్సరానికి రుసుములు పెంచుకుంటుండటంతో తాము కమిటీ నివేదికను అధ్యయనం చేసి.. న్యాయపరమైన అంశాలను పరిశీలించి ఉత్తర్వులు ఇచ్చేవరకు 2017-18 విద్యా సంవత్సరానికి వసూలు చేసిన రుసుముల్ని మాత్రమే 2018-19కి తీసుకోవాలని, పెంచితే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ రంజీవ్ ఆచార్య జనవరి 11న ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి కదిలిక లేని ప్రభుత్వం తాజాగా కమిటీ గడువును మూడు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. దీనిపై హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్(హెచ్ఎస్‌పీఏ) ప్రతినిధి ఆశిష్ మాట్లాడుతూ ఏడాదిలో ఏమీ చేయలేని కమిటీ మరో మూడు నెలల్లో ఏం చేస్తుందని ప్రశ్నించారు.

ఏపీలో అగ్రవర్ణ పేద విద్యార్థులకూ ఉపకార వేతనాలు, విదేశీ విద్య

మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

ఈనాడు, అమరావతి: అగ్రవర్ణాల్లోని పేద విద్యార్థులకు రూ.200కోట్లు కేటాయించి ఉపకార వేతనాలు, విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించబోతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రకటించారు. సంక్షేమ కార్పొరేషన్ల పరిధిలోకి రాని రాజు, రెడ్డి, కమ్మ తదితర సామాజిక వర్గాల విద్యార్థులకూ లబ్ధి చేకూర్చనున్నట్లు పేర్కొన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచబోతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి త్వరలోనే దీనిపై నిర్ణయం వెల్లడిస్తారన్నారు. 'బీసీ, ఎస్సీ, ఎస్టీ, అల్ప సంఖ్యాక వర్గాలు, మహిళా శిశు సంక్షేమం'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. రూ.30కోట్లతో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేసి వారికీ ఆర్థిక సాయం చేయబోతున్నామన్నారు. 50ఏళ్లు దాటిన మత్స్యకారులకు పింఛను అందించనున్నట్లు చెప్పారు. చీర, ధోవతి పథకాన్ని మళ్లీ అమలు చేస్తున్నామన్నారు. మన నేత కార్మికులు తయారు చేసిన వాటినే అందిస్తామన్నారు.

కాకతీయుల సైనిక స్థావరం గుర్తింపు



ఈనాడు, వరంగల్: ఓరుగల్లులో తొలితరం కాకతీయులు నిర్మించిన ఒక సైనిక స్థావరం వెలుగులోకి వచ్చింది. హన్మకొండ సిద్ధేశ్వర గుట్టపై చెట్ల పొదల్లో పురావస్తుశాఖ కనుగొన్న కొండ గుహ.. క్రీ॥శ 1116-1157 కాలం నాటి కాకతీయుల తొలి పాలకుల్లో ఒకరైన రెండో ప్రోలరాజు ఏర్పాటు చేసినట్లు భావిస్తున్నారు. కాకతీయుల అద్భుత నిర్మాణ శైలి గురించి లోతైన అధ్యయనానికి పురావస్తుశాఖ అధికారి డి.కన్నబాబు 'దేవాలయ సర్వేక్షణ' ప్రాజెక్టును చేపట్టారు. గుహ లోపల బంక మన్ను, సున్నం జాజుతో గోడలపై చిత్రలేఖనాలు వేసిన ఆనవాళ్లు కనుగొన్నారు. బంక మన్నుపై వేలి ముద్రలు ఉన్నట్టు గుర్తించారు. ఈ గుహ కాకతీయుల సైనిక స్థావరమని ఆనవాళ్లను బట్టి తేలిందన్నారు. సహజమైన రాతి గుహనే, భవనంలా మలచుకొని సైనిక స్థావరంగా వినియోగించుకున్నారని చెప్పారు.

చర్యలేంటి?

తప్పు చేశారు.. దాన్ని అంగీకరించారు కూడా. వీడియో సాక్ష్యాలూ స్పష్టంగా ఉన్నాయి. మరి ఇప్పుడు ఐసీసీ ఏం చేస్తుంది.. మ్యాచ్ రిఫరీ బాన్‌క్రాఫ్ట్, స్మిత్, ఇతర ఆస్ట్రేలియా ఆటగాళ్లపై ఏం చర్యలు తీసుకుంటాడు అని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. దీనిపై ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ఎలా స్పందిస్తుంది.. తమ ఆటగాళ్లపై సొంతంగా ఏం చర్యలు చేపడుతుందన్నదీ ఆసక్తికరమే. 17 ఏళ్ల కిందట దక్షిణాఫ్రికాలోనే జరిగిన ఓ టెస్టు మ్యాచ్‌లో సచిన్ మీద బాల్ టాంపరింగ్ ఆరోపణలు రావడం తెలిసిందే. సచిన్ బంతికి అంటిన మట్టిని వేలితో తీసే ప్రయత్నం చేయగా.. దాన్ని టాంపరింగ్‌గా పేర్కొంటూ అతడిపై ఒక మ్యాచ్‌పై నిషేధం వేసేశాడు రిఫరీ. ఐతే తర్వాత దీనిపై దుమారం రేగడంతో సచిన్‌పై నిషేధాన్ని ఎత్తేసింది ఐసీసీ.



"ఇలాంటివి ఆటలో చోటు చేసుకోకూడదు. ఒక పరికరంతో బంతి ఆకారాన్ని దెబ్బ తీసే ప్రయత్నం చేస్తే దాన్ని చాలా తీవ్రంగా పరిగణించాలి. బాన్‌క్రాఫ్ట్ చేసింది ఆమోదయోగ్యం కాదు."
– షేన్ వార్న్




"బాన్‌క్రాఫ్ట్ చేసింది చాలా అనుమానాస్పదంగా ఉంది. తప్పు చేసినట్లు తేలిత అందుకు ఫలితం అనుభవించాల్సిందే."
– అలన్ బోర్డర్

ఛాంపియన్స్



బాన్‌క్రాఫ్ట్



కెమెరాలకు చిక్కాడిలా...





జెంటిల్మన్ ఆటలో మరో నీచ కృత్యం! గెలుపు కోసం ఏం చేయడానికైనా సిద్ధమన్నట్లుగా వ్యవహరించే ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులో మరోసారి విలువల పతనం! వివాదాల నిలయంగా మారిన దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో పెద్ద కలకలం!

ఆటలో వెనుకబడ్డ ఆస్ట్రేలియా.. వక్ర మార్గంలో దక్షిణాఫ్రికాను దెబ్బ తీసేందుకు ప్రయత్నించి క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఆ జట్టు ఆటగాడు కామెరూన్ బాన్‌క్రాఫ్ట్ బంతి ఆకారాన్ని దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తూ కెమెరాలకు అడ్డంగా దొరికిపోయాడు!

తప్పు చేసి దొరికింది బాన్‌క్రాఫ్టే కానీ.. బాధ్యుడు అతనొక్కడే కాదు. ఇది ఆస్ట్రేలియా జట్టంతా కలిసి పన్నిన వ్యూహంలో భాగమని తేలిపోయింది. బుకాయింపులకు అవకాశమే లేకపోవడంతో కెప్టెన్ స్మిత్ మీడియా ముందుకొచ్చి తప్పు ఒప్పేసుకున్నాడు. తామంతా కలిసే ఈ బాగోతానికి వ్యూహ రచన చేశామన్నాడు. ఇకపై ఇలా జరగదని హామీ ఇచ్చాడు.

ఈ ఉదంతంపై ఐసీసీ ఎలా స్పందిస్తుందో.. కంగారూ జట్టుపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

అడ్డంగా దొరికిన ఆసీస్

● బాన్‌క్రాఫ్ట్ బాల్‌టాంపరింగ్ ● బంతి ఆకారం దెబ్బ తీసే ప్రయత్నం ● కెమెరాకు చిక్కిన బాగోతం ● అందరం కలిసే చేశామన్న స్మిత్

కామన్వెల్త్‌లో భారత పతాకధారి



దిల్లీ: ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరిగే కామన్వెల్త్ క్రీడల ప్రారంభోత్సవంలో భారత బృందానికి స్టార్ షట్లర్ పి.వి.సింధు సారథ్యం వహించనుంది. ఆమె మువ్వన్నెల జెండా చేతబూని ముందు నడవనుంది. ఒక షట్లర్ భారత పతకధారిగా నిలవడం గత మూడు క్రీడల తర్వాత ఇదే తొలిసారి. ఇటీవల ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్ చేరిన సింధును కామన్వెల్త్ పతాకధారిగా ఎంపిక చేస్తున్నట్లు భారత ఒలింపిక్ సంఘం వెల్లడించింది. 2014 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో షూటర్ విజయ్ కుమార్ ఈ గౌరవాన్ని పొందాడు.



20 బంతుల్లో 102

● దుమ్మురేపిన సాహా
● టీ20 టోర్నీలో మెరుపు శతకం

కోల్‌కతా: ఊచకోత అంటే ఇదే! 20 బంతుల్లో శతకం చేయడమంటే మాటలా..! అద్భుతమైన ఈ ఘనతను టీమ్‌ఇండియా వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ వృద్ధిమాన్ సాహా అందుకున్నాడు. బెంగాల్ స్థానిక క్రికెట్ టోర్నీలో అతడు కళ్లుచెదిరే ఇన్నింగ్స్ ఆడాడు. 14 సిక్సర్లు, 4 ఫోర్ల సాయంతో 510 స్ట్రైక్‌రేట్‌తో అతడు మెరుపు సెంచరీ సాధించాడు. అతడి ధాటికి మోహన్ బగాన్ జట్టు కేవలం 7 ఓవర్లలో 152 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. శనివారం జేసీ ముఖర్జీ టీ20 టోర్నీలో బీఎన్ఆర్ రిక్రియేషన్ క్లబ్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్‌గా బరిలో దిగిన సాహా (102 నాటౌట్; 20 బంతుల్లో 4×4, 14×6) మరో ఓపెనర్ శుభోమయ్ దాస్ (43 నాటౌట్; 22 బంతుల్లో 6×4, 2×6)తో కలిసి ప్రత్యర్థి జట్టు బౌలింగ్‌ను ఉతికిపారేశాడు. తొలి బంతికి సింగిల్ తీసిన అతడు.. ఆ తర్వాత 19 బంతుల్లో మరోసారి మాత్రమే సింగిల్ చేశాడు. 12 బంతుల్లో 50 పరుగుల మార్క్ చేరుకున్న సాహా.. ఆ తర్వాత 100 మైలురాయి అందుకోవడానికి ఆడింది 8 బంతులే. ఐతే స్థానిక క్రికెట్ టోర్నీ కావడంతో సాహా ఇన్నింగ్స్‌ను రికార్డుగా పరిగణించరు. టీ20ల్లో వేగవంతమైన సెంచరీ క్రిస్‌గేల్ (30) పేరిట ఉంది. రాయల్ ఛాలెంజర్స్ తరపున అతడు ఈ రికార్డు సాధించాడు. క్లబ్ క్రికెట్లో 17 బంతుల్లోనే ఓ క్రికెటర్ సెంచరీ చేశాడని సమాచారం. ఐపీఎల్‌లో చెన్నై, కోల్‌కతా, పంజాబ్ జట్లకు ఆడిన సాహా ప్రస్తుతం సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతున్నాడు.



కౌంటీల్లో కోహ్లి

దిల్లీ: ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, న్యూజిలాండ్.. ఇలా చాలా దేశాల్లో తన బ్యాటింగ్ సత్తా చూపించాడు టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి. అతను విజయవంతం కాని ఏకైక దేశం ఇంగ్లాండ్. 2014లో ఆ దేశంలో తొలిసారి పర్యటించిన అతను పేలవ ప్రదర్శన చేశాడు. ఐతే ఈసారి ఇంగ్లాండ్‌లోనూ విజయవంతమయ్యేందుకు కోహ్లి ప్రణాళికతో ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్ ఆరంభానికి రెండు నెలల ముందే అతను ఆ దేశానికి చేరుకుని కౌంటీ క్రికెట్ ఆడనున్నాడు. ఈ విషయాన్ని బీసీసీఐ పాలకుల కమిటీ (సీఓఏ) ఛైర్మన్ వినోద్ రాయ్ ధ్రువీకరించాడు. ఐపీఎల్ సీజన్ ముగిసిన కొన్ని రోజుల్లోనే కోహ్లి ఇంగ్లాండ్‌కు వెళ్లనున్నాడు. ఇందుకోసం జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టుకు కూడా విరాట్ దూరం కానున్నాడు. 'కోహ్లి జూన్‌లో ఇంగ్లిష్ కౌంటీ అగ్ర జట్టు సర్రేకు ఆడతాడని రాయ్ తెలిపాడు.

ఆసియా ఛాంప్ అడ్వాణీ



యాంగాన్: భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీ ఆసియా బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌ను నిలబెట్టుకున్నాడు. శనివారం ఫైనల్లో పంకజ్ 6-1 తేడాతో సహచరుడు భాస్కర్‌పై విజయం సాధించాడు. ఆసియా పోటీల్లో పంకజ్‌కు ఇది 11వ స్వర్ణ పతకం. మహిళల విభాగం స్వర్ణం భారత్ ఖాతాలోనే చేరింది. ఫైనల్లో అమీ కమని 3-0తో సిరిపాపార్న్ (థాయిలాండ్)పై గెలిచింది.

"లంచ్ విరామంలో మేం దీని గురించి చర్చించాం. టేప్‌కు పిచ్ వద్ద ఉన్న ఇసుక రేణువులు అంటించి దాని ద్వారా బంతి ఆకారం మార్చేందుకు మంచి అవకాశం ఉందని భావించా. కానీ అదేమీ ఆశించిన ఫలితాన్నివ్వలేదు. అందుకే అంపైర్లు బంతిని కూడా మార్చలేదు. నేను బంతి ఆకారాన్ని దెబ్బ తీసేందుకు ప్రయత్నించిన వీడియో స్క్రీన్ మీద కనిపించేసరికి ఆ టేపును నా ప్యాంటు లోపలికి వేసేశాను" – బాన్‌క్రాఫ్ట్



"నాయకత్వ బృందానికి ఈ సంగతి తెలుసు. లంచ్ విరామ సమయంలో దాని గురించి మాట్లాడుకున్నాం కూడా. అది క్రీడా స్ఫూర్తికి విరుద్ధం నా సమగ్రతను.. జట్టు, నాయకత్వ బృందం సమగ్రతను ప్రశ్నార్థకం చేసేదే. ఈ మ్యాచ్‌ను చాలా కీలకమైందిగా భావించాం. ఈ సిరీస్ అంతా బంతి రివర్స్ స్వింగ్ అవుతోంది. కానీ మూడో రోజు బంతి అలా స్వింగయ్యేలా కనిపించలేదు. ఐతే మేం ఎంచుకున్న ఆలోచన చాలా పేలవమైంది. పెద్ద తప్పు చేశాం. మా చర్యలపై ఎంతో చింతిస్తున్నాం. ఆ ఆలోచన నాయకత్వ బృందానిది. ఇందులో కోచ్‌ల పాత్ర ఏమీ లేదు. నా నాయకత్వంలో ఇలా జరగడం ఇదే తొలిసారి. ఇలాంటిది ఇంకెప్పుడూ జరగదని హామీ ఇస్తున్నా. జరిగిన దానిపై నేనేమీ గర్వించట్లేదు. నాతో పాటు జట్టంతా సిగ్గుపడుతోంది. కెప్టెన్‌గా నేను క్షమాపణ కోరుతున్నా. మా తప్పు బయటపడకపోయినా మేం దీనిపై చింతించేవాళ్లం. ఐతే కెప్టెన్సీ నుంచి తప్పుకునే ఆలోచనేమీ నాకు లేదు. ఇప్పటికే ఈ బాధ్యతకు నేనే సరైనవాడిని అనుకుంటున్నా. ఈ ఉదంతం నుంచి చేర్చుకుని మెరుగయ్యే ప్రయత్నం చేస్తా"
– స్టీవెన్ స్మిత్



"చేసిన తప్పును అంగీకరించినందుకు బాన్‌క్రాఫ్ట్, స్మిత్‌లను అభినందించాలి. ఇలాంటి సందర్భాల్లో చాలామంది బుకాయించేందుకే ప్రయత్నిస్తారు. అయితే తప్పు ఒప్పుకున్నంత మాత్రాన దీన్ని తేలిగ్గా తీసుకోకూడదు. పరిణామాలు తీవ్రంగానే ఉండాలి"
– మైకేల్ వాన్, ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్

కేప్‌టౌన్

ఒకప్పుడు విజయం కోసం తన తమ్ముడు ఇయాన్ చాపెల్‌తో అండర్ ఆర్మ్ బౌలింగ్ చేయించి క్రీడా స్ఫూర్తిని మంటగలిపాడు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ గ్రెగ్ చాపెల్. ఇప్పుడు ఆస్ట్రేలియా జట్టు మరోసారి అదే స్థాయిలో క్రీడా స్ఫూర్తికి విఘాతం కలిగించే చర్యకు పాల్పడింది. దక్షిణాఫ్రికాతో హోరాహోరీగా సాగుతున్న టెస్టు సిరీస్‌లో పైచేయి సాధించేందుకు ఆ జట్టు దొడ్డిదారిని వెతుక్కుంది. తమ జట్టుకు ఎదురుగాలులు వీస్తున్న మూడో టెస్టులో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను దెబ్బ తీసేందుకు ఒక ప్రణాళిక ప్రకారం బాల్ టాంపరింగ్‌కు పాల్పడింది. ఆ జట్టు ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ రెండో సెషన్లో బంతి ఆకారం దెబ్బ తీసేందుకు విశ్వప్రయత్నం చేశాడు. అతను పసుపు రంగులో ఉన్న చిన్న ప్లాస్టిక్ ముక్క లాంటి దాన్ని వేళ్ల మధ్య ఉంచుకుని బంతిని గోకడం కనిపించింది. బంతిని రివర్స్ స్వింగ్‌కు అనుకూలంగా మార్చేందుకు అతడిలా చేశాడు.

ఎలా దొరికాడు?: బాన్‌క్రాఫ్ట్ అనుమానాస్పదంగా ఏదో చేస్తున్న విషయం టీవీ కెమెరాలు పసిగట్టేశాయి. ఆ దృశ్యాలు ప్రసారం కావడంతో అంపైర్లకు అనుమానం వచ్చింది. అతడిని పిలిచి ప్రశ్నించారు. జేబుల్లో చేతులు పెట్టుకుని ఏమీ తెలియని అమాయకుడిలా వారి వద్దకు వెళ్లాడు బాన్‌క్రాఫ్ట్. జేబులో ఏముందో చూపించమని అంటే అతను కళ్లద్దాల సంచిని తీసి చూపించాడు. అది తప్ప అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదు. కానీ అసలు విషయం ఏంటంటే.. బాన్‌క్రాఫ్ట్ అంతకుముందే అప్రమత్తం అయ్యాడు. అతను బంతి ఆకారాన్ని దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్న దృశ్యాలు డ్రెస్సింగ్ రూమ్‌లోని టీవీలో చూసిన కోచ్ లీమన్ కంగారు పడ్డాడు. వెంటనే డగౌట్ దగ్గర ఉన్న సబ్‌స్టిట్యూట్ ఆటగాడు హాండ్స్‌కాంబ్‌తో వాకీటాకీలో మాట్లాడాడు. వెంటనే అతను మైదానంలోకి నీళ్లు తీసుకొని వెళ్లాడు. అయితే అప్పటికే మైదానంలో ఉన్న టీవీ స్క్రీన్‌లో ఆ దృశ్యాలు చూసిన బాన్‌క్రాఫ్ట్ జాగ్రత్త పడ్డాడు. అతను వెంటనే జేబులో ఉన్న ఆ పరికరాన్ని తీసి ప్యాంటు లోపల వేసుకున్నాడు. అయితే ఆ దృశ్యాలు కూడా కెమెరాలకు దొరికిపోయాయి. ఈ వీడియో కొన్ని నిమిషాల్లోనే సామాజిక మాధ్యమాల్లో విస్తృతమైంది. ఆట ముగిసేలోపే ఆస్ట్రేలియా జట్టు బాగోతం గురించి పెద్ద చర్చ నడిచింది. ఆస్ట్రేలియాకే చెందిన దిగ్గజ ఆటగాళ్లు అలన్ బోర్డర్, షేన్ వార్న్‌లతో పాటు గ్రేమ్ స్మిత్ తదితరులు బాన్‌క్రాఫ్ట్ చర్యను ఎండగట్టారు. దీని వెనుక జట్టు వ్యూహం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై పెద్ద దుమారమే చెలరేగడంతో ఆట అయ్యాక బాన్‌క్రాఫ్ట్‌తో పాటు స్మిత్ విలేకరుల సమావేశానికి వచ్చాడు. బుకాయించేందుకు వీల్లేని రీతిలో దొరికిపోవడంతో ఇద్దరూ తప్పిదాన్ని అంగీకరించారు.

ఇంతకీ ఏంటది?: రివర్స్ స్వింగ్ రాబట్టేందుకు ఆటగాళ్లు రకరకాల మార్గాల్ని అనుసరిస్తుంటారు. బంతికి ఒకవైపు మెరుపు పోగొట్టడం కోసం చూయింగ్ గమ్ లేదా జెల్లీ ఉమ్మును రాసి ప్యాంటుకు రుద్దడం మామూలే. అయితే కొందరు ఆటగాళ్లు బంతిలో సత్వర మార్పు కోసం వక్ర



మార్గాలూ అనుసరిస్తుంటారు. గోళ్లతో గీకడం, మరేదైనా వస్తువు ఉపయోగించి బంతి మెరుపు పోగొట్టే ప్రయత్నం చేయడం చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియా జట్టు ఓ వినూత్న ఆలోచన చేసింది. పసుపు రంగు టేప్ తీసుకుని దాన్ని నేలకు రుద్దడం ద్వారా ఇసుక రేణువులు అంటిస్తే.. అది గరుకుగా మారి బంతి ఆకారం దెబ్బ తీసేందుకు ఉపయోగపడుతుందని.. తద్వారా బంతి రివర్స్ స్వింగ్‌కు అనుకూలిస్తుందని భావించింది. సీనియర్ ఆటగాళ్లపై కెమెరాల దృష్టి ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఆ బాధ్యతను ఏడు టెస్టులే ఆడిన యువ ఆటగాడు బాన్‌క్రాఫ్ట్‌కు అప్పగించారు. అతను అనుకోకుండా కెమెరాలకు దొరికిపోయాడు. ముందు అతడి చేతిలో ఉన్నదేంటో ఎవరికీ అంతుబట్టలేదు. అది ప్లాస్టిక్ ముక్క అని.. ఉప్పు కాగితం అని ప్రచారాలు జరిగాయి. అయితే అసలు అదేంటో తర్వాత విలేకరుల సమావేశంలో బాన్‌క్రాఫ్టే వెల్లడించాడు.

ఎప్పట్నుంచి చేస్తున్నారో?

"నా నాయకత్వంలో ఇలా జరగడం ఇదే తొలిసారి.." అంటూ విలేకరుల సమావేశంలో నొక్కి వక్కాణించాడు ఆసీస్ కెప్టెన్ స్మిత్. కానీ కంగారూ జట్టు బుద్ధి ఎరిగిన వాళ్లు మాత్రం ఇదే తొలిసారని నమ్మే పరిస్థితి లేదు. పోయినేడాది ఇదే సమయంలో భారత్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా ఇదే స్మిత్ డీఆర్ఎస్ అడిగే విషయంలో డ్రెస్సింగ్ రూం వైపు చూస్తూ సంజ్ఞ చేయడం వివాదానికి దారి తీసిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఆ సమయంలో మతి చెడి అలా చేశానని స్మిత్ అన్నాడు కానీ.. ఎప్పట్నుంచో అలవాటుంటే తప్ప అలా ఎందుకు చేస్తాడు? ఇప్పుడు బాల్‌టాంపరింగ్ విషయంలోనూ ఆస్ట్రేలియా ఇలాంటి వక్రమార్గాలు ముందు నుంచే అనుసరించకుండా ఎలా ఉంటుందన్న ప్రశ్న తలెత్తుతోంది. దక్షిణాఫ్రికా పరిస్థితులు రివర్స్ స్వింగ్‌కు ఏమంత అనుకూలంగా ఉండవు. అయినా ఈ సిరీస్ అంతటా బంతి రివర్స్ స్వింగ్ అవుతూనే ఉంది. దీనిపై ఈ మ్యాచ్‌కు ముందు ఆసీస్ కోచ్ లీమన్ మాట్లాడుతూ.. "రెండు జట్లూ వర్స్ స్వింగ్ కోసం రకరకాల పద్ధతులు అనుసరిస్తాయి. దాంతో ఇబ్బందేముంది" అనడం గమనార్హం. బాన్‌క్రాఫ్ట్ ఉదంతం బయటికి రాగానే ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు పీటర్సన్ స్పందిస్తూ.. ఇందులో లీమన్ పాత్ర కచ్చితంగా ఉంటుందని, అతడికిలాంటివి అలవాటే అనడం విశేషం. దీన్ని బట్టి చూస్తే ఆస్ట్రేలియా ముందు నుంచే టాంపరింగ్ కోసం ఇలాంటి వక్ర మార్గాలు అనుసరిస్తూనే ఉండాలి.

పట్టు బిగించిన దక్షిణాఫ్రికా

కేప్‌టౌన్: ఆస్ట్రేలియాతో మూడో టెస్టుపై దక్షిణాఫ్రికా పట్టు బిగించింది. రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు చేతిలో ఉండగా.. ఆ జట్టు 294 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. మూడో రోజు, శనివారం ఆట ఆఖరుకు ఆ జట్టు 5 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఎల్గర్ అద్భుత శతకం సాధిస్తే.. రెండో ఇన్నింగ్స్‌లో మరో ఓపెనర్ మార్‌క్రమ్ (84) విలువైన పరుగులు చేశాడు. ఎల్గర్ (14) ఎంతోసేపు నిలవకపోయినా.. ఆమ్లా (31), డివిలియర్స్ (51 బ్యాటింగ్)లతో మార్‌క్రమ్ కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఏబీ, డికాక్ (29 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. అంతకు ముందు ఉదయం 245/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా.. ఇంకో 10 పరుగులే జోడించి చివరి వికెట్ కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా 56 పరుగుల ఆధిక్యాన్ని మూటగట్టుకుంది.

కివీస్-ఇంగ్లాండ్ టెస్టుకు వర్షం దెబ్బ

ఆక్లాండ్: న్యూజిలాండ్, ఇంగ్లాండ్ తొలి టెస్టును వర్షం వెంటాడుతూనే ఉంది. వాన వల్ల మూడో రోజు, శనివారం 17 బంతులు మాత్రమే పడ్డాయి. ఓవర్‌నైట్ స్కోరు 229/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్.. ఆట ఆగిపోయే సమయానికి 233/4తో నిలిచింది.



మను బంగారు గురి

జూనియర్ ప్రపంచకప్‌లో బాకర్ పసిడి డబుల్

సిడ్నీ: పదహారేళ్ల భారత షూటర్ మను బాకర్ పసిడి గురి కొనసాగుతోంది. ఇటీవలే మెక్సికోలో జరిగిన సీనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో రెండు స్వర్ణాలతో సత్తాచాటిన మను.. తాజాగా శనివారం జూనియర్ ప్రపంచకప్‌లోనూ రెండు పసిడి పతకాలు సొంతం చేసుకుంది. మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ విభాగంలో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన మను.. టీమ్ విభాగంలో దేవాన్షి, మహిమ అగర్వాల్‌తో కలిసి పసిడి దక్కించుకుంది.

సమస్యలపై గళమెత్తుతాం

- నేడు తెలంగాణ సకల ఉద్యోగుల మహాసభ

ఈనాడు - హైదరాబాద్



శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐకాస ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మమత, నాయకులు

తెలంగాణలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం సకల ఉద్యోగుల మహాసభను నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పింఛనర్ల ఐక్య కార్యాచరణ సమితి పేర్కొంది. తెలంగాణ ఆవిర్భవించి నాలుగేళ్లయినా తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై మహాసభ వేదికగా గళమెత్తుతామని వెల్లడించింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి జరగనున్న ఈ మహాసభకు 31 జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్దఎత్తున తరలివస్తారని తెలిపింది. ఐకాస ఛైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మమత, నాయకులు సత్యనారాయణ, మామిండ్ల రాజేందర్, చంద్రశేఖర్‌గౌడ్, పద్మాచారి, శివశంకర్, గోల్కొండ సతీష్, మధుసూదన్‌రెడ్డి, ఎంబీ కృష్ణయాదవ్, రవీందర్‌రావు, రేచల్, కస్తూరి వెంకటేశ్వర్లు, ముజీబ్, హన్మంతునాయక్, మణిపాల్‌రెడ్డి తదితరులు టీఎన్జీవో కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. ''తెలంగాణ ఉద్యమంలో నిస్వార్థంగా పాల్గొన్న మేం రాష్ట్రం ఆవిర్భావం అనంతరం అభివృద్ధే ధ్యేయంగా పనిచేశాం. సమగ్ర కుటుంబ సర్వే మొదలుకొని రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన వరకు ప్రతి కార్యక్రమాన్ని, పథకాన్ని విజయవంతంగా నడిపించాం. ఉద్యమ నాయకుడైన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరంభంలో మాకు పీఆర్‌సీని ప్రకటించి, ఉద్యోగులకు సన్నిహితంగా ఉంటానని చెప్పడంతో ఎంతో సంతోషపడ్డాం. నాలుగేళ్లుగా అనేక సమస్యలు పరిష్కారం కాలేదు. సీఎం హామీల మేరకు అధికారులు ఉత్తర్వులివ్వడం లేదు. ఇచ్చినవీ అమ్లు‌వడం లేదు. ఉద్యోగులకు ప్రధానంగా ఉన్న కంట్రిబ్యూటరీ పింఛన్ పథకాన్ని రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించడం ద్వారా సీఎం కేసీఆర్ దేశానికి ఆదర్శంగా నిలవాలి. ఏడేళ్లుగా ఉద్యోగులకు బదిలీలు లేవు. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక ఆర్డర్ టు సర్వ్ ఉత్తర్వులపై ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఏప్రిల్‌లో బదిలీలు చేపట్టాలి. ఉద్యోగులకు పదవీవిరమణ వయస్సు 60 ఏళ్లకు పెంచాలి. ఉద్యోగులకు వైద్యసేవల కోసం వెల్‌నెస్ కేంద్రాలు నాలుగే ఉన్నాయి. వాటిని 14కి పెంచాలి. ఆరోగ్యశ్రీ పరిధిలో ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్‌లను చేర్చొద్దు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1.10 లక్షల ఖాళీలను భర్తీ చేయాలి. ఒప్పంద ఉద్యోగులకు కనీస వేతనం రూ.20 వేలకు పెంచాలి. కొత్త పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి. పింఛనర్లకు తెలంగాణ ఇంక్రిమెంట్ విడుదల చేయాలి. ఏపీలో ఉన్న 1200 మంది తెలంగాణ ఉద్యోగులను స్వరాష్ట్రానికి రప్పించాలి. ఇప్పటి వరకు శాఖల వారీగా సమస్యలను ప్రభుత్వానికి వివరించాం. స్పందన రాకపోవడంతో మా సమస్యలను తెలియపరిచేందుకు ఉమ్మడిగా సభ నిర్వహిస్తున్నాం. దీని ద్వారా ప్రభుత్వం చర్చలకు ఆహ్వానిస్తుందని, సీఎం కేసీఆర్ కీలక నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నాం. లేకుంటే ఉద్యోగుల నుంచి అసంతృప్తి ప్రబలే అవకాశం ఉంది'' అని పేర్కొన్నారు. సభకు అనుమతులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, ఉద్యోగులు క్రమశిక్షణతో పాల్గొని, ప్రభుత్వానికి తమ వాణిని వినిపించాలని రవీందర్‌రెడ్డి, మమతలు కోరారు.

డ్రైవర్ సాధికారత పథకం సమర్థ అమలుకు కమిటీ

15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు కార్లు, ద్విచక్రవాహనాల ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రతిపాదించిన డ్రైవర్ సాధికారత కార్యక్రమాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఉన్నతాధికారుల కమిటీని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీకి ఎస్టీ సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేష్‌దత్‌ఎక్కా ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బి.వెంకటేశం, ఎస్సీ సంక్షేమశాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి బి.దానకిషోర్ ఉంటారు. లబ్ధిదారులకు లభించే ఆదాయం, డ్రైవర్ సాధికారిత పథకం దీర్ఘకాలం కొనసాగింపు తదితర విషయాలను ఈ కమిటీ అధ్యయనం చేసి 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. డ్రైవర్ సాధికారత కార్యక్రమం ద్వారా ఓలా, ఉబెర్ సంస్థలతోపాటు కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థల సహకారంతో నిరుద్యోగ యువతకు కార్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే మెట్రో స్టేషన్ల నుంచి సమీప ప్రాంతాలకు ప్రజలు వెళ్లేందుకు, ఆహార పదార్థాలను సరఫరా చేసేందుకు ద్విచక్రవాహనాలకు డిమాండ్ ఉందని గుర్తించింది. ఈ మేరకు ఇప్పటికే ఆసక్తి కలిగిన యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. యువతకు కార్లు ఇచ్చినపుడు బ్యాంకు రుణం చెల్లించగా నిర్వహణ, ఇతర ఖర్చులు తీసివేస్తే లబ్ధిదారుడికి వచ్చే ఆదాయాన్ని అధికారుల కమిటీ అంచనా వేస్తుంది.

డ్రైవర్ సాధికారత కింద వచ్చిన దరఖాస్తులు

సంక్షేమశాఖ	దరఖాస్తులు
ఎస్సీ	5862
ఎస్టీ	4919
బీసీ	7974
ముస్లిం	3080
క్రిస్టియన్	75

వాతావరణంలో మార్పులతో అధిక ఉష్ణోగ్రతలు: మంత్రి ఈటల

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: వాతావరణంలో రోజురోజుకూ చోటుచేసుకుంటున్న మార్పుల వల్లే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై హైదరాబాద్‌లోని ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం (సెస్)లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ఉష్ణోగ్రతలను తగ్గించే లక్ష్యంతో హరితహారం, మిషన్‌కాకతీయవంటి కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. విపత్తు నిర్వహణ కమిషనర్ డాక్టర్ ఆర్వీ చంద్రవదన్ మాట్లాడుతూ ఆయా శాఖలను సమన్వయం చేస్తూ వడగాలుల తీవ్రతపై ప్రజలు, అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల్లో అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2015లో 541మంది, 2016లో 324 మంది వడదెబ్బతో మృత్యువాత పడ్డారని చెప్పారు. ప్రభుత్వ ముందు జాగ్రత్త చర్యలతో 2017లో ఈసంఖ్య 108కి తగ్గిందన్నారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికసంస్థ, భారత వాతావరణశాఖ, యూనిసెఫ్, భారత వాతావరణ కేంద్రం హైదరాబాద్, తెలంగాణ విపత్తు నిర్వహణసంస్థ సంయుక్తంగా ఈసమావేశాన్ని నిర్వహించాయి.

'అసైన్డ్' చట్టానికి సవరణ

- ఆక్రమణ భూముల్లో ఉన్న పేదలకు హక్కులు

ఈనాడు, హైదరాబాద్: అసైన్డ్ భూముల ఆక్రమణ, కొనుగోలు చేసిన వారిలో పేదలుంటే వారికి ఆ భూములపై హక్కులు కల్పించేలా శాసనసభలో శనివారం బిల్లును ఆమోదించారు. దీంతో అది చట్టం అయింది. ఈమేరకు తెలంగాణ అసైన్డ్ భూముల చట్టం-1977కు సవరణ చేసిన తాజా చట్టానికి సభ ఆమోదముద్ర వేసింది. పాతచట్టం ప్రకారం 29.01.2007కు ముందు ఆక్రమణలో ఉన్నవారికే అర్హత ఉండేది. కొత్త చట్టంతో 31.12.2017 వరకు అసైన్డ్ భూముల్లో కొనుగోళ్లు, ఆక్రమణలకు పాల్పడిన వారిలో పేదలకు హక్కులు లభించనున్నాయి. మెట్ట ఐదు ఎకరాలు, తరి అయితే రెండున్నర ఎకరాల వరకు నిరుపేదలకు హక్కులతో పాటు పట్టాపాసు పుస్తకం జారీ చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ 2.41 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఇతరుల చేతుల్లో ఉందని గుర్తించినట్లు తెలిపారు. ఆ భూముల్లో సాగు లేదా నివాసావసరాలకు ఉపయోగించుకుంటున్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తామన్నారు. హైదరాబాద్ మెట్రో నగర పరిధిలో తాజా చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు.

ఇది ప్రమాదకరం: తెదేపా

అసైన్డ్ భూపంపిణీ కమిటీలు ఉండగా కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించారని, శాసనసభ్యులకైనా పూర్తి వివరాలు తెలపకుండా చట్టసవరణ చేయడం ప్రమాదకరమని తెలుగుదేశం పార్టీ శాసన సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య అన్నారు. 1977 చట్టానికి నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సవరణ చేయగా. . దానిని హైకోర్టు నిలిపివేస్తే ఇప్పటివరకూ అమలుకు నోచుకోలేదన్నారు. ఏజెన్సీల్లో పీఓటీ చట్టం ఉందని, అక్కడ అసైన్డ్ సవరణ చట్టం ఎలా అమలు చేస్తారో బిల్లులో పేర్కొనలేదన్నారు.

అమలుపై స్పష్టత లేదు: కిషన్‌రెడ్డి

భూదస్త్రాల ప్రక్షాళన చేసిన అనంతరం 2017 డిసెంబరు వరకూ ఆక్రమణల గడువును పెంచి అమలు చేస్తుండటంపై స్పష్టత లేదని భాజపా సభ్యుడు కిషన్‌రెడ్డి చెప్పారు. భూస్వాములు, పారిశ్రామికవేత్తలు ఆక్రమించిన భూమిని వెనక్కి తీసుకుంటారా.. పేదలకు ఇస్తారా అన్నదానిపై స్పష్టత లేదన్నారు.

54 ఉపాధ్యాయ సంఘాలతో జేసీటీయూ ఆవిర్భావం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మూడు ఐక్యవేదికలుగా ఉన్న 54 ఉపాధ్యాయ సంఘాలు కలిసి జాయింట్ కమిటీ ఆఫ్ టీచర్స్ యూనియన్ (జేసీటీయూ)గా ఏర్పాటయ్యాయి. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడిగా పోరాడాలని నిర్ణయించాయి. కార్యాచరణ రూపకల్పనకు 30మందితో స్టీరింగ్ కమిటీనిఎన్నుకున్నారు. టీటీజాక్, జాక్టో, యూఎస్‌పీసీ అనే మూడు ఐక్యవేదికల్లోని 54 సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శనివారం సమావేశమై చర్చించారు. పలు సమస్యలను పరిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. పరిష్కరించకుంటే ఏప్రిల్ 2వ తేదీ నుంచి మొదలయ్యే పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని బహిష్కరించాలని నిర్ణయించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఏకీకృత సర్వీసు నిబంధనలకు న్యాయపరమైన ఆటంకాలను తొలగించి వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని తదితర పలు సమస్యలను పరిష్కరించాలని తీర్మానించారు. ఈనెల 27న ప్రభుత్వానికి నోటీసు ఇస్తామని, 28, 29 తేదీల్లో అన్ని జిల్లాల్లో సన్నాహక సదస్సులు నిర్వహిస్తామని నేతలు తెలిపారు. సమావేశంలో కమిటీ నేతలు సరోత్తంరెడ్డి, భుజంగరావు, చావ రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రఘునందన్, చెన్నయ్య, రఘుశంకర్, లక్ష్మారెడ్డి, వేణుగోపాలస్వామి, జాడి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.